C

కవిరాజ
ఆంధ్రనాటకోత్పత్తి
అయిదవ సంపుటం
గజపతుల యుగం

LIBRARY
Sri Sarada Peetham Post Graduate Course
LIBRARY
GUNTUR.
108

I

తెలుగు సాహిత్య
సౌరభ సౌందర్యాలకు
వాచవి



మన ఆంధ్ర సాహిత్యం

అయిదవ సంపుటం
గల్పికల వికాసం

ఆరుద్ర

డా॥ పి. వి. రాజమన్నారుగారి
'ప్రవేశిక'తో,
డా॥ గిడుగు సీతాపతిగారి
పీఠికతో

యం. శేషాచలం అండ్ కంపెనీ
మద్రాసు : మచిలీపట్టణము : సికింద్రాబాదు

రూ. 5/-

SAMAGRA ANDHRA SAHITYAM (in 13 Vols.) — Vol. V: Gajapatula Yugam—By *Arudra*. Introduction: By Dr. P. V. Rajamannar. Published by *M. Seshachalam & Co.*, Madras - Machilipatnam - Secunderabad.

PRICE Rs. 5

First Edition: August '65


Copyright © M. Seshachalam & Co.

Art Work: Gangadhar

Printers:
Weldun Press,
146, T. H. Road, Madras-21.

ప్రాప్తిస్థానం:

ఆంధ్రప్రదేశ్
రాష్ట్రపతి రోడ్డు



బుక్ డిస్ట్రిబ్యూటర్స్
సికింద్రాబాదు

Regd. 212864

మా ఉద్దేశం

సాహిత్యాభిలాష గల సాధారణపాఠకులు ఆంధ్రసాహిత్యం గురించి సంపూర్ణంగా తెలుసుకోవా లనుకొంటే, వాళ్ళకు ఉపయోగించే పుస్తకాలు నేడు అందుబాటులో లేవు. నన్నయభట్టునుండి చిన్నయ సూరిదాకా ఆంధ్రసాహిత్యం అనేకవిధాలుగా, బహుముఖాలుగా సాగింది. ప్రజ్ఞావంతులైన తెలుగుకవులు రచించిన గ్రంథాలు అన్నిటికి అన్నీ అచ్చుపడి వెలుగుచూడలేదు. అచ్చయిన పుస్తకాలుగూడ అన్నీ అందరికీ లభించడంలేదు. లభించిన పుస్తకాలైనా అన్నీ సాధారణపాఠకులకు బోధపడేవివరణలతో లేవు. ఈ కొరతను తొలగించవలసిన బాధ్యత నేటి ప్రకాశకులపై ఉంది.

ఈ అవబోధంతోనే మేము అనిదంపూర్వమైన ఈ సాహిత్య సేవకు సమకట్టాము. వెయ్యిసంవత్సరాలపాటు వేవిధాలుగా పూచి, కాచి, పరిపరి పరిమళించిన నవరసాలనూ నవనవమైన నవకంతో, నేవళంతో తెనెవాకలూరించిన తెలుగు సాహిత్యాన్ని సార్వజనికోపయోగకరంగా, సర్వులకూ సులభావగాహంగా పన్నెండు సంపుటాలలోకి ఇమిడికగా పదించి, తెలుగు మహాజనులకు అందింపబూనుకొన్నాము. సహస్ర సంవత్సరాల సాహిత్యాన్ని ఇంత శతాంశంలో క్లుప్తీకరించడం సాహసమైతే కావచ్చుగాని సాహిత్యపిపాస గల సాధారణపాఠకులు వెనువెంటనే పయనించడానికి ఈ సంపుటాలు చక్కని సోపానాలు కాగల వనడానికి ఎంతమాత్రమూ సందేహంలేదన్న సంకల్పదీక్షే మమ్ముల నీకృషికి ప్రేరేచింది. ఆంధ్రసాహిత్యాన్ని మూలగ్రంథాలనుండి తనివితీరా గ్రోలడానికి ఈ సంపుటాలు సర్వాత్మనా సాయపడతా యనే ఆశిస్తున్నాము.

ఈ సంపుటాలలో ప్రముఖకవుల జీవిత విశేషాలూ, వాళ్లు సాహిత్యాన్ని ఏయేవిధంగా, ఏయే వాతావరణాల్లో, ఏయే సాధక

బాధకాలతో పెంపొందింపజేసింది, వాళ్ళ కావ్యాలలోని గొప్ప దనమూ, వాటి నిగనిగవెలుగులూ వివరించడం జరుగుతుంది. నిదర్శనకు ఆయాకవుల రచనలలోని రసవత్తర ఘట్టాలు కొన్ని ఉదాహరించడం కూడ జరుగుతుంది. ఆ రచనలలోని సొగసులూ, చమత్కారాలూ విశదీకరించడమూ జరుగుతుంది. ఒకొక్కకవి ఏయేగ్రంథాలు వ్రాసినదీ శృంగ్రగాహికగా వివరించి, అముద్రితమైనవీ అలభ్యమైనవీ అయితే ఆ గ్రంథాలనుండి తగిన ఉదాహరణలు సుదీర్ఘంగాకూడ ఇవ్వబడుతాయి.

సాహిత్యమంటే ఒక్క పద్యకావ్యాలే కావుగనుక ఈ సంపుటాలలో ముఖ్యమైన శతకకవులూ, యక్షగాన రచయితలూ, వచన కర్తలూ, వాగ్గేయకారులూ మొదలైన మధురకవులను గురించికూడ కావలసినన్ని జీవితవివరాలూ, ఉదాహరణలూ ఉంటాయి.

ఈ సంపుటాలు చదివాక ఎటువంటి సామాన్య పాఠకుడికైనా సమగ్ర ఆంధ్రసాహిత్యంతో సన్నిహితసంబంధం ఏర్పడాలని మా ఉద్దేశ్యం; ఏర్పడితీరుతుం దని మా దృఢాభిప్రాయం.

ఇవి అన్నీ సాంతం చదివాక సర్వసాధారణపాఠకుడుసైతం కొమ్ములుతిరిగిన సాహితీపరుల అగాధచర్చలను కూడ సాధికారంగా, కరతలామలకంగా బోధపరుచుకునే అవకాశ ముంటుందని ఆశిస్తున్నాము.

ఈ సాహిత్యచరిత్రలో కడచిన సహస్రాబ్దాలనూ పక్కపేజీల్లో పేరొక్కన్నట్లు అందికగా యుగాలుగా విభజించి, తదనుసారంగా ఆయా యుగాల సమీక్ష జరుగుతుంది. అందులో ఇది గజపతులయుగ సమీక్ష సంపుటి.

పన్నెండు సంపుటాలని ఆదిని అనుకొన్నాముగాని రెడ్డిరాజుల యుగం వచ్చేసరికి ఆ యుగంలోని కవుల సంఖ్య, ప్రాముఖ్యం పెరిగి, నిర్ణయించుకొన్న పుటల సంఖ్యలో రచన ఇముడనందున ఆ యుగానికి తర్వాత గజపతులయుగమని అదనంగా ఇవ్వవలసివచ్చింది. కాగా ఈ సంపుటాల సంఖ్యకూడ 13 కు పెంచక తప్పిందికాదు.

యుగవిభజన (ఉజ్జాయింపుకొలాలు)

1. ఆదిమ - చాళుక్యయుగము (క్రీ. శ. 12 వ శతాబ్ది చివరదాకా)

(రాజరాజు 1061 లో చనిపోయినా, చాళుక్యచోడులు 1180 దాకా ఆంధ్రపై అజమాయిషీ చేశారు. అందుకని.)

2. కాకతీయయుగం (క్రీ. శ. 1200 - 1290)

(రాజ్యస్థాపన క్రీ. శ. 1000 లో జరిగినా, గణపతిదేవ చక్రవర్తితో కాకతీయ ప్రాభవం ప్రస్ఫుటంగా కనబడుతుంది. అందుకు యుగం 1199 నుండి ప్రారంభం. అది రుద్రమదేవితోనే తగ్గిందని చెప్పవచ్చు. రెండవప్రతాపరుద్రుని కాలంలో కొ తగాలులు వీచాయి. కనుక యుగం 1290 తో అంతం చేయవచ్చు.)

3. పద్మనాయకయుగం (క్రీ. శ. 1300 - 1375)

(మొదటి సర్వజ్ఞసింగమ నాయకుని రాజ్యారంభందాకా)

4. రెడ్డిరాజులయుగం (క్రీ. శ. 1375 - 1450)

(స్థాపన 1325 లో జరిగినా...కొమరగిరిరెడ్డితో ప్రాభవం. ఒక ముక్కాలుశతాబ్దం వీరియుగంగా పరిగణిద్దాం)

5. గజపతులయుగం [1435 నుండి]

(రెడ్డిరాజుల యుగానికి ఇది అనుబంధంలాంటిది. గజపతులరాజ్యం ఈయుగంలో మొదలై, తొలిరాయల యుగంలో వరిలి, మలిరాయలయుగంలో మరింత ప్రాముఖ్యం చెందింది. ఆంధ్ర దేశచరిత్రలో విస్మరించరాని పాత్రవహించిన వీరి పేర నొక యుగాన్ని పేరొక్కనడం సముచితమే.)

6. తొలిరాయలయుగం (క్రీ. శ. 1450 - 1500)

(ప్రౌఢదేవరాయల చివరికాలంనుండి అనగా 1446 లేక 1450 నుండి సాళువరాయల్ల రాజ్యంబందాకా)

7. మలిరాయలయుగం (క్రీ. శ. 1500 – 1550)

(కృష్ణదేవరాయలయుగం)

8. నవాబులయుగం (క్రీ. శ. 1550 – 1600)

(ఇబ్రహీం కుతుబ్ షాతో ప్రారంభం. కులీకుతుబ్ షా మరణానికి ఒకదశ ముందుదాకా)

9. నాయకరాజుల యుగం (క్రీ. శ. 1600 – 1670)

(రఘునాథ నాయకుడు, విజయరాఘవనాయకులదాకా)

10. కడపటి రాజుల యుగం (క్రీ. శ. 1670 – 1750)

11. కుంఫిణీయుగం (క్రీ. శ. 1750 – 1850)

(మెకంజీ, బ్రౌనుల సేవ. ఉత్తర సర్కారులను బుస్సీ పుచ్చుకున్నాడు. 1758 లో కంపెనీవారు ఉత్తర సర్కారులను కైవసం చేసుకొన్నారు.)

12. జమీందారీయుగం (క్రీ. శ. 1850 – 1900)

(పరపాలన మొదలు సాహిత్యానికి జమీందారులే పోషకులని కవులు భావించడంచేత)

13. ఆధునికయుగం (క్రీ. శ. 1900 నుండి –)

సంపుటాల సంఖ్య పెరిగినా, సంకల్పించిన ప్రకారం అన్ని సంపుటాలూ సంవత్సరంలోగానే ప్రచురిస్తామని మనవిచేస్తున్నాము. మధ్యలో ఒకనెల అధికమాసంగా ఎంచి రెండు సంపుటాలు విడుదల చేయదలిచాము.

మా ఈ కృషి మహాజనానికి ఏమాత్రం సంతృప్తి కలిగించినా మహాభాగ్యంగా పరిగణిస్తాము.

ప్రకాశకులు.

ప్రవేశిక

కందుకూరి వీరేశలింగం పంతులాదిగా అనేకపండితులు ఆంధ్రకవుల చరిత్రలు రచించారు. ఆంధ్రభాషాపరిణామంగురించి పలువురు పరిశోధకులు వ్యాసాలు, గ్రంథాలు వ్రాశారు. ఆంధ్రవాఙ్మయచరిత్రలుకూడా కొన్ని ఉన్నాయి. కాని, రమారమి రెండువేల సంవత్సరాల ఆంధ్రవాఙ్మయాన్ని —చాళుక్యయుగం మొదలు ఆధునికయుగం వరకు— సమగ్రంగా, సక్రమంగా, విపులంగా ప్రజాసామాన్యానికి అందజేసే పుస్తకం ఇదివరకూ లేదు. ఆ కొరత తీర్చడానికి సంకల్పించుకొన్న శేషాచలం కంపెనీవారి ఈ అసమానోద్యమాన్ని ఎంత మెచ్చుకొన్నా చాలదు. ఈ ప్రచురణలో కొన్ని ప్రశంసనీయాలైన అంశాలున్నాయి.

'మహిమున్ వాగనుశాసనుండు సృజియింపన్' అని అన్నాడు రామరాజభూషణుడు. నన్నయ భారత-మీ తెలుగులో మొదటి కావ్యరచన అనే అభిప్రాయం—సాధారణంగా. అయితే ఒక్కక్షణం ఆలోచిస్తే హఠాత్తుగా ఎటువంటి ప్రతిభాశాలియైనా అంత పరిపక్వమైన భాషాస్వరూపాన్ని సృష్టించడం అసంభవమని తోచకమానదు. నన్నయకు పూర్వం ఎన్ని వంద లేండ్లనుంచో ఆంధ్రభాష పుట్టి పెరుగుతూ వచ్చివుండాలి. ఆ అజ్ఞాతయుగం గురించి కొంతైనా తెలిసినవారి సంఖ్య అతిస్వల్పం. ఈ ప్రచురణ మొదటి సంపుటంలో నన్నయపూర్వపు భాషాస్వరూపం, స్వభావం గురించి పరిశోధనాపూర్వమైన చర్చ ఉంది. ఇది ఒక ప్రశంసనీయమైన విషయం.

ఇంకొకటి. ఇదివరకు రచింపబడిన ఆంధ్రవాఙ్మయ చరిత్రల్లో ఆధునిక సాహిత్యానికి అర్హమైన స్థానం ఇయ్యలేదు. ఈ చరిత్రలో దానికి ఉచితమైన ప్రాముఖ్యత ఇచ్చి దాని సర్వతోముఖవికాసం వర్ణింపబడ్డది.

కవుల జాబితాలతో, గ్రంథాల పట్టీలతో నింపి సాహిత్యచరిత్ర వ్రాయవచ్చు—చప్పగా. అటువంటిది కాదిది. కవులను గురించిన కథలూ కబుర్లు, వాళ్ళ జీవితాల్లోని ప్రధానఘట్టాలు, సాహిత్యవిమర్శలు—వీటితో రసవంతంగా, ఆకర్షణీయంగా వ్రాసిన చరిత్ర ఇది.

ఇక రచయితగురించి రెండుమాటలు. ఆరుద్రకు అద్వితీయమైన ఆంధ్రసాహిత్యజ్ఞానం ఉంది. అంతేగాక ప్రపంచసాహిత్యపరిచయం సహా ఉంది. పరిశోధకకృషి, విమర్శకదృష్టి ఉంది. సరళమైన సజీవభాషలో వ్రాయగల శక్తి ఉంది. వ్యవహారంలోని తెలుగు నుడికారం సొంపు అతనికి వెన్నతోడ పెట్టింది. సౌందర్యపిపాసి, రసికుడు, అన్నివిధాల ఇటువంటి చరిత్రకు తగిన రచయిత.

ఇంత సమగ్రమైన ఆంధ్రసాహిత్యచరిత్రను ప్రకటించడానికి పూనుకున్న శేషాచలం కంపెనీవారి ఆశయం శ్లాఘనీయం. ఆంధ్రభాషకు వారు ఒనర్చే సేవ అగణ్యం. ఆంధ్రలోకానికి ఇది ప్రశస్తమైన విశ్వాసము కానుక. చదువుకొన్న ప్రతి ఆంధ్రుడు ఈ కానుకను రెండు చేతుల్తో పుచ్చుకోవలెనని నా కోరిక.

పి. వి. రాజమన్నారు.

పీఠిక

ఈ గ్రంథం సంపుటాలు అయిదున్నూ చదివినతోడనే ఈ గ్రంథం రచించడానికి ఆరుద్రగారు అన్నివిధాలా తగినవారని తోచినది. వీరు, ఎంత శ్రమపడియైనా యాథార్థ్యం తెలుసుకోవలెనన్న పట్టుదలతో పరిశోధన గావించినా రనిన్నీ, పక్షపాతం లేని విమర్శకులనిన్నీ, సద సద్వివేకము గలవారనిన్నీ గ్రహించాను. తగిన పరిశీలన లేక గతాను గతికంగా వస్తూఉన్న సిద్ధాంతాలు విమర్శించి వాస్తవమయిన దేదో నిరూపించడానికి వీరు ప్రయత్నించినారు. 'తెనుగు' అనే రూపము నన్నయ వాడినాడు. గనుక అదే మొదటి రూపమని కొందరంటున్నారు. అంతకు ముందు తెలుగు అనే రూప ముండేదన్న విషయం వీరు తెలుసు కోగలిగినారు.

ఈ విషయం నే నిదివరకు కొన్ని వ్యాసాలలో తెలియజేశాను. మన తెలుగులోనేకాక ఇతర భాషలలోకూడా కొన్ని శబ్దాలలో 'ల' కారము 'న' కారముగా మారడం కలదని ఉదాహరించాను. మరియొక విషయంకూడ వీరు తెలియజేసినందుకు సంతోషిస్తున్నాను. తెలుగు భాష ద్రావిడభాషా కుటుంబమునకు చెందినదేకాని ఆర్యభాషాకుటుంబమునకు చెందినది కాదు. సంస్కృత భాషాశబ్దాలు తత్సమాలుగాని, తద్భవాలుగా గాని వేలకొలదిగా తెలుగులోకి వచ్చినవి. అయినా అంతమాత్రాన ద్రావిడభాషా లక్షణం తెలుగులో నశించిపోలేదు.

కందుకూరి వీరేశలింగం పంతులుగారు, గురుజాడ శ్రీ రామమూర్తి గారు మొదలయినవారు కవులచరిత్ర అను పేరను కవులకు సంబంధించిన అంశములను ఎక్కువగా వివరించినారు; అంతేకాని కవుల గ్రంథ విమర్శ అంతగా చేయలేదు. ఇటీవల కొందరు సార్థకమయిన సాహిత్య చరిత్రకు పూనుకొన్నారు.

ఆరుద్రగారు రచిస్తూఉన్న ఈ గ్రంథములో అన్ని విషయములూ సమగ్రముగా చర్చించుటకు అవకాశము కలిగినది. సమగ్ర శబ్దము సాపేక్షికము. ఒక దృష్టితో చూచిన యెడల ఎంత విపులముగా రచించినా వీదిన్నీ సమగ్రము కాజాలదు. పదమూడు సంపుటములలో ఎంతవరకు సాధ్యము కాగలదో అంతవరకు సమగ్రంగానే వీరీసాహిత్య చరిత్ర

రచించినారని నా అభిప్రాయము. ఇందులో ఇదివరకు ప్రకటితములయిన గ్రంథములందు ఆయా గ్రంథకర్తలు తెలియజేసిన విషయములు పరిశీలించి తమకు తప్పుగా తోచినవి సవిమర్శకముగా ఖండించి తమకు నచ్చినవి ఎత్తుకొని రచన సాగించినారు. ముఖ్యులయిన కవులగురించి, వారి గ్రంథములగురించి అనేక విషయములు తెలియజేసినారు. తిక్కనను గురించి వ్రాసినది 85 పుటల గ్రంథ మయినది. శ్రీనాథునిగురించి వ్రాసినది 180 పుటల గ్రంథ మయినది. పోతరాజుగురించి వ్రాసినది 64 పుటలు పట్టినది.

మరియొక విషయము. ఆరుద్రగారు సాహిత్య పోషకులయిన ప్రభువంశముల పేళ్లుపెట్టి యుగవిభజన చేయడం మంచిదే కాని ఈ అయిదవ సంపుటానికి పెట్టిన పేరు తిక్కన సంపుటాలకు పెట్టిన పేళ్ళ వలె అంతగా సార్థకం కాదని నా అభిప్రాయం. గజపతులు సంస్కృత సాహిత్యమును పోషించినా, తెలుగు సాహిత్యమును కొద్దిగానయినా పోషించలేదు. అంతే కాదు; శ్రీనాథుని విషాద విషయం తలుచుకుంటే దుర్భరము కాకతప్పదు. ఈ విషయం ఆరుద్రగారు గుర్తించకపోలేదు. ఏదో ఒక సాకు చూపి "గజపతుల పేర ఒక యుగాన్ని పేరొక్కని దానిని రెడ్డిరాజుల, తొలిరాయల యుగాలకు అనుబంధంగా జమకట్టుకుందాం" అన్నారు (చూ : పుటలు 15-16). సరే; దాని కేం? ఏదో ఒక పేరు. మనకు ముఖ్యమయినది ఈ సంపుటంలోని గ్రంథ విషయం. అది నిండుగాను, నిరుష్టంగాను ఉన్నదని సంతోషిస్తున్నాను.

ఈ సంపుటములలో గ్రంథకర్త పేరొక్కన్న కావ్యములన్నీ కడుశ్రద్ధతో చదువుతూ ముఖ్యములయిన అంశము లన్నీ గుర్తించుకొన్నట్లు కనబడుతున్నది. శ్రీనాథుడు, పోతరాజు, పెద్దన్న మొదలయిన మహాకవులు ఎట్లు తమకు పూర్వులయిన నన్నయ, ఎఱ్ఱయ, నాచనసోమన మొదలయిన పెద్దకవుల పద్యములందలి భావములను, రచనలో గల రీతులను అనుకరించారో పద్యము లెత్తిచూపించినారు.

పోతరాజు బాల్యకౌమార దశల కాలమందు శైవమతము నవలంబించినవారే అనిన్నీ, పాల్కురికి సోమనాథుని గ్రంథాలు లెస్సగా చదివి ఉంటారనిన్ని ఆరుద్రగారు తెలియజేస్తూ "మంచార మకరంద..." అనే పద్యమందలి భావాలు, ఉపమానాలు బసవ పురాణమందును,

చతుర్వేద సారమందును గలవనిన్నీ చూపినారు (చూ: పుటలు 232-233). పోతరాజు ఆదళలోనే వీరభద్ర విజయం రచించాడనిన్నీ, ఆకాలమందే కాస్తయినవకుడయిన తరువాత సర్వజ్ఞ సింగభూపాలుని ఆశ్రయం అతనికి లభించినదనిన్నీ, "రాజాశ్రయంలోనూ, సానివాడలోనూ సమానంగా వున్న పోతరాజుగారు" భోగినీ దండకం రచించినారనిన్నీ ఆరుద్ర గారు తెలియజేసినారు. మరియొక విషయముకూడ ఆరుద్రగారు లెస్సగా పరిశీలించినారు. పోతరాజు తన కంకితం చేయలేదన్న కోపమువలన సింగభూపాలుడు, పోతరాజు పూర్తిగా రచించిన భాగవతమును భూమిలో పాతిపెట్టించడంచేత శిథిలమయిన దనిన్నీ, పోయిన భాగములు పోతరాజు శిష్యులు పూరించినారనిన్నీ కూచిమంచి తిమ్మకవి చెప్పినది కేవలము కల్పితమే కాని వాస్తవము కాదన్న విషయము ఇది వరకు చర్చించబడినదే కాని నూతనవిషయము కాదు. లోగడ ఇరువై సంవత్సరముల క్రిందట పిఠాపురం మహారాజావారి కోరిక ననుసరించి సింగభూపాలుని రత్నపాంచాలిక (కువలయావళి) అనే సంస్కృత నాటకమును అనువదించిన నాటకమునకు రచితములయిన పీఠికలలో నేను వ్రాసినదానిలో ఇతరులు చెప్పిన అంశములతోపాటు మరియొక అంశము తెలియజేసినాను. భూమిలో పాతిపెట్టిన గ్రంథమును పురుగులు తినడమే వాస్తవమయినయెడల ఆ పురుగులు తమకు అనువుగా నున్న భాగములన్నీ తింటవి కాని స్కంధముల నడుమునను కత్తిరించివట్లు తినడం సంభవింపదు గదా! అని తెలియజేసినాను.

ఇంకా ఎన్నో విషయములు ఆరుద్రగారు లెస్సగా చర్చించి తమ గ్రంథము తెలుగువారి కందించి సాహిత్యసేవ చేస్తూ ఉన్నందుకు వారిని అభినందిస్తున్నాను. భగవంతుడు వీరికి ఆయురారోగ్యభాగ్య భోగములొసగి వీరింకా ఇతోధికముగ సాహిత్యసేవ చేయునట్లు అనుగ్రహించును గాక! ఈ పీఠిక వ్రాయవలసిన దని కోరి ఇందులో నా అభిప్రాయములు వ్యక్తపరచుటకు అవకాశము కలిగించిన శేషాచలం అండ్ కంపెనీవారికి నేను కృతజ్ఞుడను. ఈ సంస తెలుగు సాహిత్య వికాసమునకు ఎక్కువ తోడ్పడుతున్నందుకు సంతోషిస్తున్నాను. ఇది చిరకాలము వర్ధిల్లును గాక!

ఇతిశమ్!

హైదరాబాదు.
22-7-'65

గిడుగు వేంకటసీతాపతి.

కృతజ్ఞతలు

ఇది ఈ ప్రణాళికలో అయిదవ సంపుటం; అదనంగా చేర్చిన గజపతుల యుగం. మొదట వేసుకున్న పథకంలోని పన్నెండు సంపుటాల కన్నా ఒకటి ఎక్కువైనా ఈ నా ప్రయాసకు తగిన వ్యయాన్ని అంగీకరించిన ప్రకాశకులకు మొదటి కృతజ్ఞత చెప్పుకొంటున్నాను.

ఈ సంపుటాలు వెలువడుతున్న వెంటనే ఆసక్తితో చదివి ఆదరాభిమానాలతో నాకు ఉత్తరాలు వ్రాస్తున్న శ్రేయోభిలాషులందరికి నా వందనాలు. నిర్మాణాత్మకమైన సూచనలిస్తున్నవారికి ధన్యవాదాలు. సాఫు వ్రాస్తున్నప్పుడో, ప్రూఫులు దిద్దుతున్నప్పుడో దొర్లిన పొరపాట్లను రెండవ ముద్రణలో దిద్దుకొంటానని మనవి చేస్తున్నాను.

ఈ రచనకు కావలసిన గ్రంథాలెన్నింటినో నామిత్రులెందరో ఎరువిస్తున్నారు. వారికి నా కృతజ్ఞతలు. తొలినుంచీ పుస్తకాలు ఇస్తున్న మిత్రులు వేదం వెంకటరాయశాస్త్రిగారు, వేదం లక్ష్మీనారాయణ శాస్త్రిగార్ల మేలు మరువలేను. హైదరాబాదులో కొన్ని గ్రంథాలు సేకరించి కొన్ని పటికలు తయారుచేయడంలో మిత్రుడు ఎం. వి. యల్. నరసింహారావు తోడ్పడ్డాడు. అముద్రిత గ్రంథాలనుకూడా ఎరువిచ్చిన స్నేహితులు నిడుదవోలు సుందరేశ్వరరావు, డాక్టరు బిరుదురాజు రామరాజుగార్లకు నా ధన్యవాదాలు. తొలినుంచి నాకృషిని ప్రోత్సహిస్తున్న శ్రీ ఈరంకి రాయన్న, పర్వతనేని గంగాధరరావుగార్లకు నా కృతజ్ఞతలు.

ఈ ప్రణాళికకు ప్రవేశిక వ్రాసిన డాక్టరు పి. వి. రాజమన్నారు గారికి, ఈ సంపుటానికి పీఠిక వ్రాసిన డాక్టరు గిడుగు వెంకటసీతాపతి గారికి ప్రకాశకులతోపాటు నా వందనాలు.

పుస్తక సేకరణలో తోడ్పడుతున్న మిత్రులు టి. వి. రంగాచార్యులుగారికి, సాఫువ్రాసి ప్రోత్సహిస్తున్న నా అర్ధాంగి శ్రీమతి రామలక్ష్మికి నా కృతజ్ఞత.


ఆరుద్ర.

ఇందులోని విషయాలు

మా ఉద్దేశం		iii
ప్రవేశిక – డా॥ పి. వి. రాజమన్నారు		vii
పీఠిక – డా॥ గిడుగు సీతాపతిగారు		ix
1. గజపతులయుగం	...	1
2. నిశ్శంక కొమ్మన	...	17
3. గౌరన	...	36
4. జక్కన	...	59
5. వెన్నెలకంటి అన్నయ్య	...	86
6. అనంతామాత్యుడు	...	101
7. కొలని గజపతిదేవుడు	...	133
8. అయ్యలరాజు తిప్పయ్య	...	144
9. దగ్గుపల్లి దుగ్గన	...	156
10. ఆంధ్రకవి రామయ్య	...	177
11. పోతన	...	190

సమగ్ర
ఆంధ్ర
సాహిత్యం

౬. గజపతులయుగం


కటకము
చిలుక సరస్సు
పూరి
రామగిరి
ఓరుగల్లు
రాచకొండ
గోలకొండ
ఎదేసురకొండ
కళింగపట్టణము
సింహాచలము
పిఠాపురము
ద్రాక్షారామము
రాజమంత్రి
బెల్లంపాడు
శ్రీశైలము
కొండపల్లి
బెజవాడ
చండవోలు
దినకొండ
త్రిపురాంతకము
అద్దంకి
మచిలీపట్టణము
మోటుపల్లి
కంపిలి
విజయనగరం
కందుకూరు
ఉదయగిరి
నెల్లూరు
ఎరుపుతో
చంద్రగిరి
కంచి
గజపతులనాటి ఆంధ్రదేశం

1

గజపతుల యుగం

శ్రీనాథుడు తన అవసానకాలంలో అనుభవించిన అగచాట్లకు ఎవరు కారణం అని ప్రశ్నిస్తే మన సాహిత్యచరిత్రకారులు గజపతులను చూపిస్తారు. రాజమండ్రిలో కూడా రెడ్డిరాజ్యం పతనమయ్యాక ఆంధ్రదేశాన్ని ఓఢ్రగజపతులు ఆక్రమించుకుని కొంతకాలం పాలించారు. తెలుగుభాష అంటే అభిమానంగాని, ఆసక్తిగాని ఏ కోశానా లేని ప్రభువులూ, వారి క్రింద పనిచేసే ఉద్యోగులూ సర్కారుకు రావలసిన పన్నులు నిర్దాక్షిణ్యంగా వసూలుచేశారు. కట్టవలసినవాడు కవిసార్వభౌముడైనాసరే, నిరక్షరకుక్షి అయినాసరే కచ్చితంగా ఒకే నీతి అమలుజరిపి, బాకీపడితే ఒకేవిధంగా శిక్షించారు కాబోలు. 'కవిరాజుకంఠంబు కొగలించెనుకదా' అనే పద్యంతో శ్రీనాథుడు ఆరాజులకు శాశ్వతమైన అపకీర్తిని నెలకొల్పాడనీ, ఆంధ్రవాఙ్మయం ఉన్నంతకాలం అది

చిరస్థాయిగా ఉండిపోతుందనీ మన సాహితీపరులు తడికళ్లు తుడుచుకొంటూ భావిస్తారు.

ఒక ప్రముఖకవి కష్టాలకు లోనయ్యాడని భాధ పడుతూ ఆ రాజ్యాన్ని కర్ణాటకరాజ్యంగా భావించుకొనడంలో తప్పు లేదుగాని గజపతులవల్ల మొత్తంమీద భారత దేశానికి ఉపకారమే జరిగింది. చరిత్రకారులు ఈవిధంగా భావిస్తున్నారు.

యావద్భారతమును యవనుల దండయాత్రలకు లోనై హిందవ స్వాతంత్ర్యము అడుగంటనున్న తరుణములో కపిలేశ్వర, పురుషోత్తమ, వీరరుద్రులు తురుష్కుల నెదుర్కొని వారి ధాటి నాపి హిందూధర్మమును, మతమును ఉద్ధరించి వన్నెకెక్కిరి. తమ రాజ్యములో శాంతి భద్రతలను నెలకొల్పి చక్కని పరిపాలనావిధానము నేర్పరచి, ప్రజాహిత కార్యములు చేసి చిరస్మరణీయులైరి. వారి మతాభిమానమును, భక్తిప్రపత్తులును, కళాసాహిత్యపోషణయు మరపునకు రానివి.[1]

శ్రీనాథునివంటి కవిని బాధించారన్న కోపంతో గజపతుల చరిత్రను అపార్థం చేసుకొనక దానిని సానుభూతితో పరిశీలించడమే మన కర్తవ్యం. వాళ్లూ తెలుగుపండితులకు, కవులకు భూములు, అగ్రహారాలు ఇవ్వకపోలేదు. ఈసంగతి గ్రంథస్థమైంది. క్రీ. శ. 16 వ శతాబ్ది ప్రథమ భాగంలో జీవించిన అజ్జరపు పేరయలింగం అనేకవి 'ఒడయనంబివిలాసం' అనే కావ్యం వ్రాశాడు. అందులో తన

---

1. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వము, 3 వ సంపుటం, పుట 278.

పూర్వులకు గజపతులు అగ్రహారం ఇచ్చినట్టు ఇలా చెప్పాడు.[1]

శ్రీరంజిల్ల జెలంగుచున్న గజరాట్సింహాసనాధ్యక్షునిక్
ధారాళంబుగ వేదశాస్త్రబహువిద్యారూఢి మెప్పించి యా
వీరాగ్రేసరు డియ్యకొండన మహావిఖ్యాతిగా గౌతమీ
తీరక్షోణిని నజ్జరం బనగ వా డెచ్చెక్ మహాగ్రామమున్.

ఈ పద్యంలో పేర్కొన్న గజపతి ఎవరో నికరంగా తేల్చి చెప్పలేం. గజపతులలో ముగ్గురే ముగ్గురు ప్రసిద్ధులున్నారు. వారి పేర్లూ, రాజ్యకాలాలూ చూడండి:

కపిలేశ్వరగజపతి ... క్రీ. శ. 1434–1468
పురుషోత్తమగజపతి ... క్రీ. శ. 1468–1497
ప్రతాపరుద్రగజపతి ... క్రీ. శ. 1497–1538

ఈ ముగ్గురూ వరుసగా తాత, తండ్రి, మనుమలు. కపిలేశ్వరుడు గజపతిరాజ్యాన్ని స్థాపించాడు. ఇతడు గంగ వంశపు రాజులవద్ద మంత్రిగా ఉండేవాడు. తన రాజు రెడ్డి రాజ్యంపై యుద్ధానికి వెళ్ళినపుడు ఇతడు సింహాసనాన్ని స్వాధీనం చేసుకున్నాడు. గంగవంశపు రాజులకు కూడా 'గజపతి' అనే బిరుద ముండేది. వీరి సైన్యంలో గజబలం ఎక్కువగా ఉండేది. కనుక వీళ్ళకు గజపతులని, గజనివహపతులని, గజఘటాపటులని బిరుదులున్నాయి. కపిలేశ్వరుని తోటే 'గజపతి' అనే మాట రూఢి అయింది. అయితే కపిలేశ్వరుడు పట్టం కట్టుకోడానికి ఒక పదిహేనుసంవత్సరాలు

1. ఆంధ్రకవితరంగిణి 6 వ సంపుటి 174 పుటలో చాగంటి శేషయ్యగారు ఉదాహరించారు.

ముందుగా క్రీ. శ. 1419-20 లోనే లాంగూలగజపతి రాజ మహేంద్రవరాన్ని ఆక్రమించుకొని పన్నెండు సంవత్సరాలు పాలించినట్లు స్థానికచరిత్రలు చెప్తున్నాయి.[1] మధ్యాంధ్రం ఈ గజపతిఅధికారంలో ఇంతకాలం ఉన్నా లేకపోయినా కొన్నాళ్ళపాటు ఉండేదని చెప్పవచ్చు.

తెలుగుదేశపు చరిత్రలో ఈ గజపతులేకాక అశ్వపతులు, నరపతులుకూడా ప్రసిద్ధులు. అశ్వపతులంటే బహ్మనీరాజ్యాన్ని పాలించిన తురుష్కపాలకులు. నరపతులంటే విజయనగర సామ్రాజ్యాన్ని పరిపాలించిన మహారాజులు. క్రీ. శ. పదిహేను, పదహారు శతాబ్దుల చరిత్రలో ఈ మూడువంశాల రాజకీయగాథలూ ముప్పేటలుగా అల్లుకొని ఉంటాయి. గజపతులలో చివరివాడైన ప్రతాపరుద్రుని కుమార్తెనే కృష్ణదేవరాయలవారు వివాహం చేసుకొన్నారు. గజపతుల ఇంటి ఆడపడుచును చేపట్టడమే కాక రాయలవారు గజపతుల ఆస్థానంలోని ప్రముఖ విద్వాంసులను కూడ ఆదరించి తమతో తీసుకుపోయారు. వాళ్ళలో లొల్లలక్ష్మీధరుడు, దివాకరులు ముఖ్యులు. లక్ష్మీధరుడు మహోపాధ్యాయ బిరుదాంకితుడు. ఆదిశంకరుల 'సౌందర్యలహరి'కి వ్యాఖ్యానం వ్రాశాడు. ఇతడు 'సరస్వతీవిలాసం' అనే ధర్మశాస్త్ర గ్రంథాన్ని వ్రాసి గజపతిపేర ప్రకటించాడు. ఈ లక్ష్మీధరుని పూర్వులు ఏడు పురుషాంతరాల దాకా మహాపండితులు. వాళ్ళవంశక్రమ మిది.

---

1. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 3 వ సంపుటి, పుట 272.

1. మహామహోపాధ్యాయ మహాదేవాచార్యుడు: ఇతడు లొల్లకుల సంప్రదాయప్రవర్తకుడు. భట్టలోల్లటుని నాట్యశాస్త్రానికి వ్యాఖ్యానం, వివరణా వ్రాశాడు. ఈయన ఎర్రాప్రగడవారి సమకాలికుడు. ఆయనతోపాటు ప్రోలమ వేమారెడ్డిగారి ఆస్థానంలో ఉండేవాడు.

2. మహాదేవాచార్యుల వారి కుమారుడు లక్ష్మీధరుడు: ఇతడు 'సాహిత్యపారిజాతం', 'స్మృతికల్పతరువు' అనే గ్రంథాలు వ్రాశాడు.

3. లక్ష్మీధరుని కుమారుడు విరించి మిశ్రుడు: ఇతడు 'భరతార్ణవ పోతము', 'సాహిత్యమీమాంస' అనే కృతులు రచించాడు.

4. విరించిమిశ్రుని పుత్రుడు పురుషోత్తమ మహోపాధ్యాయుడు. 'మీమాంస ద్వయం', 'జీవాతు' అనే గ్రంథాలకు ఇతడు కర్త.

5. ఈ పురుషోత్తముని పుత్రుడు లక్ష్మణార్యుడు: ఇతడు 'ప్రభాకరామృత వాహిని', 'ప్రభావళీఖండనం' మొదలైన బహుగ్రంథాలు వ్రాశాడట. "లొల్ల లక్ష్మణార్యుడను మరియొక యాంధ్రుడు సకలసిద్ధాంత విషయములను పరామర్శించి 108 ఉల్లాసములలో 'దైవజ్ఞవిలాస' మను మహాగ్రంథము నిర్మించెను." అని మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు వ్రాసింది ఇతని గురించే కావచ్చు.[1]

---

1. సంస్కృతవాఙ్మయచరిత్ర, రెండవసంపుటి, పుట 171.

6. పై లక్ష్మణార్యుని తనయుడు విశ్వనాథ భట్టారకుడు : ఇతనికి 'నూతనవ్యాస', 'మహోపాధ్యాయ', 'విద్వత్సార్వభౌమ' బిరుదు లుండేవి. ఇతడు 'నయవివేక దీపిక' రచించాడు.

7. ఈ విశ్వనాథ భట్టారకుని కుమారుడు లక్ష్మీధరుడు : ఇతడు సాహిత్యమహీధరుడు. షడ్దర్శనీ పారంగతుడు. గజపతిపేర ప్రకటించిన 'సరస్వతీ విలాసం' కాక 'సాహిత్యలక్ష్మీధరం' మొదలైన మీమాంసా గ్రంథాలు, 'యోగదీపిక' వంటి యోగగ్రంథాలు, మానవధర్మశాస్త్ర టీక 'కర్ణావతంసబర్హావతంసాది అనేక కావ్యాలు కూడ వ్రాశాడు. కెంచెం మల్లయార్యునితో కలిసి దైవజ్ఞవిచారం కూడ ఇతడే వ్రాశాడని ఈయూణ్ణి వెంకట వీరరాఘవాచార్యులుగారు చెప్తున్నారు.[1] మల్లాదివారు పేర్కొన్న దైవజ్ఞ విలాసమూ, ఇదీ ఒకటే కాబోలు. అయితే లక్ష్మీధరుడు అనే పేరుకు బదులు లక్ష్మణార్యుడని మల్లాదివారు పొరబడ్డారేమో!

లక్ష్మీధరుని తాతముత్తాతలవంటి మహాపండితులు గజపతులవద్ద ఉండేవారు. పురుషోత్తమ గజపతి స్వయంగా కవి. చక్కగా చదువుకొన్న విద్వాంసుడు. అభినవ గీత గోవిందం, ఆగమకల్పతరువు, నామమాలిక, గోపాలార్చనా

---

1. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, సంపుటి 3, పుట 1048. లొల్లవారి వంశచరిత్ర ఈయూణ్ణివారి వ్యాసంనుంచి గ్రహించిందే.

విధి, హారావళి, త్రికాండశేషం, పద్యావళి మొదలైన గ్రంథాలు వ్రాశాడట. ఇవన్నీ నేటికీ అచ్చుకాలేదు. ఇతని కుమారుడు ప్రతాపరుద్ర గజపతి విద్యలలో సాక్షాత్తూ కమలభవుడట. ఇతడు కౌతుకచింతామణి, నిర్ణయసంగ్రహం, ప్రౌఢ ప్రతాపమార్తాండం మొదలైన గ్రంథాలువ్రాశాడు. ఇతని పేర నున్న 'సరస్వతీవిలాసం' లొల్ల లక్ష్మీధరుడు వ్రాశాడని ఇంతకుముందు తెలుసుకొన్నాం. ఈ ప్రతాపరుద్రుని సామంతుడుగా రాజమహేంద్రవరాన్ని పాలించిన రామానందరాయలుకూడా సాహితీపరుడే. ఇతడు జగన్నాధ వల్లభ నాటకాన్ని వ్రాశాడు.

రెడ్డిరాజులు,సంగమవంశపురాజులు, పద్మనాయకులూ పోషించినట్లే గజపతులుకూడా సంస్కృతభాషను ఆదరించి, పోషించి అందులో స్వయంగా గ్రంథాలు వ్రాసి వన్నె కెక్కారు. వీరి కాలంలో ఒరియాభాషలో సాహిత్యం మొగ్గతొడిగి వికసించింది. రామాయణ, భారత భాగవతాలు ఆభాషలో అనువాదం పొందాయి. గజపతుల కాలంలోనే వృద్ధభాషలో భాగవతం అనువాదం అయింది. అదేకాలంలో కొంచెం ముందుగా మన తెలుగుభాషలోకూడా భాగవతాన్ని పోతరాజుగారు అనువదించారు. ఈ రెండుభాషలలోనూ భాగవతం ఒకే విధంగా ప్రజాదరణ పొందడం గమనించతగ్గ విశేషం.

ఒరియాభాషలో భాగవతాన్ని అనువాదం చేసిన జగన్నాధదాసు చైతన్యప్రభువులకు ఆంతరంగికమిత్రుడు. ఆయన ఈకవికి 'అతిబడా' అనే బిరుదు ఇచ్చాడు. ఇతని

భాగవతం ఒరియాభాషలో అత్యంతప్రజాదరణ పొందిన గ్రంథం. మన పోతరాజుగారి భాగవతాన్ని ఎలాగైతే గ్రామీణులు కంఠస్థం చేసుకొనిరోజూ పారాయణ చేస్తారో అలాగే ఒరిస్సాలోని పల్లెటూళ్లలో 'భాగవతఘర్' అనే ప్రార్థనామందిరాలలో జగన్నాధదాసుగారి భాగవతాన్ని గానంచేస్తారట. పాడుకోడానికి అనువుగా, చాలా సులభమైన తొమ్మిది అక్షరాల ఛందస్సులో సరళంగా జగన్నాధదాసు భాగవతాన్ని వ్రాయడంతో అది ప్రజారంజకం అయింది. మన పోతరాజుగారిలాగే జగన్నాధదాసుకూడా భాగవతపురాణంలో ఇతరగ్రంథాలలోని గాథలనుజోడించాడట.[1] ఒరిస్సాప్రదేశంలోని జనుల నైతికవిలువలుపెరగడానికి ఈ కావ్యమే కారణమట. దీనిని చదవా లనే ఆకాంక్షకొద్దీ అక్కడి జనులలో అక్షరాస్యతకూడా వృద్ధి చెందిందట.

సంస్కృత ఓడ్ర భాషలను పోషించిన గజపతులు స్వయంగా ఆంధ్రభాషను ఆదరించకపోయినా వారిసామంతులు మాత్రం తెలుగుకవులకు ఆశ్రయ మిచ్చి ఆదుకొన్నారు. గజపతుల రాజ్యం వివిధకాలాలలో వివిధప్రాంతాలదాకా ఆంధ్రదేశంలో విస్తరిల్లింది. కపిలేశ్వర గజపతిరాజ్యం ఒకనాడు ఉత్తరాన గంగానదిమొదలు దక్షిణాన కావేరిదాకా ఉండేది. అతని పుత్రుడు కుమారహంవీరుడు క్రీ. శ. 1464 లో శ్రీరంగందాకా దిగ్విజయంచేశాడు. ఆంధ్రదేశం

1. The Delhi Sultanate (The History and Culture of the Indian People), Bharatiya Vidya Bhavan, P. 521.

లోని ఉదయగిరి చంద్రగిరి రాజ్యాలను జయించి స్వాధీనం చేసుకొన్నాడు. తరువాత గజపతుల కాలంలో రాజ్యపు ఎల్లలు చెరుగుతూ పెరుగుతూ వచ్చేవి. ఆంధ్రదేశంలోని వివిధదుర్గాలలో రాజప్రతినిధులు ఉండేవారు. వాళ్ల కళా పోషణ ఆయా తెలుగుకవుల చరిత్రలలో చెప్పుకుందాం.

తమ 120 సంవత్సరాల పరిపాలనలో గజపతులు తెలుగు దేశాని కిచ్చిన సాంస్కృతిక వారసత్వ మేమిటో ఇప్పుడు చెప్పుకొందాం. పోతనగారి మహాభాగవతంతో యీ గడ్డమీద మధురభక్తి ప్రచారమైనా గజపతుల పరిపాలన దీనిని అధికం చేసింది. సుప్రసిద్ధ చారిత్రక పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఏమన్నారో చూడండి. ''కటకము గజపతి వంశజుల పరిపాలన కాలమున బంగాళ దేశమునుండి చైతన్య స్వామి తెలుగు దేశమునకు వచ్చుటతోనే తెలుగు శతక కవితలోని మధుర భావములకు ప్రాచుర్యము హెచ్చింది''[1].

పోతరాజుగారి మహా భాగవతంలో కృష్ణుని ప్రియు రాలుగా రాధ ప్రస క్తే లేనేలేదు. కటక గజపతుల సంపర్కంవల్లనే రాధామాధవశృంగారం తెలుగు దేశం లోకి వచ్చింది. పోతరాజుగారు రాధ గురించి ఏమీ చెప్పక పోయినా వారి సమకాలికుడైన శ్రీనాథుడు ఒక కృతిలో రాధా మాధవుల శృంగారాన్ని ఆంధ్ర సాహిత్యంలో తొలిసారి కీర్తించాడు. చూడండి.

---

1. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, ఆంధ్రసారస్వతపరిషత్తు, హైదరాబాదు ప్రచురణ, పుట 7.

వాలిక మోము మత్తపనబర్హికిశోరకలాస్యలీల బై
వాలిచి పచ్చకప్పురపువాసనతోడి ముఖారవిందతాం
బూలపు మోవి మోవిపయి మోపుచు రాధకు నిచ్చు భూర్తగో
పాలుడు ప్రోచుగావుత నపారకృపామతి మంత్రియన్ననిన్.
[భీమ. 1-3]

ఈ రాధామాధవశృంగారంలో పడే, బహుశా శ్రీనాథుడు నందనందన చరిత్ర ప్రాసి ఉంటాడు. "మడికి అనంతయ్య ప్రాసిన విష్ణుమాయా నాటకమే శ్రీనాథుడు రచించిన నందనందన చరిత్ర" అనే కొత్త వాదాన్ని కవిరాజహంస బాలాంత్రపు వెంకటరావుగారు నాతో ముచ్చటించారు.

పారిజాక్షిపరీక్షిన్నృపాలమౌళి
మధుకరస్వాంతసంతోషమయములైన
కోరికల మించు శుకముఖాంభోరుహంబు
నందనందనగాథామరందధార. [విష్ణుమాయానాటకం, 1-30]

ఈ ఎత్తుగీతిలోని 'నందనందనగాథ' అనే మాట ఒక్కటే కాక మరికొన్నింటిని కూడా బాలాంత్రపువారు బేరీజు వేశారుగాని ఎంతో కూలంకషంగా చర్చిస్తేనేగాని శ్రీనాథుడు ప్రాసిన నందనందన చరిత్రే విష్ణుమాయానాటక మని, వీధి నాటకాన్ని వల్లభరాయని పేరుమీద ప్రకటించి నట్లే విష్ణుమాయా నాటకాన్ని అతడు మడికి అనంతయ్య పేరుమీద ప్రచురించాడని పండితలోకం ఆమోదించక పోవచ్చు. అయినా పరిశోధకులు ఆలోచిస్తారని బాలాంత్రపువారి యీ కొత్త వాదాన్ని నివేదిస్తున్నాను. భీమ

ఖండంలో రాధా కృష్ణుల శృంగారాన్ని ఇష్టదేవతా ప్రార్థనలో పేరొక్కన్న శ్రీనాథుడు నందనందన చరిత్రలో అదే వర్ణించాడేమో! క్రీ. శ. 1420-25 ల మధ్య గజపతుల సంపర్కం తెలుగు దేశానికి ఏర్పడ్డాకనే భీమ ఖండ రచన జరిగింది. రాధా మాధవ శృంగారం మనకు గజపతులు ఇచ్చిన వారసత్వమే.

భారతీయ శిల్ప రీతులలో కళింగరీతి అనేది విలక్షణ మైంది. గజపతులు తాము జయించిన ప్రదేశాలలో దేవాల యాలు నిర్మించేవారు. పేరుకట్టించిన గుళ్లు ఉత్తరాన మిధున పురంలో దక్షిణాన నెల్లూరుదాకా ఉన్నాయి.[1] గజపతుల సంపర్కం వల్లనే పూరీ జగన్నాథంకూడా తెలుగువాళ్లకు దర్శింపవలసిన ముఖ్యక్షేత్రమైంది. తిరుపతి మొక్కులు ఎంత ప్రాచీనమో పూరీ జగన్నాథునికి కానుకలుకూడా ప్రాచీనమే. కాటమరాజు కథలో యాదవులు అల్లుడాడెన్నతో కటకం జగన్నాథానికి మూడువందల ఆవులు, మూడు ఆబోతులూ అర్పణంగా పంపిస్తారు. దానికి ముందు కటకంనుంచి వచ్చిన దాసర్లు ప్రసాదం ఇచ్చి అప్పనం సంగతి హెచ్చరిక చేస్తారు.[2] 'కటకము జగన్నాథు కరుణను' ఆవులూ ఎద్దులూ యుద్ధం చేస్తాయట.[3] ఈ దేశిరచన గజపతుల సంపర్కం వచ్చాక ప్రాసిందే.

---

1. ఉత్కళదేశచరిత్ర - రాళ్ళబండి సుబ్బారావుగారు, కళింగ సంచిక, పుటలు 663-664.

2. కాటమరాజు కథ - ప్రాచ్యలిఖితగ్రంథాలయం (మద్రాసు) వారి ప్రచురణ, పుటలు 101-104. 3. ఆదేపుస్తకంలో, పుట 133.

పూరీజగన్నాథుని ప్రసాదం కులభేదాలను విస్మరింప జేస్తుంది. అన్నివర్ణాలవాళ్లూ పట్టింపులు లేకుండా పుచ్చు కోవాలి. 'సర్వం శ్రీజగన్నాథం' అనే సామెత గజపతుల పాలనవల్ల వచ్చిందే. కులభేదాలను నిరసించిన చైతన్యుని మతాన్ని అభిమానించిన గజపతులు వైదికమత సంప్రదా యాలను కూడా కాపాడి పోషించారు. హేమాద్రి చెప్పిన షోడశదానాలు చేశారు. అయితే తెలుగుదేశానికి సంబం ధించినంతమటుకు వీళ్లు హృదయం లేని రాక్షసపాలకు లనే అభిప్రాయం పాతుకుపోయింది. చూడండి, సురవరం ప్రతాప రెడ్డిగారు ఏం వ్రాస్తున్నారో—

> రెడ్డిరాజుల రాజ్యపతనము క్రీ. శ. 1434 ప్రాంతములో నయ్యెను. చిరకాలమునుండి ప్రబల యత్నాలు చేయుచువచ్చిన ఓఢ్ర (ఒడ్డ) రాజులు తూర్పుతీరపు దేశమును, గుంటూరుసీమను ఆక్రమించుకొని పాలించిరి. వారికి ప్రజలపై ప్రీతి లేకుండెను. దేశమునుండి అన్నివిధములు ద్రవ్యమును లాగుకొని పోవుటయే వారి ప్రధానాశయమైన ట్లుండెను. కవుల ఆదరము, కళాపోషణము వారిలో అవశేషమైన కానరాలేదు. అఖిలాంధ్రపరిపూజ్యుడును కవిసార్వభౌముడును సార్వభౌమసమ్మాన్యుడును నగు శ్రీనాథునే వారు కష్టపెట్టిరి.[1]

ఇంతవరకు వ్రాసి ప్రతాపరెడ్డిగారు శ్రీనాథుని ప్రసిద్ధ పద్యం 'కవిరాజు కంఠంబు గాగలించెను కదా' అనేది ఉదాహరించి ఇలా వివరించారు.

> [2] ఆనాడు పన్ను లియ్యనివారి నెన్నివిధముల కష్టపెట్టుచుండిరో

---

1. ఆంధ్రుల సాంఘికచరిత్ర, రెడ్డిరాజులకాలము, పుట 184.
2. ఆదేపుస్తకంలో, పుటలు 135-136.

ఈ పద్యము బాగా విశదపరిచినది. చిత్రమేమనగా క్రీ. శ. 1900 వరకు హైద్రాబాదుసీమలోని పల్లెలలోని పటేలుపట్వారీ లివే పద్ధతులను అవలంబిస్తూ వుండిరి. ఊరిముందర చావడియుండెడిది. అందు చేతులకు కట్టెబేడీలు వేయు 'కోడాలు' ఉండెడివి. రెండు చేతులను మణికట్టు వరకు రెండు కట్టెల రంధ్రములందుంచి ఒక వెదురు చీలను (గొడిగను) వాటికి బిగించువారు. మరియు ఎండలో నిలబెట్టి బండలెత్తుట, లేక ఊరి ముందర నుండు గుండును భుజముపై మోయించుట, లేక ఒక పెద్ద మొద్దుకు గొలుసును కట్టి దానిని కాళ్లకు తగిలించుట ఇట్టివన్నియు చేయిస్తూ ఉండిరి. అనగా ఒడ్డె రాజుల సృష్టి దేశమంతటను వ్యాపించె నన్న మాట. అయితే, తిటాలున ఒడ్డె రాజులే యీ శిక్షలన్నిటిని ప్రవేశపెట్టినారనుట కాదు. అంతకు ముందును ఇట్టివి యాచారమందుండె నేమో! కాని వాఙ్మయంలో వాటి సూచన లరుదు. ఒడ్డె రాజుల యపయశస్సుమాత్ర మీ శ్రీనాథుని చాటుధార యున్నంత కాలము తెలుగునాట నుండక మానదు.

నిజాని కీ శిక్షలన్నీ ఒడ్డెరాజు లొక్కరే సృష్టించినవి కావు. కేయూరబాహుచరిత్రలో అన్యాయవ్యాపారం చేసిన వర్తకునికి విధించిన శిక్షను మంచన గ్రంథస్థం చేశాడు. ఈ గజపతుల యుగంలోనే ఉన్న అనంతామాత్యుడు తన 'భోజరాజీయం'లో చాలా వింతశిక్షను పేర్కొన్నాడు. 'వీధుల తిరుగంగ వెస తలారులు పట్టి కొజ్జాను చేసిరో' అని ఒక యువతి తన్ను నిరాకరించిన వానిని ప్రశ్నిస్తుంది (భోజ. 4-319). ఇది తురుష్కుల సంపర్కం బాగా ఉన్న రోజుల్లో. ఇంతకుముందే కాకతీయ యుగంలోని కేతన విజ్ఞానేశ్వరీయంలో ఆర్థిక నేరాలకు వివిధశిక్షలను పేర్కొన్నాడు. వాస్తవానికి శ్రీనాథుని సమకాలికుడైన

కపిలేశ్వర గజపతి ప్రజారంజకుడైన పాలకుడేగాని లోక కంటకుడు కాదు. అతడు ఉప్పుమీద, గవ్వలమీద ఉండే పన్నులు తొలగించాడు.[1] ప్రజల మన్ననపొందాడు. 15 శతాబ్దంలో దక్కనులో పర్యటించిన రష్యన్ యాత్రీకుడు అథనాసియస్ నికిటిన్ వ్రాసిన వ్రాతలవల్ల శ్రీమంతులు స్వార్థపూరితమైన వైభవాలూ, భోగాలూ అనుభవిస్తూ ఉంటే సామాన్యప్రజలు అష్టకష్టాలూ పడేవారని తెలుస్తున్నది.[2] శ్రీనాథుడు ఒకనాడు శ్రీమంతుల భోగాలు అనుభవించినవాడే. అతన్నీ, అతని ప్రభువులనూ సుఖపెట్టడానికి సామాన్యరైతులనుండి ప్రభుత్వోద్యోగులు ఎలా పన్నులువసూలుచేసేవారో దీనివల్ల ఊహించవచ్చు.

గజపతులలో కపిలేశ్వరుడు ఉన్నపన్నులు కొన్ని తొలగించినా శత్రురాజులపై ఎక్కువపన్నులు విధించినట్లు కూడా శాసనాధారాలు లేకపోలేదు. అనంతవర తామ్రశాసనంలో ఇలా ఉంది—"ప్రసహ్య కర్ణాటమహీపతేః పురా నిమథ్య విద్యానగరీం నిజైర్బలైఃసమున్నతం మానమి వోచ్ఛ్రియా కరం సమాదదే కరక్షచక్రవిక్రమః." ఈ శాసనాన్ని ప్రకటించిన వేటూరి ప్రభాకరశాస్త్రిగారు దీనికి ఇలా అర్థం చెప్పారు.[3] "ఈతడు బలాత్కరించి కర్ణాటరాజధాని అయిన విద్యానగరిని తన సేనలతో నరికట్టి సమున్నతమైన మాన

---

1. Delhi Sultanate, Gajapati Kings of Orissa, P. 365.
2. Ibid P. 656
3. ఆంధ్రపత్రిక ఉగాదిసంచిక, 1928. ఈ వ్యాసాన్ని కళింగ సంచికలో పునర్ముద్రించారు. అనుబంధం, పుటలు 97-104.

మునుబోలె హెచ్చుపన్నును గైకొనెను.'' అయితే ఇతడు అనేక అగ్రహారాలు దానం చేసినట్లుకూడా ఈ శ్లోకానికి ముందుగా మరొక శ్లోక ముంది. ''ఘనేన యేన ద్విజసంఘ సాత్కృతా మహాగ్రహారా శ్చుచిమూ క్తికోజ్జ్వలాః మహీ పురంధ్రీహృదయావలంబినో మహాగ్రహారా ఇవ సంచ కాసతే''

కపిలేశ్వరగజపతి ఎన్నో అగ్రహారాలు ఇవ్వబట్టే తెలుగుజిల్లాలలో కపిలేశ్వరపురాలు చాలా ఉన్నాయి. (ఉదాహరణకు-కృష్ణాజిల్లా గూడూరుతాలూకాలో ఒకటీ, తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురంతాలూకాలో ఒకటీ ఉన్నాయి.) విశాఖపట్నంజిల్లాలోని పార్వతీపురం ఈ కపి లేశ్వరుని భార్యపేర కట్టించిన ఊరే. కపిలేశ్వరుని కుమారు డైన పురుషోత్తమ గజపతి పేరనే బెజవాడదగ్గిర ఉన్న పురు షోత్తమపట్టణం కట్టారు. ప్రతాపరుద్ర గజపతికి విద్యాధరు డనే మారుపేరు ఉంది. అతని ఈ పేరుమీదనే బెజవాడ దగ్గిర విద్యాధరపుర మనే గ్రామం వెలిసింది. కొండపల్లివద్ద విద్యాధర గజపతి చెరువు అనే తటాకం ఉంది. అందులో ఇతడు లక్కపడవమీద షికారు చేసేవాడట.

మొత్తంమీద ముగ్గురు గజపతులు ఆంధ్ర దేశంలో చిరస్థాయిగా ఉండే ఊళ్లు కట్టించి చెరువులు తవ్వించి పాలించారు. వీరి రాజకీయపు చరిత్ర రెడ్డిరాజుల అవసాన కాలంతోనూ, మలిరాయల యుగంతోనూ పెనవేసుకొని ఉంది. గజపతులు తెలుగు సాహిత్యాన్ని ప్రత్యక్షంగా

పోషించినట్లు సాక్ష్యాలు లేకపోయినా, ఒడయనంబి విలాసం, మాఘమాహాత్మ్యం (కర్త: ఒడ్డేపూడి పెద్దన, క్రీ.శ. 1550–60) మొదలైన గ్రంథాలవల్ల వాళ్లు చేసిన దానాలు, విద్యా పోషణ తెలుస్తూఉండడంచేత గజపతులపేర ఒక యుగాన్ని పేరొక్కని, దానిని రెడ్డిరాజుల, తొలి రాయల యుగాలకు అనుబంధంగా జమకట్టుకొందాం. శ్రీనాథుని సమకాలికులూ, సమీప కాలికులూ ఇందులో ఉంటారు. వాళ్లను గురించి తెలుసుకొందాం.

2

నిశ్శంక కొమ్మున

శ్రీనాథుడు కాశీఖండం రచించి రాజమండ్రి పాలించిన వీరభద్రారెడ్డికి అంకితమిస్తే అతని తమ్ముడు దొడ్డారెడ్డికి నిశ్శంక కొమ్మున శివలీలావిలాసాన్ని అంకితమిచ్చాడు. శ్రీనాథుడు శివలీలలు కొన్నింటిని చేర్చి హరవిలాసం రచిస్తే శివుని లీలలు అన్నింటినీ క్రోడీకరించి కొమ్మన శివలీలావిలాసాన్ని వ్రాశాడు.

వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ గ్రంథాన్ని సంపాదించి దేశానికి సమర్పించారు. గ్రంథం పూర్తిగా దొరకలేదు. అవతారికలో కొంతా, మొదటి రెండు ఆశ్వాసాలూ మాత్రమే దొరికాయట. ఈ గ్రంథాన్ని ఆంధ్ర సాహిత్య పరిషత్తువారు తమ పత్రికలో అచ్చువేశారు.[1] అవతారికలో దొరికిన భాగాన్ని ప్రచురించలేదు. మల్లం

1. 31 వ సంపుటంనుండి 39 వ సంపుటందాకా కొన్నికొన్ని పంచికలలో ప్రకటించారు.

పల్లి సోమశేఖరశర్మగారు ఈ గ్రంథానికి మరొక అసం పూర్ణప్రతిని హైదరాబాదు వాస్తవ్యులు విద్వాన్ ఓగేటి సుబ్బారావుగారి ద్వారా సంపాదించారు. ఈ గ్రంథంలో మొదటి మూడు ఆశ్వాసాలు, అసమగ్రమైన అవతారిక ఉన్నాయట. ఈ అవతారికను శర్మగారు తమ రెడ్డిరాజ్యాల చరిత్ర అనే ఆంగ్లగ్రంథం అనుబంధంలో ప్రకటించారు.[1] ఈ అవతారికలో 84 పద్యా లున్నాయి. వేటూరివారు సంపాదించిన అవతారికలోని భాగాలను, తాము సంపాదించిన దానిలోని భాగాలను జతచేసి శర్మగారు ప్రకటించారు. ఇది అసంపూర్ణమైనా కవినిగురించి ఎన్నో విషయాలను తెలియజేస్తుంది.

కొమ్మన ముత్తాతపేరు గంగయ సింగనార్యుడు. ఇతడు కృతికర్త కాడుగాని కావ్యాన్ని అంకితం పుచ్చుకొన్నాడు. తూర్కరాజు చూస్తూండగా ఊరయ్య అనే కవి వ్రాసిన సుభద్రాకల్యాణం అనే కావ్యం ఈ సింగనకు అంకితమిచ్చాడు. ఈ తూర్కరాజు ఎవరో, ఊరయ్య ఎవరో సరిగా గుర్తించాలని సోమశేఖరశర్మగారు రెడ్డిరాజ్యాల చరిత్రలో వ్రాశారు (పుట 509). ఈ తూర్కరాజు మరెవరో కాదు, శృంగార నైషధాన్ని అంకితం పుచ్చుకున్న మామిడి సింగనగారి ముత్తాత తండ్రి. ఈ వంశావళిని శ్రీనాథుడు వర్ణించాడు (నైషధం, 1-20 నుండి). అతణ్ణి పెదతూర్కరా జని శ్రీనాథు డన్నాడు. ఇతని తమ్ముడో,

---

1. *History of Reddi Kingdoms*, by M. Somasekhara Sarma, Pp. 553-563.

ఎవరో చినతూర్క-రా జయిఉంటాడు. ఈ అన్నదమ్ములలో ఎవరో చూస్తూఉండగా ఊరయ్య కొమ్మన ముత్తాతకు కృతి ఇచ్చాడు. చూడండి పద్యం.

ఆకల్పంబుగ దూర్క-రాజు కన నూరాఖ్యాపచేత స్సభా
ద్రాకల్యాణ మనం దనర్చు కృతిరత్నం బొప్ప నైకొన్న సు
శ్లోక స్మశ్వ్రపితామహున్ బుధజనస్తోతవ్యదీవ్యద్గుణో
త్సేకున్ గంగయసింగనార్య్య దలతున్ ధీనిర్జరాచార్య్యనిన్.

[శివ. అవతారిక, 14]

తన ముత్తాత బుద్ధిలో బృహస్పతి అంతటివాడట. ఈయన కొడుకుపేరు నిశ్శంకమంత్రి; అతని కుమారుడు అబ్బమంత్రి. ఇతడే కొమ్మన తండ్రి. కవి తల్లిపేరు అంబ మాంబ. ఈ వివరాలన్నీ అవతారికలోని 14 వ సంఖ్యనుంచి 16 దాకా ఉన్న పద్యాలవల్ల తెలుస్తున్నాయి.

శివలీలా విలాసంవల్ల కొమ్మన వంశంగురించి అట్టే తెలియక పోయినా కొన్ని శాసనాలవల్ల మరికొన్ని వివరాలు తెలుస్తున్నాయి. పట్టిసగ్రామానికి దగ్గరలో ఉన్న పోల వరంలో మహానందీశ్వర దేవాలయం ఉంది. నిశ్శంక కొమ్మన దీనికి స్థానాపతిగా ఉండేవాడని ఒక శాసనం చెప్పుతున్నది.[1] ఈ శాసనకాలం క్రీ. శ. 1408. ఇందులో చోడభక్తరాజు కుమారుడైన అన్నదేవుడు కొప్పాక

1. A. R. 292 of 1920. ఈ శాసనంలో నిశ్శంక కొమ్మయ్య అనే పేరుకుబదులు నిశ్శంక కామయ్య అని పొరపాటుగా వ్రాశారని సోమశేఖరశర్మగారు చెప్పారు. చూ॥ *History of Reddi Kingdoms*, పుట 519.

గ్రామంలో కొన్న భూముల వివరణ ఉంది. ఈ భూములను అన్న దేవుడు మహానందీశ్వర లింగదేవుని ఆలయానికి దానమిచ్చాడు.

ఈ శాసనం నిశ్శంక కొమ్మన అన్న దేవుని కాలం వాడని, క్రీ. శ. 1408 లో ఆ దేవాలయానికి స్థానాపతిగా ఉండేవాడని తెలియచేయడమేకాక బహుశా అన్న దేవుని పోషణలో కవిగా ఉండేవాడనే ఊహకు తావునిస్తున్నది. ఈ అన్న దేవుణ్ణి అల్లాడరెడ్డి బహుశా క్రీ. శ. 1415 లో యుద్ధంలో చంపాడు.[1] ఈ సంగ్రామంలో అల్లాడరెడ్డి మూడవకొడుకు దొడ్డారెడ్డి పాల్గొని ఉంటాడు. శివలీలా విలాసంలోని క్రింది పద్యం చూడండి.

స్తుతిసేయందగు నల్లడేంద్రతినయున్ దొడ్డక్షమాపాలకున్
హితహేమాద్రివిశిష్టదానకలనానిర్దిష్టభూనిర్జితాం
చితవాణిన్ స్థలవీథి ముక్తశిరగ్ర...ధారాపయస్
స్తుతిదూరీ(రీ)కృతచోడపక్ష్మతాంతస్తాపరత్నాకరున్.

[ఆశ్వాసాంతము, 72]

ఈ పద్యంలోని చోడపుడు అన్న దేవచోడుడే అని చెప్పవచ్చు. అంటే శివలీలావిలాసరచన క్రీ. శ. 1415 తరువాత జరిగిఉంటుంది. అన్న దేవచోడుని నిర్జించాక అతని కొలువులో ఉండే నిశ్శంకకొమ్మనను దొడ్డారెడ్డి చేపట్టి ఉంటాడు.

ఈ సంగతులు వివరించాక తన తాత ముత్తాతల గురించి కొమ్మన మూడేమూడు పద్యాలు వ్రాశాడు. తన

1. *History of Reddi Kingdoms*, పుట 183.

వంశంగురించి ఇంత ముక్తసరిగా చెప్పినా 6 పద్యాలలో
ఋకవినింద చేస్తూ తన కాలపు సాహిత్య వ్యవస్థను
చక్కగా చెప్పాడు.

తెలుగని చెప్ప సంస్కృతవిధిజ్ఞత లేదని సంస్కృతంబునన్
బలుక డెనుంగు నేరరని ప్రాక్తనమార్గమునంద వచ్చినం
గలవది మున్ను నంచు నొక కైవడి గ్రొత్తగ గూర్చిరేని పె
ద్దలువ(?ప)నిగోరటం(రం?)చు మహిదజ్ఞులు నాడుదు రల్పధీయుతుల్.
కలిత మహాకవీంద్రకృతకావ్యసమర్థపదార్థమర్మముల్
తెలియగలేక చీకటియె తెంపుగ ద్రవ్వుదు రహ్మహా కడున్
ములుచలు కొంద రట్లయగు ముందట నున్నను పుట్టుజీకు లు
జ్జ్వలమణిదర్పణాంతరలసత్ప్రతిబింబము గానజేర్తురే?[అవతారిక,18,19]

మహాకవులు ఇంతకుముందే లక్షలు గ్రంథాలు
వ్రాశారు. ఇంక చెప్పక్కర్లేదు అనే వాళ్లకు జవాబు చెప్తూ
తన ఉద్దేశంలో కావ్యం అంటే ఎలాఉండాలో, అష్టాదశ
వర్ణనలు ఏమిటో వివరిస్తూ మూడు పద్యాలు వ్రాశాడు.

ఇల నలఘుకవులు కబ్బం_బులు లక్షలు జెప్పినారు మున్నని కాకన్
వల దుడుగ గావ్యరచనము_చెలగి కరులు నడచుత్రోవ జీములు జనవే?

గ్రొత్తగ నర్థముల్ దలచి గుంభనశబ్దములు న్వచిత్రతా
యత్తత నుల్లసిల్ల నిది యచ్చట నచ్చట నర్హవర్ణముల్
మెత్తిన నూలుకొల్పి రసమేళన మొప్పగ జెప్ప కూరకే
కత్తర బెత్తరల్ బెనచి కారులు కబ్బము అన్న నవ్వరే?
పురభూపర్తువు అంబుజా ప్తహిమరుక్ప్రత్రోదయంబు ల్మహీ
ధరమంత్రాహవముల్ వివాహరతియాత్రల్ ద్యూతపానాంబుధుల్
విరహోంభోవనలీల లుత్తమరసావిర్భావభావక్రియా
పరతీం జెప్పదగున్ బుధుల్ గరము మెచ్చన్ సత్ప్రబంధంబులన్.
[అవతారిక, 21_23]

ఈవిధంగా తలస్తూ 'ఉదంచితరచనా చమత్కృతి' ఉండేటట్లు ఒక సత్కృతి రచించా లనుకున్నాడు. అప్పుడు అల్లాడ దొడ్డారెడ్డి అతణ్ణి పిలిపించి ఇలా అన్నాడట:

శ్రీవత్సాన్వయశేఖరుండవు సదా శ్రీరామచంద్రానుకం
పావర్ధిష్ణుశుభాన్వితుండవు ఆ(?శుభా)పస్తంబసూత్రక్రమ
వ్యావర్ణీచరణప్రసిద్ధుడవు రమ్యార్థాష్టభాషాకవి
త్వావిర్భావవిధాధురీణుడవు బొమ్మామాత్య నీ విమ్మహిన్.
చతురుడవు పూర్వకవినాథసన్మహత్వ
మహితుడవు సర్వబుధలోకమాననీయ
చరితుడవు గాన నింపున జలుపవలయు
బెంపుగల్గంగ నస్మదభీష్ట మొకడు. [అవతారిక, 25-26]

అతని అభీష్ట మేమిటంటే సప్తసంతానాలలో కావ్యం ఎక్కువ కీర్తి నిస్తుంది. అందుచేత కృతిపతిత్వం కావాలని కోరుకున్నాడు. దొడ్డారెడ్డి అంతకుముందు ఎన్నో పురాణాలు విన్నాడట. అయితే సర్గ వంశచరిత్రలు మొదలైనవాటిచేత శివచరిత్రకు ఏకతం కలగడంలేదు. అందుచేత కేవల శివ చరితం వ్రాయమన్నాడు. ఆ పద్యాలు చూడండి.

వింటి పురాణముల్ గరము వేడుకతోడ ననేకభంగులన్
గంటి కృతార్థతాకలితగౌరవకాతుక మట్లనయ్యు ము
క్కంటి మహత్వ మేకతము గల్గద యెందు వినంగ రొ(లొ?)చ్చుగా
నంటిన సరవంశచరితాగులచే నటుగాన నా మదిన్.
కేవలశివచరితమునే-భావనవినగోరుదుం బ్రబంధనిధాన
శ్రీ వరలగ వినిపింపుము-భావరసాలంకృతాంధ్రభాషాసరణిన్.
[అవతారిక, 29-30]

దొడ్డారెడ్డి తనతో అన్న మాటలే కొమ్మన శ్రీనాథాది మహామునులచేత సూతునితో చెప్పించాడు.

అవియుగావున సర్గమన్వంతరాదు
లడరి యందును గ్రందుగా గడలుకొనుట
వరుస నప్పురాణముల బ్రవ్యక్తసరణి
దెలియగా రావు శివమహాదివ్యకథలు. [శివలీల, 1_7]

ఇలా అన్న శౌనకాది మహామునులలో ఆ మహా దేవుని చందమంతా 'క్రమరీతి' తేటపడగా చెప్పుతున్నాడు. ఈ భావం వాఙ్మయసృష్టి అంతటికీ ముకురభావమట! (1–9) ఈ ఆదేశాన్ని విన్నాక సూతుడు ఇలా ఉపక్రమించాడు :

కడగి బహుపురాణంబులు గనిన తెరగు
వెదకి యూగ మజ్జులచేత వినిన తెరగు
నొక్కతెరగున (కడు)నోజ గూర్చి
శివుని లీలావిలాసంబు చెప్పువాడ. [శివలీల, 1_15]

కావ్యంలో సూతుడు ఇలాగ అన్నా నిశ్శంక కొమ్మనే నిజంగా నూతన సూతుడు. రాజమండ్రి నైమిశారణ్యం. అల్లాడ దొడ్డారెడ్డి కోరికలే శౌనకాది మహా ములు.

ఈ దొడ్డారెడ్డి గొప్ప దండనాయకుడని ఈ క్రింది పద్యంవల్ల తెలుస్తుంది.

ఎడపక్కాగ్రహములు విడువని నృపతులు
వీడరు (విడుతురు?) నిజరాజ్యవిహారణములు
పొలవ కొజ్జలుసేయ జొరని భూరమణులు
చొత్తు రుగ్రాచలన్మూలగుహలు
కడక కప్పంబు లీగానని నృపతులు
గాంతురు నానాస్త్రఘర్షణములు

వరుస పాదములవ వ్రాలని జనవిభుల్
వ్రాలుదు రాజి ధరాతలమున
దన సముద్దండ జైత్రయాత్రాప్రతిష్ఠ
భూరిభేరీభణంకారఘోరరవము
నఖిల దిక్కుల దద్దరిల్లుకొత్తునప్పు డనిన
జొగడనేల నల్లయదొడ్డభూపమణిని? [శివలీల, 73]

దొడ్డారెడ్డిచే ఉక్కాడిన శత్రువులు యుద్ధంలో పడినప్పుడు అప్సరసలు ఎలా నాట్యం చేస్తారో ఇలా చక్కగా వర్ణించాడు. చూడండి.

వృక్కర్ణాధిపబాహు డల్లడధరిత్రీనాథు దొడ్డాంకచే
నుక్కాడన్ రిపుకోటి యాజి బడుచో నొప్పార(రు?)నాకంబులో
జక్కాకీటట దుడ్డుదూధణధణర్ఝుంఝుంధిమింధిద్ధిమిం
ధిక్కత్తోణకకీర్ణవాద్యములతో దివ్యాంగనానృత్యముల్. [శివలీల, 74]

దొడ్డారెడ్డి జైత్రయాత్రకు వెళ్లేటప్పటి సంగతులే కొమ్మన ఇందులో చెప్పాడుగాని ఆయన ఏయే యుద్ధాలలో పాల్గొన్నాడో, ఏయే దుర్గాలు పట్టుకొన్నాడో చెప్పలేదు. అయితే ఈ దొడ్డారెడ్డిసే వర్ణిస్తూ శ్రీనాథుడు కాశీఖండంలో ఇలా చెప్పాడు.

ఔరా! యల్లయరెడ్డికొడ్డవసుధాధ్యక్షుండు ధాటీచమూ
భేరీభాంకృతిఘోరఘోషమున నిర్భేదించె నొడ్డాద్రిశృం
గారంకోటయు లోతుగడ్డయును నుద్ఘాటించె నత్యుద్ధతిన్
కీరాంభోధితటంబున న్నిలిచె దిక్సీమాజయస్తంభముల్.
[కాశీఖండం, 1-52]

ఇందులో ఒడ్డాది, శృంగారపుకోట, లోతుగడ్డ అనే ప్రదేశాలున్నాయి. ఇవి విశాఖపట్నంజిల్లాలో ఉన్నాయి.

ఈ విజయాలను కొమ్మన మేరొక్కనలేదు కాబట్టి శివలీలా విలాసాన్ని అతడు శ్రీనాథుని కాశీఖండానికి ముందే రచించి ఉంటాడు. ఈ ఇద్దరు కవులూ దొడ్డారెడ్డిని వర్ణిస్తున్నప్పుడు ఒక ముఖ్యమైన సంగతిని చెప్పారు. అతడు గొప్ప గుర్రపు కాతు. ఒకసారి ఇరవైనాలుగు మూరల మేర గుర్రాన్ని దాటించాడట. ఈ 'ఫీటు'ను కొమ్మన ఇలా చెప్పాడు.

అరరే! అల్లయదొడ్డభూవిభుడు వాహారోహకేవంతు డిం
పరుదారన్ వడి మూలగూరికడ వాహ్యాళిస్థలిక్ రాజపం
జరసింహం బను వారువంబును యదృచ్ఛాలీల దాటింపడే
తిరమై యిర్వదినాల్గుమూళ్ల నిడు ఫుల్సేకంబు చేయెత్తుగన్.

[అవతారిక, 77]

ఈ సంగతినే శ్రీనాథు డిలా వర్ణించాడు.

హరి దాటించె బురోపకంఠమున వాహ్యాళిప్రదేశంబునం
దరరే! యల్లయరెడ్డినందనుడు దొడ్డయ్యక్షమాధీశ్వరుం
డిరువైనాలుగుమూళ్ళ మేర యనుగోపెక్కింపగా నేలయ
ద్ధరణీనాథుని కీర్తి దాటె గదు నుద్దండించి బ్రహ్మాండముల్.

[కాశీఖండం, 1_53]

కొమ్మనపద్యంలోని 'అరరే' అనే ఆశ్చర్యం శ్రీనాథుని రెండవపాదంలో ఉంది. శ్రీనాథుని కాశీఖండానికి ముందే శివలీలావిలాసంరచన జరిగినా శ్రీనాథుని హరవిలాసమే దీనికి మార్గదర్శి. హరవిలాసంలో కొన్ని శివలీలలే ఉంటే దీనిలో అన్నీ ఉన్నాయి. వీటిని పరిశీలిద్దాం.

ఇతడు ఒక్కొక్క కొత్తలీల మొదలుపెడుతున్నప్పుడు ఒక ఆటవెలది వ్రాస్తాడు.

వినుడు సముచితముగ వివరింతు నిటమీద
నభవు డవధరించినట్టి లీల.

అనే రెండుపాదాలు ప్రతిపద్యంలోనూ మొదట విధిగా ఉంటాయి. తరువాత రెండుపాదాలలోనూ ఆలీల పేరేమిటో వివరిస్తాడు. మొదటిలీల 1-23 తో మొదలవు తుంది. ఈ పద్యంలోని చివరి రెండుపాదాలు శిథిలంకావడం వల్ల ఈ మొదటి లీల పేరు తెలియదు. అయితే ఈలీల కడపట ఫలశ్రుతి చెప్పి శివుడిట్లు పురుషభావము సవరించిన యట్టి లీలగ దీనిని పేర్కొన్నాడు [1-37]. రెండవలీల 1-38 తో మొదలు. ఈ పద్యంలోనూ పేరుదగ్గరే అక్షరాలు పోయాయి. అయితే ఫలశ్రుతిలో (1-94) చెప్పినదానినిబట్టి దీనిని 'అజబోధ' అని సవరించవచ్చు. తరువాతి పేర్లను మొమ్మన పెట్టినవే పేర్కొని క్రోడీకరిద్దాం.

1.	పురుషభావం సవరించినలీల	1_23 (పుట 7)
2.	అజబోధ	1_38 (పుట 10)
3.	సతీవిరహం	1_95 (పుట 20)
4.	కణేశ్వరోద్భవం	1_190 (పుట 38)
5.	చంద్రధారణం	2_3 (పుట 51)
6.	వృషభవాహనం	2_31 (పుట 57)
7.	భృంగిప్రసాదం	2_51 (పుట 61)
8.	నందివాహనం	2_73 (పుట 66)
9.	సింధురాసురమర్దనం	2_98 (పుట 71)
10.	భుజంగధారణం	2_142 (పుట 80)
11.	గంగాధరణం	2_194 (పుట 91)
12.	అంతకదహనం	2_285 (పుట 110)
13.	జలంధరవధ	2_324 (పుట 120)

[రెండవ ఆశ్వాసాన్ని ముద్రిస్తున్నపుడు పరిషత్తువారు పద్యాల సంఖ్యను ఇవ్వలేదు. అందుకే పుటలను పేర్కొన్నాను.]

దొరికిన పదమూడులీలలను ఆంధ్రసాహిత్యపరిషత్తు వారు పూర్తిగా ప్రచురించారు; అయితే పదకొండు లీలలకే సంఖ్యను పేర్కొంటూ ఉపశీర్షికలు అచ్చువేశారు. పన్నెండు పదమూడు లీలలను అచ్చువేస్తున్నపుడు ఆసంఖ్య లుండవలసిన చోట ఖాళీలు వదిలేశారు. అందుచేత కొమ్మన ప్రాసిన పదకొండు లీలలే దొరికాయని కొందరు భావించవచ్చు. నిడుదవోలు వెంకటరావుగారు "ఉపలబ్ధమగు గ్రంథములో బదునొకండవలీల యగు జలంధరుని వధతో ద్వితీయాశ్వాసము ముగియుచున్నది. ఆపై ఎంత గ్రంథమున్నదో యెరుగరాదు." అని వ్రాశారు.[1] చాగంటి శేషయ్యగారు కూడా "లభించిన రెండాశ్వాసములలో పదకొండు లీలలున్నవి. ఇంక నెంతగ్రంథ మున్నదియో తెలియరాదు" అని వ్రాశాడు.[2]

కొమ్మన తన గ్రంథంలో 36 శివలీలలు ఉంటాయని చెప్పాడు (1–17). అందులో పదమూడు దొరికాయి. ఇంక 23 లీలలు దొరకాలి. వాటిపేర్లను తెలుసుకొందాం.

14. దారుకావనవిహారం, 15. హాలాహలభక్షణం, 16. సుదర్శన ప్రదానం, 17. దక్షిణామూర్తిరూపం, 18. దక్షునిపై కోపం, 19. కామదహనం, 20. కపటవటురూపం, 21. గిరిజాకల్యాణం, 22. తారకాసురవధకు ఉద్యోగం, 23. శతమన్యునిపై కోపం, 24. ఉపమన్యుని

---

1. రెడ్డిసంచిక, శివలీలావిలాసము, పుట 374.
2. ఆంధ్రకవితరంగిణి, 5 వ సంపుటం, పుట 214.

భోచడం, 25. త్రిపురసంహారం, 26. కాలభైరవుడు బ్రహ్మశిరస్సు త్రుంచడం, 27. కాలభైరవ భిక్షాటనం, 28. నందకప్రహారణం, 29. దక్షయజ్ఞవిధ్వంసనం, 30. అగ్నిముఖునిచేత మృత్యువును పరిమార్పించడం, 31. అర్ధనారీశ్వర, 32. నృసింహగర్వభంగం, 33. చండీశ్వరరక్షణ, 34. త్రివిక్రమకంకాళధారణ, 35. కిరాతార్జునీయం, 36. కల్పావసానంలో ఊర్ధ్వలింగప్రదర్శన.

కొమ్మన 630 గద్యపద్యాలలో 13 లీలలు వర్ణించాడు. ఈలెక్కనే అతడు మిగతకావ్యం వ్రాశాడనుకొంటే సగటున అతడు సుమారు 1745 గద్యపద్యాలలో ఈకావ్యం రచించిఉంటాడు. ఇంకా వెయ్యాపైచిలుకు గద్యపద్యాలు ఇతనివి లభించాలి. కొంత దొరుకుతున్నదనుకోవచ్చు. 13-వ లీల దారుకావన విహారం కాకినాడలో ఉందిగాబోలు. "శ్రీనాథునికంటె బరమశివభక్తుడుగా లెక్కింపబడు నిశ్శంక కొమ్మనామాత్యుడు తన శివలీలా విలాసమున దేవదారు వనవిహార ఘట్టమున పురుషాయతమును బంధాదికమునుకూడ పరమేశ్వరాశ్రయముగా వర్ణించి పెట్టినాడు" అని చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు వ్రాశారు.[1]

దారుకావన విహారాన్ని ఆంధ్రసాహిత్య పరిషత్తువారు ప్రకటించలేదు. ఈగ్రంథం తృతీయాశ్వాసంలో కూడా కొంత లభ్యమవుతున్నదనుకోవాలి. ఈపద్యాలు కాక కొమ్మన వ్రాసినవి ఇంకో 14 పద్యాలు ప్రబంధరత్నాకరంలో ఉన్నాయి. వాటిని ఒక ప్రాచీన సంకలనకర్త సేకరించాడు. ఆంధ్రసాహిత్యపరిషత్తువారి 'ఉదాహరణ

1. శ్రీనాథుని కవితాసమీక్ష-శ్రీనాథుడు శృంగారియా? పుట 63.

పద్యములు' అనే పుస్తకంలో అవి వున్నాయి. ఈ 14 పద్యాలు నిశ్శంకుని కొమ్మన వ్రాసిన 'వీరమాహేశ్వరము' అనే గ్రంథంలోనివని ఆ సంధాత చేర్కొన్నాడు.

"ఈ శివలీలావిలాసమునకే వీరమాహేశ్వర మన్నది నామాంతరమో, లేక యిది వేఱు గ్రంథమో తెలియరాదు. గ్రంథము నొరకువరకును వీరమాహేశ్వరము ప్రత్యేక గ్రంథ మనియే భావింతము" అని కందుకూరి వీరేశలింగంగారు వ్రాశారు.[1] అయితే ఆపద్యాలును పద్యాలనూ చూస్తే అవి ఈ శివలీలావిలాసంలోనివే అయిఉంటాయని చెప్పవచ్చు. చూడండి, వీరమాహేశ్వరంలో సుదర్శనంపై ఒక పద్యముంది.

దైతేయకాంతల తఱుకుగమ్మోవుల వీటికాశీలకు వీడుకోలు,
వేల్పుటిల్లాండ్ర క్రొవ్విదపుజన్నులమోది యలుపుబయ్యెదలకు నిలువనీడ,
విశ్వజగత్త్రయీవిజయలక్ష్మీ గాఢ బిరుదోత్సవములకు బెండ్లివిందు,
పరిపంథివాహినీపరిచితపరిభవప్రాప్తసంకటముల పాయుత్రోవ,
వేసి యెయ్యది విలసిల్లు జిత్రమహిమ?
నది ప్రయోగింప నెత్తె నయ్యచ్యుతుండు
విలయసమయసముద్భూతవిపులదహన
దారుణస్పర్శనంబు సుదర్శనంబు. [ప్రబంధ. 110]

ఇది శివలీలావిలాసంలో 16 వ లీలలోనిది. అది "ఇందిరావల్లభున కలరి, సుదర్శనం బొసంగుటయును" అని కొమ్మన్న విషయసూచికలో (1-17) చెప్పిన లీల.

---

1. ఆంధ్రకవుల చరిత్ర, ప్రథమభాగం, పుట 589.

పార్వతీదేవిని గిరిజగా వర్ణించే పద్య మొకటి వీరమాహేశ్వరంలో ఉంది.

ప్రణవపీఠిక పెక్కు భాసిల్లు నేదేవి యామ్నాయహేమహార్మ్యాగ్రవీథి?
జరియించు నేదేవి సహజారుణజ్యోతిరానందమూర్తియై బ్రహ్మనాడి?
నేదేవి భవనిల్లు నిచ్ఛాక్రియాజ్ఞానశక్తిభేదమున విశ్వంబు నిండి?
తోడునీడయయిబోలె దులకించు నేదేవి యెల్లకాలంబు విశ్వేశుగూడి?
యట్టిదేవి జగన్మాత యఖిలవంద్య
నిఖిలవిద్యాకళేశ్వరి నిత్యమహిమ
వొకటియయిను శ్రీగిరిని బ్రేవ నుల్లసిల్లు
వలఘుకల్యాణశుభగాత్రి యద్రిపుత్రి. [ప్రబంధ. 115]

ఇది వటుభావంబున గిరిజాభావం తెలుసుకొన్నాక "తదీయగరిష్ఠ నిష్ఠకు మెచ్చి యాయమం బెండ్లియగుట"అని కొమ్మన చెప్పిన 21 వ లీలలోని పద్యం. "పార్వతీ ప్రణయ వశంబున నర్ధగాత్రం బంగీకరించుటయు" అని కొమ్మన ఒకలీల రచించాడు. ఇది 31 వ లీల. ఇందులోని పద్యమే ఒకటి వీరమాహేశ్వరంలోని దని సంకలనకర్త సంతరించాడు.

తల్లిదండ్రులతోడి తగు లొల్లపండియు దల్లిదండ్రులతోడి తగులు వలచి,
కందర్పుమోదియక్కటికంబు సెల్లియు గందర్పుమోది యక్కటిక ముదవి,
సంసారకేళి ప్రసక్తిబోదట్టియు సంసారకేళి ప్రసక్తి గలిగి,
సగుణవిశేషయోజనము ల్ఘటించియు సగుణవిశేషయోజనము మరగి,
సగము పురుషుండు కంజాక్షి సగము గాగ
నర్ధనారీశ్వరాకృతి ననువుపఱచి
హరుడు తల్లింగమధ్యంబునందు నుండి
హరివిరించుల కంత బ్రత్యక్షమయ్యె. [ప్రబంధ. 109]

అర్ధనారీశ్వరలీలకు ముందుగా 'ఏకశరంబునం ద్రిపు రంబు లేర్చి యబ్ధింబడగూల్చుట' అనే 25 వ లీల ఒకటి వుంది. అందులోని పద్యమే ఈ క్రిందిది.

జడివట్టుపడగలు, పడగలమోదబోగదలెడి కండ్లును, గండ్లనడుపు
మాత్రించు జోడును, జోడుపై జరియించుబంట్లును, బంట్లకు బాయరాని
ధనువును, ధనువుతో దగిలిన యరదంబు, నరదంబు క్రిందికి నరుగు నారి,
నారి నిద్రించు బాణము, బాణ మొదవించునూతుండు, సూతసంజాతహరులు
గాగ నద్భుతార్థకరపదార్థావళి_యుల్లసిల్ల నొప్పుచున్న దిపుడు
త్రిపురహరణకరణదృఢదత్తధీర మ_నోరథంబు దేవ! నీ రథంబు.

[ప్రబంధ. 108]

'పునర్భూతుండగు దక్షుబన్నంబు వీరభద్ర పరాక్రమంబున విప్లీకరించుటయు' అనే 29 లీలలో వీరభద్రునితో వచ్చిన ప్రమథుల వర్ణనమే ఈ క్రింది పద్యం.

కమలజాండంబులు కందుకంబులు సేసి యొండొండ దాటింప నోపువారు,
విలయవహ్నులబట్టి వెసదండలుగ్రుచ్చి యురమునధరియింపనోపువారు,
తివిరి సంహారభైరవుసైన బొరివోవ నొకమాత్ర వసిమాల్పనోపువారు,
కాలచక్రక్రియాఘటనంబు ద్రిప్పి యొండొకలాగు గావింపనోపువారు,
ప్రమథవీరులు వివిధరూపములతోడ
హసనలనుఘనతాపనాద్యలఘుగతులు(?)
కెలయ గోటానకోటులు కొలిచివచ్చి
రతడు హరు గొల్వ నేతెంచు నవసరమున. [ప్రబంధ. 105]

ఈవిధంగా గుర్తుంచుకొంటూ దీనిలో మిగతపద్యాలు ఏయే ఘట్టాలలోనివో తెలుసుకోవచ్చు. మొత్తానికి వీరమాహేశ్వరం శివలీలా విలాసానికే నామాంతరమని చెప్ప

వచ్చు. ఈ శివలీలావిలాసం అవతారికలో ఉన్న పూర్వ కవిస్తుతినే వీరమాహేశ్వరంలోని దని సంకలనకర్త ఉదాహరించాడు.

నన్నయభట్టు గావ్యరచనావిధి, దిక్కనసోమయాజి న
చ్ఛిన్నమహత్త్వసంవిహితశేముషి, నెట్టియ్రాపెగ్గడన్ సమా
పన్ననవప్రబంధరసభావన, నింపున ప్రార్థసాంజలుల్
మున్నగ నాత్మలో దలతు మువ్వుర మువ్వుర బోలు పుణ్యులన్.1

[ప్రబంధ. 111]

కొమ్మన కవిత్రయాన్ని త్రిమూర్తుల్లాంటి పూజ్యులన్నాడు. నన్నెచోడుని నుతించలేదుగాని అతని కుమారసంభవాన్ని కొమ్మన చదివాడని చెప్పవచ్చు. శివలీల సతీ వివాహంలో ఆమెను మొదట నఖశిఖపర్యంతం కొమ్మన వర్ణించాడు. కాళిదాసు కుమారసంభవంలో అలాగే మొదట చేశాడు. అది చూసి నన్నెచోడుడు 31 కందపద్యాలలో వర్ణించాడు. నిశ్శంక కొమ్మన 24 పద్యాలలో వర్ణించాడు. (1-135 నుంచి 158 దాకా). ఇందులో మీగాళ్ల వర్ణన చూడండి.

సర్వమంగళమీగాళ్ళ చక్కదనము
తమకు బడయంగరాకపో కమఠము...
మెనయజాలక తల యెత్తుకొనగలేక
బయలు మెరసి చలింపవు భయముకతన. [శివలీలా. 1_137]

దీనిని నన్నెచోడుని పద్యంతో పోల్చిచూడండి.

---

1. ఈ పద్యం శివలీలావిలాసం అవతారికలో 12 పద్యం. చూ. *History of Reddi Kingdoms*, Appendix.

కన నీచయోని పడు చే_లని సకశ్రతమును నుమపదారాధనకొం
దిన విష్ణుకమఠరూప మొ_యనదగి మీగాళు లగజ కందం బొందున్.

[కుమార. 3_45]

కాళిదాసు మూలంలో దీనికి సరిపోయినవర్ణన లేదు. కాబట్టి కొమ్మన నన్నెచోడుని చూసే ఇలా చెప్పిఉంటాడు.

నన్నెచోడుడు అన్ని కందపద్యాలే వ్రాశాడు. కొమ్మన 16 కందాలు, 7 గీతలు, 1 చంపకం వ్రాశాడు. చంపకమాల చూడండి-ఆఖరుది.

సవరదనంబు లెల్లను బొసంగగ నొక్కెడ జూచువేడ్క వా
గవు డుసమాపదార్థసముదాయము లన్నియు దెచ్చి దక్షసం
భవనొనరించెగాక తలపన్నది యట్టిదగాక తక్కినన్
సవతియ లేక యాసతియ చానలలో బ్రకటిల్లుచుండునే?

[శివలీల, 158]

ఇది పార్వతీవర్ణనలో కాళిదాసు వ్రాసిన చివరి శ్లోకానికి అనువాదం. చూడండి.

సర్వోపమాద్రవ్యసముచ్చయేన_యథాప్రదేశం వినివేశితేన
సా నిర్మితా విశ్వసృజా ప్రయత్నా_దేకస్థసౌందర్యదిదృక్షయేవ.

[కుమార. 1_49]

కాళిదాసు, నన్నెచోడుడు మొదలైన ప్రాచీనులను అనుకరించడమేగాక సమకాలికులను కూడా కొమ్మన అనుకరించాడు. వీరమాహేశ్వరం లోనిదని సంకలనకర్త ఉదాహరించిన గరుత్మంతుని వర్ణనలో "దంభోళి నొక ఈకతాకు గానికసేసి యమృతంబు దెచ్చిన యవఘళుండు" అని కొమ్మన వ్రాశాడు (ప్రబంధ. 113) "జిష్ణుపతి కొక్క

యీాకయిచ్చిన ప్రదాత'' అని శ్రీనాథు డన్నాడు (కాశీ. 6-14)

శ్రీనాథుడు హరవిలాసంలో వ్రాద్దానునుకొని కొన్నే వ్రాసిన శివలీలలు తీసుకొని సంపూర్ణంగా - కల్పారంభం నుండి కల్పాంతందాకా, ఒక క్రమంగా కొమ్మన కథనం చేశాడు. దానికి ప్రబంధలక్షణాలు ఉండడానికి అక్క డక్కడ సముచితంగా వర్ణనలు చేశాడు. గణేశ్వరోద్భవంలో బాల్యాంక చేష్టలు చక్కగా వర్ణించాడు. ఆటలో బిడ్డ తల్లిని ఏడిపిస్తూఉంటే తండ్రి నవ్వుకొంటాడు. తండ్రిని ఇబ్బందిపెడితే తల్లి నవ్వుకొంటుంది. పార్వతీపరమేశ్వరు లను గణపతి ఉల్లాసపరిచాడు. చూడండి

సతి దను నంకపీఠిక బొసంగగ జేరిచి ముద్దులాడుచో
నతిముహితాద్భుతంబులకు నాయనుచన్నుల కాశ్మకంభముల్
ప్రతియిడి వీని వాని గురుభావము చెప్పు మటంచు ముగతా
న్వితనడురు న్మహేశ్వరుని వీనులకు న్ముద మావహిల్లగన్.

జనకుడు తన్ను నూరుతలసంగతు జేసి యథోచితోపలా
లనముల నింపు సేయగ జెలంగుచు దత్పదనమ్రశక్రలో
చననికరంబు చూచి జలజాతసరోవరమంచు దొండ మొ
య్యన జరిగించు దల్లిహృదయంబునకుం బ్రియముల్ జనింపగన్.

[శివలీలా. 1_234,235]

పార్వతీపరమేశ్వరులవద్ద వినాయకునికి ఎంత చనువు ఉందో కొమ్మనకూడా అంత తీసుకొన్నా డనిపిస్తున్నది. మొగలిపువ్వు శివపూజకు పనికిరాదు. అయినా శివుని నెత్తికెక్కిన చంద్రుడి కథలో కొమ్మన మొగలి రేకును లాక్కొచ్చి తురిమాడు, చూడండి.

ఆతరుణచంద్రకళచే_జేతఃప్రియకరనిరూఢి శివు డింపలరన్
మాతనవిలాసలీలా_స్మితంబగు మొగలిరేకు చెరివిన కరణిన్.
[శివలీలా. 2_28]

కవి నిరంకుశుడు! చంద్రుణ్ణి ఇలా వర్ణించినవాడు నక్షత్రాలను ఎలా వర్ణించాడో చూడండి. గంగావతరణం ఘట్టంలో శివుడు తన మేను పెంచుకొన్నాడు. నక్షత్రాలు మొదట తలపువ్వులులాగ ఉన్నాయట. అతడు పెరుగుతున్న కొద్దీ అవి ఇతర ఆభరణాలతో సరిపోలి చివరకు కాలిమువ్వలలాగ ఉన్నాయట. చూడండి.

తొలిదొలి శేఖరస్థలమున కలవడి మవ్వంబు మిగిలిన పువ్వులగుచు
నంతలోపలను గర్ణావతంసములపు బ్రకట వినూత్నవజ్రంబు లగుచు
మదనంతరంబ ప్రదేశమునపు దీపితహారమౌక్తికము లగుచు
మరి యూరుణమ కటి మహిత మేఖలపునిమ్నల రచించిన వెండిమువ్వలగుచు
నిట్లు నక్షత్రములు చిత్రమెసకమెసగ
క్రమము దప్పక నిజకపర్దములు దలప
నుగ్రమాహేశ్వరుం డున్న యునికి తోన
నిగిడి బ్రహ్మాండమండలినిండ బెరిగి. [శివలీలా. 2_265]

ఇటువంటి కవిత్వం పాత్రనేకాదు, కవినికూడ ఆకాశమంత ఎత్తుకు పెంచుతుంది.

కొమ్మన తెనుగు కవిత్వంలో ఆజానుబాహుడే.

3

గౌరన



చీన తెలుగుసాహిత్యంలో నాటకాలను ఎవరూ వ్రాయలేదుగాని ఆద్యు లెవ రైనా మొదలుపెట్టి సంప్రదాయాన్ని నెల కొలిపితే తెలుగుజాతి గర్వించదగ్గ నాటకరచయితగా పేరుపొందే కవి ఒకడు లేకపోలేదు. అతని పేరు గౌరన. ఆయన హరిశ్చంద్రుని కథను, నవనాథుల చరిత్రను ద్విపద కావ్యాలుగా వ్రాశాడు. ఇవి పేరుకు ద్విపదకావ్యాలైనా కవి వీటిని నాటకాలు వ్రాస్తున్నట్టే రచించాడు. హరి శ్చంద్ర కావ్యంలో ఇది మరీ ఎక్కువగా కనబడుతుంది.

తన కాలంనాటి సంఘంలో సామ్రాజ్యాన్ని ఏలే మహారాజుదగ్గరనుండి శ్మశానాన్ని గుత్తకు పాడే కటికవాడి దాకా ఎవరెవరు ఎలా మాట్లాడేవారో, ఎలా ప్రవర్తించే

వారో, వాళ్ళ కట్టూ, బొట్టూ, హావభావచేష్టలూ ఎలా ఉండేవో సునిశితంగా పరిశీలించి, సూక్ష్మవిషయాలుకూడా గుర్తించి, పాత్రలను సూటిగా చిత్రించిన మహాకవి గౌరన. శుద్ధచాందసకుటుంబాలలోని గయ్యాళిభార్యల ఆగడాల దగ్గర్నుంచి నేరం చేస్తే రాజుగారి భోగపత్నులను రచ్చకీడ్చే ముందు మంత్రులు మొదలైనవాళ్లు అంతఃపురంలోనే వాళ్ళను విచారణజరిపే పద్ధతిదాకా ఎన్నో సాంఘిక ఆచారాలను చూపించాడు.

గౌరన ఈ రాచమర్యాదలను స్వయంగా చూసి ఉంటాడు. అందుకు ఆస్కారం ఉంది. ఇతని పెదతండ్రిపేరు పోతన్న. ఆయన గొప్ప మంత్రి. అతడు క్రీ. శ. 1361–1384 దాకా దేవరకొండను పాలించిన మాదానాయకుని దగ్గర ఉండేవాడు. ఈ పోతనామాత్యుడు స్వామికార్యధురంధరుడు. రాజనీతియుగంధరుడు.[1] పెదతండ్రితో గౌరన చిన్నప్పుడు రాజభవనంలోని వివిధాంశాలను చూసిఉంటాడు. తను చూసిన సమాజాన్ని తన కావ్యాలలో చిత్రించాడు. ఇతని పెదతండ్రికాక తండ్రికూడ మంత్రే. ఆయనపేరు అయ్యలుమంత్రి. ఆయన ఎవరిదగ్గర, ఎక్కడ మంత్రిగా పని చేశాడో గౌరన చెప్పలేదు. బహుశా పద్మనాయకులవద్దనే

---

1. ఇవి ఆంధ్రసాహిత్యపరిషత్తువారి గ్రంథాలయంలోని 2585 నెంబరు తాళపత్రగ్రంథం 'లక్షణదీపిక'లో గౌరన చెప్పిన మాటలే.

ఉద్యోగిగా ఉండిఉంటాడు. అయ్యలుమంత్రికి ఇద్దరు కుమారులు. పెద్దవాని పేరు ధరణిమంత్రి. రెండవవాడే గౌరన. ధరణిమంత్రికూడ పద్మనాయకులవద్దనే ఉద్యోగం చేసినట్లుంది.

ధరణి నమాత్యరత్నం బనబరగు
ధరణిమంత్రికి గూర్మితమ్ముడ ఘనుడ.

అని గౌరన హరిశ్చంద్రచరిత్ర ఆరంభంలో చెప్పుకొన్నాడు. తండ్రి, పెదతండ్రి, అన్న మొదలైన బంధువులందరూ రాజోద్యోగులుగా చేసినా గౌరనమాత్రం అలాంటి బెడదలు పెట్టుకొన్నట్లు లేదు. 'కవిత్వసుమహితసామ్రాజ్యసుఖపరాయణు'నిగా తనను తను చెప్పుకొన్నాడు.[1] ఇతనికి చతురసాహిత్యలక్షణచక్రవర్తి, ప్రతివాదిమదగజ పంచాననుడు అనే బిరుదులు ఉండేవి.

లక్షణచక్రవర్తి అనే బిరుదు ఇతనికి ఊరకనే రాలేదు. లక్షణదీపిక అనే ప్రామాణికలక్షణగ్రంథం ప్రాశాడు. తెలుగుఛందస్సులనుగురించి సంస్కృతంలో రచించాడు. ఇందుకు కారణం లేకపోలేదు. ఆనాడు రాజులందరూ సంస్కృతభాషాభిమానులు. సంస్కృతంలో గ్రంథాలు ప్రాయగలిగిన సమర్థులు. గౌరనసమకాలికుడైన పద్మనాయకప్రభువు మాదానాయకుడు రామాయణానికి

1. హరిశ్చంద్రద్విపద, ఉత్తరభాగం చివర 2911 వ పాదం.

రాఘవీయమనే టీక వ్రాశాడు. ఆ టీక నేడు లభ్యం కాదు. అయినా అతడు అది రచించినట్లు ఆయనభార్య వేయించిన శాసనంవల్ల తెలుస్తున్నది. ఈ మాదానాయకుడు గౌరన పెదతండ్రిని పోషించిన 6 వ తరంలోని మాదానాయకుడు కాడేమో. (అతని కాలం క్రీ. శ. 1361–84.) 8 వ తరంలో ఉన్న మాదానాయకుడు కావచ్చు. (ఇతని కాలం క్రీ. శ. 1427). ఈ మాదానాయకనృపాలుడు రామభక్తుడు. రామాయణ మంటే అభిమాన మున్నవాడు. ఈప్రభువు వల్లనే గౌరనకూడ రాముణ్ణి స్తుతిస్తూ సంస్కృతంలో లక్షణ గ్రంథం వ్రాసిఉంటా డని భావించవచ్చు.

గౌరన రచించిన లక్షణదీపికకు రెండు విభిన్నమైన ప్రతులు ఉన్నాయి. ఒకదానికి 'క' అని, రెండవదానికి 'గ' అని సంకేతాలు పెట్టారు.[1] 'క' ప్రతిలో ప్రారంభం ఇలా ఉంది.

జానకీముఖపద్మార్కం-జానకీకుచభూషణం
జానకీరమణం వందే-జగతాం మంగళప్రదం.

[ఆ.సా.ప.తాళపత్రం, 2585]

ఈప్రతిలో మొదట శ్రీరాముణ్ణి స్తుతించడం కన బడుతుంది. అయితే 'గ' ప్రతిలో

ప్రణమ్య విద్వజ్జనపారిజాతం-కవీంద్రవిప్రార్చితపాదపంకజం
విభుం ప్రభుం విశ్వసృజం మహేశం-సంవక్ష్యతే లక్షణదీపి కేయమ్.

[ఆ.సా.ప.తాళపత్రం, 1391]

---

1. 'గౌరన—లక్షణదీపిక'—చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక 31 వ సంపుటి, 34 సంచిక.

ఈ రెండవ ప్రతిలో ఈశ్వరునికి ప్రణుతి కనబడుతుంది. గౌరన తెలుగులో ప్రాసిన రెండుకావ్యాలలోను గ్రంథాదిని శివుణ్ణే స్తుతించాడు. నవనాథచరిత్ర శ్రీశైల మల్లికార్జునదేవునికి అంకితం. అయితే అంతమాత్రంచేత గౌరన ఇతరదేవతలపట్ల అగౌరవం గలవాడు కాదు. రాముడన్నా, రామాయణమన్నా ఇష్టమే అనిపిస్తుంది. నవనాథ చరిత్రలో మీననాథుడు శిష్యులతోపాటు భారతదేశంలోని దివ్యక్షేత్రాలు దర్శిస్తూ కైలాసానికి వెడతాడు. అయోధ్యకు వెళ్ళినపుడు మీననాథుడు శిష్యులకు రామకథ చెప్పాడు. ఈ సందర్భంలో గౌరన ఇరవైనాలుగు ద్విపద పాదాలు ప్రాసి చివర 'మహాపాతకహరమైనరాము వినుత చరిత్రంబు' అన్నాడు.[1] అందుచేత 'క' ప్రతిలోని శ్రీరామ వందనం గౌరన చేసినదే అని చెప్పవచ్చు.

ఈ లక్షణదీపిక రచించడంలో గౌరన సుమారు ఏభై ప్రామాణికగ్రంథాలు సంప్రదించాడు. ఆరోజుల్లో ప్రామాణికగ్రంథాలను సంప్రదించడమంటే అవన్నీ వాచో విధేయంగా ఉండడమే. 'క' ప్రతిలో 39 ప్రామాణిక గ్రంథాలు, 'గ' ప్రతిలో 20 గ్రంథాలు ఉన్నాయి. ఇవి కాక 6 తెలుగుఛందోగ్రంథాలను గౌరన పేర్కొన్నాడని చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు ప్రాశారు. ఈ పట్టికలనుంచి క్రోడీకరించిన గ్రంథాల అకారాదిక్రమాన్ని చూడండి.

---

1. నవనాథచరిత్ర, చతుర్థాశ్వాసం, పుట 200.

'క' ప్రతిలో చెప్పినవి	'ఖ' ప్రతిలో చెప్పినవి
1. అమరుకము	అమరుకము
2. అలంకారచూడామణి	.....
3. అలంకారసంగ్రహము	.....
4. అలంకారసర్వస్వము	.....
5. ఉత్తమగండభందము	.....
6. ఉత్తరరామచరితము	.....
7. ఉద్యోదము	.....
8. కవికంఠపాశము	కవికంఠపాశము
9. కవిగజాంకుశము	.....
10. కవిరాజగజాంకుశము	కవిరాజగజాంకుశము
11. కాలనిదానము	.....
12.	కిరాతార్జునీయము
13. కుమారసంభవము	.....
14. కృష్ణవిజయము	.....
15. చమత్కారచంద్రిక	చమత్కారచంద్రిక
16. ఛప్పన్నము	.....
17.	త్రిభాష్యరత్నాకరము
18. త్రివిధము	.....
19.	నామలింగానుశాసనము
20. నిధిప్రదీపిక	.....
21.	నైషధము
22. న్యాయసారము	న్యాయసారము
23.	ప్రపంచసారము
24.	ప్రబంధదీపిక
25. పణితశాస్త్రము	.....

'క' ప్రతిలో చెప్పినవి	'గ' ప్రతిలో చెప్పినవి
26. బృహజ్జాతకము	బృహజ్జాతకము
27. భరతసంగీతరత్నకోశము	.....
28. భోజరాజీయము	.....
29. మంత్రమహార్ణవము	.....
30. మంత్రాథర్వణము	.....
31. మణిదర్పణము	.....
32. మనుస్మృతి	.....
33. మాఘము	.....
34. యోగరత్నాలయము	.....
35. రత్నమాల	రత్నమాలి
36. రసార్ణవసుధాకరము	.....
37.	వాసవదత్త
38. వాసిష్ఠసంహిత	.....
39. శాకినీసహాకారము	.....
40.	శారదాతిలకము
41. శారదావిలాసము	.....
42. సంహితాసంగ్రహము	సంహితాసంగ్రహము
43. సంహితాసారము	సంహితాసారము
44. సాహసాంకకావ్యము	.....
45. సాహిత్యచంద్రోదయము	సాహిత్యచంద్రోదయము
46. సాహిత్యచూడామణి	సాహిత్యచూడామణి
47. సాహిత్యరత్నాకరము	సాహిత్యరత్నాకరము

[రెండింటిలోనూ ఉమ్మడిగా చెప్పినవి 12 మాత్రమే.]

ఇన్ని గ్రంథాలను కూలంకషంగా చదవబట్టే గారన 'ప్రతివాది మదగజ పంచాననుడు' అనే బిరుదు పొందడానికి

తగినంత పాండిత్యం సంపాదించాడు. అతడు ఎంత పండితుడైనా తన పాండిత్య ప్రకర్షను పనిగట్టుకొని తన కావ్యాలలో ప్రదర్శించలేదు. సంస్కృతం తుఱ్ఱుంగా చదువుకొన్నా శ్రీనాథునిలాగ తత్సమ సమాసాలు గుప్పించి అదే తెలుగు కవిత్వ మనిపించలేదు. గౌరన అలాంటి సమాసాలు కట్టలేక కాదు. కావలసిన నాలుగైదుచోట్ల ఏడుపాదాలను ఏబిగిన ఒకటే సమాసం కట్టాడు. చూడండి :

ఫలితపుష్పితలతాభవనాంతరాళ _ చలితమరందనిర్ఝరణశిర _
కలితమిళిందసంగతపికకీర _ లలితగీతామృతలహరీవిలోల _ ఖిన్నరకరవల్లకీ
నాదముదిత _ సన్నుతసారంగశాబకప్రకర _ కోమలవానీరకుంజపుంజములు
[హరి-పూర్వ. 1919 నుండి 1925]

ఇలాంటి వర్ణనలు హరిశ్చంద్ర చరిత్రలో అక్కడక్కడ అరుదుగా అరుదుగా కనిపిస్తాయి. మిగతా గ్రంథమంతా తేనెలు చిలికే జాను తెనుగే. అంతటి లక్షణ పాండిత్యాన్ని కలిగిఉండి, ఛందస్సునీమాద పుస్తకం వ్రాసి, వివిధ వృత్తాలు వ్రాయగలిగిన గౌరన ద్విపదఛందస్సునే స్వీకరించి రెండు గొప్ప కావ్యాలు వ్రాశాడంటే అతనికి ప్రజలపట్ల వుండే శ్రద్ధ తెలుస్తుంది. సామాన్యప్రజల కోసం వ్రాస్తున్నా అతడు కవులను, పండితులను నిర్లక్ష్యంచేయ లేదు. తన రచనలోని 'కవితాచమత్కృతి కాంచి, హర్షించి కవులందరును శిరఃకంపంబు సేయ పచరించి వీనుల పండువుగాగ' ఋగ్వేదప్రసిద్ధుడైన హరిశ్చంద్రుని చరిత్ర వ్రాస్తానన్నాడు.

గౌరన తన కావ్యంలో ఋగ్వేదప్రసిద్ధుడైన

హరిశ్చంద్రుని కథ వ్రాస్తా నన్నాడేగాని వేదహరిశ్చంద్రుని జీవితాన్ని ఏమాత్రం ముట్టుకోలేదు. వేదహరిశ్చంద్రుని కథకు, ప్రచారంలో ఉన్న హరిశ్చంద్రుని కథకు పోలికలే లేవు. వేదహరిశ్చంద్రుడు ఆడిన మాట రమారమి తప్పి వాయిదాలు వేసే మహారాజు. స్వంతకొడుకును, పుట్టగానే, బలి ఇస్తానని దేవతకు మ్రొక్కుకొని వీళ్ళూ, పూళ్ళూ అది చెల్లించక, సొమ్మ లిచ్చి ఒక బ్రాహ్మణకుమారుణ్ణి కొని అతణ్ణి బలిచేయబోయిన మహానుభావుడు. ఈ హరిశ్చంద్రుని కథకు, దేవీభాగవతంలోను, భాగవతంలోను, మార్కండేయ పురాణంలోను ఉన్న కథలకు సంబంధం లేదు. గారన స్కాందపురాణంలోని కథనే తీసుకొని స్వేచ్ఛానువాదం చేశాడు. రసవత్తరమైన కావ్యానికి కావలసిన మార్పులు చేశాడు.

గారన హరిశ్చంద్ర కావ్యాన్ని వేదం వెంకటరాయ శాస్త్రిగారు సటిప్పణంగా 1912 లో ప్రకటించి సాహిత్య సేవ చేశారు. అవతారికలో ఇలా వ్రాశారు.

అతిహృద్యమయిన యీతని యీ గ్రంథమందు రెండుతావుల గొప్ప పొరబాట్లు సంభవించినవి. ఎవ్వి యున, గ్రంథారంభఘట్టంబు నందును ఉపసంహారమందును వసిష్ఠవిశ్వామిత్రులు నీచులవలె జగడ మాడుట, ఆదిలో నరమూర్తులుగాను అంతములో పక్షిమూర్తులుగాను. ఈదోషము హిందూమతద్వేషులు మిక్కిలి ప్రాకట్యమునపం దెచ్చి తమ గ్రంథములందు విస్తరించి మన పెద్దలను తిరస్కరణీయులనుగాను, పరిహాసనీయులనుగాను కావించుచున్నారు. ఇందు ఆదియందలి దుష్టభాగము కథకు ఆవశ్యకమయినందున దానిని అట్లే ముద్రించి, అంతమందలి పక్షి

యుద్ధభాగము కొన్ని పంక్తులే అగుటచేతను, ప్రతీప్తమని ప్రసిద్ధమై యుండుటంబట్టియు ముద్రింపక విడిచినాడ."

అయితే వసిష్ఠవిశ్వామిత్రులు – పక్షియుద్ధం గౌరన సృష్టించిన దేం కాదు. అది భాగవతపురాణంలో ఉంది. చూడండి :

ఇట్లు విశ్వామిత్రుండు హరిశ్చంద్రు నెగులువరమట విని, వసిష్ఠుండు, విశ్వామిత్రుని గృధ్రముగమ్మని శపించె; విశ్వామిత్రుడును వసిష్ఠుని బకంబు గమ్మని శపించె. పక్షియూపు లయ్యును నా యిరువుర యుద్ధంబు సేసిరి. బ్రహ్మ వారించి యెప్పటి నిజాకృతులుగా నొనరించె[1]

[భాగ. 9_192]

గౌరన వివిధమూలాలను పరిశీలించా డని ఇందు వల్ల తెలుస్తుంది.

ఇతనికి ముందు తెలుగులో హరిశ్చంద్రుని కథను రచించినవాళ్ళు లేకపోలేదు. మార్కండేయపురాణాన్ని అనువదించిన మారన అందులోనే 144 గద్యపద్యాలలో హరిశ్చంద్రోపాఖ్యానాన్ని రమణీయంగా చెప్పాడు. పాత్ర చిత్రణ, మనస్తత్వనిరూపణ చక్కగా ఉంది. అయితే గౌరన మారన్నను పాత్రపోషణలో ఏమాత్రం అనుసరించలేదు. మారన చిత్రించిన హరిశ్చంద్రుడు కొన్నిఘట్టాలలో దీనుడు. గౌరన పోషించిన హరిశ్చంద్రుడు మంచి రాజసం కలవాడు. ఆడిన మాట తప్పడుగాని ఎవరికీ భయపడడు. తాను చేస్తున్నది తప్పనుకోడు. ఈ రెండు చిత్రణలలో ఉండే తేడాను చూద్దాం.

---

1. ఇది పోతనగారి వచనం. సంస్కృతమూలంలోకూడా ఈ అర్థమున్నదే ఉంటుంది.

పెళ్ళాన్ని అమ్ముకోవడంకన్నా దారుణం ఇంకొకటి ఉండదుకదా! మారనగారి హరిశ్చంద్రుడు భార్యను విక్రయిస్తూ పలికిన పలుకులు ఇవి :

ఓ పురజనులార! నాపత్ని నమ్మోద
నేదాసిగా వెలయెరిగి పెట్టి
కొనుడు నన్నెవ్వడవని యడిగెదరేని
నే నృశంసుండను దానవుండ
నతిపాపకర్ముడ నాలి నమ్ముకొనంగ
నరుగుడెంచిన కఠినాత్మకుండ.

[మార్కండేయపురాణం, 1_214]

ఇక్కడ ''నృశంసుండను'' అంటే ''ప్రజలను బాధ పెట్టేవాడను, దానవుణ్ణి'' అని చెప్పుకొన్నాడేగాని మారన్న గారి హరిశ్చంద్రుడు పేరు చెప్పుకోలేదు. గౌరన చిత్రించిన హరిశ్చంద్రుడు మొదటనే ప్రజలతో సగర్వంగా ఇలా చెప్పుకుంటాడు.

వినరయ్య, చెప్పెద, విశ్వంబులోన
గొనియాడదగు భానుకులమున నేను
జనియించినాడ ద్రిశంకునందనుడ
సార్వభౌముడ హరిశ్చంద్రు డన్నాడ
సర్వసర్వంసహా చక్రంబునెల్ల
నాకొశికున కిచ్చి యతనికి మున్ను
మేకొన్న ధనముకై మెలత నమ్మోదను. [పుట 139]

మారన్నగారి హరిశ్చంద్రుడు అలా ప్రకటించిన వెంటనే ఒక బ్రాహ్మణుడు వచ్చి 'వెల ఎంత' అని అడుగుతాడు. విపుల దుఃఖవేదనతో పలకడానికి రాజునోరాడకపోతే ఆ

బ్రాహ్మణుడే తగినంత ధనం హరిశ్చంద్రుని వల్ల-లాలలో మడిచిపెట్టి శ్యేబను తలపట్టి ఈడ్చాడు. (మార్క-ండేయ పురాణంలో హరిశ్చంద్రుని భార్యపేరు శ్యేబ; చంద్రమతి కాదు. ఉత్తర భారతదేశంలో ఈమెను తారామతి అంటారు. చంద్రమతి అనే పేరు గౌరనే ప్రచారంచేశాడు) మార్క-ండేయ పురాణంలో తన తల పట్టి ఈడ్చిన బ్రాహ్మణునితో శ్యేబ ఇలా అంది.

విడువవయ్య తండ్రి తడయక వచ్చెద
వీడె నన్ను చూచి వెగచి వెగచి
కొడుకు దద్ద వెగడుపడి యేడ్చుచున్నాడు
బుజ్జగింతు ననుచు పుత్రు గాంచి
అన్నన్న ననుచు ముట్టకు
మన్న నృపతనూజ దాసి నగుచి ననుచు బై
గన్నీరు వెల్లిగొనగా
నున్న జనని కొంగు బాలు డుడుగక పట్టెన్.

[మార్క-ండేయ. 1-216,217]

అమ్మ్నాడుపోయిన వెనువెంటనే ''నేను దాసిని, అగు చిని, నువ్వు రాజకుమారుడవు, నన్ను ముట్టుకోకూడదు'' అని చెప్పి నోదించే కన్నతల్లి గుండెలకడలి 'పిండలి వండుగా' కలత చెందినపుడు చదివేవాళ్ళ కడుపులో చెయ్యి పెట్టి తిప్పినట్టయి గుండెలు అవసి పోకమానవు.

గౌరన ఇంత హృదయవిదారకంగా చంద్రమతి నోటంట అనిపించలేదుగాని తల్లిని అమ్మాక కొడుకు ఆమెను పోనీక బిగువుగా పైట పెనచిపట్టుకొని కూకటి

తూగాడుతూఉంటే గునుస్తున్నపుడు హరిశ్చంద్రుడు చూస్తాడు. అతిదుఃఖాత్ముడై, అశ్రువు లొలక, అప్పుడు 'కాలిమి వదలి' గద్గదకంఠంతో కాలకౌశికుణ్ణి చూసి ఇలా అంటాడు.

పెలమి ధేనువు విక్రయించుచో శ్రేష్ఠ
దొలగింతురే తల్లి తొలగగా జేసి?
నా కులభూషణు నా కుర్మిపట్టి
సీ కొమారుని గొను మిచ్చెద నీకు,
విలువ వీనికి వేయివేలు నిష్కములు,
వలనొప్ప నొసగుము వసుధామరేంద్ర.

[హరి. ఉత్తర. 711 నుండి 716]

హరిశ్చంద్రుడు, కాలకౌశికుడు ఖరీదుకోసం కాట్లాడుకొంటారు. హరిశ్చంద్రుడు వేయివేల నిష్కాలు ఇమ్మన్నాడు. కాలకౌశికుడు ఊరకే ఇమ్మంటాడు. "వీడు నా దాసుడు, వెలది నా దాసి. ఇంకా పుత్రుణ్ణి ఎలా అమ్మగలవో చెప్పు" అంటాడు. దానికి హరిశ్చంద్రుడు మండిపడతాడు.

ప్రొద్దున లేచి నీమొగము కన్నొనిన
నద్దినమున వచ్చు నాపద లెల్ల
నిన్నొక విప్రుని నిందింపనేల?
మిన్నక తలపోయ మేదినిలోన
గూడు వడ్డికి నిచ్చి కూర్చెడివారి
జూడ లిట్టివియ, యాశ్చర్య మేమిటికి?
గులము ప్రధానమే గుణము లేకున్న
గలశాబ్ధి బుట్టదె కాలకూటంబు?

అని హరిశ్చంద్రుడు నిందిస్తే కాలకౌశికుడు ఊరుకోడు.

నీచాత్మ! ప్రొద్దున నీవు నా మొగము
జూచితి గాన నాసొమ్ము నీ కబ్బె
దివిరి నా కులము నిందించి నా గుణము
వివరింప నీకేల? వియ్యమందెదవొ?

అని ఎగురుతాడు. ఈ దెబ్బలాట చాలా సహజంగా ఉంది. హరిశ్చంద్రుడు 'వడ్డీకి డబ్బిచ్చేవాడవు' అని కాలకౌశికుణ్ణి ఊరకే నిందించలేదు. చంద్రమతిని కొనడానికి ముందు కాలకౌశికుడు అప్పు ఎగవేసే ఉపాయాలు అడక్కుండానే హరిశ్చంద్రునికి బోధిస్తాడు. వడ్డీకి డబ్బిచ్చి ఎలా ధనార్జన చేయాలో పాఠాలు చెప్తాడు. అప్పు చేసి ఎగవేయడాన్ని ఒక కళగా వర్ణించాడు. దానిని సురవరం ప్రతాపరెడ్డిగారు ఇలా క్రోడీకరించారు.

ధనికుల యిండ్ల కేగి, ప్రియములు పలికి, సేవచేసి, నమ్మిక పుట్టించి, మనసులు కరగించి, మాయసొమ్ములు, అక్కఱకొదువులు, మాయ బంగారు, బంగారునీ రెక్కించిన ఇత్తడి ఇనుపసొమ్ములు, మాయమణులు గుప్తముగా రాత్రి తీసుకొనిపోయి, ఇవి దాచుడని అక్కఱముద్రలు చేయించి, లండుబోతులపూటగా బెట్టి ఆప్పులు గొని, యెగబెట్టి, పట్టుబడి రచ్చకీడ్వబడి, వారిచ్చు శిక్ష అనుభవించి, కాళ్లు మోసి, దెబ్బలు తిని రైనను మందిని ముంచవలెనట![1]

[హరిశ్చంద్ర, ఉత్తరభాగం, పుటలు 151-152]

కాలకౌశికుడు తాను డబ్బు ఎలా కూడబెట్టినదీ వివ

---

1. ఆంధ్రుల సాంఘికచరిత్ర, రెడ్డిరాజుల కాలం, పుట 126.

రించాడు. ఆ ద్వీపదలనుకూడ సురవరంవారు ఇలాగ సంక్షిప్తంగా వ్రాశారు.[1]

రోగులవల్ల కొంత లాగి, వ్రేతవాహకుడై కొంత గడించి, గండకాంతులందు, సప్తకములందును (ఏడుగురను పిలిచి పెట్టు శ్రాద్ధములందును) 'తృప్తోఽస్మి'గా భుజించి, గ్రహణకాలములో ఒకమాడయిన దక్షిణగా పొంది, ఇంటింట పంచాంగపఠనముచేసి, ఆయవారము లెత్తి దానముపట్టిన ధాన్యాలను తన వస్త్రమంచు మూలమూలలందు మూటలుగా కట్టి, ఏమి లేనినాడు కరతిత్తి పట్టి మష్టియెత్తి, కూడబెట్టిన పైకాన్ని అప్పుల కిచ్చి పత్రాలు వ్రాయించుకొని వృద్ధి, చక్రవృద్ధి, మాసవృద్ధి అని వడ్డీలు గడించాడు.

[హరిశ్చంద్ర, ఉత్తర. 145,146 పుటలు]

తన కాలంనాటి వంచకపురోహితులూ, కుహనా జ్యోతిష్కులూ అంటే గౌరనకు వల్లమంట. నవనాథచరిత్రలో ఒక వంచకపురోహితుణ్ణి ఎంత హేయంగా చిత్రించాలో అంత హేయంగానూ చిత్రించాడు. పురోహితుడు రాజుగారి అమ్మాయిపైన కన్నువేశాడు. ఆమెఅందం ఎలాగైనా అనుభవించాలనుకొన్నాడు. అందుకోసం ఒక గుర్రపువాడితో లాలూచీపడ్డాడు. "ఫలానారాత్రి గుర్రపుశాల తగలబెట్టు. సరిగ్గా ఆరోజు అది తగలబడుతుందని ముందుగానే నేను రాజుకు జ్యోతిష్యం చెప్తాను. నిదర్శనమయ్యాక రాజు నాకు డబ్బిస్తాడు. అందులో నీకు సగంవంతు ఇస్తాను." అని కుమ్మక్కు అయ్యాడు. అన్నట్లే జరిగింది. రాజు పురోహితుణ్ణి నమ్మాడు. కొన్నాళ్లు పోయాక "నీ రాజ్యానికి

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర, పుటలు 125-126.

అరిష్టముంది. నీ కూతుర్ని ఒక మందసంలో పెట్టి వీట్లో ఒది లెయ్యి. శని విరగడ అవుతుంది'' అని పురోహితుడు చెప్తాడు. విధిలేక రాజు అలాగే చేశాడు. వీట్లో కొట్టుకొచ్చే మందసాన్ని పట్టి అడవిలో రహస్యంగా ఉంచమని శిష్యులను ముందే పురమాయించాడు. వాళ్లూ అలాగే చేశారు. ఆ పెట్టె దొరికినందుకు పురోహితుడు పడ్డ ఆనందం ఇంతా అంతా కాదు. పట్టపగ్గాలులేక ''వగ్గుకోతికి సివము వచ్చిన రీతి'' కుప్పిగంతులు వేశాడు. వాటిని ఆరోజులలో 'గోవింద గంతులు' అనేవారు. ''ధోవతి మొలనంట బిగించి భుజం మీది తన మూటలు అటు పెట్టి మడమలు మాటిమాటికీ పిరుదులు వడిగా తాకేట్టు ముప్పయిరెండు గోవిందగంతులలాగ వేసి 'ఇంక నా తరం కా'దని శిష్యులను పంపించేసి పెట్టె తెరిచాడు. అందులోంచి ఒక ఎలుగుబంటి వచ్చింది. (ఎలా వచ్చిం దంటే అది వేరేకథ.) అది అతణ్ణి రక్కి-చంపింది. శిష్యులు వచ్చి మూగారు. ప్రథమచికిత్సచేశారు. అప్పుడు కొనప్రాణంతో ''ఈసంగతి ఎవరికీ చెప్పకండి. మేదినీనాథు డిట్టి నాదుర్మృత్త మెరిగిన వెడలగొట్టించు మేనెల్ల కుక్కచ్చు లొత్తి'' అని రోదిస్తాడు.

ఆరోజులలో కుక్కచ్చు ఒత్తించడం అన్నది బ్రాహ్మణులకు వేసే గొప్ప శిక్ష. ఈసంగతి కేతన విజ్ఞానేశ్వరీయంలో విశదపరిచాడు.

చంపినవానినిసరిగా-జంపుట తగు విప్రుడైన జంపక పతిత
స్సంపద గొని తల గొరిగి ప-దంపడి కుక్కచ్చు బ్రాసి దండింపదగున్.
[విజ్ఞాన. 2-64]

ఈ వ్రాసిన కుక్కచ్చు కలకాలం ఉండిపోయేది కాబోలు. కుక్కచ్చు అంటే కుక్కపాదంలాగ కనబడే బొట్టు. ఈ శిక్ష అమలుపరిచే విధంకూడా కేతన చెప్పాడు:

తల గొరిగించి కుక్కడుగు తప్పక ఫాలమునందు వ్రాసి ముం
గల ధనమెల్ల బుచ్చుకొని గాడిద నెక్కగజేసి గ్రామమున్
వెలువడ ద్రోచిపుచ్చుటయు విప్రుని జంపుట క్షుద్రజంతులన్
జొలువన చంపు తప్పు గలచో దగ చంపుట ధర్మ మెమ్మెయిన్.

[విజ్ఞాన. 3_42]

తన కాలంనాడు కఠినశిక్ష వేసినవాళ్లను ఎలా అలంకరించేవారో, ఏవిధంగా నడిపించేవారో గౌరన చక్కగా వర్ణించాడు. నవనాథచరిత్రలో సారంగధరుని కథ వుంది. కాళ్లూ, చేతులూ కొట్టియ్యడానికి అతణ్ణి తీసుకొని వెళ్లడానికి ముందు వర్ణన ఇది:

నడురేయి యగుటయు నగరరక్షకులు
తడయక సారంగధరుని బంధములు
నడలించి వీడిన జడ జక్కనల్లి
మొగలిరేకులు మీద మురువుగా జెరివి
మృగనాభితిలకంబు మెచ్చుగా దీర్చి
పలుచగా గుంకుమపంకంబు నలది
చెలువారు నెరిపట్టు చీర గట్టించి
పొలుపొంద భూషణంబులు చక్కదిద్ది
కలువపువ్వుల దండ గళమున వేసి
వెలయ గప్పురముతో వీడెంబు లొసగి
పటుఖడ్గఖేటకపాణులై యతని
నటు తోడుకొనుచును నరుగు నవ్వేళ. [నవనాథ. పుట 73]

నేడు ఆంధ్రదేశంలో విశేషప్రచారం పొందిన సారంగధరుని కథ ఆదిలో గౌరన వ్రాసినదే. అయితే ఈ సారంగధరుడు మన రాజమండ్రి ఏలిన రాజరాజుకుమారుడు కాడు. మాళవదేశంలో మాంధాతపురాన్ని ఏలిన రాజ మహేంద్రుని కుమారుడు. ఆ రాజుకు రత్నాంగి అనే భార్య, చిత్రాంగి అనే ఉంపుడుకత్తె ఉన్నారు. రాజు వేటకు వెళ్లినప్పుడు సారంగధరుడు పావురాన్ని ఎగరేయడం, అది చిత్రాంగిమేడపై వాలడం, వెళ్లి తెచ్చుకోబోతే వద్దని సుబుద్ధి వారించడం మొదలైన ఘట్టాలన్నీ గౌరన వ్రాసినవే. కాళ్లూ చేతులూ కొట్టేశాక అడవిలో అల్లాడుతున్న సారంగ ధరుణ్ణి మీననాథుడనే సిద్ధుడు కాపాడి దీక్ష ఇచ్చి సిద్ధుణ్ణి చేసి చౌరంగి అనే పేరు పెడతాడు. మీననాథుని ప్రథమశిష్యుడు చౌరంగి. ఆ తరువాత ఇంకో ఆరుగురు శిష్యుల్ని చేర్చు కొంటాడు. శివుడు ఆదినాథుడు. ఈ తొమ్మండుగురి చరిత్రే నవనాథచరిత్ర. ఇది శ్రీనాథుని కాలంలో చాలా ప్రచా రంలో ఉండేది కాబోలు. "ఏ దేవి గొల్చి మత్స్యేంద్ర నాథాదులు యోగసంసిద్ధికి నొడయులైరి" అని హరవిలాసం (1-3)లో వ్రాశాడు.

శ్రీనాథునిచేత ఏ శాంతభిక్షావృత్తిరాయడు శివ రాత్రిమాహాత్మ్యం చెప్పించాడో అతడే గౌరనచేత నవనాథ చరిత్ర ద్విపదలో వ్రాయించాడు. ఇది ఇంతకుముందే చంపూకావ్యంగా తెలుగులో వెలసింది. దానిని శ్రీ గిరికవి వ్రాశాడు. ద్విపదకావ్యమైతే జనంలో బాగా ప్రచారం పొందుతుందని ఆ మఠాధిపతి అలా పురమాయించాడు.

అతడు కోరినట్లే గారన ప్రాసిన నవనాథచరిత్రే ప్రఖ్యాత మైంది.

"ఈ నవనాథుల చర్యలకు ప్రధానరంగము మహారాష్ట్రదేశభాగముగా గనబడుచున్నది." అని కోరాడ రామకృష్ణయ్యగారు ప్రాశారు.[1] అయితే తెలుగుదేశంతో వీళ్లకు సంబంధం లేకపోలేదు. గోరక్షకనాథుడు మన శ్రీశైలం కొండమీద అల్లమప్రభువుతో వాదించి తన ఓటమి ఒప్పుకొన్నాడట. అల్లమప్రభువు చారిత్రకవ్యక్తే. క్రీ. శ. 1125 లో జన్మించి వీరశైవ మతాన్ని స్థాపించి ప్రచారం చేసిన బసవేశ్వరుడు 'అనుభవ మంటపం' అనే వీరశైవ విద్యాపరిషత్తు నెలకొల్పాడు. దానికి అధ్యక్షుడు అల్లమప్రభువు. వీరశైవ తత్త్వబోధకులలో అతడు నిరాడంబరుడు. ఇతణ్ణి ప్రభుదేవుడనికూడా పిలుస్తారు. కన్నడంలో అతడు ప్రాసిన వచనాలు ప్రసిద్ధమైనవి.[2] క్రీ. శ. 13-వ శతాబ్దిలోనే కాక నవనాథులు ఇంకా ప్రాచీనులు. నాగార్జుననాథుని శిష్యుడు సిద్ధనాగార్జునుని చర్యలుకూడా తెలుగుదేశంలోనే జరిగాయి. అతడు "తన పేరు తత్పర్వత స్థలి కీర్తి లెనయ గల్పించిన యేలేశ్వరం" చూశాడు. అక్కడే వాసం కల్పించుకొన్నాడు. ఈనాడు పురాతత్త్వ పరిశోధనశాఖవారు తవ్వితే బయటపడిన విజయపురి గారన కాలంనాటికి ఉండేదేమో. దానిని ఇలా వర్ణించాడు.

---

1. నవనాథచరిత్ర, పీఠిక. 2. *Struggle for Empire.* Bharatiya Vidya Bhavan. పుటలు 367, 370.

ఆకృష్ణవేణి మహానది దాటి
వీక నేలేశ్వరవిభు నుత్తరమున
నాయతంబై మించు నశ్వమేధాద్రి
వాయవ్యమున నవద్వారకవాట
పరిఘ సమున్నతప్రాకారయంత్ర ... [నవనాథ. పుట 239]

దురదృష్టవశాత్తూ ఇక్కడ గ్రంథం శిథిలమైంది. లేకపోతే ఆ కోటవర్ణన పూర్తిగా దొరికేది. ఇవాళ విజయపురిలో అశ్వమేధఘట్టం అవీ బయటపడ్డాయి. ఈప్రదేశంలోని కొండనే సిద్ధనాగార్జునుడు పూర్తిగా బంగారం చేద్దామనుకొన్నాడట. ఆ ప్రయత్నాన్ని విష్ణువు పడనియ్యలేదు. సిద్ధనాగార్జునుణ్ణి చంపేశాడు. దానికి కారణం ఇలా చెప్పాడు.

అప్పుండడీకాఱు డందరు వినగ
నెలు గెత్తి యిట్లనె నిత డహంకార
కలితుడై యనుచితకర్మంబు వూనె
నది యెట్లనిన మానవావళి కెందు
వదలక బహువిధ వ్యవహారములకు
గారణంబై యుండు కాంచనం బిప్పు
డేరీతి శ్రీగిరి యెల్ల దానైన
వారికి వారికి వలసినంతైన
గోరి కొఱకొని తమకును దామె రాజు
లై యల్పు లధికులు నను వాసి లేక
రాయిడింపుడు బ్రతిగ్రహదానముఖ్య
ధర్మంబు లన్నియు దప్పి మర్యాద
నిర్మూలమై భూమి నేరిదప్పగాన
దడయక లోకహితంబుగా నితని

పొడ వణగించితి భువనవిద్వేషు
గాసిగా శిక్షింపగలవా రుపేక్ష
చేసిన దోషంబు సిద్ధించుగాన
నేనే జగంబు లన్నియును రక్షింప
బూనిన లక్ష్మీవిభుడ నని చెప్పి
యంతర్హితుం డయ్యె... [నవనాథ. పుటలు 246_247]

సర్వసామానవసమానత్వం ఆర్థికంగా పాలకవర్గాలకు ఇష్టంలేదు. ప్రజలకు మేలుచేసే సిద్ధులను ఆనాటి రాజులు చంపించివేసేవారు. రసయోగశాస్త్ర నిర్మాతయైన నాగార్జునునికి వ్యాళిసిద్ధుడు అనే ఒక శిష్యుడుండేవాడు. ఇతడు కాయసిద్ధి పొందాడు. ఇతని విద్యను పరీక్షించే నెపంతో రాజు ఇతణ్ణి మరుగుతున్న తైలంలో ఉరకమన్నాడు. సిద్ధుడు ఉరికేముందు కొన్ని మందులు మంత్రుల చేతి కిచ్చాడు. తైలంలో తన దేహం ముద్దగా అయ్యాక ఆ మందులు అందులో వెయ్యమన్నాడు. వాటి ప్రభావంవల్ల బ్రతికి కొత్తతేజస్సు పొందవచ్చు అని చెప్పాడు. రాజును నమ్మక మంత్రుల కిచ్చాడు. అయితే సిద్ధుడు తైలంలో ఉరికాక రాజు మంత్రులను ఆ మందులు వెయ్యవద్దని వారించాడు. ఎందుకంటే ''ఇత డిందు బ్రతికిన నిలకెల్ల దానె పతియగు నసమానబలయూధు'' డవుతాడనే.

గోరక్ష డనే సిద్ధుని సౌరాష్ట్రదేశాపతి చంపించ బోయాడు. దానికి కారణం ఆ సిద్ధునివద్ద సమాకర్షవిద్య వుంది. కృష్ణకందారు డనే రాజు తాను తవ్వించే తటాకానికి

ఒక సిద్ధుని బలివేయా లనుకున్నాడు.[1] కలలో జలదేవత కనబడి పదివేలమంది శూద్రులనో, వెయ్యిమంది వైశ్యులనో, నూరుమంది క్షత్రియులనో, పదిమంది బ్రాహ్మణులనో, లేక ఒక సిద్ధుణ్ణో బలివేయమన్నదట. చెరసాలలో ఉన్న పదివేలమంది ఖైదీలనూ రాజు చంపించబోయాడు. జలదేవత ఒప్పుకోలేదు. తనకు ఈ పీనుగులు పనికిరా దంది. రాజ్యంలో ప్రజలంతా తల్లడిల్లిపోయారు. ఎవరిని చంపిస్తాడో నని అందరికీ భయమే. అప్పుడు గోరంటకుడు అనే సిద్ధుడు జాలిపొందాడు.

దయలేక యక్కట ధరణీశ్వరుండు
నయ మేడి పాపంబునకు రోయ డయ్యో
దీనుల నొరలగా దెగటార్చి పిదప
బూని తా జేసిన పుణ్య మేమిటికి
మను "ఆహింసా పరమో ధర్మ" యనుచు
వినుతింతు రటుగాన విడిపింతు పీరి
నేవెరవునైన నిప్పుడే యనుచు ... [నవనాథ. పుట 278]

రాజుకు జ్ఞానోదయం కలిగించాడు. మొత్తంమీద ఆనాటి సిద్ధులు భూతదయ కలవాళ్లు. ప్రజలకు మేలుచేసే వాళ్లు. అందుకే వాళ్ల చరిత్రను శాంతభిక్షావృత్తిరాయడు గారనచేత వ్రాయించాడు. శైవసిద్ధుల చరిత్రతోబాటు తన కాలంనాటి ఆర్థిక సాంఘికపరిస్థితులను, ఆచార వ్యవహారాలను అతడు కళ్లకు కట్టేటట్లు చిత్రించాడు. ఆనాటి ప్రజల

---

1. ఈ కృష్ణకందారుడుకూడా చారిత్రకవ్యక్తే. క్రీ. శ. 939 లో రాష్ట్రకూటసింహాసనం అధిష్ఠించిన మూడవ కృష్ణునికే ఇది నామాంతరం.

సంభాషణలనే అతడు తనపాత్రల నోట పలికించి నాటకం లాగా కొన్నిఘట్టాలు వ్రాశాడు. అతడు కల్పించిన పాత్రలు ఆపేర్లతో నేటికీ నిలిచిపోయాయి. నక్షత్రకుని పాత్రను సృష్టించినది ఇతడే. కాలకౌశికుని భార్యకు కలహాకంఠి అనే పేరు పెట్టిం దితడే. సారంగధరుని చెలికాని పేరు సుబుద్ధి అని పెట్టిందికూడా గౌరనే.

నాటకాలు వ్రాయకపోయినా ఇతడు సృష్టించిన పాత్రలే ఇటీవల స్టేజినాటకాలకు పనికివచ్చారు. ఇతడు కల్పించిన సన్నివేశాలనే అనంతర రచయితలు వాడు కొన్నారు. ఇలా శాశ్వతంగా నిలిచిపోయి బహుళప్రచారం పొందిన కావ్యాలు వ్రాసిన గౌరన ధన్యుడు. ఇతని పేరు కలకాలం చెప్పుకొని ఇతని కావ్యాలను చదవడం ఆంధ్రుల విధి.

4

జికరున

ప్రతి దేశానికి ఒక సాహసవీరుడుంటాడు. ఎటువంటి భీకరమైన సన్నివేశంలో నైనా అతడు తొణకడు, బెణకడు. వెనుకంజ వేయడు. అద్భుతకార్యాలను సాధిస్తాడు. సాధించిన సంపదలను గడ్డిపోచలాగ చూడగలడు. అడిగినవాళ్లకే కాక అడగనివాళ్లకుకూడా దానమిస్తాడు. ఎటువంటి ధర్మసందేహాన్నయినా తీర్చగలడు. ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొగలడు.

ఇటువంటి వీరుడు లేకపోతే జనులు అతణ్ణి సృష్టించుకొంటారు. ఎక్కడ, ఏ దేశంలో, ఏ చెప్పుకోదగ్గది జరిగినట్టు విన్నా ఆ ఘనకార్యాన్ని తమ కథానాయకునికి ఆపాదిస్తారు. ఇటువంటి జనాదరణకు నోచుకున్న వీరులే చిరంజీవులు. మన భారతదేశానికి ఏకైక సాహస వీరుడు విక్రమార్కుడు. అతని గురించి చెప్పుకొనే కథలు అనేకం. విక్రమార్కుని కథలు, భట్టివిక్రమార్కుల కథలు, విక్రమార్కుని సింహాస

నంపై ఉండే ముప్పయిరెండు బొమ్మలు చెప్పిన కథలు, బేతాళుణ్ణి తెస్తున్నప్పుడు విక్రమార్కునికి అతడు చెప్పిన ఇరవైఐదుకథలు ఇలా ఎన్నో ఉన్నాయి.

క్రీ. శ. 1400 ప్రాంతాలకే విక్రమార్కుని కథలు తెలుగుదేశంలో ప్రచారంలో ఉన్నాయి. వీటిని గ్రంథరూపంలో 'విక్రమార్కచరిత్ర'గా రూపొందించినవాడు జక్కన. ఇతడు పాకనాటివాడు. బహుశా నెల్లూరివాడు. ఇతని తాత పెద్దయామాత్యుడు గొప్ప చిత్రకవి. ఈయన ఎన్నెన్ని విద్యలలో అందెవేసిన చెయ్యో మనం ఇంతకుముందు తెలుసుకున్నాం.[1] ఈ పెద్దయామాత్యుని కుమారుడు అన్నయ్య. ఇతడు చక్కని మాటకారి. ఈయనను జనవినుతకర్మమిన రస ప్రసంగసంగీతకవితాఘనతేజులు రాజులు అఖిలరాడకుంజర సభలలో కొనియాడేవారట. ఏమని?

ఆడదు మయూరరేఖను - గాడంబారందు బాణగతి మన మెరియన్
బ్రోడగు పెద్దయయన్నయ-మాడఱు మాడెత్త యతని మాటలు జగతిన్.
[విక్రమ. 1-21]

ఇందులో శ్లేష ఉంది. మయూరుడు, బాణుడు ప్రసిద్ధులైన సంస్కృతకవులు. పెద్దయ్యగారి అన్నమాటలు మాడకు మాడ ఎత్తట. ఇటువంటి మాటకారి నోట్లోంచి ఇతని కొడుకు జక్కన పుట్టుకొచ్చాడు. వైదుష్యం, కావ్యరచనాచాతుర్యం ఉన్నవాడు. గద్యలో చెప్పుకొన్నట్టు శారదాదయావిధేయుడు; అఖిలకవిమిత్రుడు.

---

1. సమగ్రఆంధ్రసాహిత్యం - III పద్మనాయకయుగం: 'పెద్దయామాత్యుడు', పుటలు 89, 90.

ఇతని తాత నెల్లూరిరాజులవద్ద ఉన్నవాడుకనుక వీళ్ళది నెల్లూరే అని చెప్పవచ్చు. జక్కన విక్రమార్కచరిత్రలో ఒకచోట కథలో నెల్లూరును వర్ణించాడు.

శ్రీకవితానూనచిత్రశేఖాయు క్తి కొమ్మలందును గోటకొమ్మలందు
నవరసపదయు క్తి నానార్థగరిమలు రాజులందును గవిరాజులందు
గవిలోకసంతోషకరజీవనస్థితి సరసులందును గేళిసరసులందు
నవనవశ్రీసుమనఃప్రవాళవిభూతి మావులందును నెలమావులందు
గలిగి సముదగ్రసౌధాగ్రతలసమగ్ర-శాతకుంభమవాకుంభజాతగుంభి
తోరరత్నవినూత్నశృంగార మగుచు-సిరులనొప్పారువిక్రమసింహపురము.

[విక్రమ. 7-133]

బెల్లంకొండ పెన్నఒడ్డున ఉండే సిద్ధపట్టణ స్థానం. నెల్లూరు మొదలైన పాకనాటిప్రదేశాలను జక్కయ పేరొక్కన్నాడు. క్రీ. శ. 1400 సంవత్సరానికి ఒక పాతికేళ్లు ఇటో అటో ఈ ప్రాంతాలలో వెన్నెలకంటివారి వంశంలోని వ్యక్తులు మంచి రాజకీయఉద్యోగాలలో ఉండేవారు. వాళ్లలో సిద్ధనమంత్రి ఒకడు. ఇతని తండ్రి జన్నయ దేవకీనందనశతకం ప్రారంభాడని ఇంతకుముందే చెప్పుకున్నాం. ఈ సిద్ధనమంత్రి జక్కనను పిలిపించి ఇలా అన్నాడు: "పురాణాలు, భారత రామాయణాలు, ప్రబంధకావ్యాలు, కమనీయచిత్ర కావ్యాలు, నాటకాలూ సకలదేశభాషావిశేషాలలో వరసగా ప్రఖ్యాతం, ఔచిత్యం, మిశ్రమం అని ఒప్పే సత్కథామేళనలు ఎన్నో చిన్నప్పుడే విన్నాను."

తలప దదీయయేకతవితానముకం టెను సాహసక్రియా
కలితవదాన్యతాదిగుణగౌరవరేఖల విక్రమార్కభూ

తలపతి యొక్కడై నెగడె దచ్చరితంబు బ్రబంధకయ్యగా
దెలుగున జెప్పి యా కృతిపతిత్వము మా కొడగూర్పు నేర్పునన్.
[విక్రమ. 1_28]

అంతకు ముందే జక్కన 'అపూర్వకథాప్రబంధం' ప్రాయాలనుకొన్నాడు. కృతిపతి కోరినట్లు విక్రమార్క చరిత్రను ప్రారంభించాడు. ఇది ఎనిమిదిఆశ్వాసాల కావ్యం. ఇందులో 1519 గద్యపద్యాలున్నాయి. జక్కన తన కాలంనాడు విశేష ప్రచారంలో ఉన్న విక్రమార్కుని కథలను ఒకచోట చేర్చి చక్కని కథలా చెప్పాడు. ఇప్పుడు విక్రమార్కుని కథలు మనకు వచనగ్రంథాలుగా ఎన్నో లభిస్తున్నాయి. కాని మొట్టమొదటి సారిగా తెలుగుభాషలో వెలువడ్డ విక్రమార్కుని కథ లేమిటో టూకీగా తెలుసుకొని,తరువాత కావ్యం గురించి చెప్పుకొందాం.

విక్రమార్క చరిత్ర

ప్రథమాశ్వాసం :—మధురానగరాన్ని పాలించే శృంగారశేఖరుడనే రాజు కొలువులో చంద్రగుప్తుడనే బ్రాహ్మణయువకుడు చేరాడు. అతడు గొప్ప పండితుడేకాక ఎంతో అందగాడు. ఆ రాజ్యపు దండనాధుని చెల్లెలు మదనరేఖ చంద్రగుప్తుని చూసి మోహించింది. తనను పెళ్ళిచేసుకోమని కబురుపెట్టింది. కులంతక్కువపెళ్ళికి చంద్రగుప్తుడు ఒప్పుకోలేదు. నిరాశవల్ల ఆమె బ్రతికేటట్లు లేదు. దండనాధునికి చెల్లెలంటే ప్రేమ. అతడంటే రాజుకు ఇష్టం. అందుచేత శాస్త్రరీత్యా బ్రాహ్మణుడు నాలుగు కులాల కన్యలనూ క్రమంగా పెళ్ళిచేసుకోవచ్చునని చెప్పి రాజు చంద్రగుప్తునిచేత పెళ్ళికి ఒప్పించాడు. రాజుగారి పురోహితుని కూతురు శీలవతిని, రాజుగారి కూతురు రాగమంజరిని, రాచనిధుల అధికారి ధనగుప్తుడనే వైశ్యునికూతురు సుమతిని పెళ్ళి

చేసుకున్నాక చంద్రగుప్తుడు మదనరేఖను మామగారిచ్చిన రాజ్యంలో కూటు చేబట్టాడు. ఈ నలుగురు ఇల్లాళ్ళలో బ్రాహ్మణస్త్రీకి వరరుచి, క్షత్రియకాంతకు విక్రమార్కుడు, వైశ్యవనితకు భట్టి, శూద్రభామకు భర్తృహరి అనే కుమారులు జన్మించారు. పిల్లలు పెద్దవాళ్ళయ్యాక విక్రమార్కునికి పట్టంగట్టి చంద్రగుప్తుడు శ్రీశైలపర్వతందగ్గర కాలం గడపడానికి వెళ్ళిపోయాడు.

ద్వితీయాశ్వాసం :—విక్రమార్కుడు రాజ్యం పాలిస్తూ ఒకసారి వింధ్యపర్వతప్రాంతాలకు వెళ్ళాడు. అక్కడ ఇద్దరు రాక్షసులు కొట్టుకుంటున్నారు. వాళ్ళ దగ్గర ఒక కంథ, మంత్రదండం, పాంకోళ్లు, రత్నపాత్ర ఉన్నాయి. రత్నపాత్ర, అడిగితే, పంచభక్ష్యపరమాన్నాలు ఇస్తుంది. పాంకోళ్లు తొడుక్కుంటే ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్ళవచ్చు. కంథను బోర్లిస్తే కనకరాసులు కురుస్తుంది. ఈ అద్భుత వస్తువులకోసం రాక్షసులు పోట్లాడుకొంటున్నారు. విక్రమార్కుడు ఆ తగవు తీర్చడానికి వారి మధ్యకు వెళ్ళి పరుగుపందెంలో ఎవరు గెలిస్తే వారిని తీసుకోమని చెప్పి, వాళ్లు పరుగెత్తగానే పాపాత్ముల సొమ్ము దక్షుడుపుచ్చుకోనడం రాజుల ధర్మం కనుక ఆ వస్తువులు తను సంగ్రహించాడు. పాంకోళ్లు తొడుక్కొని మిగతా మూడింటిని పట్టుకొని ఎగిరిపోయి మేరుపర్వతం దక్షిణదిక్కున దిగేడు. మంత్రదండంతో ఒకపట్టణం నిర్మించి దానికి చంద్రపురం అని పేరుపెట్టి పాలించసాగాడు. కోరినంత ధన మిచ్చే కంథ తనదగ్గరుంది. కనుక అడిగినవానికి లేదనకుండా, చూస్తే వేయి, మాట్లాడితే పదివేలు, కలిసి భోంచేస్తే లక్ష, మనస్సుకు నచ్చితే కోటి ధనం అర్థులకు ఇవ్వసాగాడు. పాంకోళ్లు తొడుక్కొని విక్రమార్కుడు ఒకసారి బ్రహ్మలోకం వెళ్ళాడు. బ్రహ్మ 'ఏం కావా'లని అడిగాడు. వెంటనే విక్రమార్కుడు కత్తితో నుదురు చీల్చి "ఈ నొసట ఇంతకన్నా మంచి వ్రాతలు కొన్ని వ్రాయి" అని అడిగాడు. బ్రహ్మ ఆ సాహసానికి మెచ్చుకొని దీవించి బ్రహ్మాస్త్రంకూడా ఇచ్చాడు.

తరువాత విక్రమార్కుడు మరో అద్భుతమైన సాహసం చేశాడు. ఉజ్జయినిలో కాళికాదేవిఆలయంవద్ద అగాధమైన కొలని గట్టున మర్రిచెట్టుకు ఒక ఉట్టి ఉంది. దానిలో ఎక్కి ఆ తాళ్ళు కోసి కిందనున్న శూలంపైన పడ్డవానికి సామ్రాజ్యపదవి లభిస్తుంది. ఎవరా ఉట్టితాళ్ళు కోయబోయినా, ఒకటికోసి రెండవది కోసుంటే మొదటిది మొలుస్తుంది. ఈ ఉట్టి మొదలంటా ఒకేసారి కోస్తే మంచిదని భట్టి కొలని గట్టి ఉపాయం చెప్పాడు. విక్రమార్కుడు అలాగే చేసి కాళిని మెప్పించి ఉజ్జయిని రాజధానిగా సామ్రాజ్యపదవినే కాక వేయి సంవత్సరాల పాలన చేసే చిరాయువును కూడ నోచుకున్నాడు. వీడాదికి ఆర్నెలలే పాలిస్తే రెండువేలసంవత్సరాలు సామ్రాజ్యాన్ని వీలవచ్చుననే ఉపాయంతో భట్టి దీనిని రెట్టించాడు. విక్రమార్కుడు మిగతాఆర్నెల్లూ దేశసంచారం చేశాడు.

ఒకసారి విక్రమార్కుణ్ణి దేవేంద్రుడు స్వయంగా పిలిపించి నాట్యంలో రంభాఊర్వశు లిద్దరిలో ఎవరు అందెవేసిన చెయ్యో చెప్పమన్నాడు. విక్రమార్కుడు పోటీ చూసి న్యాయనిర్ణయం చేశాడు. అందుకు మెచ్చుకొని ముప్పైరెండు బొమ్మలున్న సింహాసనాన్ని ఇంద్రుడు ఇచ్చాడు. దీనిమీద కొలువుండి విక్రమార్కుడు దేశాన్ని పాలించాడు. ఎవరెక్కడ ఏ వింత ఉన్నదని చెప్తే అది కళ్ళారా చూసి సాహసాలు చేసి సాధించిన అపూర్వవస్తువులు, అమూల్యసంపదలు అక్కడక్కడే ఎవరు ఎదుటపడితే వాళ్ళకు దానం చేసి పేరు పొందాడు.

ఒక బంగారుకమలం సూర్యోదయంతో పైకిలేస్తూ మధ్యాహ్నం సూర్యుణ్ణి కలుసుకొని అతడు అస్తమించేటప్పుడు నేలకు వాలుతుంది. విక్రమార్కుడు ఈ వింతసంగతి విని కమలనాళంలోంచి ప్రవేశించి పువ్వులో బ్రహ్మలాగ కదురుకొని సూర్యుణ్ణి కలుసుకొని అత డిచ్చిన మణి తీసుకొని సాయంత్రం పువ్వుతోపాటు నేలకు దిగాడు. అనుదినం

రెండుబారువుల బంగారం ఇచ్చే ఆ మణిని ఒక వేదబ్రాహ్మణునికి విక్రమార్కుడు దానంచేశాడు. పాతాళానికి వెళ్ళి బలిచక్రవర్తిని కలుసుకొని ఆత డిచ్చిన రత్నద్వయాన్ని, బయటికొస్తూనే, ఒక యువతి బ్రాహ్మణునికి ఇచ్చాడు.

ఉజ్జయినిలో ఒక వైశ్యకుమారుడు తీర్థయాత్రలకు వెళ్ళి వచ్చి, మధురాపురం పరిసరాలలో ఉన్న బిల్వవాటికలో ప్రతిరాత్రీ ఒక ఆడది ఆర్తనాదం చేస్తుందని విక్రమార్కునితో చెప్పాడు. ఆ సంగ తేమిటో కనుక్కొందామని ఆ వైశ్యకుమారునితో విక్రమార్కుడు అక్కడకు వెళ్ళాడు. ఆ ఆడదాన్ని కొందరు రాక్షసులు బాధపెడుతూఉంటారు. విక్రమార్కుడు వాళ్ళను నిర్జించాడు. దాంతో ఆ కామినికి శాప విమోచన మైంది. ఆమె ఒక దేవకాంత. ఇంద్రుని ఆజ్ఞ చొప్పున ఒక మునితపస్సును భంగంచేయటానికి వెళ్ళి ఇలా శాపం పొందింది. విమోచనం కాగానే ఆమె విక్రమార్కునికి ఒక రత్నాన్ని సమర్పించింది. దానిని అతడు ఆ వైశ్యకుమారునికి అక్కడే ఇచ్చేశాడు.

తృతీయాశ్వాసం :—విక్రమార్కుని తమ్ముడు భర్తృహరి భార్యా సమేతుడై రాజధానికి వచ్చాడు. అతనికి ఒక బ్రాహ్మణుడు తాను తపస్సుచేసి సంపాదించిన ఫలాన్ని ఇచ్చాడు. భర్తృహరి దానిని తన భార్యకు ఇచ్చాడు. ఆమె తన ప్రియుడు గుర్రపాడికి ఇచ్చింది. అది అలా అలా చేతులు మారి వేడ పోగుచేసుకునేదానికి దొరికింది. అది ఒక సాయంత్రం ఆ పండు పిడకలబుట్టమీద పెట్టుకొని పోతూఉంటే భర్తృహరి చూశాడు. ఆరా తీసి అంతా తెలుసుకొని 'ఆడవాళ్ళంతా ఇంతే' నన్న వైరాగ్యంతో తపస్సుకు పోతూ మంత్రి చెప్పినట్లు రాజు నడచుకోవాలని, రాజుకు వచ్చే బ్రహ్మహత్యనైనా మంత్రి తప్పించగలడని 'ససేమిరా' కథను సవిస్తరంగా అన్నగారికి చెప్పాడు.

చతుర్థాశ్వాసం :—విక్రమార్కుణ్ణి అల్లుణి చేసుకోడానికి విదర్భరాజు పూజలుచేసి అనంగవతి అనే ఒక కూతుర్ని కన్నాడు. ఆమె

అందానికి మగుడై సిద్ధపురం ఏలే శకవల్లభుడు ఆమెను పెళ్ళాడదలి చాడు. విదర్భరాజు ఇవ్వనన్నాడు. శకరాజు దండెత్తాడు. విదర్భ రాజుకు సహాయం చేసి అనంగవతిని వివాహం చేసుకోమని నారదుడు వచ్చి విక్రమార్కునికి హితోపదేశం చేశాడు. విక్రమార్కుడు యుద్ధా నికి వెళ్ళి శకరాజును జయించి విదర్భరాజుకు పట్టంకట్టి అతని కూతుర్ని చేపట్టాడు.

పంచమాశ్వాసం :—విక్రమార్కుడు తన భార్య అనంగవతితో వినోదిస్తూ ఆరేసి నెలలు రాజ్యం చేస్తూ సంచరిస్తూ సుఖంగా ఉన్నాడు. ఒక ముని చిత్రకూటంలో ఎన్నాళ్ళనుంచో తపస్సు చేస్తూవున్నాడని, ఎంత కాలానికీ అతనికి దేవి ప్రత్యక్షంకాలేదని చారులవల్ల విని విక్ర మార్కుడు ఆశ్చర్యపోయాడు. తాను ఆ ప్రదేశానికి వెళ్ళి తన మెడ ఉత్తరించుకోబోగా దేవి వచ్చి 'ఏంవరం కావా' అన్నది. అతడు 'ఈ మునికి బ్రతికిస్తే నాకిచ్చినంతగా సంతోషిస్తా' వన్నాడు. ఆమె ఇచ్చింది. ఆ తరువాత విక్రమార్కుడు అశ్వమేధయాగం చేశాడు. బ్రాహ్మణులకు మృష్టాన్నభోజనాలు పెట్టి దానధర్మాలు చేసి రాజ్యమే ధారపోశాడు. కాని వాళ్ళు దానిని అతనికే ఇచ్చివేశారు. అతడు 32 బొమ్మల సింహాసనం పైనుండి పాలిస్తూ వచ్చాడు.

ఆత డొకనాడు వేటకు వెళ్ళి అడవిలో అలసిపోయి సొమ్మసిల్లి పడుకొన్నాడు. అప్పు డొక బ్రాహ్మణుడు అతనిమీద నీళ్ళు జల్లి సేద దీర్చాడు. ఆబ్రాహ్మణుణ్ణి తనతో తీసుకుపోయి విక్రమార్క డతణ్ణి తన పురోహితునిగా చేసుకొన్నాడు. ఒకనాడు ఆ పురోహితుడు రాజు గారి బిడ్డను ముద్దాడుతున్నట్లు తీసుకుపోయి నగలకోసం ఆ కుర్రాణ్ణి చెప్పరానంత చేత చేశాడు. నేరం చేస్తూ దొరకిపోగా రాజోద్యోగులు అతణ్ణి దండించబోయారు. అప్పుడు విక్రమార్కుడు 'అడవిలో ఇతను నాకు ఉపచారాలు చేశాడు. ఇతణ్ణి, ఎంత అపచారం చేసినా, మన్నిం చాల్సిందే'నని చెప్పి విడిపించాడు. 'నిన్ను శోధించడానికే ఇలా చేశాను,

నీకొడుకు బాగానే ఉన్నా' డని పురోహితుడు రాకుమారుణ్ణి బయట పెట్టాడు. విక్రమార్కుణ్ణి అందరూ కొనియాడారు.

కంచిలో నరమోహిని అనే వారకాంత ఉంది. ఆమెను చూస్తే అంబరూ మరులుకొంటారు. కాని ఆమెతో క్రీడించడానికి వెళ్లే ప్రతి వాడినీ ఒక రాక్షసుడు చంపేస్తూవుంటాడు. ఈ సంగతిని విక్రమార్కుని పురోహితునికొడుకు కాశ్మీరదేశంలో చదువుకొని వస్తున్నప్పుడు తెలుసుకొని రాజుకు చెప్పాడు. వెంటనే విక్రమార్కుడు అతణ్ణి వెంటబెట్టుకువెళ్లి ఆరాత్రి ఆ రాక్షసుణ్ణి సంహరించాడు. అందుకామె కృతజ్ఞత చెప్పగా కమలాకరుణ్ణి పెళ్లాడమని విక్రమార్కుడు ఆమెతో చెప్పాడు. అతడు రాజ్యానికి తిరిగివస్తూ అడవిలో పడుకొన్నాడు. పక్షులు మాట్లాడుకొన్న మాటలవల్ల బకాసురుడులాంటి ఒక రాక్షసునివద్దకు ఆమర్నాడు ఒక వేదబ్రాహ్మణుడు వెళ్లేవంతు వస్తుందని తెలుసుకొన్నాడు. తనే అక్కడికి వెళ్లి రాక్షసునికి ఆహారం కాబోయాడు. ఆ పగోపకారాన్ని రాక్షసుడు మెచ్చుకుని ఇంక నరభక్షణ చెయ్యనని వరం ఇచ్చాడు.

పశ్చాద్భాగం: —ప్రష్ఠపురం ఏలే రాజుకు కళావతి అనే కూతురు ఉంది. ఆమె వసంతంలో ఉన్న ఒక పాములపుట్టపైన ఆమె చేతులు ఊంచుతుంది. తన చేతో చెయ్యి కలిపినవాడిని ఇంటికి తీసుకువెళ్ళి స్నానం చేయించి భోజనం పెడుతుంది. తరువాత వేర్వేరు మంచాలమీద పడుకొని ఉండగా ఆమెచేత ముమ్మారు మాటాడించినవాణ్ణి పెళ్ళిచేసుకొంటుంది. ఈ సంగతి విని ఒక సిద్ధుడు వచ్చి విక్రమార్కునికి చెప్పికొన్ని మంత్రసిద్ధులుపదేశించి వెళ్ళిపోయాడు. విక్రమార్కుడు ఆమెను కలుసుకొని మజ్జనభోజనాదులయాక ఆమె తన మంచంమీద ముసుగుపెట్టుకుని పడుకొంది. ఆగదిలో ఉన్న దీపం సెమ్మాకు ప్రాణం పోసి దాని నొక కథ చెప్పమన్నాడు విక్రమార్కుడు. 'అనగనగా ఒక రాకుమారి ఒక యువకుణ్ణి పెళ్ళిచేసుకొని అతనికోసం ఎన్నో త్యాగాలు

చేసి అడవులుపట్టింది. అతడు ఊళ్లో కెళ్ళి అన్నం తెస్తానని చెప్పి వెళ్ళాడు. అక్కడొక వారకాంత చెలికత్తె అతణ్ణి చూసి, ఆ వేశ్యతో అతణ్ణి కలిపింది. వేశ్యచెలిమితో అతడు భార్యనే మరిచిపోయాడు. ఆమె భర్తకోసం వెదకి వేసారి నిప్పుల్లో దూకింది. అప్పటికి భార్య జ్ఞప్తి కొచ్చి ఇంక నా బ్రతు కెందు కని అతడూ ఆ గుండంలో దూకాడు. తనవల్ల ఆదంపతుల కెడబాటు కలిగినందుకు వారకాంతకూడా దుమికింది. దీని కంతటికీ తనదే తప్పు అని ఆమె చెలికత్తెకూడా నిప్పుల్లో పడికింది. వీళ్ళ సాహసానికి మెచ్చి కాళికాదేవి ఆ నలుగుర్నీ బ్రతికించింది. వీళ్ళలో ఎవరిది నిజమైన సాహసమో చెప్పగలవా అని దీపపు సెమ్మ రాజును అడిగింది. అతడు వారకాంతదే సాహస మన్నాడు. ఇది విన్న కళావతి 'అబ్బే! వారకాంత కొంత అనుభవించింది, దానిది సాహసమా! ఏసుఖమూ ఎరగని చెలికత్తెదే నిజమైన సాహసం' అని బదులుచెప్పి యథాప్రకారం ముసుగు పెట్టి పడుకుంది.[1]

సప్తమాశ్వాసం:—విక్రమార్కుడు కళావతిచేత రెండోసారి మాటాడించడానికి ఆ గదిలో ఉన్న కర్పూరపేటికకు ప్రాణం పోసి కథ చెప్పమన్నాడు. అది ఇలా చెప్పింది. 'అనగనగా రాజశేఖరుడనే ఒక రాకుమారుడు వేటకు వెళ్ళి ఒక యోగినిని కలుసుకున్నాడు. ఆమె అతని కొక మాట్లాడే చిలుక నిచ్చింది. దాని నతడు ఇంటికి తెచ్చి ఆప్యాయంగా చూసుకుంటున్నాడు. 'నిన్ను కర్పూరమంజరి అనే రాజకుమార్తె పెళ్ళిచేసుకుంటుంది. ఇప్పుడే పెళ్ళిమాటలకు వస్తారు' అని ఆది రాజశేఖరునితో చెప్పింది. అతడు నమ్మలేదు. అంతలో కర్పూరమంజరి చెలికత్తెలు అక్కడికి వచ్చి తమ రాకుమార్తెకు ఒక గోరువంక దొరికిందని, ఆది రాజశేఖరునిగురించి చెప్పినవార్తలు విని కర్పూరమంజరి అతణ్ణి మోహించిందని, అందు కామెతల్లిదండ్రు లంగీ

---

1. ఈ కథను అనంతామాత్యుడు తన భోజరాజీయంలో అనుకరించాడు.

కరించారని చెప్పాగు. ఇద్దరికీ పెళ్లయి అన్యోన్యంగా వున్నారు. రాజ శేఖరుని పెంపుడుచిలుకా, కర్పూరమంజరి మచ్చిక గోరువంకా ఈ అన్యోన్యతను చూచాయి. తాముకూడ అలాగుంటే బాగుంటుందని చిలుకరాజు కన్నెగోరతో అన్నాడు. 'మగవాళ్లు పాపాత్ములు, వాళ్ళను నమ్మకూడదు' అని కన్నెగోర అంది. 'ఆడవాళ్లే ఎంతకైనా తెగించినవాళ్లు. వాళ్ళను నమ్మకూడదు' అని రాజకీరం అంది. దాంతో మాటా మాటా పెరిగి ఆ రెండూ దెబ్బలాడుకుంటుండగా రాజశేఖరుడు, కర్పూరమంజరి చూచి ఏమిటని ప్రశ్నించారు. చిలుకా, గోరింకా తమ తమ వాదాలు చెప్పి చెరోకథా చెప్పాయి. గోరింక నీతికథ చెప్పింది; చిలక ఒక బూతుకథ చెప్పింది. ఆరెండు కథలూ వినిపించి, 'ఆడవాళ్ళా మగవాళ్ళా, ఎవరు దుష్టులు' అని కర్పూరపేటిక విక్రమార్కుణ్ణి ప్రశ్నించింది. అతడు 'మగవాళ్లే చెడ్డవాళ్లు' అనగా అదివిన్న కళావతి దిగ్గున లేచి 'మగవాడు పాపం చెయ్యవచ్చు. కాని అతడు చేస్తున్నాడని ఆడదికూడా తెగిస్తే పతివ్రతాధర్మా లేమైపోతా' యని రెండోసారి మాట్లాడి మళ్ళా ముసుగుపెట్టి పడుకొన్నది.

అష్టమాశ్వాసం:—కళావతిచేత మూడోసారి మాటాడించడానికి గాను విక్రమార్కుడు ఆ గదిలో ఉన్న సువర్ణకలశానికి ప్రాణం పోసి కథ చెప్పమన్నాడు. అది ఇలా చెప్పింది: అనగనగా ఒకరాజుకు పద్మావతి, గుణావతి, లీలావతి అని ముగ్గురు కుమార్తెలున్నారు. అతడు వాళ్ళకు పెళ్ళిళ్ళు చేసి ముగ్గుర్నీ మూడు ఊళ్ళలో ఉంచాడు. వారిలో పద్మావతి, అహర్నిశలూ విల్లమ్ములు చేతబట్టి భర్త వెంట తిరుగుతున్నా సరే, ఆమె భర్తను మోసగించి తన చిత్తమొచ్చినవాడితో వ్యభిచరించ గలదు. ఈసంగతి విన్న వెంటు డొకడు ఆమెఇంటికిపోయి తాను విన్నది నిజమని ప్రత్యక్షంగా తెలుసుకొన్నాడు. అందు కామెకు జోహారు చెయ్యగా 'నా చాతుర్యానికి ఆశ్చర్యపోవడ మేమిటి? మా గుణావతి భర్తకళ్ళముందరే పరపురుషుడితో క్రీడించగలదు' అని చెప్పింది.

వెంటనే ఆ విటుడు ఆవూరు వెళ్ళి, ఆసంగతికూడా అక్షరాలా నిజమని తెలుసుకున్నాడు. అందుకామెను ప్రస్తుతించబోగా 'మా లీలావతి భర్త పడుకొక్కన్న మంచంమీదనే ప్రియునితో రమించగలదు, నాగొప్పతన మేముంది' అని చెప్పింది. ఆ విటుడు ఆవూరుకూడా వెళ్ళి ఆవిషయంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదని తెలుసుకున్నాడు.

ఈ మూడు 'నిరంకు'శోపాఖ్యానాలూ సవిస్తరంగా చెప్పి ఈ ముగ్గురిలో ఎవరు జాణలో నిర్ణయించమని సువర్ణకలశం విక్రమార్కుణ్ణి కోరింది. అతడు 'పద్మావతి' అన్నాడు. అప్పుడు కళావతి లేచి 'వాళ్ళలో లీలావతి నిజంగా విదగ్ధకదా. పద్మావతి అని చెప్పవచ్చా' అని బదులు పలికింది. ఆవిధంగా ఆమె మూడుసార్లు మాటాడక తప్పలేదు. తాను పెట్టిన షరతు పూర్తిచేసినందుకు ఆమె విక్రమార్కుణ్ణి వివాహమాడింది.

విక్రమార్కుడు ఆర్నెల్లు దేశాటనం చేశాడో లేదో గాని విక్రమార్కుని చరిత్ర వ్రాసిన జక్కనకుమాత్రం తీర్థయాత్రలంటే చాలా ఇష్టంగా ఉంది. ఈ కావ్యంలో తీర్థయాత్రల ప్రస్తుతి, పుణ్యక్షేత్రాల ప్రశంస విరివిగా ఉంది.

విక్రమార్కునికి పట్టం గట్టి చంద్రగుప్తమహీసురుడు వానప్రస్థానికి వెళ్ళిపోయాడు. అతడు వెళ్ళినచోటు శ్రీశైలం. అలా వెళ్ళడానికి ముందు 7 పద్యాలలో (అందులో రెండు సీసాలు) అతడు శ్రీశైలక్షేత్రమహిమను ఉగ్గడిస్తాడు. (1:195-201)

ఉజ్జయినీనగరంలో పురందరుడనే వైశ్యుడు ఉన్న ఆస్తినంతా దానధర్మాలుచేసి తీర్థయాత్రలకు వెళతాడు. జక్కన అతణ్ణి ఉజ్జయినినుంచి మధురకు పంపాడు. అక్కడ నుండి కాశీకి మళ్ళించాడు. ఆరు గద్యపద్యాలలో (2:189-

194) కాశీవర్ణనం కావించి శ్రీశైలానికి పంపించాడు. 13 గద్యపద్యాలలో (2 : 195-207) ఆ పుణ్యక్షేత్రదర్శనం వర్ణించాడు. 'శ్రీశైలంచూస్తే ముక్తి, కాశీలో మరణిస్తే మోక్షం.' అన్న సంస్కృతి ఖండితకుముంబే ప్రథమాశ్వాసం లోనే వక్కాణించాడు. కాశీలో మరణించేవాళ్ళు ఎలా గణనకెక్కేదీ లెక్కలలో ఇలా చెప్పాడు.

రూప మొక్కటి రెండు రూపులై చెలువొందు
మూడు మొనల పోటు ముట్టు బట్టు
బాహుచతుష్కంబు బంచాస్యములు బూను
షణ్ముఖుపై బ్రేమ సలుపుచుండు
సప్తాశ్వచంద్రు లీక్షణములుగా నొప్పు
నెనిమిది మూర్తుల వెనుతికెక్కు
నవనిధీశసఖుం డనంగ గీర్తిగహించు
బదికొంగులైన యంబరముగట్టు
బదునొకండు విధంబుల బ్రణుతికెక్కు
వెలయ బండ్రెండుగనుపుల విల్లు పట్టు
గర్మపాశలవిత్రవిఖ్యాతి మెరయు
గాశిలో మేను దొరగిన ఘనయశుండు. [విక్రమార్క. 2-192]

ఈ అంకెల సంవిధానం చూస్తే కేయూరబాహుచరిత్రలో మంచన చేసిన ఆశీర్వాదం జ్ఞాపకమొస్తుంది. అందులో ఒకటినుంచి అనంతందాకా లెక్కగల దేవతలు తన కృతిపతిని బ్రోచాలని కాంక్షించాడు (కేయూర. 1-2). మంచన యొక్క కృతిపతిలాగ జక్కన కృతిపతికూడ గణకుడే. అందుకే ఇలా అంకెలతో సంబంధించే పద్యం.

అనంతామాత్యుడు భోజరాజును ప్రశంసించిన పద్యం ఈ నోవలోనిదే.

జక్కన శ్రీశైలంలో అన్నిప్రదేశాలూ స్వయంగా చూసిన ట్టున్నాడు. పురందరునికి తోటవీరేశ్వరదేవాలయం కూడ చూపెట్టాడు (2-206). అక్కడనుంచి కొండదింపించి అహోబలం చూపించాడు. ఆతరువాత పురాణసిద్ధంబగు సిద్ధపట్టణస్థానం పంపించి పెన్నలో స్నానం చేయించాడు. బహుశా సిద్ధపట్టణం జక్కన స్వగ్రామమైఉంటుంది. అక్కడ నుంచి కాళహస్తి, తిరుపతి, కంచి, శ్రీరంగం, కుంభకోణం, రామేశ్వరం, సేతుబంధనం, అనంతశయనం చూపించి హేమ కూటానికి విరూపాక్ష లింగదర్శనంకోసం పంపించాడు.

జక్కన స్వయంగా ఈ యాత్రలు చేసిన ట్టుంది. ఈ తీర్థాలలో తాను చేసిన స్తోత్రాలే పురందరుని నోటంట చెప్పించిన ట్టుంది. విరూపాక్షలింగాన్ని మూడు శ్లోకాలలో నుతించాడు. ఇవి అతడు రచించినవే అయిఉంటాయి.[1]

హేమకూటంలో ఈవిరూపాక్షలింగదర్శనం చేయించి జక్కన పురందరుణ్ణి పంపించాడు. 'పుట్టి పెరిగిన దేశం బెట్టి జనులకైన జూడనిచ్చగుట నేపట్టున కాలూదక నిజపట్టణ మునకు' ఆవైశ్యుడు వెళ్లాడు(2-220). పురందరుని తీర్థయా త్రలలో 'సర్వలోకలోచనసముత్సేధ సౌధగోపురంబగు కాంచీపురంబు' అని ఒక్క వాక్యంలో చెప్పేశాడు. కాని జక్కనకు ఆఊరంటే చాలా ఇష్టం. సప్తమాశ్వాసంలో

---

1. విక్రమ. 2: 222_224.

7 పద్యాలలో సుదీర్ఘంగా, సవిస్తరంగా వర్ణించాడు, 'కంచి జూడని కన్నులు కన్నులగునె' అని ప్రశ్నించాడు (7-114). 'ద్రవిళ బాలావిలాసినీతతుల' సౌందర్యాన్ని శ్రీనాథునిలాగే ఇతడూ తనివితీరా వర్ణించాడు.

జక్కన శ్రీనాథునికి కొంచెం పూర్వుడు. కనుక జక్కనను చూసే శ్రీనాథుడు కొన్ని పద్యాలను ప్రాశాడని కుందూరి ఈశ్వరదత్తుగారు పోలికలు చూపించాడు.[1] వాటిని మనం ఒక పట్టికగా వేసి క్రమంలో చూద్దాం.

జక్కన	శ్రీనాథుడు
1. దానంబునకు నిదానంబును, ధర్మంబునకు మర్మంబును, విభవంబునకు ప్రభవంబును, విక్రంబునకు నయక్రమంబును, సౌఖ్యంబునకు ముఖ్యంబునై యొప్పు నప్పురంబునకు నధీశ్వరుండు. [విక్రమార్క-చరిత్రము, 1-101]	విభవంబునకు ప్రభవంబును, విలాసంబునకు నివాసంబును, నపవర్గంబునకు సర్గంబును, ధర్మంబునకు మర్మంబును, దానంబునకు నిదానంబును, నానందమునకు మూలకందమును, విద్యకు నిషద్యయు, విక్రమంబునకు ధామంబునైన పట్టణంబున కధీశ్వరుండు. [భీమఖండము, 1-110]
2. తన కీర్తిన ర్కి దశదిశా మండలీ రంగమధ్యమున నర్తనము సేయ [విక్రమార్క-చరిత్రము, 1-102]	తన కీర్తిన ర్కి ఘనతర బ్రహ్మాండ భవనభూములగొండ్లి పరిఢవిల్లి [శృంగారనైషధము, 1-9]

1. శ్రీనాథుని కవిత్వతత్త్వము-తొమ్మిదవ ప్రకరణం, పుటలు 42-45.

జక్కన	శ్రీనాథుడు
3. నారీచిత్తసరోమరాళ వదనా గంధసాగంధ్య వి స్తారోదారభుజాంతరాళ ప్రతిభా సర్వజ్ఞ సోమాబ వి స్ఫారాకారశరన్నిశాకరకరా శ్లేషప్రియంభావుక స్ఫారక్షీరపయోధిలంఘనకళా జంఘాలకీర్తిశ్వరా. [విక్రమార్క-చరిత్రము, 4-229]	నారీచిత్తసరోమరాళ వదనచాణక్య విరించాన్వయ క్షీరాంభోధి సుధానుయూఖ కవితా సిద్ధాంత సర్వజ్ఞజం భారాతిద్విపహస్తకాండవినిభ బాహా ఖడ్గధారాపయో ధారాశాంతవిరోధిభూధవమహో దగ్రప్రతాపానలా! [శృంగారనైషధము. 6-144]
	లాటీచిత్తసరోమరాళకుకురీ లావణ్య లోలాత్మక ర్ణాటీనృత్యకళావిలోకన సమారంభ ప్రియంభావుకా భోటీనేత్రచకోరచంద్రమగధీ పుష్పాస్త్రచోళీకుచా ఘాటస్థాపిత మన్మథాంకకుహళీ గాఢాంకపాళీప్రియా. [శృంగారనైషధము, 4-141]
4. కుకురుకురుచేర కేరళ శకమరుకర్ణాటలాటసౌరాష్ట్ర మహీ పకమంత్రిజనమనీషా నికషోపలనయకలాప! నిగమా లాపా. [విక్రమార్క-చరిత్రము, 6-146]	కుకురుకురుచోళ కేరళ శకమరు కర్ణాటలాట సౌవీరనృప ప్రకరసభాభరణ మహా సుకవిజనానీక వినుతశుభచరితునకున్. [శృంగారనైషధము, 1-41]

జక్కన	శ్రీనాథుడు
5. వెన్నెలజరియిడ్డ వెండితీగలబోలు యజ్ఞోపవీతంబు లరుత నమర గన్నెఱ్ఱ చెంగల్వపూవన్నెమించిన నీరు కావిదోవతికట్టు కటిదలిర్ప వెలిదమ్మి విరిమోది యెలదేటిగతి గంగ మట్టిపై వేలిమిబొట్టుదనర నీలికందుకముపై గీలించుముత్యాల విధమున సిగగమ్మి విరులు మెరయ లలితనవయౌవనారంభకలితమైన మేని మెరుగులు మెరుగుల మెరుగు దెగడ జంద్రధరు కృప బ్రహ్మవర్చసము గన్న మారుడన నొప్పు విప్రకుమారు గాంచె. [విక్రమార్క-చరిత్రము, 7-143]	సరిగొన్న దెలిపట్టు జన్నిదంబులతోడ రత్నాలతాగహారమధరించి వలిపనీరాకా విదోవతిపై బదార్వన్నె కళయైన పసిడిమేఖల ఘటించి గంగమట్టియమోద గస్తూరిరసమున బుంద్రకమ్మ లలాటమున నమర్చి కమలకర్ణికకుండలములు పార్శ్వము లందు లలితంబులగు నొంటులలవరించి యాత్మవంశపరంపరాయాతమైన వైదికాచారమార్గంబు వక్కాణించి యూరజము రాచరికము నలవరించి నగరివీథులజరియించు బెగడసుతుడు. [శివరాత్రిమాహాత్మ్యము, 2-90]
6. ముగురంగూర్చిన ముండడైవ మునకున్ మ్రొక్కించు జేజేయనున్. [విక్రమార్క-చరిత్రము, 8-80]	ముగరంగూర్చిన ముండడైవమునకున్ మోమోట లేదో సుమీ! [భీమఖండము, 3-6]

ఈ పోలికలు కొట్టవచ్చినట్లు స్ఫుటంగా కనబడుతున్నాయి. లాటీచిత్తసరోమరాళ (శృం. నై. 4-141) శ్రీనా

ఖుడు మంచనపద్యాన్నికూడా జ్ఞాపకం చేసుకొని చెప్పి ఉంటాడు. "గాళీనిర్జర రాజనందనుని..."(కేయూర 1-78) అని మంచన తన కృతిపతిని సంబోధించాడు. ఈశ్వరదత్తు గారు ఈ పోలికలుకాక జక్కన రచించిన అయిదుసీసాలను ఉదాహరించి, ఇలా వ్రాశారు.

శ్రీనాథుని ఉపచారక్రియాప్రయోగములు జక్కనక్రియాప్రయోగముల ననుసరించుచున్నవి....పై సీసపద్యములలో చరణాంతముల నిరూపింపబడిన ఉపచారక్రియావిచ్ఛిత్తి సహృదయాహ్లాదకరమై చమత్కారాతిశయమును బోషించుచున్నది. ఇట్టి వైచిత్రియే శ్రీనాథుని కొరవడి యైనది.1

అయితే శ్రీనాథునిదే శిల్పంలో పైచేయి. జక్కన 'వెన్నెల జరియిడ్డ వెండితీగెలబోలు యజ్ఞోపవీతంబు లరుత నమర' అని కేవలం వర్ణనే చేశాడు. శ్రీనాథుడు యజ్ఞోపవీతాలను, రత్నాలహారాలను కలిపాడు. సిరాక్-విధోవతిపై పసిడిమేఖల కట్టించాడు. గంగమట్టిమీద కస్తూరిబొట్టు పెట్టించాడు. కుండలాలపక్కన ఒంటులు అలంకరింపజేశాడు. వైదికాచారాన్ని, రాజరికాన్ని పక్కపక్కన పెట్టాడు. ఒకడిలోనే రెండు విరుద్ధమైన వాటిని ఇమిడ్చాడు. అదీ కవిత్వం.

శ్రీనాథుడే జక్కనను అనుకరించాడా, లేక జక్కనే శ్రీనాథుణ్ణి అనుసరించాడా అన్నది ఒక చిక్కుప్రశ్నే! విక్రమార్కచరిత్ర రచనాకాలాన్ని చాగంటి శేషయ్యగారు క్రీ. శ. 1375-1404 అని నిర్ణయించారు.[2] దీనికి కారణం

---

1. శ్రీనాథుని కవిత్వతత్త్వము, పుటలు 45-47.
2. ఆంధ్రకవితరంగిణి, 4 వ సంపుటం, పుట 287.

ఆఱిచ్చిన కాలంలో దేవరాయలు యువరాజుగా ఉదయగిరిని పాలించాడు. అతనిదగ్గర చామరసు అనే మంత్రి ఉండేవాడు. ఆతణ్ణి దేవరాయల మంత్రిగా జక్కన విక్రమార్కచరిత్రలో పేరొక్కన్నాడు. దేవరాయలు క్రీ. శ. 1406 లో మహారాజు అయ్యాడు. అతని కొడుకు రామచంద్రరాయలు యువరాజుగా అప్పటినుంచి ఉదయగిరి ఏలాడు. అతని దగ్గర చామరసు డున్నాడు. అయితే జక్కన తన కావ్యంలో రామచంద్రరాయల్ని పేరొక్కనలేదు. కనుక జక్కన విక్రమార్కచరిత్రను 1375-1404 మధ్య ఎప్పుడేనా వ్రాసి ఉంటాడు అని శేషయ్యగారు చెప్పారు. జక్కన 1404 లోనో, 1405 లోనో వ్రాస్తే అతడు శ్రీనాథునికి సమకాలికుడవుతాడు.

జక్కన విక్రమార్కచరిత్రలో దేవరాయలగురించి, చామరసుగురించి చెప్పినది కొంచెం జాగ్రత్తగా పరిశీలిస్తే దేవరాయలు రాజుగా ఉన్నప్పుడే, అంటే 1406 తరువాతనే విక్రమార్కచరిత్ర రచన జరిగిఉంటుంది. ఈ కావ్యంలో దేవరాయల్ని 'మహారాయలు' అని జక్కన పేరొక్కన్నాడు (1-44). 'కర్ణాటమహామహేశ్వరు' డన్నాడు (3-137). చామరసు చామరచ్ఛత్రశిబికాది భాగ్యచిహ్నాలను జన్నయ సిద్ధమంత్రికి ఇచ్చాడు. యువరాజుగారి మంత్రిగా కన్నా రాజుగారి మంత్రిగానే అవి ఇవ్వడానికి ఆస్కార ముంటుంది. ఆ రోజుల్లో గొడుగు ఇవ్వడం అంటే ఎంత గొప్పో గారన వ్రాసిన హరిశ్చంద్ర చూస్తే తెలుస్తుంది. మాలెతలను

రాజు 'మీకు ఏమికావా' లని అడిగాడు. వాళ్ళు అడిగిన దేమిటో, హరిశ్చంద్రు డన్న దేమిటో చూడండి.

'గొడుగిచ్చి రక్షింపు కువలయాధీశ!
యంచితసవాలక్షు లొండొల్ల మేము;
పచరణ గాదు, మీ పాదంబు లాన.'
యని పల్క, మనసు దిగ్గని విర్రి రోసి
మనుజేశు డా మాల మగువల కనియె:
'మను సిరివచ్చిన మోకాలి నొగ్గు
ననువున నా త్యాగ మందక మీరు
పొం దెరుంగక వేడబోలు నే? పొసగ
దందని ఫలముల కర్రులు సాప
నొనర మహారాజయోగ్యంబులైన
వినుతవస్తువు లేడ? విద్యావా రేడ?
లేరా విద్యలవారు? లేరా భూనాథు?
లీరితి జడిరో? యిచ్చిరో తొల్లి?
గోరెడివారికి గొరత లెందుండు?
నీవాని వస్తువు లీరాము....' [హరిశ్చంద్ర. పూర్వ, 998-1012]

మహారాజయోగ్యములైన గొడుగులు మహారాజు గారి మంత్రిమాత్రమే ఇవ్వగలుగుతాడు. అందుచేత దేవ రాయల పరిపాలనాకాలమైన క్రీ. శ. 1406-1422 మధ్య ఎప్పుడేనా విక్రమార్కచరిత్రరచన జరిగిఉండవచ్చు. దేవ రాయల కొడుకు వేయించిన శాసనంలో చెప్పిన చామరసు మంత్రి చామరసుకాడు. 'కప్రతిదేవనిచామవొడయలు' ఈ శాసనకాలం క్రీ. శ. 1406. ''ఇతడు దోనికొండగ్రామం ఏలు తూఉండేవాడు. ఉదయగిరిలో ఉన్న మంత్రిని ఈ శాసనం

చెప్పదు.[1] అందుచేత ఈ శాసనంలోని చామరసును నమ్మి కొని జక్కన కావ్యరచనాకాలాన్ని నిర్ణయించలేం. శ్రీనాథుని జక్కన అనుసరించి ఉండవచ్చు. అయితే శ్రీనాథుని చివరిరచనలలో జక్కన పద్యాల పోలికలు ఉన్నాయి, వాటి మాట ఏమిటి అనే ప్రశ్న వస్తుంది. దానికి సమాధానం చెప్పవచ్చు.

శివరాత్రిమాహాత్మ్యంలోని ఈపద్యానికీ, జక్కన పద్యానికీ వస్తుసామగ్రిలో తప్ప పోలికలు తేవేమో అనిపిస్తున్నాయి. శివరాత్రిమాహాత్మ్యాన్ని శ్రీనాథుడు తన అవసానకాలంలో వ్రాశాడు. ఈపద్యాన్ని వ్రాస్తున్నప్పుడు జక్కనపద్యంకన్నా తన కాలపునాటి మంత్రికుమారలేకళ్ళ ముందు కనబడిఉంటారు. 'ముగురం గూర్చిన ముండ్రైవం' అనేది ఆనాడు ప్రచారంలో ఉన్నది. కావచ్చు. విక్రమార్కచరిత్ర, భీమఖండాలలోని వచనాలు బహుశా ఒకటే సంస్కృతమూలానికి అనువాదమేమో, పోతే నైషధంలోని పద్యాలకు, విక్రమార్కచరిత్రలోని పద్యాలకు పోలికలుండడం. శ్రీనాథునే జక్కన అనుకరించాడేమో అనే వాదానికి ఆస్కారం లేకపోలేదు.

జక్కన ఎర్రయ్యగారి కాలమువాడనికూడా కొందరు భావిస్తారు. ఏమంటే ఇతడు ఎర్రయగారిని స్తుతిస్తూ ఆయన అరణ్యపర్వశేషం, నరసింహపురాణం, రామాయణం వ్రాసినట్లు చెప్పాడేగాని హరివంశం వ్రాసినట్లు చెప్పలేదు. అందు

1. నెల్లూరుశాసనసంపుటం, 1 వ భాగం, పుట 810

చేత జక్కన విక్రమార్కచరిత్ర రచించేనాటికి హరివంశ రచన జరగలేదంటారు.[1] జక్కన ఎర్రయగారిని గురించి చెప్పిన పద్యం ఇది.

ఈర్రయి దా బ్రబంధపరమేశ్వరుడై విరచించె శబ్దవై
చిత్రి నరణ్యపర్వమున శేషము శ్రీనరసింహరామచా
రిత్రములన్ బుధవ్రజగరిష్ఠత నెర్రయ శంభుదాసు డా
చిత్రకవిత్వవాగ్విభవజృంభితు గొల్చెద భక్తియుక్తితోన్.

[విక్రమ. 1_14.]

ఇందులో 'అరణ్యపర్వమున శేషము' అన్నమాటను 'అరణ్యశేషమును శేషము' అని దిద్దడానికి అవకాశ ముందేమో వ్రాతప్రతులు శోధించాలి. హరివంశం భారత శేషమే కదా. ఈ దిద్దుబాటుకు అవకాశం ఉంటే ఎర్రయ గారి నాలుగురచనలూ జక్కన పేరొక్కన్నట్టే అవుతుంది. ఎర్రయగారిని ఈ పద్యంలో జక్కన చిత్రకవిత్వవాగ్విభవ జృంభితు డన్నాడు. ఐతే తన వరవడిని చేసుకున్నాడు.

ప్రతిపద్యము జోద్యముగా-గృతిజెప్పిన నొప్పుగాక కృతి నొకపద్యం
బతిమూఢుడైనచిత్రత-బ్రతిపాదింపడె ఘుణాక్షరన్యాయమునన్?

[విక్రమ. 1_17]

అని తాను కచ్చితంగా చెప్పాడు. ఇతడు తనగురించి కృతిపతిచేత ఇలా అనిపించాడు:

చక్కన నీవైదుష్యము-చక్కన నీకావ్యరచనచాతుర్యంబుల్
చక్కన నీ వాగ్వైఖరి-చక్కన నీవంశమహిమ జక్కనసుకవీ!

---

1. ఆంధ్రకవితరంగిణి, 4 వ భాగం, చాగంటి శేషయ్యగారు పు 216.

స్వాభావికనవకవితా-ప్రాభవముల నుభయభాష బ్రౌఢిమ జెప్పన్
భూభువనంబునసరిలే-రా భారతి నీవుదక్క నన్నయజక్కా!

[విక్రమ. 1: 23-24]

జక్కనది నిజంగా ఒక ప్రక్కనుంచి స్వాభావికనవ కవిత్వమే. అతని వాగ్వైఖరి చక్కనే. నాచనసోముని తరువాత సరిగ్గా అతికినట్టు సామెతలు వాడడంలో ఇతని కితనే సాటి. తెనుగుతనం ఉట్టిపడే జాతీయాలు మాత్రమేకాక సంస్కృత లోకోక్తులుకూడా బాగా వాడుతాడు. చూడండి.

జక్కన సామెతలు—లోకోక్తులు

తెలుగు:

తూచ తప్పకుండ—(1-110) పసిడిపల్లెర మైనన్ జేరుపగచోటు వలెను (1-111) పూసగ్రుచ్చినగతి (1-145) తెడ్డునాకి యుపవాసము మాన్పుకొనంగ నేటికిన్ (1-150) మరువము మొలుపగ తోడనె పరిమళ ముదయించినట్లు (1-) నూదిపిరింది ప్రతిక్రియ (2-72; 2-136) గుడి ప్రింగువారికి నంది పిండి వడియము (2-238) నెయ్యివోసిన యగ్నియట్లు (3-64) ముందట నుయ్యి వెన్క లోతగు గొయ్యి యున్నలాగు (3-81) ఆమూలచూడంబు (1-190; 3-106; 7-39) పులిమీసల నుయ్యాల లూగవచ్చునే (4-59) కాకతాళీయం (4-61) బాపనపోటును కప్ప కాటును గలదె? (4-63) హస్తి మశకాంతరం (4-68) తామరపాకున నీటిక్రియ తల్లడము (4-99) కమలదళంబుమీది యుదకంబును బోలె (4-132) సింహము మెడగంటవోలె(4-132) ఏమిటికి ఏనుగునెక్కి యుడ్డి దూరగన్ (4-149) చుట్టములసురభి (4-191) ఏనుగు పల్లనంబడిన ఏడికకు వశమేవహింపగన్ (5-132) తలపూ వాడక యుండగ (6-98) పలికిన పగడంబులు కాలునట్లు (7-4) చెరకున పండొదవినట్లు (7-20)

ఏమిటికి చల్లకు వచ్చి ముంతదాపగన్ (7_38) పెన్నిధానంబుగాంచిన పేదవోలె (8_22) మొలవూసలు క్రొవ్విననాటనుండి (8_41)

సంస్కృతం :

అహింసా పరమోధర్మయనంగ (1_148) 'ధర్మస్య త్వరితాగతి' యను పురాణవచనము (2_185) 'కామినీ లోకానాం జాతిః ప్రకల్పితా' యనునీతి(3_28) 'కామాంధోఒపి నపశ్యతి' నా మును వినబడిన పలుకు (3_68) 'గుర్వాజ్ఞాం ప్రతిపాలయే' త్తనెడి పల్కుల్ (5_133) 'వచస్సు భాషిత పరివ్యక్తం బలమేవహికేవల' మను పలుకు (5_160) 'పరోప కారార్థమిదం శరీర'మనిన ధర్మమార్గం (5_226) 'సర్వం విష్ణుమయం జగ' త్తనుట (6_65)

ఈ సామెతలను జక్కన ఎంత చక్కగా పద్యాలలో వాడాడో గమనిద్దాం. విక్రమార్కుని తండ్రి చంద్రగుప్తు డనే బ్రాహ్మణుడు. ఈ సంగతిని ఎత్తిపొడుస్తూ పరరాజులు పంపిన దూత ఏమంటున్నాడో వినండి.

పలుకులు వేయునేటి కిక బ్రాహ్మణసూనుడ వీవు నీకు దో
ర్బలమున కేమికారణము బాపనపోటును గప్పకాటునుం
గలదె ధరిత్రి భట్టి మొన గట్టిగ నమ్మిక మోసపోకు నీ
కొలదులె రాచకార్యములు కోమటిబుద్ధుల దీర్పదీరునే? [విక్రమ. 4_63]

ఈదూతే వీరమరణంఘనతను ఎలా చాటుకొం టున్నాడో చూడండి :

ఇంచుక సూదివేదన సహించినమాత్ర నృపాంగనాళచో
డంచితసౌఖ్యకేళి సతతంబును గంచుల గాంచు నాజిని
ర్వంచన దీవ్రబాణనికరక్షతదేహుల కబ్బవే మరు
చ్చంచలలోచనాఘనకుచ స్థలకద్యుతిసంగసౌఖ్యముల్?[విక్రమ. 4_71]

కాస్త సూదిపోట్లు ఓర్చుకొన్నంతమాత్రంచేత రవిక రాచకూతుళ్ళ పాలిండ్ల సౌఖ్యకేళిని నిరంతరం నోచుకొంటున్నది. యుద్ధంలో తీవ్రబాణాలవల్ల ఋత దేహులై తే దేవతాస్త్రీల సంగమసౌఖ్యం లభిస్తుందట.

ఇతని ఒకటిరెండు పద్యాలు చదివినంతమాత్రం చేతనే ఇంత ఆనందం కలిగితే కావ్యమంతా చదివితే ఇంక ఎంత హాయిగా ఉంటుందో అన్నది సహజమైన కుతూహలమే.

జక్కన కవిత్వం నిజానికి చక్కనే.

5

వెన్నెలకంటి అన్నయ్య



ట్టి విక్రమార్కుని కథలు, విక్రమార్కుని సింహాసన సాలభంజికల కథలు అంటే సామాన్యప్రజలకు ఎంత ఇష్టమో భేతాళునికథలన్నా అంత ఇష్టమే. విక్రమార్క చరిత్రను జక్కన, సింహాసన ద్వాత్రింశికను కొరవి గోపరాజు రచించిన కాలాల మధ్యలోనే వెన్నెలకంటి అన్నయ్య భేతాళపంచవింశతిలోని కొన్ని కథలను తన షోడశకుమార చరిత్రలో నాడుకొన్నాడు. అందువల్ల నే కవి గద్యలో తాను వ్రాసిన కావ్యం 'షోడశకుమారచరిత్రము' అని స్పష్టంగా చెప్పినా దీనికి భేతాళపంచవింశతి అనే పేరు నిన్న మొన్నటి దాకా, అంటే చిన్నయసూరికాలందాకా ఉండేది.

అయితే ఈ షోడశకుమారచరిత్రలో ఒక్క భేతాళ పంచవింశతికథలుమాత్రమే కావు. దశకుమారచరిత్రలోని కొన్నికథల పోలికలు,విక్రమార్కచరిత్రలోని కొన్ని సంఘట

నల అనుకరణలు, కథాసరిత్సాగరంలోని కొన్ని కథల తుల్లింతలు, మంచన కేయూరబాహుచరిత్రప్రభావం దీనిలో కనబడుతుంది. ఈ గ్రంథాన్ని శ్రద్ధగా పరిశీలిస్తే ఇది జక్కనకాలానికి తరువాత వ్రాసినదే అనిపిస్తుంది. ఇది శ్రీనాథుని రచనలు ప్రచారంలోనికి వచ్చాక వ్రాసినదేమో అని చెప్పవచ్చు. శ్రీనాథుని ప్రభావంకూడా కనబడుతుంది. శ్రీనాథుడు శృంగారనైషధంలో తన కృతిపతిని ఇలా సంబోధించాడు:

శ్రీహర్ష సుకవి కవితా-వ్యాహారకథా సుధారసాస్వాదసుఖ
శ్రీహర్షోదయ సత్యస-మాహితమహితాంతరంగ మామిడిసింగా!

[నైష. 3-1]

వెన్నెలకంటి అన్నయ్యకూడా తన కృతిపతిని ఇంచుమించు ఇలాగే సంబోధించాడు. చూడండి.

శ్రీహర్ష ముఖ్యసుకవి స-మాహిత కావ్యప్రపంచమాధుర్యసుధా
గాహనలీలారసిక-వ్యాహారవిహారమంత్రి యన్నయసూరా!

[షోడశ. 6-1]

శ్రీహర్ష పండితుడు క్రీ. శ. 1189-1195 ప్రాంతాలవాడు. ఇతని నైషధీయచరితానికి మొదటి వ్యాఖ్యాత విద్యాధరపండితుడు క్రీ. శ. 1250 లేక 1260 ప్రాంతాలవాడు. రెండవ వ్యాఖ్యాత చండూపండితుడు క్రీ శ. 1297లో వ్యాఖ్య రచించినట్టు తనే చెప్పుకొన్నాడు.[1] క్రీ. శ. 1300 తర్వాత అది బహుళప్రచారం పొందింది అని చెప్పుకోవచ్చు. మడికిసింగన శ్రీహర్షుణ్ణి పూర్వకవిస్తుతిలో పేరొక్కన్నాడు.

1. శృంగారనైషధసర్వంకష, ప్రకాశకవిజ్ఞప్తి, పుట 27

వ్యాసవాల్మీకి కుకవాలిదాసబాణ
హర్ష భాదుల వాద్యుల వాళ్ళ నిలిపి
సకలభాషారసజ్ఞుల సమూల నన్న
యార్యతిక్కనకవీంద్రుల నభినుతింతు. [జ్ఞానవాసిష్ఠం, 1_5]

చిమ్మపూడి అమరేశ్వరుడు చేసిన అర్వాచీనసంస్కృత భాషాకవుల పట్టికలో హర్షుని పేరు లేదు.[1] వెన్నెలకంటి అన్నయ్య మడికిసింగనకన్న ప్రాచీనుడు కాడేమో. ఇతని కాలాన్ని నిర్ణయించడానికి గ్రంథంలో ఏమీ ఆధారాలు లేవు. ఈ పుస్తకం అవతారిక దొరకలేదు. అందుచేత ఆశ్వాసాంతపద్యాలలోని సాహిత్యాలను పట్టి కాలనిర్ణయం చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ఒక పద్యంలో కవి తన కృతిపతిని ఇలా నుతించాడు.

సరసానందనసత్కళాగమపరీక్షాకృష్ణకందార్భ
స్వరసానారసభావనిర్మథనభోజక్ష్మాపవిద్యానిరం
తరగోష్ఠీజగదేకమల్లబహుళాస్త్రగ్రంథసిద్ధాంతవి
స్తరవిజ్ఞానకవిత్వతత్త్వకలనాసర్వజ్ఞసోమేశ్వరా !
[పోడశ. 7_128]

ఇందులో కృష్ణకందారుడు, భోజుడు, జగదేకమల్లుడు, సర్వజ్ఞసోమేశ్వరుడు అనే చారిత్రకవ్యక్తులున్నారు. వీళ్ళ కాలాలు తెలుస్తున్నాయి. ఈ ప్రసిద్ధులతో కృతిపతిని పోల్చి నందువల్ల కవి వీళ్ళకాలానికి అర్వాచీనుడే అవుతాడు. ఎంత అన్నది వేరేప్రశ్న.

---

1. సమగ్రఆంధ్రసాహిత్యం_III. పద్మశాయకయుగం, పుట 101.

1. భోజుడు ధారాపురాధిపతి క్రీ. శ. 11వ శతాబ్ది
2. సర్వజ్ఞసోమేశ్వరుడు పశ్చిమచాళుక్యచక్రవర్తి క్రీ. శ. 1126-1138
3. జగదేకమల్లుడు క్రీ. శ. 1148
4. కృష్ణకందారుడు యాదవరాజు క్రీ. శ. 1250

ఈ చారిత్రకవ్యక్తులలో ఆఖరివాడు క్రీ. శ. 1250 ప్రాంతాలు కనుక వెన్నెలకంటి అన్నయ్యకూడ ఆకాలం వాడే అని నిడుదవోలు వెంకటరావుగారు అభిప్రాయపడుతున్నారు.[1] అయితే మల్లంపల్లి సోమశేఖరశర్మగారు ఇతణ్ణి రాష్ట్రికూటరాజుల్లో మూడవకృష్ణునిగా గుర్తించారు.[2] అతనికాలం క్రీ. శ. 939. పశ్చిమచాళుక్యచక్రవర్తినీ, రాష్ట్రికూటరాజునూ పేర్కొనడంవల్ల కవి అప్పటివాడే కానక్కర్లేదు. దూబగుంట నారాయణకవి తన పంచతంత్రంలో తన కృతిపతిని భోజ సర్వజ్ఞ సోమేశులతో సరిపోల్చాడు. చూడండి.

రామరఘురంతిసగరధర్మజదిలీప
భోజసర్వజ్ఞ సోమేశరాజసరణి
ధాత్రిపాలించెతమ్మభూధవసుతుండు
శాశ్వతంబుగ బసవభూమీశ్వరుండు. [పంచ. 1-38]

దూబగుంట నారాయణకవి కాలం మనకు చూచాయగా తెలుసు. ఇతడు గజపతుల సామంతుడుగా ఉదయగిరిని పాలించిన బసవరాజుకాలంవాడు. నారాయణకవి పేర్కొన్నట్టే భోజసోమేశ్వరులను ఆశ్వాసాంత పద్యాలలో పేర్కొన్న అన్నయకూడా ఆకాలంవాడే కావచ్చు.

---

1. తెనుగుకవుల చరిత్ర, పుట 380
2. *History of Reddi Kingdoms*, పుట 504.

ఆశ్వాసాలలోని ఆద్యంతపద్యాలవల్ల షోడశకుమార చరిత్ర కృతిపతి చాలాచాలా గట్టివాడని తెలుస్తున్నది. అతడు ఆఖ్యానం, కల్పితకథ, ఉపాఖ్యానం, ఆఖ్యాయికా ప్రపంచరహస్యవ్యాఖ్యాన వ్యవహరణ ప్రఖ్యాత చరిత్రుడు (1-39). శ్రీరామాయణం, భారతం, పారాశరసూక్తి, కూర్మపురాణం, పద్మపురాణం మొదలైన ప్రముఖమైన అపారపురాణ విలోచన గౌరవ మహిధన్యుడు(2-185). కేవల పండితుడే కాడు, అశ్వశిక్షకుడుకూడా. ఇతడు 'సింధురాత్త ప్రచురతురగ సేవ్యవాజి శిక్షణుడు (5-158); శైవసిద్ధాంత వేది (1-40). ఇతనికి బోలెడంత శిష్యవర్గం ఉంది (5-1). నాటకముఖకోహళాది నాట్యరహస్యాల ఉద్ఘాటననిపుణ ప్రజ్ఞాచాతుర్యుడు; నూత్నభరతాచార్యుడు (8-91).

ఈ కృతిభర్తపేరు సూరామాత్యుడు. కృతికర్త తండ్రిపేరుకూడా సూరామాత్యుడే. ఇద్దరిదీ హరితసగోత్రమే. అందుచేత అన్నయ తన తండ్రికే ఈ షోడశకుమార చరిత్రను అంకితమిచ్చాడని పరిశోధకు లందరూ భావిస్తున్నారు. భావిపరిశోధనవల్ల కాని ఇంతకన్నా వివరాలు లభించవు.

ఈ గ్రంథంకూడా పూర్తిగా దొరకలేదు. ఇది ఎనిమిది ఆశ్వాసాల కావ్యం. అయినా మూడో ఆశ్వాసం, నాలుగో ఆశ్వాసం పూర్తిగా దొరకలేదు. మిగతా ఆశ్వాసాలలో శైథిల్యాలు లేకపోలేదు. గ్రంథపాఠాలు కూడా ఉన్నాయి. అయినా ఉన్న గ్రంథంతో ఆ షోడశకుమార

లెవరో, వాళ్ల హూదా లేమిటో, కథ లేమిటో చాలామట్టుకు తెలుసుకోవచ్చు. చూడండి.

షోడశకుమారచరిత్ర కథ

1. కమలాకరుడు – రాజకుమారుడు :—

ఇతడు జనమేజయమహారాజుకొడుకు. ఇతనికి ఎనమండుగురు మంత్రికుమారులు, నలుగురు దండనాయకకుమారులు, ముగ్గురు పురోహిత కుమారులు – వెరసి పదిహేనుమంది స్నేహితులు. తనలోకలుపుకొని వీళ్ళంతా షోడశకుమారులు. ఈ పదహారుమందీ దండకారణ్యంలో ఒక సాధకునికి సహాయం చేయబోయారు. అప్పుడు ఒక పన్నగంవల్ల వాళ్లు ఆపన్నులయ్యారు. చెట్లు కొక పిట్టగా చెల్లాచెదరయ్యారు. కొన్నాళ్ళకు కమలాకరుడు బోయపల్లెలో ఒక నెమలిని చూశాడు. నిమరగానే ఆ మయూరం తన స్నేహితుడు భీమభటుడుగా మారిపోయాడు.

[ద్వితీయఆశ్వాసం – 1 నుండి 16 దాకా.]

2. భీమభటుడు – సేనానికొడుకు :—

ఆ పన్నగంవల్ల ఆపన్నులయ్యాక భీమభటుడు ఉజ్జయినిలో ఒక ముసలిదాని ఇంటికి వెళ్ళాడు. అది మంత్రిక త్తె. అతణ్ణి అది మోసంచేయ బోయింది. అతడు దాన్నే మోసంచేశాడు. చివరికి మంత్రపాశంతో అతణి నెమలిని చేసింది. ఆ నెమలి బోయలపు దొరికింది. రాజకుమారుని స్పర్శవల్ల నిజరూపం వచ్చింది. [ద్వితీయ. 17 నుండి 26 దాకా]

'ఈ కిరాతులు మనల్ని చంపుతారు. మంత్రపాశంచేత మయూరాలమై ఎగిరిపోదాం.' అన్నాడు భీమభటుడు. ఎగిరిఎగిరి ఒక చెట్టు క్రిందకు చేరారు. ఆ ఎండుచెట్టు చంద్రోదయంకాగానే చిగురొత్తి మొగ్గవేసి పూసింది. ఉన్నట్టుండి చెట్టు వాళ్ళ స్నేహితుడు కరుణాకరుడుగా మారిపోవడం జరిగింది. [ద్వితీయ. 27 నుండి 30 దాకా]

3. కరుణాకరుడు (గుణాకరుడు?)-మంత్రికుమారుడు :—

పామువల్ల చెదరిపోయాక కరుణాకరుడు అడవిలో ఒక ముని శాపంవల్ల చెట్టుగా మారాడు. మిత్రదర్శనంవల్ల శాపవిమోచనం జరిగింది.
[ద్వితీయ. 30_34]

ఈ స్నేహితులు ముగ్గురూ కలుసుకొన్నాక ఆకాశంలోంచి ఒక వ్యక్తి వీళ్ళను చూసి క్రిందికి దిగాడు. అతడు పాంకోళ్ళ తొడుక్కున్నాడు. అతని పక్కన ఒక యువతి ఉంది. అతడు వీళ్ళ మిత్రుడు చిత్రకరుడే.
[ద్వితీయ. 35 నుండి 36]

4. చిత్రకరుడు – మంత్రికుమారుడు :—

పామువల్ల చెదిరిపోయిన చిత్రకరుడు అడవిలో ఇద్దరు రాక్షసులు దెబ్బలాడుకొనడం చూచాడు. వాళ్ళు ఒక పాత్ర, ఒక దండం, ఒక పాంకోళ్ళ జతకోసం తగువులాడుకుంటున్నారు. అవి మంత్రశక్తులుగలవి. ఆ రాక్షసుల్ని పరుగుపందెం వేసుకొనమని చెప్పి మంత్రసామగ్రిని దక్కించుకొని మంత్రికుమారుడు ఎగిరిపోయాడు. ఒక ఊళ్లో రాజుగారి కుమార్తెను చూసి మోహించాడు. పాదుకల శక్తితో కన్నెమాళిగపై దిగి ఆమెను కలుసుకొన్నాడు. రహస్యంగా కొన్నాళ్ళు సాగింది. రాజుకు తెలియగానే ఆమెతోపాటు ఎగిరిపోయాడు. స్నేహితులను చూసి దిగాడు.
[ద్వితీయ. 35 నుండి 60]

తనదగ్గర ఉన్న పాత్ర పంచభక్ష్యపరమాన్నాలూ ఇస్తుంది. లాతంతో ఊళ్లూ నగరాలూ నిర్మించవచ్చు. చిత్రకరుడు పట్టణం నిర్మించాడు. రాజకుమారుడు ముగ్గురు స్నేహితులతో హాయిగా రాజ్యం పాలిస్తున్నాడు.

[రాక్షసులదగ్గర వస్తుసామగ్రిని చిక్కించుకొనడం, ఊళ్ళు నిర్మించే మంత్రదండం మొదలైనవి విక్రమార్క-చరిత్రలోని కథలోనూ

ఉన్నాయి. [చూ: జక్కనకావ్యం, ద్వితీయ. 4 నుండి 12 దాకా సెంబరు పద్యాలు]

మంత్రదండం ప్రాసిన ఊరును కమలాకరుడు పాలిస్తున్నాడని తెలిసి కాంతిమంతుడు, బుద్ధిమంతుడు అనే మిత్రులు ఆ ఊరు చేరుకొన్నారు. వాళ్ళు తమ కథలు చెప్పుకొన్నారు. [ద్వితీయ. 66_68]

5. కాంతిమంతుడు – మంత్రికుమారుడు :—

పామువల్ల చెదరిపోయాక కాంతిమంతుడు ఒక ఊరు చేరుకొన్నాడు. ఆ రాజుగారి కూతురు మదిరావతిని చూసి మోహించాడు. ఆమెకూడా అతణ్ణి ప్రేమించింది. అయితే రాజు ఇంకొకరితో వివాహాన్ని నిర్ణయించాడు. కాంతిమంతుడు విరహంతో, విచారంతో బయటకు వెళ్ళాడు. ఊరవతల అతణ్ణి స్నేహితుడు బుద్ధిసహాయుడు కలుసుకొన్నాడు. [ద్వితీయ. 67_90]

6. బుద్ధిసహాయుడు – మంత్రికుమారుడు :—

పామువల్ల ఎడబాటు కలిగాక బుద్ధిసహాయుడు ఎన్నో అడవులు గడచి ఒకసరస్సు చేరుకున్నాడు. అక్కడకు కొందరు యువతులు స్నానానికి వచ్చారు. వాళ్ళ నొక ఏనుగు బెదిరించింది. ఒక యువతి భయపడి పరుగెత్తి బుద్ధిసహాయుడిని కాగలించుకుంది. ఆమె మదిరావతి పినతల్లికూతురు. ఇద్దరూ ప్రేమించుకొన్నారు. కాని విడిపోవలసి వచ్చింది. విరహంతో తిరుగుతూ బుద్ధిసహాయుడు కాంతిమంతుణ్ణి కలుసుకున్నాడు. [ద్వితీయ. 91_106]

కాంతిమంతుని ప్రేయసి తన పెళ్ళినాడు లగ్నానికి ముందు రాత్రి కాముని గుడికి వచ్చి గర్భగుడిలో ఊరిపోసుకొని చచ్చిపోదామనుకొంది. ఆలయంలో స్నేహితులిద్దరు కాచుకొని ఉన్నారు. ఆమెను వారించారు. బుద్ధిసహాయుడు ఆడవేషం వేసుకొని బయటకు వచ్చి పల్లకీ ఎక్కి అంతఃపురానికి వెళ్ళిపోయాడు. అక్కడ పినతల్లికూతురు పెళ్ళికి

వచ్చిన ప్రేయసిని కలుసుకొన్నాడు. కాపలావాళ్ళ కన్నుకప్పి అడవి లోకివచ్చి కాంతిమంతుణ్ణి, అతని ప్రియురాలిని కలుసుకొన్నాడు. ఈ జంటలు రెండూ కమలాకరుని సంగతి విని ఆ నగరం చేరుకున్నారు. [ద్వితీయ. 107_135]

కమలాకరుడు ఒకనాడు వీనుగుబీటకు వెళ్లాడు. అడవిలో దుర్గాలయంవద్ద నరబలి ఇస్తున్న కిరాతుల్ని చూశాడు. రాజకుమారుణ్ణి చూసి వాళ్లు బంధితుణ్ణి వదలి పారిపోయారు. ఆ బంధితుడు రాజకుమారుని స్నేహితుడు వసంతకుడే! [ద్వితీయ. 136_138]

7. వసంతకుడు – పురోహితపుత్రుడు :—

పామువల్ల ఎడబాశాక వసంతకుడు అడవిలో తిరుగుతున్నాడు. ఒక బేహారిని దొంగలు కొల్లగొడుతూ ఉంటే రక్షించాడు. ఆ వైశ్యుడు అతణ్ణి తన ఊరికి తీసుకుపోయాడు. ఆ ఊళ్లో రూపిణి అనే వేశ్య ఉంది. అది వసంతకుణ్ణి చూసి ప్రేమించింది. వాళ్లు ఆనందంతో ఓలలాడుతూ ఉంటే వేశ్యమాత ధనాశచేత మందుపెట్టి వసంతకుణ్ణి నదిలో పారవేయించింది. నీళ్ళలో పడ్డ వసంతకుడు ఒక చచ్చిన ఏనుగు డొక్కతేలుతూఉంటే దానిలోకి ఎక్కాడు. దాని నొక మహాపక్షి ఎగరేసుకుపోయింది. లంకాద్వీపంలో పడేసింది. లంక నప్పుడు విభీషణుడు పాలిస్తున్నాడు. వసంతకుని కథ విని అతనికి శంఖచక్రాలు, గదాంబుజాలూ ఇప్పించి మళ్లా ఆ రూపిణి ఇంటిదగ్గరనే తన రాక్షసులచేత విభీషణుడు వదిలిపెట్టించాడు. శంఖచక్రాలతో వచ్చిన వసంతకుడు విష్ణువులాగే ఉన్నాడు. వేశ్యమాత ఆశ్చర్యపోయి అత్యాశ జెంది బొందితో వైకుంఠం వెళ్లా లనుకుంది. వసంతకుడు ఆమెకు తగిన గుణపాఠం చెప్పాడు. ఆ తరువాత మంత్రదండంతో వ్రాసిన పట్టణాన్ని కమలాకరుడు ఏలుతున్నా డని విని రూపిణితో కలిసి అక్కడకు బయలు దేరాడు. దారిలో కిరాతులు ఆమెను బంధించి గూడెంలో పెట్టారు. అతణ్ణి బలివేయబోయారు. ఇదీ అతడి కథ. [ద్వితీయ. 137_172]

కమలాకరుడు వసంతకుని కథ విని కిరాతులగూడెంపై దాడి చేయించి రూపిణిని విడిపించి కలుసుకొన్న స్నేహితులతో సుఖంగా ఉంటున్నాడు. [దీనితో ద్వితీయాశ్వాసం ముగిసింది.]

[ఈ వసంతకుని కథ దశకుమారచరిత్రలోని అపహారవర్మకథ వంటిది. అందులో అతడు వేశ్యకు ఇంకొకరకంగా బుద్ధిచెప్తాడు.]

8. విక్రమకేసరి – సేనానికొడుకు :—

పామువల్ల విడిపోయాక ఇతడు ఎక్కడికి వెళ్లాడో, ఏయే సాహసాలు చేశాడో తెలియదు. ఎందుచేత నంటే, ఇతనికథ సగం లోంచి మొదలవుతుంది. ఇతనికి భేతాళుడు త్రివిక్రమసేనుని వినుత చరిత్రాన్ని చెప్పాడు. ఇతనికికూడా వాహనంగా ఉండడానికి అనుకూలమైన మంత్రాన్ని చెప్పాడు. దాని ప్రభావంవల్ల విక్రమకేసరి భేతాళవాహనుడై తన స్నేహితుడు కమలాకరుని కలుసుకొన్నాడు. ఇతనికి భేతాళుడు చెప్పిన కొన్ని కథలే ఈ ఆశ్వాసంలో ఉన్నాయి. [పంచమాశ్వాసం పూర్తిగా ఇతని కథే.] వాటి వివరాలు :

1. భోజనవనితాశయ్యాచంగుల కథ [3–26]
2. జ్ఞానవిజ్ఞానశూరుల కథ [28–45]
3. మదనమంజరి కథ [46–59]
4. దేవసేనచరిత్రం [60–86]
5. వైశ్యకన్యకథ (ముగ్గురుతండ్రుల పిండప్రదానసమస్య) [87–123]
6. ధర్మరాజుకథ (విక్రమకేసరి జవాబు చెప్పలేక పోయింది) [124–139]

ఈ కథల తరువాత భేతాళపంచవింశతి ఉపసంహారం కథ కొంత ఉంది. త్రివిక్రమసేనుణ్ణి బ్రాహ్మణులు బలివేయబోవడం, భేతాళ దర్శనం, వరం ఇవ్వడం మొదలైనవి. [140 నుండి చివరిదాకా.]

రాజకుమారుడు నిండుసభలో ఉన్నాడు. ఆతనివద్దకు కళావతి అనే యువతి ఒక చిలుకను తీసుకొచ్చింది. అది అసాధ్యపుచిలుక. కమలాకరుడు ప్రేమిస్తున్న హంసావళి అనే రాజకన్యకూ, అతనికీ నలుని, దమయంతిని గూర్చిన కలహంసలాగ కూర్చడానికి ప్రయత్నించింది. ఆ చిలుకను రాజకుమారుడు మెచ్చుకొని దువ్వేసరికి అది అతని స్నేహితుడు వివేకనిధి రూపాన్ని పొందింది. [షష్ఠా. 1-60]

9. వివేకనిధి – మంత్రికుమారుడు :—

పామువల్ల విడిపోయాక వివేకనిధి చాలాదూరం వెళ్ళి కాశ్మీర భువిలో శరదనగరంచెంత అడవిలో ఒక మునిశాపంవల్ల చిలుకగా మారిపోయాడు. నీ స్నేహితుడు కాంక్షించే హంసావళి అనే మాళవదేశపు రాజకుమార్తెను అతనికి సుముఖురాలిని చేసి నీ స్నేహితుణ్ణి నువ్వు కలుసుకొన్నప్పుడు నీకు శాపవిమోచనం అని ముని చెప్పాడు. (వివేకనిధి చిలుకరూపంలో కళావతికి చిక్కాడు. ఆమెయింటికి సిద్ధులు వస్తూఉంటారు. ఒక సిద్ధుడు కమలాకరుని చిత్రాన్ని, హంసావళి చిత్రాన్ని ఫలకాలపైన వ్రాసి తనే వీళ్ళకు సంధానం కలిగించమని చిలుకకు చెప్పాడు. చిలుక మొదట హంసావళిని కలుసుకొని ఆమెకు కమలాకరునిమీద మరులు పుట్టించింది. ఆమె వ్రాసిన రెండర్థాల పద్యం పట్టుకొని ఇక్కడకు వచ్చింది.) ఇప్పుడు ఇలా శాపవిమోచనం కలిగింది. [షష్ఠా. 62-68]

తన అసాధారణపు చిలుక మనిషిగా మారినందుకు కళావతి చింతించింది. అప్పుడు కమలాకరుడు తన స్నేహితుడు చిత్రకరుడి మంత్రదండంచేత సర్వజ్ఞత్వం ఉన్న చిలుకను వ్రాయించి ఇప్పించాడు. తరువాత హంసావళిని కలుసుకొనడానికి ఆమెదేశానికి దిగ్విజయం నెపం మీద వెళ్ళాడు. దారిలో ఒక విమానంలో ఎవరో వ్యక్తి ఎగిరివెళ్ళడం శాతమారుడు చూచాడు. విమానం ఆగింది. అందులోని వ్యక్తి దిగాడు. అతడు తన స్నేహితుడు ప్రభాకరుడే. [షష్ఠా. 69-79]

10. ప్రభాకరుడు – మంత్రికుమారుడు :—

పామువల్ల చెదిరిపోయాక ప్రభాకరుడు అడవిలో ఒక మునిని కలుసుకొని నమస్కరించాడు. అతడు దివ్యదృష్టితో చూచి విచారించాడు. 'నానాయాతనలూ పడి నలుగురు యువతులను పెళ్ళిచేసుకొని చివరకు మీ స్నేహితుణ్ణి కలుసుకొంటావు.' అని చెప్పాడు. కనకపురిని చూసినవాళ్ళకు తనకుమార్తె కనకలేఖను ఇచ్చి పెళ్ళిచేస్తానని వర్ధమాన పురంరాజు చాటించాడు. ఆ రాజకుమార్తెమీది మోహంవల్ల ప్రభాకరుడు చూడకుండానే చూశానని మొదట బుకాయించాడు. తరువాత ఎన్నో కష్టాలు పడి అది చూశాడు. ఆ గదులలో చైతన్యం లేకుండా పడుకొన్న ముగ్గురు కన్య లున్నారు. చివరి కన్య తానువలచిన కనకలేఖ. ఆమె మరణించిందా? ప్రభాకరుడు విలపించాడు. అంతలో ఒక మాయగుర్రం వచ్చి అతణ్ణి ఒక్కసారి వూపుగా డొక్కతో కొట్టింది. అతడు కనకపురినుండి ఎగిరి వర్ధమానపురంలో పడ్డాడు. కనకపురి చూశానని చెప్పాడు. మూడు మంచాలమీద ముగ్గురు కన్యలను చూశానన్నాడు. అది వినగానే కనకలేఖ మరణించింది. ఆమెప్రాణాలు కనకపురిలో ఉన్న కన్యలో కలసిపోయాయని అతడు మళ్ళీ ప్రయాస పడి ఆ ద్వీపానికి వెళ్ళాడు. కష్టాలు పడి నలుగురు కన్యలను పెళ్ళి చేసుకొని విమానం పొందాడు. దానిలోనే వస్తూ ఇలా స్నేహితుణ్ణి కలుసుకొన్నాడు. [షష్ఠ. 81 నుండి చివరదాకా]

దిగ్విజయం చేస్తూ కమలాకరుడు కప్పాలు చెల్లించే రాజును మన్నిస్తూ సాగిపోయాడు. పుత్రవర్ధనం అనే పురాన్ని ఏలే రాజు మాత్రం వచ్చి కానుకలు ఇవ్వలేదు. అతణ్ణి శిక్షించడానికి ఆ పురం మీద దండెత్తాడు. ఆ కోటలోనుంచి ఇద్దరు వీరులు రథమెక్కి యుద్ధానికి వచ్చారు. తీరా చూస్తే వాళ్లు కమలాకరుని మిత్రులే. ఒకడు దృఢవర్మ, రెండవవాడు దీర్ఘబాహు. వాళ్ళు తమ కథలు ఇలా చెప్పారు. [సప్తమ. 1–7]

11. దీర్ఘబాహుడు – సేనానికొడుకు :—

పామువల్ల విడిపోయాక దీర్ఘబాహుడు వెళ్ళివెళ్ళి ఒక ఊళ్లో ఒక బ్రాహ్మణుని ఇంటిముందు ఆగాడు. ఆ ఇల్లాలు – ముసలిది – ఏడుస్తూంది. ఎందుకంటే ఆరోజు తన కొడుకు మరణిస్తాడు.

12. దృఢముష్టి – సేనానికొడుకు :—

ఆవూరి రాజుగారి భూమా త్తె రోజూ రాత్రి కొక యువకుణ్ణి రప్పించుకొంటుంది. అలా పిలిపించుకొన్నవాడు రాత్రి మరణిస్తాడు. ఈ రాత్రి తన కొడుకు వెళ్ళాలి అని ఆమె రోదిస్తోంది. 'నీకుమారుడి బదులుగా నేను వెళతాను.' అని దీర్ఘబాహుడు వెళ్ళాడు. ఆ రాకుమా రె వద్ద ఒక రాక్షసుడు ఉన్నాడు. దీర్ఘబాహుడు తన కత్తిని దూసి "నేను కమలాకర రాకుమారుని బంటును, కాచుకో" అని ఉరికాడు. అయితే నేను స్నేహితుని మామను అన్నాడు రాక్షసుడు. ఏమిటి సంగతి అని ప్రశ్నిస్తే దృఢముష్టి ఆరాక్షసుడికి అల్లుడయ్యాడు. అతని బహు సాహసాలను వివరించాడు. అతడొక్కడున్నదీ తెలిపాడు. ఇద్దరూ చివరకు పుత్రవరనం అనే ప్రభావాన్ని సహించారు. ఇప్పుడు ఇలా తమ స్నేహితుణ్ణి కలుసుకొన్నారు. [సప్తమ. 8_64]

ఆ తరువాత కమలాకరుడు హంసావళిరాజ్యానికివెళ్ళి ఆమె తండ్రికి కబురు పంపుతాడు. అతడు కూతుర్ని ఇవ్వడానికి ఒప్పు కొంటాడు. అయితే ఒక పరిచారిక కుట్రవల్ల అవాంతరాలు, ప్రమాదాలు వస్తాయి. చివరకు కమలాకర హంసావళులు పెళ్ళి చేసుకొంటారు. సుఖ సంకథావినోదాలలో ఓలలాడుతారు. షోడశకుమారులలో ఇప్పటికి తేలినవాళ్లు పన్నెండుమందే. మిగతా నలుగురికథలూ లభించలేదు. గాని పాళ్ళపేర్లు తెలుస్తున్నాయి. [సప్తమ 64 నుండి చివరదాకా, అష్టమా శ్వాసం పూర్తిగా వివాహం వివరాల కథ.]

13. యశఃకేతుడు – మంత్రికుమారుడు.

14. నీతిమంతుడు – మంత్రికుమారుడు.

15. మతిమంతుడు – పురోహితపుత్రుడు.

16. కళానిధి – పురోహితపుత్రుడు.

ఇందులో షష్ఠాశ్వాసంలోగాని మంచిపాకాన పడిన రచన కనబడదు. మొదటి ఆశ్వాసాలలో కథ చెప్పుకు పోవడమేగాని ఆగి వర్ణించడం, పాత్రల భావాలను చిత్రించడం మొదలైనవి తక్కువే. అక్కడక్కడ మగీ లేకపోలేదు. ఉన్నవి మంచివే. ఆకాలపునాటి వేశ్యల వైభవాన్ని వర్ణిస్తున్నాడు, చూడండి.

హాటకహర్మ్యంబు లంగరేకులవారు పరిచారికావళి భటచయంబు
స్మరబంధచిత్రము ల్సకినల మంచము ల్పరుపు గీరంబులు బారువంబు
లాలవట్టంబులు గీలుబొమ్మలు మంచి పైడిపన్నారులు బట్టు తెరలు
నిలువుటద్దములు గంటల యుయ్యాలలు హంసతూలికపాన్పులు దోమ తెరలు
సారమృగమదకర్పూరచందనములు
లలితచీనాంబరాదులు పొలుపుమిగిలి
చెలువుమీర మనోహరశ్రీల మెరసి
యొప్పుదురు వారకామిను లప్పురమున. [పోడ. 2_145]

ఆనాడు రాజాస్థానాలలో ఉండే ప్రతీహారకాంతలను వర్ణిస్తున్నాడు, చూడండి.

చిత్తజాజాలక్ష్మిచేతి పూసెల కట్టె కరణి బెత్తము గేల గరము మెరయ
గనకకుంభములపై గాయు వెన్నెలవోలె జన్నుల చందనచర్చ దనర
జపలాలతాసంగికారదాభ్రమువోలె గట్టిన వెలిపట్టుపుట్ట మమర
వదనేందునకు బొంచి యొదిగిన రాహునా గతిభాగమున ఖడ్గంబు ప్రేల
రమణియై యున్న శృంగారరసమువోల
నుర్విపై గరజానువు లూంద ప్రొక్కి
యల్లనల్లన యాప్రతీహారకాంత
వినయ మెసగంగ నిట్లని విన్నవించె. [పోడ. 6_4]

శ్రీనాథుని ప్రభావంలో రచించిన పద్యంలాగ కని పించే శైలిలో శారదాపీఠాన్ని వర్ణిస్తున్నాడు, చూడండి.

శ్రుతులుపుట్టిన యిల్లు మతిజనంబుల పంట యాగమగోష్ఠివిహారదేశ
మష్టమహాసిద్ధు లందెడు కందువ పరమయోగీంద్రుల పట్టుగొమ్మ
సిద్ధసారస్వతసిద్ధి కావాలంబు శబ్దశాస్త్రమునకు జన్మభూమి
నిశ్రేయసంబుల నిచ్చెన మహనీయమహిమల గని శ్రీల మనికిపట్టు
గరుడగంధర్వకిన్నరఖచరసిద్ధ
పన్న గామరకోటుల బ్రదుకుజోటు
సర్వసర్వంసహావిభూషణ మనంగ
దనరె శారదాపీఠంబు మనుజనాథ ! [షోడ. 6_19]

పరస్పర విరోధమున్న ఉపమానాలతో కథానాయిక అవయవాలను వర్ణించి కొసమెరుపుగా నడుమును వర్ణించాడు చూడండి.

కరతరంబుల యొప్పు సరసిజంబులబోల నెరచందురుని బోలె నెమ్మొగంబు
తనువుటూర్పుల యింపు గనుగాలిమించిన నవరోమరేఖ పన్నగము మించె
నలకలు తేటుల చెలువంబు గెలువ నాసికయొప్పు హేమపుష్పకము గెలిచె
ఘనకుచంబులు శైలగరిమంబు మీరిన రదనదీప్తులు వజ్రరశ్మి మీరె
గారణమ్మ్ లేక కడు బరస్పరవైర
మయ్యె నొక్కొ్క మేనియందె యిప్పు
డవయవముల కనుచు నతిచింత డస్సెనా
నడుము సన్నమయ్యె నలినముఖికి. [6_32]

ఈతని తండ్రి కృతిభర్త నూత్నభరతాచార్యుడు కనుక కవి నటరాజురూపాన్ని వర్ణించడంలో చాకచక్యం చూపించకపోడు. చూడండి, కారుమేఘాన్ని ఎలా వర్ణిస్తున్నాడో.

వితతవర్ణవితీర్ణవిద్రుమవల్లులు పరగెడు ఘనజటాభంతి దొరయ
నంబుపానసమాగతాంబుదపటలంబు దనరారు కుంజరాజినముగాగ
బ్రబలవాతోద్ధూతభంగసంఘంబులు విస్తరిల్లెడు హస్తవితతిబోల
ఘోరతరస్ఫుర్ధుమఘుమాఘూషణం బారభటిభాతి నతిశయిల్ల
బ్రళయకాలతాండవలీల బ్రజ్వరిల్లు
ఫాలలోచను నుగ్రరూపంబువోలె
నంబరంబును దిక్కులు నాక్రమించి
యతిభయంకరమయ్యె నా యంబుదంబు. [6_102]

ఇతని తండ్రి శైవసిద్ధాంత వేది కనుక అన్నయ్యకూడా శివభక్తుడే అనవచ్చు. అందుకే తుఫాను మేఘాన్ని నటరాజుతో పోల్చాడు. ఉదయచంద్రుణ్ణి శివలింగంతో సరిపోలుస్తున్నాడు. చూడండి.

పూర్వగిరి పానవట్టమై పొలుపుమిగుల
బద్మరాగలింగమువోలె బ్రబలె రాజు
పూజచేసిన నవకంబు బూవులట్టు
లుపరితలమున దారక లొప్పుమిగిలె.

శైవుడైన ఇతడు శివకవులలో ప్రసిద్ధుడైన పండితయ్యగారి ప్రయోగాలను కూడా చేశాడు. పండితయ్య కొందరు కొందరు అనే మాటలో తుది ఉకారలోపంగా ప్రయోగించినట్లు మనం చూశాం.[1] ఇతడుకూడా అలాంటి ప్రయోగం చేశాడు.

తెగియెను గునుమదొడంగిన
బగగొని ఖడ్గహతి కోర్చి పైబడి కొందర్

---

1. సమగ్రఆంధ్రసాహిత్యం, I-చాళుక్యయుగం, పుట 250.

దెగగా గొండరు గాశ్సె
యొగయకయుసు మెలగ మిడుకనీక యదిమినన్.

[షోడశ. 2_180]

ఇతని గ్రంథం సంపూర్ణంగా దొరికితే భేతాళపంచ వింశతికథల ఆదిమరచన తెలుగుభాషలోనిది సంపూర్ణంగా ఉండేది. పంచమాశ్వాసంలో ఇప్పుడు పదికథలు మాత్రమే ఉన్నాయి. కవిభల్లటుని భేతాళపంచవింశతినీ, దీనినీ తెపారు వేసి పరిశీలిస్తే ఇంకొన్ని వివరాలు తెలుస్తాయి.

భావి పరిశోధకులకు చేతినిండా పని కల్పించే కవులలో వెన్నెలకంటి అన్నయ్య ఎవ్వరికీ తమ్ముడు కాడు.

6

అనంతాత్మాత్ప్యుడు



నగనగా ఒక ఊళ్లో ఒక ఆవు ఉండేది. అది ఒకనాడు అడవికి వెళ్లి మేత మేస్తూఉంటే ఉన్నట్టుండి ఒక పులి దానిమీద విరుచుకుపడి విరుచుకొని తినబోయింది. అప్పుడా ఆవు దానిని కొంచెం ఆగమని ప్రార్థించింది. ఆ ప్రార్థన విని పులి ఆగగానే ఆవు ఇంకొకటి ప్రార్థించింది. "పులిరాజా! పులిరాజా! ఆకలితో ఉన్నవానికి ఆహారం పెట్టడమంత పుణ్యం ఇంకొకటి లేదు. నువ్వు ఆకలితో ఉన్నావు. నేను నీకు ఆహారం అవడానికి నా కేం అభ్యంతరం లేదు. అయితే ఒక చిన్న విన్నపం: నాకు ఇంకా పొదుగు విడవని చిన్నారి పెయ్య ఉంది. ఇంటికి వెళ్లి దాన్ికి పాలిచ్చి వచ్చేస్తాను. కొంచెం ఓపిక పట్టగలవా?" ఆవుమాటలు విని పులి 'అలాగే కానివ్వు' అంది. ఆవు ఇంటికి వెళ్లి పిల్లకు పాలిచ్చి, ఆడిన మాట తప్పకుండా పులికి ఆహారంగా అడవికివెళ్ళింది. పులి ఆశ్చర్యపడి ఆవును

చంపడం మానేసి ఇంటికి పొమ్మన్నాంది. కథ కంచికీ, మన మింటికీ.

ఈ నీతికథ ఆంధ్రదేశంలోని ఆబాలగోపాలానికీ తెలుసు. దీనిని రచించి మొట్టమొదట తెలుగుసాహిత్యంలో గ్రంథస్థం చేసిన కవిపేరుమాత్రం తెలియకపోవచ్చు. అతని పేరు అనంతామాత్యుడు. ఇతడు కృష్ణాజిల్లావాడు. క్రీ. శ. 1435 ప్రాంతాలవాడు. ఇతని తాతతండ్రులు కవులని చెప్పలేంగాని ముత్తాత బయ్యన్నమాత్రం మంచి కవి. తిక్కన గారంతటివారు ఆయన కవిత్వాన్ని మెచ్చుకొని భవ్యభారతి అనే బిరుదు ఇచ్చారు. బయ్యన్న ఉత్తకవే కాడు. దండనాథుడుకూడ. అనంతామాత్యుడు తన ముత్తాతను బయ్యచమూపతి అనీ, గదానిపుణుడు, అసహాయసాహసుడు, అరాతిభయదబాహుడ్యుడు, అక్షరాదివిద్యలందు చతురుడు, కవిరత్నం అనీ, రాజసభలలో పూజలుపొందినవాడనీ చెప్పాడు.[1] బయ్యనమంత్రి నెల్లూరిరాజుల సభలోకూడా సత్కారాలు పొందాడేమో! అప్పుడే ఆ సభలోఉన్న తిక్కనగారు భవ్యభారతి అనే బిరుదు ఇచ్చారేమో. బయ్యనమంత్రి పాకనాడులోగాని, వెలనాడులోగాని దండనాథుడుగా ఉండిఉంటాడు. ఇతని తాతతండ్రులనుగురించి కూడా అనంతామాత్యుడు వివరాలు చెప్పాడు. ఈబయ్యనమంత్రి పినతండ్రి షణ్మాసాలు పురశ్చరణచేసి వాళ్ళవంశజులయింటి మార్జాలమునకైన నరకంబు లేకుండ వరము బడసినవాడట.[2]

---

1. భోజరాజీయం, 1 : 23 - 25. 2. అదేపుస్తకంలో, 1-21.

తిక్కనగారిచేత బిరుదు పొందిన బయ్యనమంత్రి తన మనుమడొకనికి తిక్కన అని పేరు పెట్టుకున్నాడు. ఈతిక్కన మంత్రి కృష్ణాజిల్లాలోని శ్రీకాకుళంలోని ఆంధ్రవల్లభుని భక్తుడు. బహుశా ఈ గ్రామానికి దగ్గరలోనే పెరుమగూరు అనే ఊరు ఉండిఉంటుంది. ఇది కృష్ణవేణామలాపహారిణీభీమరథీనదులు కలిసే అంతర్వేది అయిన పావనక్షేత్రంలో ఉందట. అంతర్వేదిఅంటే ఈ మూడునదుల మధ్య నున్న గడ్డకాక ఈ నదులు కలిసినతావునకు చివరనున్న భాగమని జనమంచి శేషాద్రిశర్మగారు అర్థంచెప్పారు.[1]

అనంతామాత్యుని తండ్రి నివసించిన పెరుమగూరు ఎక్కడుందో ఎలా తెలియదో అలాగే అనంతామాత్యుడు నివసించిన ధ్రువపట్టణం ఎక్కడుందో కూడా చెప్పలేం. ఇతడు రసాభరణం అనే అలంకారశాస్త్రగ్రంథాన్ని వ్రాసి ధ్రువపట్టణంలోని గోపాలకృష్ణునికి అంకితమిచ్చాడు. ధ్రువ శబ్దానికి మర్రి, మోడు అనే అర్థాలున్నాయని, మర్రిపూడి, లేకమర్రివాడ అనే పేరును కవి సంస్కృతీకరించి ధ్రువపట్టణమనే పేరు పెట్టిఉంటాడని చాగంటి శేషయ్యగారు అభిప్రాయపడ్డాడు.[2] కృష్ణాజిల్లా గన్నవరంతాలూకాలో మర్రివాడ ఉందట. దివితాలూకాలో మోడుమూడి ఉందట. ఈరెండు గ్రామాలలో ఏదయినా ధ్రువపట్టణ మయిఉంటుందని చాగంటివారు ఊహించారు. ఈరెండూకాక కృష్ణామండ

---

1. భోజరాజీయం, వావిళ్ళప్రచురణ, మొదటికూర్పుపీఠికలో పుట 5.
2. ఆంధ్రకవితరంగిణి, 5 వ సంపుటి, పుట 262.

లంలోని దరువూ రే ధ్రువపురి అని నిడుదవోలు వెంకటరావు గారి ఉద్దేశం.[1]

అనంతామాత్యుడు ఎక్కడివాడైనా అతడు అహోబలనరసింహుని భక్తుడు. తన మొదటికావ్యాన్ని ఆ దేవునికే అంకితమిచ్చాడు. అందులోనూ దేవుడు ముచ్చటపడి వచ్చి అడిగితే ఇచ్చాడు. తిక్కనగారి కలలోకి వచ్చి వాళ్ళ నాన్నగారు సిఫారుచేస్తే హరిహరనాథునికి ఆయన భారతాన్ని అంకితమిచ్చారు. ఎర్రయ్యగారి కలలోకి వాళ్ళ తాతగారు వచ్చి అహోబలనరసింహునికి కృతిఇవ్వమని ఆదేశించారు. అలాగే అనంతామాత్యుని కలలోనికి అతని గురువు తిరుమల నల్లా గోవిందచక్రవర్తిగారితో కలిసి అహోబలనరసింహుడు విజయంచేశాడు. గురువుగారు ఈ దేవునికి ఒక కృతి అంకితం ఇవ్వమని ఉపదేశంచేశాడు. అనంతామాత్యుడు పులకించాడు. కొంచెం వినయంగా ఇలా అనుకున్నాడు.

వెలయగ దొంటిపెద్దల కవిత్వము వోలె రుచించు నొక్కొ యే
బలికెడు నూత్నకావ్యరసభావములైనను భూమి దల్లిదం
ద్రులకు నిజాగ్రనూనుల పటుప్రచురోక్తులకంటె జిన్నబి
డ్డల వెడతొక్కబల్కులు దృఢంబగు ముద్దుల నీనకుండునే?

[భోజరాజీయం, 1_70]

నిజంగా ముద్దులీనే కవిత్వమే చెప్పాడు. పాతకథలను తీసుకొని వాటిని అనుసరిస్తూనే స్వకపోలకల్పితపురా

---

1. అనంతుని ఛందము, వావిళ్ళప్రచురణ, ద్వితీయముద్రణ పీఠిక, పుట 47.

ణాలు సృష్టించి చక్కగా చెప్పాడు. విక్రమార్కుని సింహాసనంపైన ఎక్కదలచిన భోజుని కథలు ఆంధ్రదేశంలో ప్రసిద్ధంగా ఉన్నాయి. అయితే ఇందులో సింహాసనం ఎక్కడానికి భోజుడు ప్రయత్నించిన గాథ లేమీ ఇతడు వ్రాయలేదు. పోనీ అని భోజకాళిదాసు కథలుగా ఈనాడు మనం చెప్పుకొనే కథలనుకూడా వ్రాయలేదు. బహుశా ఇతని కాలంనాటికి ఆ కథల కల్పన జరగలేదేమో.

అనంతామాత్యుని కాలంనాటికి భోజుని కీర్తి దేశంలో వ్యాపించినా చారిత్రకవివరాలు విపులంగా ప్రచారమైఉండవు. అందుకే అనంతుడు మరీ పలచని కథ తీసుకొని దానికి చేర్పులు మార్పులు ఎన్నో చేశాడు. తన ప్రణాళికను ఇలా చెప్పాడు :

నూత్రకథ భోజరాజ చ_రిత్రమయా నడుమ ధర్మరీతులు నీతుల్
చిత్రకథలై తలిర్పగ_శ్రోత్రసుఖముగా నొనర్పజొప్పడియుండున్.
[భోజ. 1_86]

తన కావ్యం నూతనంబయ్యి పురాతనకృతులట్లు సంతతశ్రవ్యమై పరగుతూఉంటుందని, 'ఇందు చెప్పబడిన కథలన్నియు ప్రశస్తధర్మోపదేశా'లనీ అనంతుని విశ్వాసం. ఇంత సమ్మకంగా అతడు రచించిన కావ్యంలోని కథ లేమిటో కొంచెం సంగ్రహంగా చెప్పుకొందాం.

పూర్వం మహుడు అనే కాంభోజరాజుకు కుష్ఠరోగం వచ్చింది. దాన్నతడు భరించలేకపోయాడు.

కడుకొని కామినీజనుల కాగిట నేమని యుండువాడ నా
కొడుకుల బొత్తునం గుడువ గొంకక యేమని పిల్చువాడ నా

కొడ కరుదెంచు నేరకడల కేమని యే గొలువిచ్చువాడ నే
కడ చనువాడ నేది కడగా నిటు కేగెడువాడ ధీరతక్ ? [భోజ. 1-104]

అని బాధపడ్డాడు. గౌతమీనదిలో పడి ఆత్మహత్య చేసుకొంటే 'రోగము గీగము మాను నంటన్' అనుకొన్నాడు. అనుకొన్నట్లే వెళ్ళి ఆనదిలో పడబోతూ ఉండగా ఒక మునిపత్ని వచ్చి అతణ్ణి వారించింది. ఆమె మరెవరో కాదు, గౌతమీనదే. అతని భరించలేని హేయమైన రోగాన్ని తానూ భరించలే ననుకొంది. అందుకే మునిభామవేషం వేసుకొనివచ్చి ఆపింది. హేమకూటపర్వతం మీద ఉండే దత్తాత్రేయమహర్షిదర్శనం చేసుకొంటే నీ వ్యాధి పోతుందని చెప్పింది. కాంభోజరాజు అలాగే అని అక్కడకు వెళ్లాడు.

దత్తాత్రేయుడు ఎప్పుడూ 'ముక్కునబంటిగా మాంసములు' భ్రమింగుతూ ఉంటాడు. 'హృద్యంబగు మద్యభాండము'లోని సురభాగుతూ ఉంటాడు.[1] ఇది కపటవేష మని కాంభోజరాజుకు తెలుసు. దత్తాత్రేయుని మద్యమాంసవ్యసనాలను వీవగించుకొనకుండ అతణ్ణి 6 పద్యాలలో స్తుతించాడు. దత్తాత్రేయుడు కనికరించాడు. తాను ప్రొద్దుట ప్రయాగలో, మధ్యాహ్నం హేమకూటంలో, రాత్రి శ్రీరంగంలో ఉంటానని చెప్పాడు. ఇప్పుడు శ్రీరంగం పోవాలి, రేపువచ్చి నిన్ను రోగవిముక్తుణ్ణి చేస్తాను అన్నాడు. కాంభోజరాజు 'చిత్తం' అని ఆగాడు.

---

1. దత్తాత్రేయుని ప్రవర్తన మార్కండేయపురాణంలో మరీ విపులంగా ఉంది. చూడండి.

చెప్పినట్టే దత్తాత్రేయుడు మర్నాడు వచ్చాడు. అందులోనూ ఎలా వచ్చాడంటే 'క్రేపుపై నొలసిన మకుట సురభి యుద్ధవడిం బరతెంచు చాడ్పునన్' వచ్చాడు (1-135). రోగవిముక్తుణ్ణి చేశాడు. కాంభోజరాజు అతణ్ణి స్తుతించి 'అయ్యా, మీరుండే ప్రయాగ, హేమకూటం, శ్రీరంగాల మాహాత్మ్యం వివరించండి' అని అడిగాడు.

దత్తాత్రేయుడు 24 గద్యపద్యాలలో శ్రీరంగమహిమను వర్ణించాడు. 5 పద్యాలలో హేమకూటాన్ని, 5 పద్యాలలో ప్రయాగను ప్రశంసించాడు. అప్పుడు కాంభోజరాజు ఒక ప్రశ్న వేశాడు. "అయ్యా! ప్రయాగలో మరణిస్తూ ఏదికోరుకుంటే అది జరుగుతుందట, నిజమేనా? అలా కోరిక తీరినవాళ్లు ఎవరైనా ఉన్నారా?" అన్నాడు. "లేకేం? ఉన్నారు. ప్రయాగమరణం ఇష్టకామ్యసిద్ధిదం. పూర్వం ఒక వేద బ్రాహ్మణుడు దరిద్రం భరించలేక ఊరు వదిలిపెట్టి కాశీకి వెళ్లాడు. ఆ వెళ్లడం దుక్కెద్దు దేశాంతరం వెళ్లినట్టే అయింది. కాలం తీరి ప్రాణాలు పోయాకనే కాశీ మోక్షమిస్తుందట. కావాలని ప్రాణాలు తీసుకొన్నా ప్రయాగ కోరుకొన్నది నెరవేరుస్తుందట. అందుచేత ఆ బ్రాహ్మణుడు ప్రయాగకు వెళ్లాడు.

అక్కడ గంగాయమునల సంగమంలో పడి చచ్చిపోవాలనుకొన్నాడు. ఆ నదుల కలయక ఎలా ఉందంటే, రెండూ విడివిడిగా కూడ కనబడుతున్నాయి.

ఆ వె దివిజాపగాజలము, అల్లవె యాయమునాజలంబు లా
ధవళతయు న్వినీలతయు దారొకొని చూడ్కికి వేడ్క చేసె మా

భవసదనాంగణం బగుట దత్పరిచారిక లర్థి జందన
ద్రవమున గ్రొత్తక స్తురిని దక్కక రేకలు పెట్టిరో యనన్.
[భోజ. 2_20]

ఈ సంగమంలో అతనిలాగే పడి ఆత్మహత్య చేసుకో వాలని నలుగురు కాంతలు వచ్చారు. వాళ్లు నలుగురూ నాలుగురకాల కోరికలు కోరుకుంటూ చచ్చిపోయారు. ఒకామె తనకు వచ్చే జన్మలో కనకపుకుప్పలు, మణినికా యాలు, ధనధాన్యరాసులు, గుర్రాలు, ఏనుగులు, ఆవులు, గేదెలు అన్నీ ఉండి దాత అయినవాడు భర్త కావాలని కోరుకుని చచ్చిపోయింది. ఇంకొకామె వచ్చేజన్మలో తన భర్త వదనంలో సరస్వతి తాండవించాలనీ, అతని ముఖం చూడగానే జనులు కవిత్వం చెప్పగలగాలనీ కోరుకొంది. మూడవ కాంత తనకు మరుజన్మలో నిర్మలకోమలాంగుడైన రాజు భర్త అవాలని కోరుకొంది. అందమైనవాడు, మన్మథ కళాతంత్రంలో ప్రవీణుడైనవాడు ముందుజన్మలో తనభర్త కావాలని ఒకామె కోరుకొని చచ్చిపోయింది.

ఈ నలుగురి కోరికలూ వింటున్న బ్రాహ్మణునికి ఒక చక్కని యోచన తట్టింది. ఈ వనితా చతుష్టయం తనకు వచ్చే జన్మలో భార్య లవాలని కోరుకొంటూ అతడు ఆ నదుల సంగమంలో 'హరీ' అన్నాడు. ఆ హరి 'సరీ' అన్నాడు. తరువాతి జన్మలో అతడు భోజరాజై పుట్టాడు. లాటదేశంలో ధారానగరానికి అధీశ్వరుడై అనేక సంవత్స రాలు పాలించాడు.

ఇది అనంతామాత్యుడు చెప్పిన భోజరాజు పూర్వ

కథ. కల్పితమే. అయితే భోజుడు చారిత్రకవ్యక్తి. అతని గురించి చరిత్రకారులు చెప్పే విషయాలు ఇవి.

భోజుడు పరమారవంశపు రాజు. క్రీ. శ. 1000–1055 మధ్య అతడు మాళవ దేశాన్ని పాలించాడు. 1020–1047 మధ్య పాలించాడని నికరంగా చెప్పగలిగే శాసనాలు ఉన్నాయి. అతడు బహు పరాక్రమవంతుడు.

ఘజ్నీ మహమ్మదు దండయాత్ర చేసినప్పుడు తూర్పు పంజాబులోని రాజులు కొందరు తమ రాజ్యాలను విడిచిపెట్టి పరభూములు పట్టారు. శాహీ రాజు త్రిలోచనపాలుడు తన రాజ్యాన్ని వీడి మాళవదేశాధిపతి యైన భోజుని ఆశ్రయం పొందాడు.[1] భోజుడు బ్రతికున్నంతకాలం మహమ్మదీయులకు సింహస్వప్నంలాగ ఉండేది. అతడు మరణించాక (క్రీ. శ. 1055) మహమ్మదీయులు భారతదేశంపై తమదృష్టి ప్రసరించారు.[2] అయితే ఇంతటి భోజుని చాళుక్యరాజు రెండవ జయసింహుడు క్రీ. శ. 1019 కి పూర్వం ఓడించాడు. ఒక్కభోజున్నే కాదు, అతనితో చెయ్యికలిపిన విక్రమాదిత్యునికూడ జయసింహుడు ఓడించాడు. నేటి జబల్పూరు ప్రాంతాలలో ఉన్న మధ్యప్రదేశ్‌ను ఆరోజుల్లో దాహళ దేశ మనేవారు. దానిని క్రీ. శ. 1019 కి ముందుగా రెండవ కోకల్లుడు పాలించాడు. అతని బిరుదు విక్రమాదిత్యుడు.[3]

భోజుడు ఎన్ని యుద్ధాలు చేసినా ఒక్క కొంకణాన్ని

---

1. *Struggle for Empire - The History and Culture of the Indian People*, Bharatiya Vidya Bhavan, పుట 16.
2. అదేపుస్తకంలో, పుట 51. 3. అదేపుస్తకంలో, పుట 61.

తప్ప కొత్త ప్రాంతాలను తన రాజ్యంలో కలుపుకొన లేక పోయాడు. అతడు పరాక్రమ వంతుడే, పరరాజ్యాలపై కత్తికట్టినవాడే. కాని కలంపట్టి 'సుకవితా యద్యస్తి రాజ్యేన కిమ్మన్న సూక్తి నిదర్శనంగా కవితారాజ్యాన్ని వదలి పోయాడు. అతడు రమారమి 23 గ్రంథాలు వ్రాసినట్లు చెప్పుకొంటారు. రామాయణ చంపులో కిష్కింధాకాండను అతడు వ్రాశాడట.[1] 'నామమాలిక' అనే సంకలన గ్రంథం వ్రాశాడు.[2] 'సరస్వతీ కంఠాభరణం' అనే అలంకార శాస్త్రాన్ని రచించాడు. 'యుక్తి కల్పతరువు' అనే న్యాయ శాస్త్రాన్నికూడ వ్రాశాడట. విద్యాలయాలు స్థాపించాడు. ధారానగరంలో అతడు కట్టించిన సరస్వతీమందిరంలో వాగ్దేవత విగ్రహాన్ని అతడు ప్రతిష్ఠించాడు. పరమార శిల్ప కళ ఇందులో పరమావధి చేరుతుందట.[3]

ఈ చారిత్రక విషయాలను అనంతామాత్యుడు చెప్పలేదు. అయితే భోజరాజు ముఖం చూస్తే కవిత్వం పుట్టుకొస్తుందనే మాటను పట్టుకొని ధారానగరాన్ని బాగా వర్ణించాడు. చూడండి :

కైపద మిచ్చువారలును గ్రక్కున బద్యము చెప్పువారలున్
రూపిత సంస్కృతాదిపదరూఢి యెలర్ప మహాప్రబంధముల్
వే పొసగంగ బల్కు పృథివిం బ్రథితంబుగ జేయువారు ధా
రాపురమందెకాక కలరా మరి తక్కినపట్టణంబులన్ ? [భోజ. 2-50]

---

1. *Struggle for Empire*, పుట 312. 2. అదేపుస్తకంలో, పుట 317. 3. అదేపుస్తకంలో, పుట 658.

ఇటువంటి విద్యానిలయమైన పట్టణంలో ఉండి పరిపాలిస్తున్న భోజునికి ఒక అపురూపమైన విద్య అలవడిందట. అది ఏలోహాన్నైనా బంగారంగా మార్చే మహావిద్య. దీనిని అతడు ఎలా నేర్చుకున్నాడో దత్తాత్రేయుడు కాంభోజ రాజుకు చెప్పాడు. భోజుడు ఒకనాడు వేటకు వెళ్లాడట. అడవిలో అత డొక మర్రిచెట్టును చూశాడట. దానిని అనంతామాత్యుడు రెండు సీసపద్యాలలో బ్రహ్మాండంగా వర్ణించాడు, చూడండి.

ఇట్టి మర్రి యుండ నీ ద్వీపమును వట_ద్వీప మనక యేమి తెలివి యొక్కొ
తొంటి పెద్దలెల్ల దొడగి జంబూద్వీప_మనిరి నాగ నొప్పె నక్క_జంబు.
[భోజ. 2_61]

దిక్పాలపురముల తెరు వేల యడుగ నీ
శాఖి శాఖలవెంట జనగరాదె?
యంబరస్థల మెంత యన నేల యీ మ్రాను
ఘన విశాలత చూచి కొనగరాదె?
యుడుమండలం బెంత పొడవొక్కో యననేల
యీభూజ మెక్కిన నెరుగరాదె?
యవని యేమిట నిల్చె నన నేల యీ మ్రాన
దిగిన యూడలు చూచి తెలియరాదె?
యనగ నాశ్చర్యమై యఖిలమృగస
మాజ మాశ్రితచ్ఛాయమై యమరియుండు
బక్షిపక్షిచ్ఛదాఘాతపాతఫలస
హస్రవర్షోద్భటంబు మహావటంబు. [భోజ. 2_62]

ఈ మర్రిచెట్టుకు తలక్రిందులా ఒక సిద్ధుడు వ్రేలాడుతూ ఉండడం భోజరాజు చూశాడు. అతని పేరు సర్పటి.

ఆయనను రాజు తన పట్టణానికి తీసుకుపోయాడు. ఆతిథ్య మిచ్చిన రాజుకు ఉపకారం చేద్దామని సర్పటి అనుకొన్నాడు. 'వీడిల్లు బంగారంగాను' అని మనసులో దీవించి రాజుగారి కొలువు చవికెను బంగారం చేసి తెల్లారేలోపున చక్కా పోయాడు. మర్నాడు ఆవింతను చూసి అందరూ ఆశ్చర్య పోయారు. రాజుగారు మెల్లగా నిద్రలేచారు. ఇవాళ మనలో కొందరు నిద్రలేస్తూ తమ అరచేతులు చూసు కొంటారు. భోజరాజు అలాగే చేశాడని అనంతామాత్యుడు ఇలాగ చెప్పాడు.

అత డట్లు మేలుకని య_చ్యుతు సంస్మృతియందు దగిలి శుభలక్షణల
క్షితములగు నిజకరాంభో_జతలంబులు చూచుచుండు సమయమునందున్.

[భోజ. 2_120]

సేవకులు వచ్చి కొలువు చవికె బంగారమైనట్లు చెప్పారు. ఇది సర్పటి చేసిన అద్భుతమే అని భోజరాజు తెలుసుకొన్నాడు. వెళ్లిపోయిన సర్పటిని కపటోపాయంతో రప్పించి, మాయోపాయంతో, అతివినయంతో, ఆ బంగారం చేసే విద్యను సంగ్రహించాడు. ఇటువంటి మోసం చేసినందుకు కథానాయకుని శీలం దెబ్బతింటుంది. అయితే సర్పటి ఒక వేశ్యను మోసంచేసి ఈ విద్యను నేర్చుకొనబట్టి అది అలాగే అతని చేతుల్లోంచి పోయిందని కవి సమర్థించాడు. ఒక శాపాన్ని సృష్టించాడు. దగాపడిన సర్పటిని భోజరాజు తన ఇంట్లో భోంచేసి వెళ్ళి మంటాడు. సర్పటి తాను పంచభిక్ష చేసే వ్రతమున్నవాడినని చెప్తాడు. అందు చేత నీఇంట తిన నంటాడు.

అప్పుడు భోజుడు అగస్త్యవసిష్ఠుల కథ చెప్పాడు. అగస్త్యుడు ఒక ఏటికి అద్దరిని తపస్సు చేసుకొంటున్నాడు. అతనికి గోజూ వసిష్ఠుడు తనభార్య అరుంధతిచేత భోజనం పంపిస్తున్నాడు. ఒకనాడు మింటికీ మంటికీ ఏకధారగా వర్షం పడి ఏరు పొంగింది. అరుంధతి అన్నం తీసుకువెళ్లడానికి వీల్లేకపోయింది. ఆమెకు వసిష్ఠుడు అభయమిచ్చాడు. "నేను సదా బ్రహ్మచారి పంపిస్తే వెళ్తున్నాను" అని ఏటికి చెప్పమన్నాడు. ఆమె అలాగ చెప్పగానే నది దారి ఇచ్చింది. ఆ తెరపిలో నడిచి వెళ్లి ఆమె అగస్త్యునికి అన్నం పెట్టింది. తిరుగు ప్రయాణం ఎలాగ? అగస్త్యుడు ఆమెకు ఉపాయం చెప్పాడు. "నిత్యనిరాహారి పంపిస్తే వెళ్తున్నాను." అని ఏటితో చెప్పమన్నాడు. ఆమె అలా అనగానే ఏరు పల్లా తెరపిచ్చింది. కాపురం చేస్తున్న వసిష్ఠుడు సదా బ్రహ్మచారే! కడుపునిండా భోజనం చేస్తున్నా అగస్త్యుడు నిత్యోపవాసే! ఎందువల్లనంటే దాని కో ధర్మసూక్ష్మ ముంది.

ఆశనాభిరతి లేక యటవీస్థలంబున నియతతపోనిష్ఠ నెరపుచుండ
గృహధర్మనిరతులు కొనివచ్చి భక్తిపూర్వకముగా దగ సమర్పణముచేయ
నన్నపానాదుల నాసక్తుడై కొనుఁతడు నిరాహారుడండ్రు బుధులు
ధర్మమార్గమున సంతతి యుపార్జింప సమాన్వయంబున వివాహంబు వడసి
మనసు తమకంబులే కాత్మ వనితయందు
బూని ఋతుకాలమందున గాని తిథులు
పరిహరించి యశ్లోచితభంగి గేలి
సలుపువాడు సదా బ్రహ్మచారి యండ్రు. [భోజ. 3_27]

ఈ నిర్వచనం అనంతామాత్యుడు భారతంనుండి తీసుకొన్నాడు.[1] ఈ ఒక్క సందర్భంలోనే కాదు, మిగతా చోట్లకూడా అనంతుడు భారతంలోంచి తనకు కావలసినంత చేదుకొన్నాడు. నన్నయగారు శకుంతలోపాఖ్యానంలో ఇలా వ్రాశాడు.

నుతజలపూరితంబు లగు నూతులు నూరిటికంటె నూనృత
వ్రత యొక బావి మేలు మరి బావులు నూరిటికంటె నొక్క స
త్క్రతు వది మేలు తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు త
త్సుతశతకంబుకంటె నొక నూనృతవాక్యము మేలు నూడగన్.

[భార. ఆది. 4_94]

ఈ పద్యభావాన్ని అనంతుడు ఒక కందంలో అందంగా ఎలా చెప్పాడో చూడండి :

శతకూపాధిక దీర్ఘిక
శతవాప్యధికంబు గ్రతువు శతయజ్ఞసము
న్నతు డొక్క సుతుడు దత్సుత
శతకంబున కెక్కు డొక్క సత్యోక్తి నృపా. [భోజ. 6_92]

తాను చెప్పే ధర్మసూత్రాల ప్రామాణికత్వం కోసం అనంతుడు ఇలాగ పూర్వగ్రంథాలను అనుకరిస్తాడు. అందుకే సదాబ్రహ్మచారి నిత్యోపవాసుల నిర్వచనాన్ని భారతం నుండి తీసుకొని అంత చక్కగా భోజరాజుచేత కథ చెప్పించాడు. రాజు చెప్పిన ఈ చిన్నకథకు సమాధానంగా సర్పటి మూడు పెద్ద కథలు చెప్పాడు.

(1) చెప్పగూడతో పాయసం తోడి ఆతిథ్యమిచ్చిన

---

1. భోజరాజీయం పీఠిక, బులుసు వెంకటేశ్వర్లుగారు, పుట 18.

సజ్జనుడు స్వర్గంలో ఇందుకు అనుభవించిన ప్రతిఫలంకథ (2) బ్రహ్మరాక్షసికి ఆహారంగా బలికావలసిన యోగ మున్నా అందుకు సిద్ధపడి పుష్పగంధిని పెళ్లాడిన రత్నకుండుని కథ. (3) అన్నదానంచేసే మరదిని వదినెలు వేరు కాపు రానికి పంపించిన కథ.

ఈ మూడు పెద్దకథలలో ఎన్నో ఉపాఖ్యానా లున్నాయి. ఉపకథలలో మళ్లీ ఉపకథ లున్నాయి. వాటి వివరాలు చూడండి.

I. చెప్పగూడతో పాయసం తోడి ఆతిథ్యమిచ్చినవానికథ. 3-36 నుండి 3-123 దాకా. 88 గద్యపద్యాలు.

ఇందులో ఉపకథ. ఇంద్రుడు చెప్పినది. మంటిముద్ద యోగికి భిక్షగా పెట్టి ప్రతిఫల మనుభవించిన స్త్రీకథ. 3-63 నుండి 118 దాకా, 56 గద్యపద్యాలు.

ఇందులో మళ్ళీ మళ్లో ఉపకథ ఉంది. తినగా మిగిలిన అన్నం భిక్షంపెట్టి చండాలదంపతులుగా పుట్టినవాళ్ళ కథ. 3-109 నుండి 3-118 దాకా 10 గద్యపద్యాలు.

II. పుష్పగంధి రత్నమండనుల ప్రధానకథ. 3-127 నుండి 6-119 దాకా 978 గద్యపద్యాలు.

(A) చిన్న ఉపకథలు రెండు:

1. ఎలుకకథ, 4-15 నుండి 4-27 దాకా. 13 గద్యపద్యాలు.

2. విప్రప్రభావం, 4-49 నుండి 4-70 దాకా. 22 గద్యపద్యాలు.

(B) చాలా పెద్ద ఉపాఖ్యానం ఒకటి. రత్నమండనుడు బ్రహ్మ రాక్షసికి చెప్పిన గోవ్యాఘ్రసంవాదంకథ. 4-129 నుండి 6-79 దాకా 587 గద్యపద్యాలు.

ఈ గోవ్యాఘ్రసంవాదంలో మూడు పెద్ద ఉపకథలు ఉన్నాయి.

(అ) చాకెతవల్ల తపోమహిమ తగ్గి పందిగా పుట్టిన యోగికథ. ఇది పులి చెప్పినది. 4-143 నుండి 4-208 దాకా. 66 గద్య పద్యాలు.

(ఆ) ఆవు చెప్పిన మదనరేఖకథ. పెళ్ళికి ముందు తనను కామించిన గురుపుత్రునివద్దకు పెళ్ళి కాగానే భర్త అనుమతితో మొదటిరాత్రి ముందుగా వెళ్ళిన యువతికథ. 4-217 నుండి 4-353 దాకా 137 గద్య పద్యాలు.

(ఇ) ఈ మదనరేఖసోదరుడు పావకలోమునికి మిత్రద్రోహి తెచ్చిపెట్టిన కష్టాలకథ. పంచమాశ్వాసం పూర్తిగా ఇదే. 372 గద్య పద్యాలు.

ఇందులో రెండు ఉపకథలు ఉన్నాయి—

(i) స్వర్ణకారుని నమ్మకూడదని ముసలిది చెప్పిన, పెత్తురుకాకే కొండ కథ. 5-21 నుండి 264 దాకా. 53 గద్యపద్యాలు.

(ii) తండ్రిచెల్లెలి కొడుకునూ, తల్లి అన్నకొడుకునూ కాక పిచ్చుగుంటును పెళ్ళాడిన రాజకుమారికథ. 5-327 నుండి 357 దాకా. 31 గద్యపద్యాలు.

III. అన్నదానం చేసే మరదిని వదినెలు వేరుకాపురం పెట్టించిన కథ. 6-122 నుండి 7-233 దాకా 522 గద్యపద్యాలు.

ఇందులోని ఉపకథలూ, ఘట్టాలు—

(అ) అల్పాశనం పెడితే వచ్చే అనర్థాల కథ. కథానాయకుడు భార్యకు చెప్పినది. 6-166 నుండి 182 దాకా. 17 గద్యపద్యాలు.

(ఆ) విష్ణువు పరీక్షిస్తే కథానాయకుని భార్య చేటతో ఇసుక చెరిగి అది వండిపెట్టిన గాథ. 6-183 నుండి 207 దాకా. 25 గద్య పద్యాలు.

(ఇ) అన్నదానఫలం ఏమిటో అప్పుడు పుట్టిన పాప చెప్పగలదని గౌరీదేవి కథాన్యాయపద్ధతి ఒకచోటను పంపిన ఘట్టం. 6_222 నుండి 6_259 దాకా. 38 గద్యపద్యాలు.

(ఈ) ఈ 'అప్పుడు పుట్టిన పాప పూర్వచరిత్ర'గా గంగాదేవి చెప్పిన వంజగోపాఖ్యానంకడవరకూ ఇదే.

ఈ ఉపాఖ్యానాలనూ, వాటిలోని ఉపకథలనూ అనంతామాత్యుడు చాలా చాకచక్యంగా, ఔచిత్యాన్నిపోషిస్తూ అప్రస్తావవర్ణనలూ మానివేసి, సజీవమైన భాషలో, సామెతలూ, పలుకుబళ్లూ వాడుతూ, అక్కడక్కడ హాస్యోక్తులు చాడుతూ రచించాడు సుస్నిగ్ధమైన వేటకారంలో అనంతామాత్యుడు సిద్ధహస్తుడు. విప్రలబ్ధం చెప్పే కథలో ఒక శకునాలు చెప్పేవాడు. ఫలానావారైతే గడ్డికోస్తూ చచ్చిపోతాడని జ్యోశ్యం చెప్పాడు. ఆ రైతు చావక తిరిగివస్తాడు. అప్పుడు శకునజ్ఞుణ్ణి రాజు ఎత్తిపొడిచే మాటలు చూడండి.

చంపంగ వచ్చిన జముని దూతలకు అంచము పెట్టివచ్చెనో, చావనొల్ల బొమ్మని మోరకంబునద్రోచివచ్చెనో, యింటివారికిజెప్ప కిచటజచ్చె నటైన గోపింతురని చెప్పవచ్చెనో, వీని పెండ్లిమట నవ్విషము గరగి వడిసెనెనో, సర్పంబు వాతపిసిపోయెనో, శకునంపుబులుగు లీసారి బ్రమసి తప్పజెప్పెనో యితండేనివిధమున-బ్రతికివచ్చెనని 'భార్గవేంద్ర ! యవధరింపు మింత యణకింపనేల నీ_బంటుపంత'మనుచు బలికె నతడు.

[భోజ. 4_58]

ఇంటివారికి చెప్పక ఇక్కడే చస్తే కోపిస్తారని భయపడి చావలేదనడం చక్కని ఎత్తిపొడుపు. చమత్కారంగా సంభాషణ నడిపించడంలోను, మనోజ్ఞమైన కల్పనలు చేయ

డంలోను అనంతుడు గట్టివాడు. ఒక రాజుగారి అమ్మాయిని త్రిమూర్తులు ముగ్గురూ చూశారు. 'ఈమె ఎవరిని పెళ్లాడు తుంది' అని హరిహరు లిద్దరూ అడిగారు. అప్పుడు అనం తుడు నడిపిన కథ చూడండి.

అడిగిన బద్మజుండు దరహాసవిలాసముఖారవిందుడై
'యిడుపతిజాట! యీతరుణి యొడ్డుల పాలగుగాని యిందులో
నడరగ నబ్బ దెవ్వనికి' నన్న మహాద్భుతచిత్తు డౌచు 'నీ
పడతుక యింక నేనరుని పాలగు నాతని మాకు జూపుమా!'
[భోజ. 5_329]

అనిన నారిలోన నెనుపోతుపై నెక్కి
వచ్చుచున్న యొక్క పిచ్చుగుంటు
జూపి 'యితడు సుమ్ము సుదతికి మగ'డన్న
నగుచు విష్ణుదేవు మొగము జూచి. [330]

'వింటికబా నీతనయుని_కొంచెతనము, విరిమాని పటీలాలక న
క్కుంటునకు నిత్తురట, యిటు_వంటివి పో పెక్కునోళ్ళవారల మాటల్.'
[331]

అనిన చతుర్వదనుం డి_ట్లను 'రమ్మా! పంచవదన! యమృతంబులు ప
ల్కునె బ్రహ్మ నన్నురుంగవె_విను మిది జొంకైన నీకు విరిగినవాడన్.'
[332]

తనకు పెక్కునోళ్ళని శివుడు ఈసడిస్తే బ్రహ్మ ఊరు కుంటాడా! బ్రహ్మ ఊరుకొన్నా కవిబ్రహ్మ మెచ్చు కున్న కవిగారి మనసుడు ఊరుకొంటాడా! ఈశ్వరునికి ఐదు ముఖాలని వ్యంగ్యంగా ఎత్తిపొడిచాడు. ఈశ్వరుని ముఖాల మీద చమత్కరించడం అనంతునికి సరదా. సారంగధరుని లాగ కాళ్లూ చేతులు పోయాక రత్నమండనునికి పార్వతీ

పరమేశ్వరులు ప్రత్యక్షమవుతారు. అప్పుడు అతను చేసిన స్తవంలో ఈ పద్య ముంది చూడండి:

ఆరు మొగంబులాతడు మదాత్మజుడాతని ముద్దుసేయగా
సారు మొగంబులు వ్యాలయు నంచిక, యేనును నీవు గూడగా
నారు మొగంబు లౌ, నతిరయంబున రమ్మని నీవు నవ్వుచుం
జీరుట యోగివర్యులకు జింత్యమగున్ ముఖపంచకోజ్జ్వలా! [భోజ. 5_201]

ఈ ఘట్టంలో అనంతుడు నాలుగుపద్యాలలో ఈశ్వరుని స్తుతించాడు. ఇంకొక ఘట్టంలో అపరభగీరథుడు వంజరునికి శివుడు ప్రత్యక్షమైనప్పుడు ఒక లయవిభాతిలో, ఒక లయగ్రాహిలో, ఒక లయహారిలో మూడు స్తుతులు వ్రాశాడు. ఈ ఒక్కఘట్టంలో ఇలా విశేషవృత్తాలను వాడినా అనంతుడు సర్వసాధారణమైన చంపకోత్పలాలు, సీసాలు,కందాలు వంటి ఛందస్సులలోనే కావ్యం వ్రాశాడు. అందుచేత ఇతనికి ఇతరవిశేష వృత్తాలు తెలియవనుకోకూడదు. ఇతడు ఛందోగ్రంథం వ్రాశాడు. దానికతడు ఛందోదర్పణ మనే పేరు పెట్టినా లోకులు దానిని అనంతుని ఛందం అనే చెప్పుకొంటున్నారు.

ఈ గ్రంథాన్ని అతడు భోజరాజీయం వ్రాశాకనే రచించాడు. ఈసంగతి ఛందోదర్పణంలోని ఈ క్రింది పద్యం వల్ల తెలుస్తున్నది.

శ్రీనిధి చక్రవర్తి గురుశేఖర పుణ్యకటాక్షలబ్ధసు
జ్ఞానుడనంతధీమణి లసన్మణి భోజచరిత్ర చెప్పి ల
క్ష్మీనరసింహు గూర్చిన ప్రసిద్ధుడు వేడుకతో నొనర్చె ఛం
దోసతి యోగిహృద్విమలతోయజవర్తికనంతమూర్తికిన్.
[ఛందం, 4_132]

ఇది నాలుగాశ్వాసాల శాస్త్రం. మొదటి ఆశ్వాసంలో గద్యపద్యాదికావ్యలక్షణాలు, గురులఘునిర్ణయం, గణ నిరూపణ, ప్రాసయతివిశేషాలు, పరిగణనసజ్ఞ ఉన్నాయి. రెండో ఆశ్వాసంలో ఉభయభాషానుయాయాలైన గద్య పద్యాల విధాలు, ఇరవై ఆరు ఛందోనామాలు, వాటిలో పుట్టిన సమవృత్తాలు, వృత్తమిశ్రాలైన అర్ధసమవృత్తాలు, ఛందోవిరిక్తాలైన మాలావృత్తాలూ, తద్భేదమైన దండక లక్షణం ఉన్నాయి. మూడో ఆశ్వాసంలో జాతిలక్షణాలయిన తాలైన కందాలు, మాత్రాలక్షణయుక్తాలైన గీతాలు, సీసాలు, ఉత్సాహ, తరువోజ, అక్కర, షట్పద, ద్విపద, మంజరి, చౌపద, రగడలు అనే చాటుకావ్యప్రమాణాలు, ఉదాహరణములు, షట్ప్రత్యయాలు, సప్తమప్రత్యయాలైన సమవృత్తాల లెక్క ఉన్నాయి. నాలుగో ఆశ్వాసంలో వర్జనీయాలైన దశదోషాలు పరిహరచడం. అందుదోషరహితాలైన ఆదరణీయాలైన పట్లు తీర్చడం, సంధి, సమాసాలు, యాభై అక్షరాలు పరిచడం ఉన్నాయి.

అనంతామాత్యుని లెక్కలో మన భాషలో పాతిక అక్షరాలే ఉన్నాయి. అతని దృష్టిలో ళకారం విడిఅక్షరం కాదు. 'ఱ'మాత్రం హల్లే. ఈ లెక్క అప్పకవికి నచ్చలేదు. అందుకే ఇలా వెక్కిరించాడు.

కాక పా జడ్డయైన ఱకారమగుట
దలప కేబది లిపులలో దాని గూర్చి
లొలుత భిన్నాక్షరంబైన దొడ్డ 'శా'ను
విడిచిపెట్టెననంతుడు వెర్రిగాడె! [అప్పకవీయం]

అప్పకవి ఇతర్లని వెర్రివాడన్నా లక్షణం చెప్పడంలో ఇతని అడుగుజాడల్లోనే నడిచాడు. అప్పకవీయం మీదా, అనంతుని ఛందంమీదా ప్రత్యేకంగాను, ఇతరఛందో గ్రంథాలను కూలంకషంగానూ పరిశోధించిన రావూరి దొర స్వామిశర్మగారు ఇలా వ్రాశారు:

చిత్రకవి పెద్దన వ్రాసిన "లక్షణసారసంగ్రహము చాలవరకు ఛందోదర్పణానుసారి యని పరికించిన తెలియగలదు. సులక్షణసారము, కవిసంజీవని, అప్పకవీయము, వర్ణలక్షణసారసంగ్రహము, రంగరాట్ఛం ఉము మున్నగు లక్షణగ్రంథములందు ఛందోదర్పణ ముదాహృతము. మీగుమిక్కిలి యప్పకవి ఛందోదర్పణమే యుపజీవ్యగ్రంథములలో ప్రధానమైనది. పెద్దలక్ష్యలక్షణము లప్పకవిఛందోదర్పణఛాయలో పంతరించెను. మరికొందరు వ్యాఖ్యాత లిందలి పద్యముల ప్రమాణముగా నుదహరించిరి.[1]

అనంతుని ఛందాన్ని ఉపయోగించుకొనని లాక్షణికులు ఎలాగైతే లేరో ఈ ఛందస్సుపై పరిశోధనలు చేయని ఆధునిక పండితులుకూడా లేరు. 1921 లో వావిళ్ల వారు తొలిసారిగా ప్రచురించినపుడు గిడుగుసీతాపతిగారు అనంతుని ఛందానికి విపులమైన పీఠిక వ్రాశారు. కవిజనాశ్రయంలో పదియతులే చెప్పాడు. విన్నకోట పెద్దన పంద్రెండు చెప్పాడు. అనంతుడు ఇరవై చెప్పాడు. అప్పకవి వాటిని 41 దాకా పెంచాడు. సీతాపతిగారు పట్టికలు వేసి సమాకలనం చేసి వీటిని విపులంగా చర్చించారు. తెలుగు ఛందోగ్రంథాలు సంస్కృతాన్ని గుడ్డిగా అనుకరించడం తప్ప

1. అనంతుని ఛందం-వావిళ్ళ ప్రచురణ (1958) - సమీక్ష. పుట 66

ఈ భాషలో ఛందస్సులు ఎలా ఉండాలో చెప్పవని చక్కగా వ్రాశారు.

అన్ని పాదములలోనూ విశ్రాంతి ఒక్క చోటనే ఉండుట కంటె పద్యము రసోచితముగా ఉండుటకు వీలుండును. అక్షరమైత్రి కావలెనని కోరేవారు విశ్రాంతిస్థలమందు కడి పాటించుట మంచిదేకాని విశ్రాంతిస్థలమును నిర్ణయించుటలో రసజ్ఞులైన కవులు తమ స్వాతంత్ర్యము చెడగొట్టుకోకూడదని నా మతము. మూడేసి అక్షరముల గణ మంటే గణవిభజన పద్యము నడకనుబట్టి ఉండడు మసంభవము. నడకబట్టి గణ విభజన ఉంటేనేగాని గణవిభజన ప్రయోజనము కనబడదు..... జాగ్రత్తగా విమర్శించి చూచిన యెడల చక్కగా నడిచే పద్యములన్నీ ఏదోఒక తాళమునకో, లయకో సరిపడిఉంటవి... పాదమం దుండే అక్షరముల సంఖ్యనుబట్టి ఛందము లేర్పరచి ఆ ఛందములలో ఒక్కొక్కటి ప్రస్తరించి వృత్తములు కల్పించడమువల్ల ప్రయోజనము విశేషముగా కనబడలేదు. అంతకంటె శ్రుతి కింపుకొలిపే నడకకు ఆధారమైన లక్షణముబట్టి తిస్రగతిచ్ఛందము, చతురస్రగతి చ్ఛందము మొదలయిన ఛందము లేర్పరిచి పద్యములు చెప్పుటవల్లను ప్రయోజనము విశేషముగా ఉండునని నిన్ను, అట్లు వీర్పడిన పద్యములు తెలుగుభాషకు అమరిఉండు నని నా యభిప్రాయము.[1]

సీతాపతిగారు చెప్పిన సంగతులను శ్రద్ధగా పరిశీలించి ద్రావిడభాషలలోని ఛందస్సులనుగురించి ప్రత్యేకమైన తులనాత్మకపరిశోధన కావాలి. టేకుమళ్ళ రాజగోపాలరావుగారు కొంత చేశారు. అయినా ఈ పద్ధతులలో ఇతరులుచేయడం లేదు. సీతాపతిగారు స్థూలంగా సూచనలే చేశారు గాని సూక్ష్మంగా పరిశీలన జరగాలి.

1. ఛందోదర్పణము_వావిళ్ళప్రచురణ_మొదటిముద్రణ ఉపోద్ఘాతం.

అనంతుని ఛందం ద్వితీయ ముద్రణకు పీఠిక వ్రాస్తూ నిడుదవోలు వెంకటరావుగారు కూడా కొన్ని కొత్త విషయాలు చెప్పారు. అనంతుని మతంలో 'వీపు'లో అరసున్న లేదని ఋజువుచేశారు. (అయితే ముద్రాపకులు అరసున్న తోసే అచ్చువేశారు)[1] మూడవముద్రణలో రాఫూరి దొర స్వామిశర్మగారు విపులమైన సమీక్ష చేశారు. వీరు అంతకు ముందే ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలో అనంతుని ప్రశస్తి గురించి వ్రాశారు.[2] అందులో గిడుగువారి ఉపోద్ఘాతాన్ని విమర్శించి అనంతుడు కవిజనాశ్రయాన్ని చూశాడని నిరూపించారు.

అనంతుడు కవిజనాశ్రయాన్ని చూశాడు గాని విన్న కోట పెద్దన వ్రాసిన కావ్యాలంకార చూడామణి చూశాడో లేదో! పెద్దన ఉదాహరణ లక్షణాలు చెప్తూ ఒక్కొక్క విభక్తికి ఒక అధిదేవతను చెప్పాడు. అనంతుడు కూడా అలాగే చెప్పాడు గాని పెద్దన చెప్పినట్టు సద్దళి, విద్దళి మొదలైన ఉదాహరణ భేదాలను చెప్పలేదు.

ఈ గ్రంథంలో ఛందస్సు గురించి విపులంగా, వ్యాకరణం గురించి క్లుప్తంగా చెప్పిన అనంతుడు అలంకారాలకు ముఖ్యమైన రసం గురించి విపులంగా ఒక ప్రత్యేక గ్రంథమే రచించాడు. దాని పేరు రసాభరణం. అయితే గద్యలో దీనిని అనంతుడు 'రసాలంకారం' అని పేర్కొన్నాడు.

---

1. అనంతుని ఛందం-మూడవముద్రణ-పుట 57
2. ఆంధ్రసాహిత్యపరిషత్తు పత్రికలు-సంపుటాలు 32, 37, 33

కొందరు దీనిని రసార్ణవం అని పిలుస్తున్నారు[1]. ఇదికూడా నాలుగు ఆశ్వాసాల గ్రంథం. ఇందులో 344 గద్యపద్యాలు ఉన్నాయి. ఒక్కొక్క ఆశ్వాసానికి ఒక్కొక్క పేరు పెట్టాడు. మొదటి ఆశ్వాసంచివర అది సంజ్ఞాప్రకరణమని, తదుపరాత మూడూ వివిధ ప్రకరణాలనీ ఇలా చెప్పాడు.

ఆరయ సంజ్ఞాప్రకరణ_మారీతి దనర్చి వెలయు నిట రత్నాది
ప్పారప్రకరణమును శృం_గారప్రకరణము నాయకప్రకరణమునన్[2]

[రసా. పుట 7]

ఈ అలంకార శాస్త్రాన్ని అనంతుడు చాలా చక్కగా రచించాడు. విస్తృతిని పెద్దన మనసు మొదటి అలంకార గ్రంథాన్ని ఇచ్చాడు. అయినా అనంతుని గ్రంథంలో రసవివరణ స్పష్టంగా ఉంది. "లక్షణముల కుదాహరణముల నిచ్చటలో గొన్ని తావుల పెద్దనకంటె నవంతుని బే పై చేయి యైనదని నా యుద్దేశము" అని చాగంటి శేషయ్యగారు అన్న మాటలు అక్షరాలా నిజం.[3] మూడండి, 4వ ఆశ్వాసంలో దుష్టనాయకుని కిచ్చిన ఉదాహరణ.

(పద్యాలకు నెంబర్లుజేయలేదు. కాబట్టి పుటలు మాత్రం ఇచ్చాను.)

చనునెడ పిన్నదాన నను జాయలు వల్కకు పేటసన్నమా
ఘనతరవల్లకీకుసుమవాసనగంధము కంటకాగ్రసం
జనితము లీక్షణంబులు ప్రచండపు టెండచెమర్చుటో. సతీ!
ఘనముగ మోవిగందుట తగన్ వినుశంఖిరవం బొనర్పగన్.

[రసా. పుటలు 31,32]

---

1. అనంతుని చందం_మొదటిముద్రణ పీఠికలో గిడుగు సీతాపతిగారు
2. రసాభరణాన్ని ఆంధ్రసాహిత్యపరిషత్తువారు ప్రచురించారు.
3. ఆంధ్రకవి తరంగిణి, 5_వ సంపుటం, పుట 263

నాయకుడు అన్యకాంతాసుఖం పొంది వచ్చాడు. ఘుమఘుమ లాడుతున్నాడు. ఒంటినిండా రక్కలు ఉన్నాయి. ఒళ్ళంతా చెమట పోస్తోంది. మోవి బాగా కందింది. తను వేటకు వెళ్ళివచ్చానని, అడవిలోని పువ్వుల వాసనే ఒంట బట్టిందని, ముళ్ళవల్ల ఒళ్లు గీసుకు పోయిందని, ఎండ తీవ్రతవల్ల చెమటలు పోస్తున్నాయని, శంఖం బాగా ఊదడంవల్ల మోవి కంది పోయిందని నాయికతో నచ్చ చెప్తున్నాడు.

ఆడవాళ్ళ కళ్లు మగవాని అబద్ధాలను ఇట్టే పట్టేస్తాయి. పైసంబాయింపే నమ్మిఉండదు. అయితే చేపలలాగ ఉండే ఆమె కన్నులను, బాగా కఠినంగా ఉండే వక్షోజాలను శ్రీహరి మెచ్చుకోలేదట. ఎందుచేత నంటే, ఇలా చమత్కరిస్తున్నాడు, చూడండి.

తెరవాలికకన్నుల క్రొమ్మెరుగులు గుచకఠినతయును మెచ్చులె హరికిన్
సిరమోవై తాబేలై_పరలె నతం డనిన నింతి వదనము వంచెన్.

[రసా. పుట 27]

నాయికలలో స్వీయ, పరకీయ, పణ్య అని మూడు రకాలు ఉంటారు. పరకీయ లక్షణాన్ని ఇలా చెప్పాడు చూడండి.

అత్తయు నూర లేదు మగడా మరి మందకుబోయి రాడు నే
నిత్తరి నొంటి నుండు దనియే జను తెంచితి గృష్ణరాయ నీ
చిత్త మెరింగి మూలదెస జీకటి దాచినదాన వెన్నగో
డొత్తున నుండి యేల నను నూరకె చూచెదు తొంగిచూపులన్ ?

[రసా. పుట 33]

ఈపద్యంలో హాలుని గాథాసప్తశతిలోని ఒక గాథ ఛాయలు లేకపోలేదు. అనంతుడు ప్రాచీనగ్రంథాలను బాగా చదివినవాడు. రసాభరణానికి పీఠిక వ్రాసిన కోపల్లి శివకామేశ్వరరావుగారు ఇలా వ్రాశారు: "రసాభరణమును తెనుగున వ్రాసిన యనంతామాత్యుడు విశ్వనాథుని దర్పణమును, ముమ్మటుని కావ్యప్రకాశమునుగూడ మేళవించి యం దేవిషయము ప్రశస్తమయినదో దాని నెల్ల గ్రహించినా డనవచ్చును."[1] అయితే అలంకారశాస్త్రంమీద సమగ్రంగా, కూలంకషంగా పరిశోధనలు చేసిన బులుసు వెంకటరమణయ్యగారు ఇలా వ్రాశారు: "విషయనిరూపణమునుబట్టి ఇది చాలవరకు విద్యానాథుని ప్రతాపరుద్రీయమునే యనుకరించుచున్నది. దర్పణాదుల ననుకరించుచున్నట్లు తోచదు. ప్రతాపరుద్రీయానుక్త విషయమున గ్రంథాంతర సాహాయ్య మపేక్షింపబడ వచ్చును."[2]

అనంతామాత్యుడు ముమ్మటుని కావ్యప్రకాశమును బాగా పఠించినవాడే. అందులో ఈ క్రింది శ్లోకం చాలా ప్రసిద్ధమైనది.

కావ్యంయశసేఽర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యఃపరనిర్వృతయే కాంతాసమ్మితత యోపదేశయుజే.

దీనికి అనంతామాత్యుడు తాను వ్రాసిన సాహిత్యశాస్త్రంలో అనువదించక పోయినా తన మొదటి గ్రంథమైన భోజరాజీయంలోనే ఇలా అనువదించాడు:

---

1. రసాభరణం, భూమిక, పుట 3.
2. ఆంధ్రాలంకారవాఙ్మయచరిత్రము, పుట 16.

సకలవిద్యలయందు జర్చింప గవిత యుత్కృష్టమం డ్రది నిత్యకీర్తికొరకు
నర్థాప్తికొరకును వ్యవహారలక్షణం బెరిగెడుకొరకు ననేకవిధము
లగు నమంగళముల హరియించుకొరకు నుచితనిత్యసౌఖ్యసంసిద్ధికొరకు
కొనర గాంతాసమ్మితోపదేశంబున ప్రీతిమై హితమాచరించుకొరకు
వయ్యె గాన బెద్ద లాచరించెద రంచు
నేర్పుకొలది కృతి యొనర్పబూని
యస్మదీయకృతికి నధిపతి గావింప
నర్హు డెవ్వడొకో కృ యని తలంచి. [భోజ. 1-60]

కావ్యాన్ని కాంతా సమ్మితంగా ప్రాసేవాళ్లు మన తెలుగు సాహిత్యంలో ఉత్తరోత్తరా అరుదయ్యారు. ఆడవాళ్లూ మగవాళ్లూ కలసి చదువుతున్నప్పుడు పనితలు సిగ్గుపడనిదే కాంతాసమ్మితమైన కావ్యం. మన ప్రబంధకవులు కాంతా సమ్మితమైన కావ్యం ప్రాశారుగాని ఆ కాంతలు కులకాంతలు కారు, వారకాంతలే. అనంతుడు మాటికి తొంభైతొమ్మిది వంతులు కులకాంతా సమ్మితంగానే ప్రాశాడు. ఏకో ఒకటి రెండుచోట్ల కుక్కల రతిని వర్ణిస్తూ చివుక్కుమనే మాట వాడాడు (భోజ 6-351). అయితే అది జంతువుల సహజప్రవృత్తికి సంబంధించినది. పశుపక్షుల స్వభావాలను గమనించడంలో అనంతుడు గట్టివాడు. అతని కావ్యంలో కొన్ని పట్లు చదువుతూ ఉంటే వాల్ట్‌డిస్నీ తీసిన 'ట్రూ లైఫ్' చలనచిత్రాలు చూస్తున్నట్లు ఉంటుంది. చూడండి, ఒక ఎలుకపిల్లను ఎలా వర్ణించాడో.

మరియు నచ్చిరుతఎలుక తన తొరటలోనన యుండి వెలుపలికి దనమూతి సాపుచుం దలచూపి మరలం దిగుచుచు నర్ధశరీరంబు దోప విగుడి మగుడుచు బుచ్చంబుం దక్కం దక్కటి శరీరం బంతయు బయలు

పడ నించుక సేపు కంపంబునొందుచు నుండియుండి మరచి తలచిన ట్లవలి పడి తిరిగి తొర్ర చొచ్చుచు వెండియు నుండలేక వెలువడి శాఖామార్గంబునం గొంతదవ్వరిగి పర్ణరవంబులు కర్ణంబులు సోకినం బెదరి కోటర ద్వారంబునకుం బరతెంచుచు నిట్లు శైశవక్రీడలు నడిపి తదనంతరంబ యొలప్రాయంబు సొచ్చుడు నూగుదోసపిందెగతి నందంబగు దేహంబును, దరుణశాకినీమూలంబును బోలు వాలంబును శాల్మలీతూలకంబళంబు విధంబున నత్యంతమృదులం బగు నుదరంబును సాఖుకర్ణిపర్ణంబుల మాడ్కి రిక్కించుకొని యున్న కర్ణంబులును నలంతిపూసలంటించినట్లు దనరు కనుంగవయును, నుచ్చింతపువ్వులలోని కేసరంబుల క్రియ భాసురంబగు పలువరుసయు, దన వయోరూపంబున కనురూపంబులగుచుండ జెలంగి సెలగొమ్మ లెక్కి ప్రేలుచు బలిష్ఠంబులగు తిర్యక్శాఖలపై ప్రుళ్లిగింతలు వెట్టుచు నానజొంపంబులు సొచ్చి దాగుచు నిటు బహువిధంబుల విహరించుచుండు నమ్మూషకయోషం జూచి యొక్క మూషకతరుణ పురుషుండు వివశాంతఃకరణుం డగుచు జారచర సాంప్రమోద ప్రాకి వేగిరపడి చెనకిన నది కినుకతోడ. [భోజ. 4_19]

మద మొదవంగ మూషకకుమారసమూహము వెన్నుసమ్మెకై
పొదవిన వాల మార్చుచు బ్రబుద్ధ విటుం డురుధైర్యమూలమున్
జెదరగ ద్రవ్వుకోళ్ళగొని చెక్కిలి వ్రేసిన మూర్ఛవోయి తా
గదలకయుండె కాముబడిగంటదొడింబడియున్న కైవడిన్. [భోజ. 4_20]

భువి నట్లకాదె యువతియు గవితయు_సహజప్రసంగగతి నొందినచో
దివిరి కడుబల్మి చేసిన_నవి సరసత యుడిగి విరసమయి చను టరుదే ?
[భోజ. 4_21]

ఎలుకపిల్ల నిలా వర్ణించినట్లే ఒక ఎండ్రకాయపిల్లను కూడ చక్కగా ఇంకొక చోట వర్ణించాడు [భోజ. 6-274 నుండి]. ఈ ఎండ్రకాయపిల్ల గంగాయాత్ర చేస్తా నంటుంది.

ఇది ముందు తన తల్లికి వేసిన ప్రశ్నలు ఎంతో ముగ్ధంగా ఉంటాయి. చూడండి.

వరలోకం బెట్టువంటిది_సురలోకం బెట్టి, దీవు చూచితె? మనమం
దిరములు సాటివి యాసో_విరచితగతి నింతకంటె వి స్తీర్ణములో?
అం దుండెడివారికి మన_చందమొ రూపములు వేరె చందమొ నా కా
చందము వివరింపుమనిన_నందను మాటలకు దల్లి నవ్వుచు బల్కెన్.

[భోజ. 6_232, 283]

ఎలుకను, ఎండ్రపీతను వర్ణించడం ఒక ఎత్తు, గోవును దాని పెయ్యను వర్ణించడం ఒక యెత్తు. చూడండి, పెయ్య పాలు తాగుతూ ఉంటే ఆవు కదలనైనా కదలలేదట.

కొడుకు చనుగ్రోలుచున్నంత దడవు దల్లి
యడుగుదిరుగక కదలక యన్యచిత్త
గాక పై నీగ సోకిన గదలకుండె
నెమ్మి బాషాణధేనువు నిలిపినట్లు.

పాలు త్రాగాక ఆ దూడపెయ్య వేసే చంగనాలు ఎలా వర్ణించాడో చూడండి.

పొట్టపొంగున దల్లి పొది వాసి వీథికి బారి క్రమ్మరు బెద్ద పరువుతోడ
దలయెత్తిచూచుచు బలుమారు దనువల్లిపిలువంగ నిటనటబొలసియాడు
నిలమీద మోమిడి యేమేని మూర్ఖాను బసి వెట్టుకొనుచు దత్ప్రాంత
నంతంత బసివిడ్డ లడ్డంబుపడిసిన జుకించి మిన్నంట డొకళించు ప్రమ్మదు
నిట్లు శైశవక్రీడల నెసగుచున్న
కొడుకుదెసజూచి కన్నీరు గ్రక్కుకొనుచు
'గటకటా! యిట్టి నెత్తురుగందు నిచట
వైచిపోవంగ వలసెనే నీవగతికి!' [భోజ. 6_25]

అప్పుడు ఆవు తన బిడ్డను పిలిచి నీతిబోధలుచేసి పులికి ఆహారంగా పోతుంది. ఇలాంటి ఆవును తెలుగుసాహిత్యంలో సృష్టించిన అనంతామాత్యుడు నిజంగా ఆవుకన్నా సాధువే. అయితే ఇంతకన్నా గోపులాంటి కవి మనకు లేక పోలేదు. ఆయన బమ్మెర పోతిరాజుగారు. అయితే ఆయనకు అనంతుడు చాలా విషయాలలో మార్గదర్శి. చూడండి. పోతరాజుగారి ఈపద్యం చాలా ప్రసిద్ధమైంది.

ఉప్పింపంచి ఎగసిన పుండలంబుల కాంతి గగనభాగం బెల్ల గప్పికొనగ
మురికిన నోళ్ళాక యుదరంబులో నున్నజగముల ద్రేగున జగతి గదల
జక్రంబు జేపట్టి చనుదెంచు రయమున బైనున్న పచ్చని పటము జార
నమ్మితి నాలావు నగుబాటు సేయక మన్నింపు మని క్రీడి మ్రొక్కదిగువ
గరికి లంఘించు సింహంబు కరణి మెరసి
నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
విడువు మర్జున! యనుచు మద్విశిఖసృష్టి
దెరలి చనుదెంచు దేవుండు దిక్కు నాకు. [భాగ. 1-185]

దీనికి అనంతామాత్యుడు చక్కని పరవడి పెట్టాడు. చూడండి:

ఉంకించి యొగయుచో నుభయపార్శ్వంబుల
పర్వతంబులును గంపంబునొంద
బళువిక్షేపణప్రౌఢిమ నెరపుచో
గారాకులట్లు మేఘములు దూల
గమనీయబహుచిత్రగతుల నేపారుచో
సురభిమానంబులు మూరగిలగ
ద్దంపుచూపులు నిగిడించుచో శంభు
తోడవు పాములకు దల్లడము గదుర

గరుడగమనుండు వచ్చిన కాదలంచి
నెమ్మి దళుకొ త్త ప్రమథగణమ్ము తోడ
గదలి బాలేందుశేఖరుం డెదురునడవ
నిగిడె గరుడుండు కైలాసనగము పైకి. [భోజ. 7_34]

తన అసంతరకవులకు తాను ఎలాగ మార్గదర్శకుడో అనంతుడు అలాగే తను తన పూర్వులు చేసిన బాటలో నడిచాడు. చూడండి, ఇది భోజరాజును ప్రశంసించే పద్యం.

చర్చింప రెండవ చంద్రుడు మూడవ యశ్వని నాలవ యగ్నిదేవు
డైదవ లోకపాలాఖ్యు డారవ పాండుసంతాన మేడవ చక్రవర్తి
యెనిమిదవయగు నన్మనీశు డాతొమ్మిదవయగు భోగిపతి పదియవ విరించి
పదునొకండవ చక్రపాణి పండ్రెండవ శూలి పదమ్మూడవ సూర్యు డనగ
దనరు గాంతిరూపమున బ్రతాపమున స
త్యమున ధర్మచరిత నాజ్ఞ శుచిని
భూరిసత్త్వమున బ్రబుద్ధత గలిమిని
భూతి కెజమునను భోజవిభుడు. [భోజ. 7_245]

ఇటువంటి అంకెల సంవిధాన మున్న పద్యాన్ని మనం ఇంతకుముందు గుర్తించాం.[1] భోజరాజు రెండవ చంద్రుడు, మూడవ అశ్వని అని వరుసగా అనంతుడు వర్ణించినా అతడు మాత్రం తెలుగుభాషలో మొదటి గడుసువాడు.

---

1. సమగ్రఆంధ్రసాహిత్యం, II. కాకతీయసంపుటి, పుట 191.

7

కొలని గణపతిదేవుడు



లుగు భాషలో నాటకాలు లేవనీ, ఉంటే గారన చాలా మంచి నాటక రచయితగా రాణించే వాడనీ చెప్పుకొన్నాం. అయితే గారనకాలం లోనే తెలుగులో నాటకాలు వ్రాసిన మహానుభావుడు లేకపోలేదు. కొలను గణపతి దేవుడనే కని శివయోగసార మనే గ్రంథాన్ని వ్రాశాడు. దాని అవతారికలో అతని గురువు ఇలా అన్నాడు.

మరియును శివపరముల యై_నెరయు కృతుల నాటకముల నేర్పు జనులం
దరు నానానని పొగడగ_కరకంఠుని కరుణ రచన కాంచి తిలన్.

[శివయోగ. పీఠిక, 92]

ఇతని కృతులన్నీ దేశితెనుగులో ఉండేవని ఇంతకు ముందు పద్యంలో ఆ గురువే చెప్పాడు.

పశుపాశపతిజ్ఞానము_నశకీర్తభవవిజయమనోబోధముగా
విశదములగు నీకృతులన_దృశగతి చెప్పి దేశితెనుగున తెలియున్.[1]

[శివయోగ. పీఠిక, 91]

---

1. ఈపద్యంలో యతిభంగాలు, గణభంగాలు ఉన్నాయి.

దురదృష్టవశాత్తూ కొలని గణపతిదేవుడు రచించిన నాటకాలు, పశుపాశ పరిజ్ఞానము, అశరీరభవ విజయం మొదలైన కృతులు లభించలేదు. దొరికిన వల్లూ అతని శివయోగసారం, మనోబోధలు మాత్రమే. ఈ రెండింటిలో శైవమతబోధ, వేదాంత ప్రబోధం తప్ప రసానందమిచ్చే కథాకథనం లేదు. అయితే శివయోగసారం పీఠిక చారిత్రకంగా మన కెంతో పనికివస్తుంది.[1]

కాకతీయసామ్రాజ్యచరిత్రలో కొన్ని ఘట్టాలను ఈ శివయోగసారంపీఠికసహాయంతోనే పూరించగలం. పాల్కురికి సోమనాథునికి శిష్యుడై అతని ప్రీతికోసం డోంపర్రు అగ్రహారాన్ని శివభక్తులకు ప్రతాపరుద్రచక్రవర్తిచేత ఇప్పించిన ఇందులూరి అన్నయదేవుని వంశచరిత్ర అంతా ఈ శివయోగసారపీఠికవల్లనే తెలియవస్తున్నది. ఈ అవతారికను ఆధారం చేసుకొనే చిలుకూరి వీరభద్రరావుగారు 'అన్నయదేవుడు-వింతచరిత్రాంశములు' అనే వ్యాసం వ్రాసి కాకతీయచరిత్రలో ఒక ప్రకరణాన్ని సవరించారు.[2]

కొలనుగణపతిదేవుడు తన గ్రంథం అవతారికలో ఇందులూరివారి వంశచరిత్రను ఇంత విపులంగా వ్రాయడానికి కారణం లేకపోలేదు. అది తన వంశచరిత్రే. ఇందు

---

1. ఈపీఠిక కాకతీయసంచికలో అనుబంధంగా ప్రకటించారు. పుటలు 10 _ 20.

2. 'సుభాషిణి' పత్రికలో సంపాదకుడు పండిరి మల్లికార్జునరావుగారు. ప్రథమసంచిక, అక్టోబరు 1927.

లూగివారి వంశంలో ఒక శాఖకే ఉత్తరోత్తరా కొలనువారనే ఇంటిపేరు వచ్చింది. ఆ సంగతులు తెలుసుకొందాం.

కాకతీయసామ్రాజ్యాన్ని పరిపాలించిన గణపతిదేవ చక్రవర్తికీ, అతని కుమార్తె రుద్రమదేవికీ పుగసంతానం లేదు. అందుకే గణపతిదేవుడు తన జీవితకాలంలో కుమార్తెకు గద్దెకెక్కించాడు. ఆమె తన మనుమణ్ణే దత్తత చేసుకొండి. తన కుమార్తె రాజ్యపరిపాలన సుస్థిరంగా ఉండాలంటే మంత్రిదండనాథులు విధేయులైనంతమాత్రాన చాలదు. బంధుత్వాలుకూడా ఉండాలని గణపతిదేవుడు భావించివుంటాడు. రుద్రమదేవికుమార్తెలను మూండిలికు లకు, మంత్రులను ఇచ్చి పెళ్ళిచేయించాడు. రుద్రమదేవికి ముమ్మడమ్మ, రుయ్యమ్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దపిల్లను నిడుదవోలు పుండలాన్ని పాలించే మహాదేవరాజుకు ఇచ్చి పెళ్లిచేయించాడు. రెండవ కుమార్తె రుయ్యమ్మను తమ కొలువులో వున్న ఇందులూరి పెద్దగన్నయ్యగారి అబ్బాయి అన్నయదేవుని కిచ్చి వివాహం జరిపించాడు.

ఈ ఇందులూరివారు అప్పటికి మూడుతరాలనుంచీ కాకతీయ చక్రవర్తుల కొలువులో మంత్రులుగా, దండనాథులుగా ఉంటున్నారు. అన్నయదేవుడు గొప్పపరాక్రమవంతుడు. ఇతడు కారణజన్ముడని, ఒక యతి తన కడపటి జన్మ ఈవిధంగా ఎత్తాలని కోరుకుని అన్నయదేవుడుగా జన్మించాడనీ లోకులు చెప్పుకొనేవారు. ఇతడు ఓరుగల్లు దగ్గర్నుంచి తూర్పున సింహాచలం దాకా ఎన్నో భూములు చిన్నప్పుడే జయించాడు. ఇతడు తన పెద

తండ్రి సోమన్నగారితో ఈ దండయాత్రలలో పాల్గొని ఉంటాడు. ఏమంటే సోమన్నకూడా ఓరుగంటికి తూర్పున ఉన్న శత్రురాజ్యాలన్నీ జయించి కొలనువీడుజల దుర్గాన్ని తన స్వంతం చేసుకొన్నాడు. పెదతండ్రీ, అన్న దేవుడూ రెండుసార్లు ఓడుగల్లునుంచి తూర్పున దిగ్విజయం చేయవలసిన అవసరం ఉండదేమో. ఇందులూరిసోమన్న కొలనుపీడుదుర్గాన్ని సాధించి స్వంతం చేసుకొన్నాడు. అందు చేత గణపతిదేవచక్రవర్తి అతణ్ణి కొలను సోమన్న అని పిలువసాగాడు. అదే రూఢిఅయిపోయింది. దానితో ఇందు లూరివారి వంశంలో సోమన్నగారి సంతతికి 'కొలను' వారు అనే ఇంటిపేరు వచ్చింది. వారు ఇందులూరువారికి ఉండే బిరుదులతోనే కొలనుపీడు పాలిస్తూఉండేవారు. కొలనువీడు అంటే అదేదో ఊరు అనుకోకండి. నేటి ఏలూరునే ఆనాడు ఆపేరుతో పిలిచేవారు.

కొలను సోమన్నగారి తర్వాత అయికోతరంలో శివ యోగసారం వ్రాసిన గణపతిదేవుడు జన్మించాడు. అంటే ఇతడు సోమన్నగారి ముమ్మనమడియునమడు. ఇందులూరి అన్నమంత్రికి రాయచౌహత్తమల్లు డనే బిరుదు వుంది. అది వంశక్రమానుగతంగా ఈ గణపతిదేవునికి కూడా ఉంది. ఇతడు మంత్రిగా, దండనాథుడుగా పేరుపొందకపోవచ్చు. కాని సగర్వంగా తాను అన్యనారీసహోదరుడ ననీ, యోగిజన పదపంకేరుహ మత్తమధుకరుడ ననీ, అన్యస్తుతి పరాఙ్ముఖుడ ననీ, శివస్తుతిసుముఖుడ ననీ చెప్పుకొన్నాడు. ఇతడు సేవించిన యోగులు శివయోగులు. అందులోనూ

శ్రీగురుచన్నసదాశివయోగికి ప్రియశిష్యుడు. ఈ యోగి కవికి పరాయివాడు కాడు. సాక్షాత్తు మేనబావ. చిన్నప్పుడే సన్యసించి శివయోగిగా ప్రసిద్ధుడై ఉంటాడు. లేకపోతే మేనమరది శిష్యుడవడానికి ఆస్కారాలు తక్కువ. ఈ శ్రీగురుచన్నసదాశివయోగికి పూర్వాశ్రమంలోని పేరు ఈడూరి నూకనారాధ్యుడు. ఈ ఇంటిపేరులోని ఈడూరు నేటికీ పశ్చిమ గోదావరిజిల్లా తణుకుతాలూకాలో ఉంది.

ఈడూరి నూకనారాధ్యుడు సకలవేదపురాణశాస్త్రార్థ సారసంవిజ్ఞాత, సర్వజ్ఞుడు. గురుకటాక్షంచేత సిద్ధుడైనాడు. అధ్యాత్మసంవేత్త. కాశీ మొదలైన ముఖ్యక్షేత్రాలు చరించినవాడు (శివయోగప్రీతిక, 85). ఇతడు శైవయోగ శాస్త్రసారసముచ్చయాన్ని ముందే నిశ్చయించాడు. దానిని తెలుగుభాషలో చెప్పించా లనుకొని తన మేనమరదిని కొలను గణపతిదేవుణ్ణి ర ప్పించి "విలసన్నూతనకవితానిపు ణుడవు. ఇంతకుముందు నాటకాలు, శైవకృతులు చేశావు. అందుకే ఇది నియోగిస్తున్నాను" అన్నాడు.

శైవయోగశాస్త్రసారసముచ్చయం-చేయుమున్న నిశ్చయించినార
మది తెనుంగుభాస నఖిలలోకోపకా-రార్థముగ రచింపు మభినవముగ.
ఖిల యజ్ఞాగులయెడ కృప-గలిగి శివజ్ఞానపుస్తుకశ్లోకమునం
గలుగు యథార్థము చెప్పిన-గలుగు సుకృతమునకు మేర కలదే తలపన్ ?
లోకానురంజనంబుగ-మాకృప మత్కృతియు దగిన మాతృకగాదే
కేకావింపుము తెనుగున-నౌకృతి శివయోగసార మను నామమునన్.
[శివయోగ. పీఠిక, 93-95]

ఈ పద్యాలవల్ల శివయోగసారం సంస్కృతగ్రంథా

నికి అనువాదమని తెలుస్తున్నది. దీనిని గణపతిదేవుడు రెండు భాగాలుగా రచించాడు. పూర్వభాగంలో ఎనిమిది ఆశ్వాసాలు ఉన్నాయి. ఉత్తరభాగంలో నాలుగు ఆశ్వాసాలు ఉన్నాయి. ఈ వివరాలన్నీ ఉత్తరభాగంలోని అవతారికలో ఉన్నాయి. చూడండి.

గణపతిదేవనామమున గల్గిన యే శివయోగసారమున్
బ్రణుతమహాప్రబంధమున బల్కితి నాక్రియ పూర్వభాగమున్
ద్రిణయనభక్తలో నన గథింతు సదాశివయోగనాథపై
మణి యన రూఢికెక్కి గరిమంబున నుత్తరభాగ మేర్పడన్.
విశ్వాస్థిరభక్తి వర్ధిలగ నుర్వీం బూర్వభాగాష్టసం
ఖ్యాశ్వాసంబుల గర్మయజ్ఞము దపోయజ్ఞప్రకారంబు స
ద్వైశ్వర్యప్రదమై తనర్చు జపయజ్ఞాచారమున్ గూడగా
విశ్వస్తుత్యగతిం బ్రబంధ మమరెన్ విద్వత్పరిగ్రాహ్యమై.
ఈ యుత్తరభాగంబున_నాయతి రచియింతు నాలుగాశ్వాసములం
దాయక ధ్యానజ్ఞాన మ_హాయజ్ఞద్వయము యమిజనానందముగన్.

[ఉత్తర. అవతారిక, 2,3,4]

శైవమతప్రచారంకోసం ప్రాసిన గ్రంథం కాబట్టి ఇది సార్వజనీనం కాదేమో అనిపించవచ్చుగాని ఇందులో అందరికీ వర్తించే నీతులు కూడా లేకపో లేదు. పాత్రమెరిగిన దానం మంచిదని రుజువు చేస్తూ ఆవుకు గడ్డిపెట్టినా పాలు ఇస్తుంది; పాముకు పాలుపోస్తే విషం కక్కుతుంది అని ఎంత చక్కగా చెప్పాడో చూడండి.

ప్రమదముతో నొకింతయిన పాత్రున కీవి మహాఫలం బగున్
బ్రమసి యపారవిత్తము లపాత్రున కిచ్చిన గీడుపొందు ఘా

సము నొసగంగ దుగ్ధముల జాలగ ధేనువు లిచ్చు నట్టి దు
గ్ధము లొసగన్ విషం బొలుకు గాదె భుజంగమయూథ మిమ్మహిన్.[1]

ఈ శివయోగసారాన్ని పరిశీలిస్తే ఇలాంటివి ఎన్నో దొరకవచ్చు. ఈ కృతిని రచించడానికి ముందు కొలను గణపతిదేవుడు చేసిన వనుగులో నాటకాలు మొదలైనవి వ్రాశాడని చెప్పుకొన్నవాటిలో మానసబోధ ఒకటి. ఇది 459 పద్యాల ద్విపదగ్రంథం. ఇందులో చివర "ఉర్వీపై గాంతాసహోదరుం డనగ గణపనారాధ్యులం గరుణించు శివుడు" అని వుంది. శివయోగసారంలో గణపతిదేవుడు తాను అన్యకాంతాసహోదరుడనని చెప్పుకొన్నాడు. ఈ సంగతి తన తొలిరచనలలోకూడ చాటుకొన్నాడన్న మాట.

గణపనారాధ్యుడనే కవి 'స్వరశాస్త్రమంజరి' అనే ద్విపదకావ్యాన్ని వ్రాశాడు. అందులో కవి తనకు పరనారీ సహోదరుడనే బిరుదు చెప్పుకోలేదుగాని తన అన్నగారు రామరాజుకు "పరసతిసోదరభావంబు బిరుదు" అని చెప్పాడు. శివయోగసారం, మనోబోధ వ్రాసిన గణప నారాధ్యుని తండ్రిపేరు ఆదిమూలుడు. అందుచేత ఇద్దరూ ఒకరు కారని చెప్పాలి. అదీకాక తొలి గణపనారాధ్యుడు (అంటే స్వరశాస్త్రం వ్రాసిన కవి) ప్రతాపరుద్రుని కాలం లోనూ, ఆ తరువాత ఓ రెండు పుష్కరాలూ జీవించి ఉంటాడు. అతని అన్న రామరాజు ఢిల్లీసుల్తాన్ చే మన్న

1. శివయోగసారం, పూర్వభాగం.

నలు పొందినట్లు స్వరశాస్త్రమంజరిలో ఉంది.[1] అయితే ఈ గణపనారాధ్యుడు కొలని గణపతిదేవుని పూర్వీకుడై ఉంటాడు. గోత్రాలు ఒకటే. ఒక రాజ్యంలోనే మంత్రులుగా కొలువుచేసినవారిసంతతిలో వాళ్ళు. మొదటి గణపనారాధ్యుడు ఈ వంశంలోని 4 వ తరంలోనూ, రెండవ గణపనారాధ్యుడు 8 వ తరంలోనూ ఉంటారు.

ఉమామహేశ్వర సంవాదరూపమైన స్వరచింతామణి అనే 25 అధ్యాయాల గ్రంథం ఒకటి సంస్కృతంలో ఉంది. స్వరశాస్త్రం అంటే సంగీతానికి సంబంధించిందని పొరబడవచ్చునుగాని, సంగీతానికీ దీనికీ సంబంధం లేదు. ఇది యోగశాస్త్రం. ఇందులో పిండోత్పత్తి దగ్గరనుంచి శరీరానాలూ వశ్యమూలికలు దాకా ఎన్నో విషయాల గురించి చెప్పారు.[2] ఈ స్వరచింతామణికి గణపనారాధ్యుని స్వరశాస్త్రమంజరి ముక్కస్య ముక్క అనువాదం కాదుగాని రెండు గ్రంథాలలోని విషయాలూ ఒకటే. "మహిమోద్భవముఖ్యమైయున్న యోగశాస్త్రము లెల్ల యోచించి చూచి జీవహితంబుగా జీవునిబట్టి తెంగొప్ప జనులెల్ల తెలియునట్లు

---

1. ఈ స్వరశాస్త్రమంజరిని నేలటూరి వెంకటరమణయ్య, టి. వి. రంగాచార్యులుగార్లు తమ హంపీయాత్రలో సంపాదించారు. దీని గురించి నేలటూరివారు భారతి 12 వ సంపుటి 1 వ సంచికలో వ్రాశారు. స్వరశాస్త్రమంజరి వ్రాతప్రతిని మిత్రులు నిడుదవోలు సుందరేశ్వరరావు గారు వాకు దయతో ఇచ్చారు.

2. సంస్కృతస్వరచింతామణిని ఆంధ్రపబ్లిషింగ్ హౌస్ (వేపేరి, మద్రాసు)వారు అచ్చువేశారు (1955). ఈ యోగశాస్త్రాన్ని తెన్మళం శ్రీ రంగాచార్యులుగారు పరిష్కరించారు.

గను స్వరశాస్త్ర మంజరి''ని గణపనారాధ్యుడు వ్రాశా వన్నాడు. ఈ స్వరచింతామణిని కూడా చూసిఉంటాడు.

మొదటి గణపనారాధ్యుని స్వరశాస్త్రమంజరిని రెండవ గణపనారాధ్యుడు, అంటే కొలను గణపతి దేవుడు చూసిఉంటాడు. శివయోగసారంలోని కొన్ని భావాలకు, దీనికి పోలికలు ఉన్నాయి. పీటిని పైపారువేయడం పేరే పరిశోధన. శివయోగసారం వ్రాయడానికి ముందు గణపతి దేవుడు స్వరశాస్త్రాన్ని చదివాడనీ, మొదటిగణపనారాధ్యుని అన్నలాగ పరసతి సోదరభావంబు బిరుదుగా పెట్టుకొన్నాడనీ చెప్పుకొనడమే ఇక్కడ ముఖ్యం. ఈ బిరుదు పెట్టుకొనడంవల్ల శివయోగసారం, మనోబోధ వ్రాసింది ఒక్కరే అని తెలుసుకొనడానికి వీలవుతున్నది. ఈ మనోబోధను నిడుదవోలు సుందరేశ్వరరావుగారు పరిష్కరించి ప్రకటించారు.[1] ఇందులో గణపతిదేవుడు వైరాగ్యాన్ని చాలా తేటమాటలలో చెప్పాడు. పాపాత్ముడు భక్తి మార్గాన్ని చేపట్టడని ఇలా అన్నాడు:

అలరుల తావికి పలరునే మిడుత?
వ్యగుళంఖనాదంబు మెచ్చునే చెవుడు?
కొమరారు నృత్యంబు కోరునే చీకు?
కస్తూరి వెదకునే గ్రామసూకరము?
కెలయ సౌభాగ్యంబు వెదకునే గూబ?
తనరార చతురత దనరునే యెద్దు
పాపాత్మునకు నేల భక్తుని క్రియలు? [మనో. 396-402]

---

1. మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయం వారి బులెటిన్, 1950-పుటలు 61 - 77.

ఈ వైరాగ్యబోధలోని భావాలు నాటినుంచి నేటి దాకా ప్రచారంలో ఉన్నాయి. "కర్ర లే చుట్టాలు. కట్టలే బంధువులు కన్నతల్లెవ్వరే చిలుకా" అని, పోయేనాడు ఎవరూ వెంబడిరారని మన తత్త్వాలు బోధిస్తాయి. గణపతి దేవుడు మనోబోధ ఎలా చేస్తున్నాడో చూడండి.

మాయబంధుల నేల మరిగెదవు మనస
చుట్టాలు పక్కాలు సుతులు సోదరులు
కలిమిలో సరి,వారు కలిమి గుందినను
సిరివోయెనని తన్ను జేరంగ నీరు
కొంచెపెంపున మాన దూలపోనాడి
ఏమేడ, మీరేడ? యేమి పోరామి
అని పెక్కుభంగు లందంద బలుక
వగల సందడి నోర్చి వాసికి బాసి
మాటలు దలపోసి మది నీవు గుందు
చుండుట కోపుదే ఉండవు మనస!
ఎవ్వరెవ్వరివారు ఏమిపోరామి?
చావు మాన్పగ లేరు చా దోడరారు
తన చేయు పుణ్యంబు తన తోడు నీడ [మనో. 195 - 207]

మనోబోధలోని ఈభావాలు గణపతిదేవుని అనంతర కృతి శివయోగ సారంలో కనబడతాయి. చూడండి.

మిత్తములు గట్టి తగు భృత్యులును జుట్టములు
నత్తికొనియుండుదురు నిత్యమును మర్త్యులో
విత్తబహుళంబైన యత్తరిన యొక్కయెడ
విత్త మెడబ్రెత్తవ్యమును దత్తమముతో దా
నొత్తుకొని నీయకడ కొత్తుమున నేటి కని
రిత్తలును నగ్గులును నెత్తికొని యాడం

జిత్తమున సంతతము నుత్తలము నొందుటకు
నుత్తములు చూచి మరి మెత్తురె ధరిత్రిన్!

[ఉత్తర. 1_282]

వీవారైనను వారలేమవ్రదు రూహింపంగ నెవ్వారికిం
జావా మాన్పగ లేరు వారు పివపం జా దోడుగానైనలే
రావేగంబున దోడ జచ్చినను గర్మాయత్తులై యన్యులో
కావాసంబున కేగుచుండుమయ తథ్యంబంతయుం జూడగన్.

[ఉత్తర. 1_283]

మనోబోధలోని వైరాగ్యాన్ని వేమన్నకూడా అల వరుచుకొన్నాడు. ఇందులోని కొన్ని పాదాల మువ్వాలు అతని ఆటవెలదుల పాదాల గజ్జెలైనాయి. 'తలలు బోడు లైన తలపులు బోవులా?' అన్నాడు వేమన్న. గణపతిదేవుడు వీమన్నాడో చూడండి.

కెంట్రుకల్ చీరలు విడిచిపోయినను
మాయలు విడుచునే మనస భావింప
తలబోడిచీరయు తలపులో నెపుడు
తలపని పడుచుల త్యజ్ఞు లండ్రు. [మనో. 339_342]

గణపతిదేవుణ్ణి వేమన్న చాలాచోట్ల అనుకరించా డనే చెప్పాలి. చూడండి.

ఆవులు పలుచాయలై యుండుగాక
పాలు నాచాయలై బరగునె చెపుమ?
జాతులు వెక్కని చాటిన నేమి.... [మనో. 888_390]

ఈమాటలను వేమన్న ఎలా అనుకరించాడో చూడండి :

కనగ సొమ్ము లెన్నో-కనకంబు నొక్కటి
పసులవన్నె లెన్నో-పాలనొకటి

పుష్పజాతు లెన్నో పూజ యొక్కటి సుమీ
విశ్వదాభిరామ వినుర వేమ! [వేమన, 181]

ద్విపదలను నడిపించడంలో గణపతిదేవుడు గారనకు వీమాత్రం తీసిపోడు. ఒక్కొక్క పాదంలో రెండు అంత్య ప్రాసలు పెనుతూ చక్కగా కదనుతొక్కిస్తాడు. చూడండి.

దేహంబు తేరగల్ల తెలియఁజెప్పెదను
మోహంబు ఎడబాసి ముదమార వినుము
హేయంబులకు దిట్ట యెమ్మల పుట్ట
మజంబు నిలయంబు మలయుసదనంబు
శోణితంబుల కుంట శుక్లంబు పెంట
చీముక రాటంబు శ్లేష్మభాండంబు
ముదిమియుండెను యిక్క మూత్రంపుబొక్క
ఆదియైన నిలచునే యచలంబుగాక
నీరు బగ్గయుబోలి నీరవంబగును [మనో. 235 - 243]

దేహం ఎంత హేయమైనదో చెప్పి, అటువంటిదాని మీద మమకారం పొందినా అది శాశ్వతంగా ఉండదనీ, నీటిబుడగ అనే చివర చెప్పడంలో వైరాగ్యం శిఖరాగ్రాన్ని చేరుకొంటున్నది. ఇంత తేట తెల్లమైన దేశి తెనుగులో గణపతి దేవుడు వ్రాసిన ఇతరకృతులు లభించకపోవడం దుర దృష్టమే.

జనులంవరు 'ఔను ఔను' అని మెచ్చుకొన్న ఇతని నాటకాలు దొరికితే మన తెలుగు సాహిత్యంకూడా ఈ విషయంలో సగర్వంగా తలయెత్తుకొని తిరిగేది. నాటకాలు దొరక్కపోయినా నాటకాలు వ్రాసిన రచయిత పేరు తెలిసింది. అదెంత కాదు?

8

అయ్యలరాజు తిప్పయ్య



రశైవమతం మన దేశంలో పేళ్లు నిల
ద్రొక్కుకుని విజృంభించడం ఈ సాహిత్య
చరిత్రలో మనం గమనించాం. వీరశైవం
లాగే వీరవైష్ణవంకూడ కొంత కాలానికి
ప్రబలింది. మల్లికార్జున పండితారాధ్యుల గురించి చెప్పు
కొంటున్నప్పుడు ఆయన శివుణ్ణి మించిన దైవంలేడని చెప్ప
డానికి తన తల ఇస్తా నన్నాడని తెలుసుకొన్నాం.[1] అతడు
నిప్పు మట్టుకుంటా నన్నాడు. శివునికన్నా వేరేదైవ మున్నా
డని ఎవరైనా చెప్తేవాళ్ళతల తనకాలితో తంతానన్నాడు.[2]
వీరశైవుడైన ఒక తెలుగుకవి తనమతాన్ని ప్రచారంచేసు
కొందుకు ఇటువంటి జబర్దస్తీమాటలు చెప్పినట్టే కొంచెం
తగ్గు శ్రుతిలో ఒక వీరవైష్ణవుడైన తెలుగుకవికూడ తన
మతాన్ని చాటిచెప్పాడు. వినండి.

---

1. సమగ్రాంధ్రసాహిత్యం, I చాళుక్యయుగం, పుట 233.
2. పండితారాధ్యచరిత్ర, వాదప్రకరణం, పుట 711.

ఇల నీమీదను జాల భక్తిగలవాడే యెట్టివాడైన నే
ఖలుడైనన్ దుది నుత్తమోత్తము డగున్ గాదన్న గొంగీడ్చెదన్
దెలుపన్ నిల్చిన నాడుకొన్న బరవాదిన్ గెల్చెదన్ వేదళా
స్త్ర లసద్వాక్యనుతప్రతాపరఘువీరా ! జానకీనాయకా !1

ఈ పద్యాన్ని వ్రాసిన కవిపేరు అయ్యలరాజు త్రిపురాంతకుడు. ఇతడు 'రఘువీరా జానకీనాయకా'! అనే మకుటంతో శతకం వ్రాశాడు. ఇది చాలా ప్రసిద్ధమైంది. ఈ శతకం చెప్పిన తిప్పయ్య మా పూర్వీకుడు అని ఇతని సంతతి వాళ్ళు గొప్పగా చెప్పుకున్నారు. కృష్ణదేవరాయలవారి కాలానికి కొంచెం అర్వాచీనుడైన అయ్యలరాజు రామభద్రుడు ఈ తిప్పయ్యకు సాక్షాత్తూ మునిమనుమడు.[2] కొందరు మునిమనుమడు కాడు, ఉత్త మనుమడే అంటారు.[3] మనుమడైనా, మునిమనుమడైనా రామభద్రకవితన పూర్వీకుడైన తిప్పయ్యగారు ఒంటిమిట్ట రఘునాథశతకం వ్రాసిన సంగతి తన కావ్యం రామాభ్యుదయంలో ఘనంగా చెప్పుకొన్నాడు. కృతిభర్తదిని పద్యాలలో కాక ప్రతి ఆశ్వాసం చివరా గద్యలో ఇలా ప్రకటించాడు:

ఇది శ్రీమదొంటిమిట్ట రఘువీరశతక నిర్మాణకర్మఠ జగదేక ఖ్యాతి ధుర్యాయ్యలరాజు తిప్పయమనీషి పర్వతాభిధాన పౌత్రాకర్ణ్య పుత్రపరికీలిత సమిద్ధ రామానుజసిద్ధాంతామాత్య ముమ్మడివరదా

---

1. ఒంటిమిట్ట రఘువీరశతకం, పద్యం 84.
2. ఆంధ్రకవితరంగిణి, 6 వ సంపుటి, పుట 12.
3. వావిళ్ళవారు ప్రచురించిన ఒంటిమిట్ట రఘువీరశతకం పీఠికలో గన్నవరపు సుబ్బరామయ్యగారున్ను, శతకకవుల చరిత్రలో వంగూరి సుబ్బారావుగారున్ను. శతక. పుట 147.

చార్య కటాక్ష వీక్షాపాత్ర హృదయపద్మాధిష్ఠిత శ్రీరామభద్రకవి ప్రణీతంబైన రామాభ్యుదయ మహాప్రబంధంబునందు ప్రథమాశ్వాసము.[1]

ఈ గద్యవల్ల అయ్యలరాజు తిప్పయ్యగారు ఒంటిమిట్ట రఘువీరశతకం చెప్పినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. అయితే శతకం మకుటంలో 'ఒంటిమిట' అనే మాట మనకు కనబడదు. శతకంలోని 108 పద్యాలలోనూ ఎక్కడో ఒకటి రెండుసార్లు అరుదుగా కనబడుతుంది. ఇతడు ఒంటిమిట్టలో ఉండే రాముడిమీద చెప్పడంవల్ల శతకానికి ఈ పేరు వచ్చింది. కవే ఒక పద్యంలో ఇలా చెప్పాడు:

తారుణ్యోదయ యొంటిమిట్ట రఘునాథా! నీకు నే బద్యముల్
నూరుం జెప్పెద నూరుపేరు వెలయన్ నూత్నంబుగా నంత నా
నోరుం బావన మౌను నీకరుణ గాంతున్ భక్తి నన్నందరున్
రారమ్మందురు గారవించి రఘువీరా! జానకీనాయకా! [65]

ఈ శతకం చెప్పడానికి ముందే ఇతణ్ణి అందరూ 'రారమ్మ' నే వారు. సామాన్యులు కారు, మహారాజులే గారవించేవారు. ఆ సంగతి ఇతడే ఒక పద్యంలో మొదట ఇలా చెప్పాడు.

ఆకర్ణాటకమండలాధిపతిచే నాస్థానమధ్యంబునన్
నాకాస్యంబులు మెచ్చజేసితివి నానారాజులుం జూడగా
నీకుం బద్యము లిచ్చుచో నిపుడు వాణీదేవి నాజిహ్వకున్
రాకుండ న్వసియించు టెట్లు రఘువీరా! జానకీనాయకా! [2]

నానారాజులు చూస్తుండగా ఆస్థానమధ్యంలో కర్ణాటక మండలాధిపతి మెచ్చుకొనేటట్టు తిప్పయ్యగారు చెప్పిన

---

1. వీరేశలింగంగారు ప్రకటించిన రామాభ్యుదయం [పుట 26]

కావ్యా లేమిటో మనకు తెలియవు. ఇతని వంశంలో ఎందరో కవులు పుట్టారు. వాళ్లు ఈయన వ్రాసిన ఇతర గ్రంథాలను పేర్కొనలేదు. ఈయన వ్రాసిన కావ్యాలను మెచ్చుకున్న కర్ణాటక మండలాధిపతి ఎవరోకూడ నికరంగా తెలియరు. అయితే మునిమనమడైన అయ్యలరాజు రామభద్రయ్య క్రీ. శ. 1540 ప్రాంతాలవాడు కాబట్టి తరానికి పాతికేళ్ళ చొప్పున వెనకకు వెళితే ముత్తాత క్రీ. శ. 1440 ప్రాంతాల వాడవుతాడు. ఆకాలంలో కర్ణాటకరాజ్యాన్ని పరిపాలించిన సంగమ వంశంరాజు రెండవ దేవరాయలు. ఇతని ఆస్థానం లోనే మొదట తిప్పయగారు ఉన్నా కొన్నాళ్ళకు విరక్తితో దానిని వదిలిపెట్టినట్టు కనబడుతుంది. రాజులను తిరస్కరిస్తూ ఇతడు ఈ పద్యం చెప్పాడు.

తమ గర్వంబున దారుపుంగుడగుచున్ దైవంబు మంత్రంబు తం
త్రములన్ వీడగ నాడుచున్ దిరుగు నిర్భాగ్యుల్ మహారాజులై
మము నూరింపగ నేము నిన్నెరిగి నీమంత్రం బెరింగిన్ దరి
ద్రమతిన్ వేడగబోవు టెట్లు రఘువీరా! జానకీనాయకా! [59]

రాజులు ఊరించినా ఇప్పుడు లోబడలేదుగాని ఇతడు ఒకనాడు విచ్చలవిడిగా తిరిగినట్టు కనబడుతుంది.

చెడుగన్ గష్టుడ దుష్టచిత్తుడ బరస్త్రీలోలుడన్ బాలుడన్
జడుడన్ మూఢుడ గొండెగాడను దురాచారిన్ నిషేధాత్ముడన్
గడుసన్ గాకరిగల్లగుల్లగపటిన్ గర్విన్నమున్ గావు మా
రడియున్నాడను నీవె దిక్కు రఘువీరా! జానకీనాయకా! [17]

ఈ పద్యంలో చెప్పిన అవలక్షణాలన్నీ నిజంగా అతనికున్నాయో లేవో తెలియదు. భక్తుడు తాను పాపినని

చెప్పుకొనడం మామూలు. అయితే ఈ పద్యంలో చెప్పిన 'పరస్త్రీలోలుడన్' అనేది నిజమే అనిపిస్తుంది. ఇంకొక పద్యంలోకూడ ఆసంగతిని ఇంకొంచెం విశదపరిచి చెప్పాడు. చూడండి.

పరనారీకుచకుంభపాళికలపై బాదాబ్జయుగ్మంబుపై
గరమూలంబులపై గపోలతటిపై గంఠంబుపై గొప్పపై
బరువుల్ వారెడు నాతలంపులు మిముస్ భావింపగాజేసి స
ర్వరసాధీశ్వర నన్నుబ్రోవురఘువీరా! జానకీనాయకా! [69]

ఈ పద్యానికీ, పోతరాజుగారి పద్యం 'ఆదిన్ శ్రీసతి గొప్పపై' అనేదానికీ పోలిక లున్నాయని పరిశోధకులు గుర్తించారు.[1] పోతరాజుగారి పద్యం చూడండి.

ఆదిన్ శ్రీసతిగొప్పపై దనువుపై నంసోత్తరీయంబుపై
బాదాబ్జంబులపై గపోలతటిపై బాలిండ్లపై నూత్నమ
ర్యాదం జెందు కరంబు క్రిందగుట మీదై నాకరంబుంట మే
ల్గాదే రాజ్యము గీజ్యమున్ సతతమే కాయంబు నాపాయమే?

[భాగ. ఆష్ట. 591]

పై రెండు పద్యాలలోనూ పాదాబ్జాలు, కపోలతటి అనేమాట లున్నాయి. పోతరాజుగారి పద్యంలో అంసోత్తరీయం ఉంది; తిప్పయ్యగారి పద్యంలో లేదు. మొదటే పరనారీకుచకుంభపాళి కనబడుతుంది. ఈ రెండు పద్యాలకూ సంస్కృతభాగవతం ఆధారమో, లేక తిప్పయ్యగారినే పోతరాజుగారు అనుకరించారో తెలుసుకోవాలని పరిశోధకులు భావిస్తున్నారు.[2]

---

1. వంగూరి వెంకటసుబ్బారావుగారి శతకకవులచరిత్ర, పుట 151.
2. చాగంటి శేషయ్యగారు, ఆంధ్రకవితరంగిణి, 6వ సంపుటి, పుట 15.

తిప్పయ్యగారు పూర్వకవులను అనుకరిస్తా రన్న సంగతి రఘుపీరశతకాన్ని చదివితే తెలుస్తుంది. అందులో ఆయన ఇలా వ్రాశాడు:

బాలత్వంబున గొంతకాలము వృథా పాల్మాలి దుర్బుద్ధినై
జాలన్ యౌవనమందు గర్వమతినై సంసారినై దుష్క్రియా
జాలభ్రాంతి జరింతుగాని నిను గాంక్షిం గొల్వలే దయ్య హే
రాళంబైనది చింత వంత రఘుపీరా! జానకీనాయకా! [73]

ఇది ఆదిశంకరుల 'భజగోవిందం'లోని 7 వ శ్లోకానికి అనుకరణ. చూడండి.

బాల స్తావ త్క్రీడాసక్త స్తరుణ స్తావ త్తరుణీసక్తః
వృద్ధ స్తావ చ్చింతాసక్తః పరే బ్రహ్మణి కోపి నసక్తః.

ఈపోలికను చూపిన వంగూరి వెంకటసుబ్బారావు గారే జానకీపతిశతకంలోని ఒక పద్యానికి పోలిక లున్న తిప్పయగారి పద్యాన్ని చూపించారు. రెండూ చూడండి.

చిలుకను బెంచి ముద్దులకు జేడియ కుల్కుచు రామరామ యన్
బలుకులు నేర్పుచున్ వలుక పైబడి మోక్షము మొసంగి తంచు నే
పలుమరు నీకథ ల్వినియు భక్తిని నామము లుచ్చరింపుచున్
బలమగు పాపబంధమున బారగగంటిని జానకీపతీ!

[జానకీపతిశతకం, 7]

చిలుకన్ ముద్దులు చిల్క బల్కుతరి రాజీవాక్షి యొక్కర్తు ని
చ్చలు 'రామా, రఘురామ, రావె'యనినన్ సాలోక్యసామీప్యముల్
కొలదుల్ మీరగ నిచ్చినాడవట నీకుం బిడ్డపేరిడ్డవా
రల పుణ్యంబున కేది మేర రఘువీరా! జానకీనాయకా! [82]

జానకీపతిశతకాలను ఇద్దరు కవులు చెప్పారు. ఆనే విళ్ళసీతారామకవి (క్రీ. శ. 1750), రామభద్రకవి (క్రీ. శ.

1800 కి పూర్వం) అనేవారు వీటిని వ్రాశారు. తిప్పయ్య గారి చిలుకపద్యానికి పోలికలున్న పద్యం రామభద్రకవి వ్రాసిందే. ఈచిలుకకథ తిప్పయ్యగారి కాలంతరువాతకూడ ప్రచారంలో ఉన్నదనడానికి మొల్ల వ్రాసిన ఈ క్రిందిపద్యం సాక్ష్యం.

వారాంగన శ్రీరాముని_పేరిడి రాచిలుక బిలిచి పెంపు వహించెన్
నేరుపు గల చందంబున_నారాముని వినుతిసేయ వార్ష ముగాదే!

[రామాయణం పీఠిక, 22]

మొల్ల చెప్పిన వారకాంత తిప్పయగారి కాలానికి ముందుదైఉండాలి. లేదా సమకాలికురాలైనా అయి ఉండాలి. ఆయన తన సమకాలికవిషయాలను కొన్ని శత కంలో గ్రంథస్థంచేశాడు. చూడండి.

చెలువం బొప్పు సువర్ణముద్ర లితరుల్ చెల్లించుటేక్రొత్త కా
కలనీముద్రలు చూడజెల్లుబడి చక్రాలంచు వేయించు మం
డలనాథాగ్రణి క్రొత్త నీ బలిమి నానావర్ణపుందోలుము
ద్రలు చెల్లించితి విందునందు రఘువీరా జానకీనాయకా! [ఒంటిమిట్ట 80]

ఈపద్యంలో చెప్పిన నానారకాల తోలుముద్రల కథేమిటో చారిత్రకులు చెప్పాలి. పిచ్చితుఘ్లక్ రాగినాణాలు వేయడం మనం విన్నాం. తోలునాణాలు వేసిం దెవరో?

నాణెం బంగారానిదైతేనే ఆరోజుల్లో విలువ. ఇను మునుంచి బంగారం చేయాలని ఆనాడు ఎందరో ప్రయత్నించారు. వేమన్నగారి పద్యాలలో రసవాదం ప్రస క్తి ఎన్నో సార్లు కనబడుతుంది. తిప్పయ్యగారుకూడా రసవాదంసంగతి చెప్పారు, చూడండి.

కసుమాలంబగు దేహి పుట్టువుల నీకష్టంబులం బాపి ది
వ్యసుకాయం బొనరింతు వెవ్వడు నినున్ వాక్రుచ్చినన్ యోగిమా
నసగేహంబుల నుండి లోహము సువర్ణచ్ఛాయగాజేయగా
రసవాదంబులు నేర్చి తౌర రఘువీరా! జానకీనాయకా! [94]

ఈశతకంలో సమకాలికవిషయాలకన్నా భారతభాగవతరామాయణగాథలలోని సంగతులు సహజంగా ఎక్కువ ఉన్నాయి. రెండు ఇతిహాసాలలోని కథలను ఒక్కసారే చెప్పి కవి చమత్కరించడంకూడ కనబడుతుంది.

రవిసూనున్ బరిమార్చి యింద్రసుతునిన్ రక్షించినా డందునో
రవిసూనున్ గృప నేలి యింద్రసుతు బోరం ద్రుంచినాడందునో
యివి నీయందును రెండునుం గలవు నీ కేదిష్టమో చక్కగా
రవివంశాగ్రణి తెల్పవయ్య! రఘువీరా! జానకీనాయకా! [92]

భారతంలో కర్ణుడు రవిసూనుడు, అర్జునుడు ఇంద్రసూనుడు. రామాయణంలో వాలి ఇంద్రసూనుడు; సుగ్రీవుడు రవిసూనుడు. రవిసూనుణ్ణి చంపి ఇంద్రసూనుణ్ణి రక్షించావనా? రవిసూనుణ్ణి రక్షించి ఇంద్రసూనుణ్ణి పరిమార్చావనేదా? ఈ రెండూ నువ్వు చేశావు. ఇందులో నీ కేది ఇష్టం అని అడుగుతున్నాడు. ఈప్రశ్న తిక్కనగారు హరిహరనాథుణ్ణి "ప్రభూ, నీకు అస్థిమాల ఇష్టమా, కౌస్తుభం ఇష్టమా? కాలకూటం రుచిగా ఉంటుందా, యశోదాదేవి చనుబాలు రుచిగా ఉంటాయా? సెలవియ్యి" అని అడిగిన శ్లోకాన్ని గుర్తుచేస్తుంది.[1]

పురాణకథలను పేరొక్కన్నాడేకాని తిప్పయ్యగారు

---

1. మహాభారతం, విరాట. 1_11.

చెప్పే కొన్నికథలు హరివంశం మొదలైన ప్రామాణిక గ్రంథాలకు విరుద్ధమైనవి. చూడండి.

చెవి నీనామము వింటినో యని కడున్ శంకించి కర్ణంబులన్
రవమ్మల్ మీరిన ఘంట లంటనిడి ఘంటాకర్ణు డేతేరగా
నవి చూచిన్ వరమిచ్చినాడ వట నీయుంగ్రిద్వయీసేవక
ప్రవరుం గాచుట ఏమి లెక్క రఘువీరా! జానకీనాయకా! [91]

హరివంశంలోని ఘంటాకర్ణుడు విష్ణుభక్తుడే. హరినామ స్మరణ చేసేవాడే. విష్ణునామం వినబడకూడదని చెవులకు ఘంటలు కట్టుకొనలేదు. ఈకథ ఆపురాణానికి వ్యతిరేకమైనది. ఇంకోఘంటాకర్ణుడు ఉన్నట్టు కనబడదు.[1]

తిప్పయ్యగారి కాలానికే పురాణకథలు వేరే రూపాలను పొందుతున్నట్టు కనబడుతుంది. కొత్తపురాణాలను సృష్టించుకొనడం కూడా మొదలైంది.

ఎటువంటి పాపాత్ముడైనాసరే శివరాత్రినాడు పుణ్యం చేసుకుంటే ముక్తి డౌతాడని నిరూపించడానికి శ్రీనాథుడు కాశీఖండంలోని గుణనిధికథను శివరాత్రిమాహాత్మ్యంగా తిరగ్రవాశాడు. సుకుమారుడు చెయ్యని పాప మంటూ లేదు. అటువంటివానికి శైవులు ముక్తినిప్పిస్తే ఈ వైష్ణవుడు ఏమంటున్నాడో చూడండి.

గోమాంసాశని మద్యపాని సగరిన్ గొండీడు చండాలుడున్
హేమస్తేయుడు సోదరీరతుడు కూడేకాదశిన్ భుక్తిచే
నేమూఢాత్ముడు లోనుగాగలుగు దుశ్శీలాత్ముడైనన్ తుదిన్
రామా యన్నను ముక్తిగాచు రఘువీరా! జానకీనాయకా! [52]

---

1. పూర్వగాథాలహరిలో వేరేఘంటాకర్ణుని సంగతి లేదు.

వీరశైవులు ఎలాగైతే శివుని పేరు తప్పించి అన్యుల పేరు ఉచ్చరించరో వీరవైష్ణవులుకూడా అంతే అని ఇంకొక పద్యంవల్ల తెలుస్తుంది. పిడుగులు పడుతున్నప్పుడు సాధారణంగా 'అర్జునః ఫల్గునః పార్థః కిరీటీ' అని గాండీవిపేర్లు చెప్పుకొనడం పరిపాటి. ఇత డేమంటున్నాడో చూడండి.

పటునిర్ఘాతకఠోరనాదము ఘనబ్రహ్మాండభాండంబు పి
క్కటిలం జేయుచు వచ్చునప్పు డితరుల్ గాండీవినామంబు లె
న్నుట మేలందురు వైష్ణవుల్ దలప రన్యం గోరి యెంతెంత దు
ర్ఘటముల్ వచ్చిన నిన్నెకాని రఘువీరా! జానకీనాయకా! [14]

ఆరాధనాభేదాలకన్నా ఆచార్యుల భాష్యాలలోని సామ్యాలను అర్థంచేసుకొనడం ఉత్తమం అనీ, రామానుజ శంకరదర్శనాలను అధ్యయనంచేసి సమన్వయం చేసుకొనడం విశాలదృక్పథానికి అవసరమనీ తలచే మన ఇరవయ్యో శతాబ్దంలో ఈ వీరశైవవీరవైష్ణవకవితల పరిశీలన మన పూర్వులు ఎలా ప్రతికారో, ఏమి భావించారో, ఎలా భాషించారో తెలుసుకొనడానికిమాత్రమే పనికివస్తుంది.

అయ్యలరాజు తిప్పయ్యభావాలు ఎలాంటివైనా భాష సజీవమైంది. దేవకీనందనశతకంలో వెన్నెలకంటి జన్న మంత్రి ఎంత సజీవమైన భాషను వాడాడో తిప్పయ్యగారు కూడ అంత చక్కని వ్యావహారికాన్ని ఆనాడే పద్యాలలో వాడాడు.

అడిగే విద్యకు (18), చేసే మతి (34), పుట్టేది (78) మొదలైన ప్రయోగాలు కనబడతాయి. శబ్దాలంకా

రాలూ, శ్లేషలూ వాడడంలోకూడా ఈ కవి చతురుడే. చూడండి.

ఇనవంశోత్తమ వేదశాస్త్రములలో నేవింటి నేవింటివా
డును నీకుం బ్రతిగాడు నీకుగల బంటున్ నన్ను రక్షించు కా
లుని బంటున్ విదలింపగావలయు నాలో నుండు మీ మెండుమీ
రనమోఘాస్త్రమువిల్లు బూని రఘువీరా! జానకీనాయకా! [41]

ఇతని ఇతరకృతులు కొంచెం దీర్ఘమైనవి. దీనితరువాతివి దొరికితే వాటిలోంచి ఇంతకన్నా కమనీయమైన కవితను ఆస్వాదించేవాళ్ళమేమో! ఆ కృతులు ఎలాంటివో చెప్పలేంగాని అవి రాజులకు అంకితమిచ్చినవి మాత్రంకావు. ఏమంటే, అల్పులమీద ఇతడు కృతులు చెప్పడు. వినండి.

క్షితిలో నల్పులమీదజెప్పిన కృతుల్ చీచీ నిరర్థంబు లా
సతికిం బాత్రము గావు మేక మెడచన్నుల్ నేతిబీరాకులున్
వితతప్రౌఢిని నీకుజెప్పిన కృతుల్ వేదాలు శాస్త్రాలు భా
రతరామాయణముల్ దలంప రఘువీరా! జానకీనాయకా! [26]

తిప్పయ్యగారికి రాజూ, రవుతూ దేవుడే. ఈ రెండు మాటలమీదా చమత్కరించి ఎలా పద్యం చెప్పాడో చూడండి.

తేజంబొప్పగ నీవె కావె మొదలన్ త్రేతాయుగాంతంబునన్
రాజై పుట్టితి వింక నీ కలియుగాంతంబందునన్ రౌతవై
వాజిం దోలి విరోధులం దునుమ దేవా నీవ యొం డెవ్వడా
రాజున్ రౌతవు నీవ కావె రఘువీరా! జానకీనాయకా! [10]

ఒంటిమిట్టరఘువీరశతకం చెప్పకముందూ తిప్పయ ఒక కర్ణాటకమండలాధిపతిఆస్థానంలో ఉన్నా ఈ శతకంలో అతని కర్ణాటేశ్వరుడు దేవుడే అని ఈ క్రిందిపద్యంవల్ల తెలుస్తున్నది.

నేటం దీరె ననేకజన్మములనుండిన్ నన్ను వెంటాడుచున్
వాటంబై చనుదెంచు పాపములు శ్రీవత్సాంక నీవంక నీ
పాటల్ పాఠము సేయువారికి మరిన్ పాపంబులన్ బాపు క
ర్ణాటాధీశ్వర! యొంటిమిట్టరఘువీరా! జానకీనాయకా! [13]

ఇందులో తిప్పయ్య పాటలు పాఠంచేయడంగురించి చెప్పాడు. ఇతడు ఏపాటలు పాఠంచేశాడో, రచించాడో మనకు తెలియదుగాని ఈ యుగంలో జన్మించి పాటలు రచించిన ఇంకొక మహాకవిగురించి ఎంతో తెలియవస్తున్నది. అది ముందుముందు తెలుసుకొందాం!

9

దగ్గుపల్లి దుగ్గన



నాథుడూ, బమ్మెర పోతరాజుగానూ బాపమరదు లని లోకం చెప్పుకొంటుంది గాని అది చారిత్రక సత్యం కాదన్న సంగతి మనం శ్రీనాథుని చరిత్రలో గుర్తించాం. కవిసార్వభౌమునికి దగ్గుపల్లి దుగ్గన్న అనే మరిది ఉన్నాడనీ, అతణ్ణి శ్రీనాథుడు అభిమానించి తనతో తిప్పుకొన్నాడనీ కూడా చెప్పుకొన్నాం. తన బావ గారి సాన్నిధ్యంలో చిన్నప్పట్నుంచీ పెరగడంవల్ల దుగ్గన మంచి కవి అయ్యాడు. శ్రీనాథుని దయవల్లనే తాను కవి అయినట్లు తాను వ్రాసిన 'నాసికేతోపాఖ్యానం' అనే గ్రంథంలో ఇలా చెప్పుకున్నాడు.

ఇది శ్రీమత్కమలనాభపౌత్ర మారయామాత్యపుత్ర కవిసార్వభౌమ సకలవిద్యాసనాథ శ్రీనాథమహాకవీంద్రప్రసాదలబ్ధకవితావిశేష దగ్గుపల్లితిప్పనార్యప్రియతనూజ దుగ్గననామధేయప్రణీతంబైన నాసికేతోపాఖ్యానం బను మహాప్రబంధంబు...

దుగ్గన ఈ ప్రబంధాన్ని వ్రాయడానికి ముందు

'కాంచీమాహాత్మ్యం' అనే కథ చిత్రతరంగా విస్తరించి వ్రాశాడు. దీనిని తీసుకువెళ్ళి ఉదయగిరి పాలించే పూసపాటి బసవరాజుగారి కొలువులో వుండే చెందలూరి దేవయ్య మంత్రికి అంకితమిచ్చాడు. శ్రీనాథునితోపాటు పర్యటనలు చేస్తున్నప్పుడు దుగ్గన కంచిని సందర్శించి ఉంటాడు. ఆక్షేత్ర మాహాత్మ్యాన్ని గ్రంథస్థం చేయాలనే కాంక్షతో ఈ కావ్యాన్ని చెప్పి శ్రీనాథుని మరణానంతరం ఉదయగిరి మంత్రులను ఆశ్రయించి ఉంటాడు. దుగ్గన్న వ్రాసిన 'శివ కాంచీ మాహాత్మ్యం' ఇవాళ మనకు ఎక్కడా దొరకలేదు. ఆ గ్రంథంలోని రెండు పద్యాలు మాత్రం పెదపాటి జగ్గన సంకలనం చేసిన ప్రబంధరత్నాకరంలో చేర్చడంవల్ల దక్కాయి. అవి వర్షాకాలాన్ని వర్ణించే రెండు సీస పద్యాలు. చూడండి.

క్షోణీనభంబులు నూత్రించిన టింద్రచాపంబు చాపమై సంఘటింప
బ్రహ్మాండభాండంబు పగిలించు గర్జలు సింహనాదస్ఫూర్తి జేయుచుండ
సౌదామినీదామజాలము ల్దిక్కుల స్వప్రతాపానలజ్వాలలుగను
నాహార్యహారిణోద్యదశనిసంఘంబులు దివ్యాస్త్రవితతులు తేజరిల్ల
నాశుశరవృష్టి శరవృష్టి నఖిలలోక-బాధ కోర్ద్ధిష్మభీష్మశంఖవ్రితాప
మార్చె నర్జునయుతశిఖండ్యభివర్ధ(?)-నాఖ్యవర్ష్ణ ర్తునారాయణాఖ్యమూర్తి.

బంధూక మడరించె బరపయ్యె గేదంగి కడిమి పుష్పితమయ్యె గ్రంథి పూచె
నర్జునం బలరారె నరవిందములు కేరె భూస్థలి నేరులు పుక్కలించె చెలగ
గండూపదము లుబ్బె గలరె హంసచయంబు నటియించె గప్పలు నమిలి
జాతకంబులు మించె సాగరం బెడయించె హరిగోపములతోడ నాడె లేళ్లు

మత్తభృంగంబులకు దేనె రిత్తయయ్యె-గండుకోయిలకూతలు గట్టుకొనియె చూలుకొన స్వాతి చూటి బొదువ(?)-విష్ణునకు నిద్రపోయెడి వేళయయ్యె.
[ప్రబంధరత్నాకరం, 177-78]

"ఈ కాంచీమాహాత్మ్యకథ స్కాందపురాణమందలి సనత్కుమార సంహితాంతర్గతమైన కాళికాఖండమున తీర్థస్థలప్రశంసలో చెప్పబడినది. కాంచీపురం, లేక సత్య వ్రతక్షేత్రమంచున్న క్షేత్రపాలకులందరికథలున్నూ, అనగా కచ్ఛపేశ్వరుడు, సిద్ధేశ్వరుడు, త్రిదశేశ్వరుడు, వల్మీకమాహేశ్వరుడు మున్నగు నుపదేవతలకథలున్నూ, ఆ దివ్యక్షేత్రమునకు ప్రధానముగానున్న ఏకామ్రనాథుని చరిత్రమున్నూ ఇత్యాది మాహాత్మ్యము లెన్నియో అభివర్ణింపబడియుండవచ్చును.

చతుర్వేదముల ఏకమయమూర్తి కాంచీనగరమందలి కంపానదీతీరమున ఒక మామిడిచెట్టు (ఏకామ్ర) రూపమున జనించెను. ఆ చెట్టుమొదట నర్ధేందుమౌళి యంబికాసహితుడై స్థిరనివాస మేర్పరచుకొనెను. కావున నప్పరమేశ్వరునకు నేకామ్రనాథసంజ్ఞయు, నంబికకు కామాక్షీసంజ్ఞయు కలిగెను."

ఈ కాంచీపురములో నొకభాగము విష్ణుకంచి. దాని అధిష్ఠానదైవము వరదరాజస్వామి. ఇది వైష్ణవక్షేత్రము.

ఈ శివకాంచీమాహాత్మ్యానికి మూలగ్రంథమేమిటో, కావ్యంలో ఏయే విషయాలు ఉంటాయో లేకుమళ్ళ అచ్యుతరావుగారు ఇలా చెప్తున్నారు.[1]

---

1. విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్ర, ప్రథమభాగం, పుటలు 128, 129.

శివకాంచీమాహాత్మ్యాన్ని రచించాక దుగ్గన్న బహుశా ఉదయగిరిలోనో, చెందలూరులోనో ఉండి చెందలూరు మంత్రుల ఆశ్రయంలో జీవిస్తూఉండేవాడు. ఆ మంత్రులపై చాటుపద్యాలు చెప్తూండేవాడు. శివకాంచీ మాహాత్మ్యం అంకితం పుచ్చుకున్న దేవయ్య మంత్రిగారి పెత్తండ్రికొడుకు గండయ్య మంత్రిమీద దుగ్గన్న చాటుపద్యాలు చెప్పినట్టు ఈ క్రిందిపద్యంవల్ల తెలుస్తున్నది:

హితమతివి సకలవిద్యా-చతురుండవు చాటుపద్యజాలంబుల నా
కతులితకీర్తులగలిగిం-చితి దుగ్గనకవివరేణ్య! శివకారుణ్యా! [నాసి.1_17]

తనమీద చాటుపద్యాలు చెప్పిన దుగ్గన్న 'నాసికేతోపాఖ్యానం' అనే కావ్యాన్ని - 'చదవడానికీ, వినడానికీ ఇంపైనదానిని' వ్రాస్తున్నట్టు 'సకలవిద్యాజన శ్రోత్ర పరంపరావశంబున' విన్నాడు. విన్నాక దుగ్గనకవిత్వంలోని గొప్పతనాన్ని తలచుకొన్నాడు. పరమానందంతో ఇలాగ ప్రస్తుతించాడు:

శ్రుతుల విహారదేశములు సుస్థిరవాక్యపదప్రమాణశా
స్త్రతతుల యిక్క లాగమపురాణచయమ్ముల కేలిసద్మముల్
స్మృతుల నివాసముల్ కవిసమూహితసత్కవితాగుణప్రసా
దితములు దగ్గుబల్లికవితిప్పయ దుగ్గని గద్యపద్యముల్. [నాసి. 1_15]

దుగ్గన్న గద్యపద్యాలలో వేదాలు విహరిస్తాయట. అవి శాస్త్రాలకు తావులట. ఆగమపురాణాలకు ఆటపట్టులట. స్మృతులకు ఊనికిపట్టు లట. వేదశాస్త్ర సమ్మతాలైన ప్రమాణాలతో దుగ్గన్న శివకాంచీ మాహాత్మ్యం వ్రాసి ఉండబట్టే గంగయ్యమంత్రి ఇంతగా పొగుడుతూ భాషించి

ఉంటాడు. దుగ్గన్నను తన సముఖానికి రప్పించుకొని, గంగయ్యమంత్రి శ్రీనాథుని పొగడి, "అటువంటివాని ముద్దు మరిదివి, ఇప్పుడు వ్రాస్తున్న నాసికేతోపాఖ్యానం నాకు అంకితంఇయ్యి" అని అర్థించాడు. గంగయామాత్యుడు ప్రస్తుతించినట్టూ, తన కంకితం ఇవ్వమన్నట్టూ దుగ్గన చెప్పిన పద్యాలవల్ల కవిసార్వభౌముని సర్వతోముఖ వైదుష్యం తెలుస్తున్నది, చూడండి.

సంస్కృతప్రాకృతశౌరసేనీముఖ్యభాషాపరిజ్ఞానపాటవంబు
బన్నగపతిసార్వభౌమభాషితమహాభాష్యవిద్యాసమభ్యాసబలము
నతిపాదకణాదపక్షిలోదీరితన్యాయకళాకౌశలాతిశయము
శ్రుతిపురాణాగమస్మృతిసాంఖ్యసిద్ధాంతకబళనవ్యుత్పత్తిగౌరవంబు
పూర్వకవిముఖ్యవిరచితాపూర్వకావ్య
భావరససుధాచర్వణప్రౌఢతయును
గందళింపగగాశికాఖండనైష
ధప్రముఖవివిధప్రబంధము లొనర్చి,
కవిసార్వభౌముడై కర్ణాటవిభుచేత గనకరత్నాభిషేకములు గనిన
శ్రీనాథసుకవి కూరిమిసేయు మరిదివి దుగ్గయ కవిరాజ! దగ్గుబల్లి
తిప్పనార్యునకును సతీమణి యెఱ్ఱమకును దనూజుడవు పోతనకు నెఱ్ఱ
నామాత్యవరునకు ననుగుదమ్ముండవు కౌండిల్యగోత్రు డౌ సరసమతివి
చెప్పనేర్పుప్ర కృతులు సుస్థిరముగాగ
గాన నీవు రచింపంగ గడగితిన్న
నాసికేతచరిత్రంబు నాదు పేర
నంకితముసేయు కవిరాజు లాదరింప. [నాసి. 1_18, 19]

ఇలా కృతి అడగడానికి ఇంకొక కారణం తన పిన తండ్రి కుమారునికి దుగ్గన శివకాంచీ మాహాత్మ్యం అంకితం

ఇవ్వడం కూడ అయివుంటుంది. ఆ సంగతి ఈపద్యంలో చెప్పాడు.

మా పినతండ్రి గంగయ యమాత్యశిఖామణి త త్తనూభవుం
డై పెనుపొందు దేవసచివాగ్రణి కిచ్చితి వంధ్రభాషగాం
చీపురనాథు దివ్యకథ చిత్రతరంబుగ వి స్తరించి నీ
వోపుదు వార్యహృద్యమధురోక్తుల సత్కృతు లొప్పజెప్పగన్.

[నానికేతోపాఖ్యానం, 1_20]

నిజానికి దుగ్గన్న అంతవాడే. ఆర్యహృద్యమధురోక్తులతో సత్కృతు లొప్పేటట్టు చెప్పడానికి ఓపినవాడే. చిన్నకథను తీసుకుని చిత్రతరంగా వి స్తరించి వ్రాయగల్గిన జాణడే. సలలిత కావ్యబృందాలను జాణలు వ్రా స్తే దుష్కృవులు దోషాలు ఎన్నవచ్చుగాని వాటిని ఖాతరు చేయరని దుగ్గన యీపద్యంలో చెప్పాడు:—

సలలితకావ్యబృందములు జాణలు కావ్యరసానుబంధరీ
తుల గొనియాడ దుష్కృవులు దోషము లెన్నగ జూతు రట్టె యీ
వెలదుల మేన నేర్పరులు విభ్రమలీలలు చూచి మెచ్చనీ
గలు వ్రణమర్మముల్ వెదకుగాక యెరుంగునె తద్విలాసముల్?

[నానికేతోపాఖ్యానం, 1_9]

ఈ పద్యంలో దుగ్గన నన్నెచోడుని అక్షరాలా మక్కికి మక్కి అనుసరించాడు. నన్నెచోడుడు కుకవినిందలో వాళ్లను ఈగలతో పోల్చాడు (కుమారసంభవం, 1–30). నన్నెచోడుని ఇలా అనుసరించినా దుగ్గన అతణ్ణి పూర్వకవి స్తుతిలో పేర్కొనలేదు. ఆ మాట కొస్తే అతణ్ణి ఏ తెలుగు కవీ నుతించలేదు. దుగ్గన ప్రస్తుతించిన తెలుగుకవులు

కవిత్రయంలోని వాళ్లే.ఎర్రయగారి యింటిపేరు 'చెదలువాడ' అని దుగ్గన మాటలవల్ల తెలుస్తున్నది. కవిత్రయంవారి ప్రభావం దుగ్గన రచించిన నాసికేతోపాఖ్యానంలో పూర్తిగా కనబడుతుంది.

శౌనకాది మహాములులు తమ కెలాంటి కథ వినాలని ఉందో సూతునికి చెప్పారు. ఆ సంగతి నన్నయగా రిలా వ్రాశారు:

ఏయది హృద్య మపూర్వం-బేయది యొద్దాని వినిన యెరుక సమగ్రం
బైయుండు, నఘనిబర్హా-ణమేయది యక్కథయ వినగ నిష్టము మాకున్.
[భారతం, 1_1_30]

ఈ పద్యాన్ని దుగ్గన అనుసరించాడు. ఎలాటి కథను తెలుగుచేస్తే బాగుంటుందా అని అతడు ఇలా భావించాడు:

ఏకథ పురాణసమ్మత మే-కథ వేదప్రసిద్ధ మేకథ పుణ్య
శ్లోకస్తుత్యగుణాన్విత-మేకథ చదువంగ వినగ నింపై యుండున్.
[నాసికేతోపాఖ్యానం, 1_11]

ఇన్ని షరతులతో కూడుకొన్న కథావిశేషంకోసం దుగ్గన అన్వేషించాడు. నాసికేతోపాఖ్యానం దొరికింది. అది సకలధర్మమర్మజ్ఞాపకం, దురితదూరీకరణపారీణం, అపూర్వ ఆశ్చర్యభుర్యం, సకలపురుషార్థసాధకం అని నిశ్చయించాడు. ఆ యితిహాసాన్ని తెలుగుచేయదలిచాడు. నాసికేతుని కథ కఠోపనిషత్తులోనూ, భారతం అనుశాసనిక పర్వంలోనూ ఉంది. అయితే ఆ కథలకూ, దుగ్గన్న వ్రాసిన కథకూ చాలా తేడా ఉంది. అంతమాత్రాన ఇది దుగ్గన్న

స్వకపోలకల్పితం కాదు. ఇతడు వ్రాసినదానికి సరిపోయే సంస్కృతమూలం ఒకటి లేకపోలేదు. అది పూనాలోని భండార్కరు పుస్తకభాండాగారంలో ఉంది. ఈ మూల ప్రతిని పరిశీలించి అందులోని కథను సవిస్తరంగా వేకుమళ్ళ అచ్యుతరావుగారు పొందుపరిచారు.[1] ఒక్క మూలకథనే కాక, కఠోపనిషత్తులోని కథ, భారతంలోని మూలకథ, దుగ్గన్న వ్రాసిన చరిత్ర అన్నీ చర్చించారు.

నాసికేతోపాఖ్యానం ముఖ్యంగా యమలోకాన్ని వర్ణించడానికి. ఏయే పాపాలు చేస్తే, యేయే శిక్షలు వేస్తారో చెప్పడానికీ పురాణకర్తలు ఉద్దేశించారు. కావ్యకర్త మాత్రం దాన్ని వేరే అభిప్రాయంతో తీసుకున్నాడు. నిరంతర బ్రహ్మచర్యం పనికిరాదనీ, మునులు సహితం గృహస్థాశ్రమం స్వీకరించాలనీ ప్రబోధించడానికి ప్రయత్నించాడు. బ్రహ్మమానసపుత్రుడైన ఉద్దాలకు డనేముని అడవిలో తపస్సు చేసుకొంటున్నాడు. 'పెళ్ళిచేసుకొని ఒక ఇంటివాడవు క'మ్మని తోటిమునులు చెప్పారు. లాభం లేకపోయింది. అతణ్ణి పుట్టించిన జేజెమ్మ వచ్చి చెప్పాడు. ముని వినలేదు. బ్రహ్మకు వళ్ళు మండింది. "నీ కొడుకే నీకూ, నీ పెళ్ళానికీ పెళ్ళి చేస్తాడు పో" అని శపించాడు. ఆ శాపప్రకారం ఉద్దాలకునికి కొడుకు పుట్టనూ పుట్టాడు; తల్లితండ్రులకు పెళ్ళీ చేశాడు. ఆ తరువాత వాళ్ళు సుఖంగా ఉండేటప్పుడు ఒకసారి తండ్రికి కోపం వచ్చి కొడుకును "యమలోకానికి

---

1. విజయనగరసామ్రాజ్యమందలి ఆంధ్రవాఙ్మయచరిత్రము, ప్రథమభాగం (క్రీ. శ. 1330–1500), పుట 135.

పో'' అని శపించాడు. కొడుకు అలాగే పోయి, తిరిగివచ్చి తాను చూసిన విషయాలన్నీ మునులకందరికీ చెప్పాడు. ఇదీ ఈ కావ్యంలోని కథ.

అడవిలో ముక్కు-మూసుకుని కూర్చునేవాడికి-పెళ్ళి చేసుకోనని భీష్మించుకున్నవాడికి కొడు కెలా పుట్టాడు? ఆ బిడ్డ తల్లితండ్రులకు ఎలాగ పెళ్ళిచేశాడు? అన్నవే కుతూహలాన్ని రేకెత్తించే ప్రశ్నలు. ఉద్దాలకుడు పట్టుదలకు పెళ్ళి వద్దన్నాడేగాని నిద్రలో సర్వప్రజలకూ సహజమైన స్వప్నాలు రాకుండా ఉంటాయా? కలగన్నాడు. అందులో ఒక వన్నెలాడి కనిపించింది. ఆమెతో భోగించినట్టు భావించాడు. వీర్యస్ఖలనమైంది. దాని నా ముని ఒక తామర పూవులో నిక్షిప్తం చేసి ఆకులు చుట్టి తూళ్ళతో కట్టి నదిలో పారవేశాడు. అది కొట్టుకొని వెళ్ళి వెళ్ళి ఒక రాచవారి చిన్నదానికి దొరికింది. ఆమె ఆ పొట్లం విప్పి అందులోని పువ్వును చూసి, తీసి గట్టిగా వాసన చూసింది. ఇంకే ముంది? కొంప మునిగింది! కొన్నాళ్ళ కామె నెల తప్పింది.

పళ్ళకూ, పాయసాలకూ పిల్లలు పుట్టరనీ, మగవాని వీర్యంవల్లనే సంతానం కలుగుతుందనీ గుర్తించిన తొలిరోజులలో మన ఆదిపురాణ కర్తలు ఇలాంటికథలు ఎన్నో కల్పించారు. మహాభారతంలోని మహానుభావులు ద్రోణుడు, కృపుడు, ద్రుపదుడూ కామాతురులైన మునుల రేతఃపతనంవల్ల పుట్టినవాళ్ళే. భారతీయులకు పరమ పూజ్యురాలైన సీతామ్మవారుకూడా ఇలాగ పుట్టిందే. తన జన్మ

వృత్తాంతాన్ని ఆమె అనసూయతో నిస్సంకోచంగా చెప్పుకుంది. మేనకనుచూసి మరులుకొన్న జనకుడు 'బీజముష్టి విక్షేపం' చేసేటప్పుడు సీత జన్మించింది.[1] పురుషవీర్యాన్ని ధరించిన స్త్రీలేకాక, నేల, నీరు, రెల్లుగడ్డి మొదలైనవీ, చేపలు వగైరా జీవులుకూడ బిడ్డల్ని కంటాయని వివిధ పురాణాలు మన వాళ్లు కల్పించారు. ఆదిమశాస్త్రజ్ఞులు చెప్పిన గోరంత సత్యంతో ప్రాచీన భావుకులు కొండంత పురాణ సంచయాన్ని నిర్మించారు.

ముక్కు మూసుకొని తపస్సు చేసుకొనే మునివీర్యాన్ని ముక్కుతో వాసనచూడడంవలన పుట్టినవాడు కనుక ఆ బిడ్డకు 'నాసికేతుడు' అని పేరుపెట్టారు.

నాసికాంత సముద్భూతః సర్వలక్షణ సంయుతః
నాసికేతు రితి ఖ్యాతః మునిభిః కృతమంగళః.

అని మూలంలో ఉంది. ఇతణ్ణే 'నాచికేతుడు' అని కొందరు చకారయుతంగా వ్యవహరిస్తారు. భారతంలోనూ, కఠోపనిషత్తులోనూ అలాగే వుంది.[2] అయితే దుగన నాసికేతుని జన్మవృత్తాంతంకూడా వ్రాయడంవల్ల ఔచిత్యవంతమైన పేరునే పెట్టాడు. వాస్తవానికి, దుగ్గన, మూలంలో ఉన్న అనౌచిత్యాన్ని పరిహరించి చక్కని పాత్రపోషణతో కథ నడిపాడు.

---

1. భాస్కర రామాయణం, అయోధ్య. 432-437.
2. భారతం. అనుశాసనికం. 2 : 446-462. కఠోపనిషత్తు ప్రథమాధ్యాయం. ప్రథమవల్లీ ప్రథమ శ్లోకంలోనే నాచికేతు డనే పేరుంది.

మునిచరమధాతువును ఆఘ్రాణించి నెలతప్పిన చంద్రవతి తన అకారణ గర్భానికి అగ్గిలించి, ఉప్పొంగే కన్నీరు నఖాంకురాలతో మీటుతూ, ఏమని చెప్పుకోవాలో తెలియక 'కొంకిన గర్భము దాగనేర్చునే' అని భావించి తన పరిస్థితిని తలితండ్రులకు చెప్పమని చెలిక త్తెలను కోరింది. వాళ్ళు వెళ్లి రాజుకు చల్లగా తెలియజేయగానే అతడు వెంటనే మూర్ఛపోయాడు. తరువాత తెప్పరిల్లి ఇలా బాధ పడ్డాడు.

రాజవంశములోన పూజనీయం బైన
కులము సత్కీర్తులు కోలుపోయె
బహుల సదాచార పావన మైన గో
త్రంబు నీనిందకు పాత్రమయ్యె
బాంధవకోటికి ప్రమదంబు గావించు
నిలువడి పెంపెల్ల నిలువబడియె
లోకవిఖ్యాత మై యేకళంకము లేని
యభిమాన గరిమకు వోని కర్లె
వసుధ సరివారిలో తలవంపు లయ్యె
గన్నియల గన్న వారిలో కష్టపడితి
గాని వారిలో నేను నొక్కరుడ నైతి
గుతిలపడితిని గొరగాని కూతు గాంచి.
[నానికేతోపాఖ్యానం, 1-181]

ఈ కొరగాని కూతురు యెంతకైనా తెగిస్తుందని మండిపడ్డాడు.

నెఱియలి పాతకంబునకు నిందకు రోయక రంతుసేసి మా
కొరుగక జెప్పుడంచు మది యించుక నేనియు గొంకులేక యీ

పరచుల[1] నెల్ల నాయెడకు బంచిన దిమ్మొయి నిట్టికితవం
బరిమురి నెట్లు నేర్చినొకొ యంతకు నేర్చిన దింత నేరదే!
[నాసికేతోపాఖ్యానం, 1_183]

దీనికి ప్రాయశ్చిత్తం ఆమెను అడవికి పంపడమే అనుకున్నాడు. "త్యజే దేకం కులస్యార్థే" అన్న నీతిని అవలంబించాడు. భృత్యులను పిలిచాడు. ఇలా చెప్పాడు:

దీనికి మీర్ ప్రతి చెప్పక_దానిని గొనిపోయి ఘోరదారుణ వనసం
స్థానముల పాలు సేయుడు_వానికి నిరవైన కూతు నర్మిలి యేలా?
[నాసికేతోపాఖ్యానం, 1_192]

ఈ పద్యంలో 'మీరు' అనే మాటలో ఉకారలోపం ఉంది. పండితారాధ్యుడూ, పాల్కురికి సోమనాథుడూ కొండర్, అనియెదర్, కొనినవార్ మొదలైన ఉకారలోప రూపాలను వాడినట్లు మనం ఇంతకు ముందు గమనించాం.[2] పండితయ్య సోమనాథులలాగ దుగ్గనకూడా శైవుడే. కాని వీరశైవుడు కాదు. నాసికేతోపాఖ్యానం మంగళాచరణంలో విష్ణువును మొదట నుతించాడు. దుగ్గన తిక్కనగారి దారిలో, ఎర్రయగారి పద్ధతిలో సంచరిస్తాడు. భర్త అడవిలో విడిచిపెట్టించినప్పుడు సీతమ్మ ఎలా భావించిందని తిక్కనగారు వ్రాశారో ఆపోలిక లున్న పద్యాలను తండ్రి వెళ్ళగొడితే అడవులపాలైన చంద్రవతి భావాలుగా వ్రాశాడు. చూడండి:

---

1. 'పఱచు' అనే మాటకు 'దుష్టుడు, దుష్టురాలు, చెడ్డది, వ్యభిచారిణి, కులట' అనే అర్థాలు నూర్యరాయాంధ్రనిఘంటువులో ఇచ్చారు. దుగ్గన్న ప్రయోగంవల్ల, అన్నెం పున్నెం ఎరుగనివాళ్ళనుకూడా పరచులు అనవచ్చు అని తెలుస్తోంది. పెళ్ళికాకుండా రాచబిడ్డ నెల మసలిందని చెప్పడానికి వచ్చినవాళ్లు కులటలు కారు కదా.

2. సమగ్ర ఆంధ్రసాహిత్యం, I చాళుక్య యుగం, పుట 250.

ఎవ్వరే నిశాక్రున కేల వచ్చితి వన్న నేమని యుత్తరం బిచ్చుదాన?
నేరీతి విఫలసంసారంబు నపకీర్తి ముంచుచు వెడలంగ బోవుదాన?
నిర్మానుషంబైన నిబిడ దుర్గముల నెవ్వారలు దిక్కని చేరుదాన?
దిగ్భ్రాంతి చేయు నీ దీర్ఘాటవులలోన నేత్రోవ నెయ్యెడ కేగుదాన?
భాగ్యహీనత కేమని పనగుదాన-జెనటిబాముల కేమని వనరుదాన
మాయగర్భంబు గలిగించి మన్నిగొన్న-దుష్టదైవంబు నేమని దూరుదాన?
[నానికేతోపాఖ్యానం, 1-207]

ఈ పద్యానికీ. నిర్వచనోత్తర రామాయణం (9-35) లోని భావాలకూ పోలిక లున్నాయి. తిక్కనగారి గ్రంథంలో రాముడు సడికన్న చావు మేలని తలిస్తే, చంద్రవతి 'సడి తోటి బ్రతు కదేటికి, విడిచెద ప్రాణములు' అనుకొంది గాని తాను గర్భవతి. భ్రూణహత్య పాపమని కిన్నెరకంఠి విముక్తకంఠయై రోదించింది. "కొండలకుంది పెల్లోరలు కొంచగట్టి మోర వెట్టుచున్న" ఆమె ఆర్తదానం తృణ బిందుడనే ఋషి విన్నాడు. ఆదుకొని ఆశ్రమానికి చేర్చాడు. అక్కడ ఆమె ప్రసవించింది. రోజూ కుమిలిపోతూ ఇలా రోదించేది.

మాతామహుండును మాతామహియు జేయు
గారాము గైకొనం గానవైతి
యానందమున నెత్తి యర్మిలి ముద్దాడు
మేనమామల మేలు గానవైతి
గరిమ నక్కున జేర్చి శిరసు మూర్కొను తండ్రి
కౌగిట మెలగగా గానవైతి
యుత్సంగమున నుంచి వాత్సల్యమున దాది
గైసేయు మోహంబు గానవైతి
పరిజనంబులు సఖులును ప్రమద మెసగ
బూని యొనరించు ప్రియమును గానవైతి

చుట్టములకెల్ల వెలువడి రట్టువడిన
నాకు జనియించి యిట్లైతివే కుమార !

[నాసికేతోపాఖ్యానం, 1-236]

తన కెందు కిలా ఆరడిచూలు వచ్చిందని ఏడ్చింది. 'నా కెందుకు పుట్టావురా కొడుకా!' అని బాధపడింది. ఇత డెవ్వరి కొడుకని అడిగితే తండ్రిపేరు ఎలా చెప్తానని శోకించింది. తల్లితండ్రుల వియోగం, నీలాపనింద, అరణ్యవాసం అన్నీ కలిసి ఒక్కసారి బాధపెట్టేసరికి పుత్రవాత్సల్యం విస్మరించి ఆ కొడుకును ఒక పెట్టెలో పెట్టి నీళ్లలో వదిలి పెట్టింది. కర్ణుని వదలినప్పుడు కుంతి సకలదేవతలనూ కాపు పెట్టిందని ఎర్రయ అరణ్యపర్వంలో (7-348) చెప్పినట్టే దుగ్గనకూడా 'ఫలభాగంబునన్ గరకమలంబులు మొగిడ్చి భాగీరథికిం బ్రణామంబు జేసి" సకలభూతంబులను సకలలోక పాలకులను సకలదేవతలను ప్రార్థించింది (నాసి. 7-239). ఎటొచ్చీ ఎర్రయగారు పద్యంలో చెప్పారు; దుగ్గన్న వచనం వ్రాశాడు.

చంద్రవతి బిడ్డను నీళ్లలో వదిలిపెట్టి "ఈ కుక్షిరాడు తన జననానికి కారణభూతుడైన ఆ మహానుభావుని చేరు గాక!" అనుకొంది. కుక్షివాడున్న పెట్టెను గంగ చంకను పెట్టుకు కొనిపోయినట్టు అది కదలాడింది. వెళ్లి వెళ్లి తండ్రిని చేరుకొంది. అద్దంలో తన నీడలా కనబడే కుమారుణ్ణి తండ్రి తీసుకున్నాడు. సంతోషించాడు.

అనఘుం డీ పసి బిడ్డడు-మనుకొని నాకిప్పు డింత ముద మొందవించెన్
దనుగన్న తల్లిదండ్రుల-కొనరగ వీడెట్టి మోహ మొనరించునొగో!

[నాసికేతోపాఖ్యానం, 1-243]

అని భావించాడు. ఆబిడ్డను పెంచడం మొదలుపెట్టాడు. అతనికి క్రూరత్వాన్ని నాకడమే లోకమైంది. తన కుమారుడని తెలియకుండా తండ్రి అలా పెంచుతూంటే తల్లి రమారమి ఉన్మత్త అయింది. "తల్లిదండ్రులకు కానిదాన నైతి, దోడ బుట్టువులకు దూరమైతి, సుతుని కన్నులనైన చూచుచుండ కతని పేరేటి వరుత పోనాడికొంటి" అని విలపించి బిడ్డను వెతుక్కొంటూ బయలుదేరింది. చివరకు ఒకచోట కన బడ్డాడు. ఆమె అతివేగంగా

చిక్కక గొగలించు తన చెక్కిల బాలకు చెక్కి జేర్చు నిం
పెక్కి శిరంబు మూరుకొని యేడ్చుచు నచ్చెరువందు నాత్మలో
మక్కువతోడ మైనిమురు మాటికి మాటికి మోము జూచుచున్
గ్రక్కున గ్రుచ్చి యెత్తుకొను గామిని చన్నులు చేపుచుండగన్.

తరువాత కొడుకుతో ఇలా ఉంది :

అక్కటికంబు మాని నిను నమ్మోయి బారగవైచి చన్న నా
కక్కట కన్నతల్లి యని యర్మిలి నేసెద వన్న! భూమిలో
నెక్కడ నాడు బుట్టువుల కేకరినట్టులు దైవ మిట్లు నిన్
రక్కసినైన నా కడుపునఁ గలిగించెనె పాపజాతియై!

[నాసికేతోపాఖ్యానం, 2_14]

అని తన్ను తాను నిందించుకొని "కడుపున పుట్టిన బిడ్డలను ఏట్లో కలపడానికి ఏ పడతులకైనా, నిర్దయాత్ముల కైనా చెల్లుతుందా. నాకు చెల్లిందికాక!" అనుకొంది. తరువాత, ని న్నెవరు ఆదుకొన్నారు? ఎవరు పెంచుతున్నారు? అని అడిగింది. క్రూరవాడు బదులుచెప్పాడు. ఆపిమ్మట ఆమె ఇలా అడిగింది:

తనయ! నీ వాకొన్న తరి యెరింగి మునీంద్రు
డెపుడు నీ కాహార మేమి పెట్టు?
నే పదార్థము లిచ్చు? నేమని మాట్లాడు?
మూని ని న్నేరీతి మరపికొనియె?
నాతోడి ప్రేముడి నను దలంపపు కదా
మతిలేక మరిచిపోయితివె నన్ను?
దగ నానికేతాభిధానుండ వీవని
ఋషివరుం డే వెంట నెరిగె నిన్ను?
నత్తపస్వికి బంధులు నాప్త జనులు
తల్లిదండ్రులు గురులు సోదరులు కలరె?
యతని యాకృతి యేరీతి, యతని మేని
వర్ణ మే చాయ, యీత డే వయసువాడు?

[నానికేతోపాఖ్యానం, 2-23]

కుబ్రాడు అడిగిన ప్రశ్నలన్నిటికీ జవాబు చెప్పలేక పోయాడు. ఆమె వాసకసజ్జికలాగ మునిరాకకోసం ఎదురు చూసింది. ఆశ్రమాన్ని అలంకరించింది. ముని వచ్చి కుబ్రాడిని చూశాడు. ఈ అలంకారాలు కుబ్రవాడికి చేతకావు. మరి ఎవరు చేశారు? ప్రశ్నించాడు. కొడుకు చెప్పాడు. ముని ఆమెను ఎదుటికి తీసుకు రమ్మన్నాడు. అప్పు డామె మనస్సులో ఇలా అనుకొన్నదట.

అవ్వరమౌని నన్ను గని యాదరణంబున గారవించి నీ
వెవ్వరిదాన వే యనిన నేమనుదాన? 'సహాయహీనవై
యివ్వనభూమి గ్రుమ్మరగ నే'లనిన న్మరి(యేమి)యు త్తరం
బెవ్వరు బుద్ధి చెప్పగల రిత్తరి బోదునొ పోక యుందునో!

[నానికేతోపాఖ్యానం, 2-43]

ఎలాగైతేనేం, వెళ్ళి ఎదుట పడింది. ఒకరి నొకరు చూసుకున్నారు. మన్మథవికారాలు కలిగాయి. 'అలనాడు రాత్రి కలలో కనపడ్డ దీ పిన్నది కాదె' అని అత డను కొన్నాడు. ఒకరి సంగతులు ఒకరికి చెప్పుకున్నారు. చివర కతడు తన తమకం తేటపడగా చెప్పాడు. ఆమెను చెట్టపట్ట దలిచాడు. ఆమె—

జిలిబిలివోవు చేతలక సిగ్గులు నిగ్గులు వన్నెవెట్ట వే
నలి యర వీడుచుండ జరణంబులు దొట్రిల గ్రాలుగన్నులం
దొలకెడు మందహాసములు తొంగలి రెప్పలలోన డాగగా
నలికులవేణి యోసరిలె నల్లన బయ్యెద సంతరింపుచున్.

ఇట్లు మైదిగిచికొని యత్తెరవ కృతాంజలియై యమ్మానివరుని కిట్లనియె.

నీచే వడ్డది సొమ్మిది-వాచంయమ వేగపడగవలవదు కృపతో
నాచనవు లీయకొని కా-లోచితధర్మకృతనిశ్చయుండవగు మనఘా!
ఉపయమతంత్రమ సతులకు-నుపనయనం బంద్రు పెద్ద లోమునివర! నీ
కృప నాకు నట్టిశోభన-ముపలబ్ధముగాగవలదె యుర్వీయోరుంగన్?

[నానికేతోపాఖ్యానం, 114-117]

ముందు పెళ్ళి చేసుకోవాలని షరతు పెట్టింది. ముని అంగీకరించాడు. రాజుకు కబురు పెట్టాడు. బ్రహ్మమానస పుత్రుడు అల్లు డవుతున్నాడని రాజు బ్రహ్మానందం పొందాడు. కుమార్తెకు వచ్చిన అపవాదు తొలగిందని సంతోషించాడు. పెళ్ళి చేశాడు. పెళ్లిప్రయత్నాల నుంచి అంపకాలదాకా దుగ్గన్న 65 గద్యపద్యాలలో వర్ణించాడు (2-157 నుంచి 2-221 దాకా). ఇంతకుముందున్న కావ్యాల

లోని వర్ణనలలాగే ఉన్నాయిగాని కొత్తదనం లేదు. తన తల్లితండ్రుల పెళ్ళి జరుగుతున్నప్పుడు ఆపందిట్లోనే ఉన్న నాసికేతుని చేష్టలు మాత్రం చిహ్నవ్వు పుట్టిస్తాయి– చూడండి.

పరిణయద్రవ్యసంపాదనపరులైన వృద్ధపురంధ్రులు వేగుదెంచు
తలఁబాలుతరి తల్లిదండ్రుల శిరముల దానును శేషాక్షతములు జల్లు
నాశీర్వదించు విప్రామరవరులతో దానును గూడి మంత్రములు నొడువ
తరుణీజనులు పెండ్లిధవళింబు వాడంగ నాగీతములు దాను ననువదించు
తల్లిబలగంబువారును తండ్రివంక–వారు నుత్సంగతలముల గారవించి
వీడ పెండిలిపెద్దని వేడ్క చూడ–తల్లితండ్రుల కతిమహోత్సవము జేయు.
[నాసికేతోపాఖ్యానం, 2–202]

పెళ్లి అయాక బిడ్డతోపాటు వధూవరులు ఆశ్రమానికి వెళ్లారు. కొన్నాళ్లకు తండ్రికి, బిడ్డకు అభిప్రాయభేదాలు వచ్చాయి. తండ్రిహోమానికి కుమారుడు సమిధలు తీసుకురా లేదు. మునికి కోపం వచ్చింది. 'అన్నిటికంటె ముఖ్యమైన హోమాన్ని మాన్పించావు. నీవు నాకొడుకువా?' అని తిట్టాడు. ఇలా చెప్పాడు:

వినుము బ్రాహ్మణునకు వేదంబు ముఖ్యంబు
వేదములును యాగవిధుల నొడువు
యజ్ఞములకు మూల మగ్నిహోత్రముగాన
యగ్నిహోత్రసేవ యాత్మసేవ. [నాసికేతోపాఖ్యానం, 3–13]

దానికి కుమారు డిలా సమాధానం ఇచ్చాడు:

అగ్నిహోత్రంబు మేలని యానతిచ్చి
తనఘు! యోగంబు మేలందు రాత్మవేదు

లాత్మవిద్యానుధారస మాస్వదించు
మనసు సే(?)శ్వరకర్మముల్ మరగు నెట్లు?
ఎన్నిక్రతువులు సేసిన నేమిఫలము?
మగుడవలయును సుకృతంబు తెగినయపుడు
యపునరావృత్తికిని మూల మాత్మవిద్య
యాత్మవిద్యావిదూషణ మఘము జేయు.

[నాసికేతోపాఖ్యానం, 3_15, 16]

దానితో తీవ్రగోషుడై తండ్రి కుమారుణ్ణి యమలో కానికి పొమ్మని శాపం ఇచ్చాడు. నాసికేతుడు యమున్ణి చూసి, అతణ్ణి మెప్పించి తిరిగివచ్చాడు. పరలోకవిశేషాలు అడిగినవారందరికీ సవిస్తరంగా చెప్పాడు. 3 వ ఆశ్వాసంలో 58 వ పద్యంనుంచి ఆ కథనం మొదలవుతుంది. 187 పద్యం దాకా గ్రంథం దొరికింది. ఆతరువాత ఎంత ఉందో తెలియదు. ఉన్న గ్రంథంలో కూడ శిథిలాలు ఎక్కువ. అయితే, శ్రీనాథుని ప్రియశిష్యుని కావ్యం కొంతవరకైనా నిర్దుష్టమై నది దొరికిందనీ, కథాభాగ మున్నది శిథిలమవలేదనీ సంతోషించాలి.

దుగ్గన్న శ్రీనాథుని శిష్యుడైనా చాలా విషయాలలో బావగారి పద్ధతులను ఒంటపట్టించుకోలేదు. కృతిపతి వంశచరిత్ర రాస్తున్నప్పుడు శ్రీనాథు డెన్నో చారిత్రకవిషయాలు చెప్తాడు. వాస్తవానికి రెడ్డిరాజుల చరిత్రను సమన్యాయం చేయడానికి శ్రీనాథుని రచనలు ఎంతో తోడ్పడుతాయి. దుగ్గన నాసికేతోపాఖ్యానంలో చెందలూరిమంత్రుల వంశాన్ని 53 గద్యపద్యాలలో 1-22 నుంచి 1-75 దాకా

వర్ణించాడుగాని ఒక్క చారిత్రకవిషయంకూడా చెప్పలేదు. అయితే అనంతరకవులు అనుసరించడానికి అనువైన పద్యాలు కొన్ని అందులో ఉన్నాయి. చూడండి.

రాజు నవీనకాంతి రతిరాజు విలాసమునందు వాహినీ
రాజు గభీరతన్ ఖచరరాజు నిరంతరదానశక్తి రా
రాజు రమాసమృద్ధి నని ప్రస్తుతిసేయగ సర్వలోకసం
పూజితుడైన కొమ్మయ సుపుత్రుడు గంగన మించె నిమ్మహిన్.

[నానికేతోపాఖ్యానం, 1_48]

ధనపక్షంలో చెప్పిన ఈ పద్యానికి ఋణపక్షంలో అనుకరణ:

రాజు కళంకమూర్తి రతిరాజు శరీరవిహీను డంబికా
రాజు దిగంబరుండు మృగరాజు గుహాంతరసీమవర్తి వి
భ్రాజితపూసపాడ్వజయరామనృపాలుడు రాజుగాక యీ
రాజులు రాజులే పెనుతెరాజులుగాక ధరాతలంబునన్?

[సూరకవిచాటుధార]

దీనిని అడిదం సూరకవి ప్రాశాడు. ఇతడు దుగ్గన పద్యాన్ని చదివేవుంటాడు. అరుణాస్పద మనే పురాన్ని వర్ణిస్తూ అల్లసాని పెద్దన్నగారు "అచటి విప్రులు మెచ్చ రఖిలవిద్యాప్రౌఢి ముదిమదితప్పిన మొదటి వేల్పు" (మను. 1-504) అని యేయేవర్ణాలవాడు ఎలా ఉంటాడో వర్ణించారు. దుగ్గన్న తన కృతిపతివంశంలోని దుగ్గమంత్రి చేసే దానాలకు తృప్తిపడి కల్పవృక్షాన్నీ, కామధేనువునూ లక్ష్యపెట్టరని ప్రాశాడు. చూడండి.

పూరువున నున్న కల్పకము బ్రోది యొనర్పరు దొడ్డిలోపలన్
దిరిగిన కామధేనువుల దేరకొనంగనుగోరు కొంగునన్
బెరసిన దివ్యరత్నము గణింప రనంతయదుగ్గమంత్రియ
చ్చెరువుగ నిచ్చు నర్థముల జెందిన సత్కవి రాజవర్యులో.

[నానికేతోపాఖ్యానం, 1-65]

ఈ పద్యాన్ని చదివాకనే పెద్దనగారు అవ్యక్తంగా 'అచటి విప్రులు', 'కెలకుల నున్న తంగెటిజున్ను' అనే రెండు పద్యాల రచనకు మనసు సిద్ధంచేసుకొని ఉంటారు. అనంతరకవులలో ఈమాత్రం ఛాయలు పడనిచ్చే కవి తక్కువ వాడు కాదు. దగ్గుపల్లి దుగ్గన్న శ్రీనాథుని బావమరిది కాకపోయినా చదువతగిన కవే.

10

ఆంధ్రకవి రామయ్య



న తెలుగు కవులందరూ వాస్తవానికి ఆంధ్ర కవులే అయినా ఇంటిపేరువల్లగాని, బిరుదువల్లగాని ఆంధ్రకవి ఒక్కడే ఒక్కడు మనకున్నాడు. అతని పేరు రామయ్య. ఇతడు 'ఏష్ణుకాంచీ మాహాత్మ్యం' అనే ప్రబంధం వ్రాశాడు. ఈ గ్రంథం నేడు లభ్యం కావడంలేదుగాని ఇందులోని పన్నెండు పద్యాలు మాత్రం ఒక సంకలనగ్రంథకర్త ధర్మమా అని దొరుకుతున్నాయి. ఆంధ్రసాహిత్యపరిషత్తువారి కార్యాలయంలో 'ఉదాహరణపద్యములు' అనే వివిధకావ్యాలలోని పద్య సంకలనం ఉంది. అందులోనివే ఇవి.

'ప్రబంధరత్నాకరం' అనేఇంకొక సంకలనగ్రంథాన్ని క్రీ. శ. 1550-60 ప్రాంతాలలో ఉండిన పెదపాటి జగ్గన్న నిర్మించాడు. అతడు ఆంధ్రకవి రామయ్యపద్యాలు సేకరించలేదుగాని వాసిరాజు రామయ్య అనే కవి వ్రాసిన

'బృహన్నారదీయం' అనే కావ్యంలోనివి 3 పద్యాలు ఉదాహరించాడు. ఈ రామయ్యలు ఇద్దరూ ఒక్కరేనా, లేక విభిన్నులా అన్నది భావిపరిశోధనవల్ల తేలవలసిందే.

శ్రీనాథుని భావమరది దగ్గుపల్లి దుగ్గన 'శివకాంచి మాహాత్మ్యం' వ్రాశాడు. అతడు శివకంచిమహిమను కీర్తిస్తే ఈ రామయ్య 'విష్ణుకంచి' ఘనతను చాటడానికి ఈ పుస్తకం వ్రాసిఉంటాడు. అందుచేత ఈ రామయ్య దుగ్గన్నకు సమకాలికుడో, లేక కొద్దిగా సమీపకాలంలోని అర్వాచీనుడో అవుతాడు.

ఈకవి రాయలసీమవాడైవుంటాడని చాగంటి శేషయ్యగారు ఊహించారు[1] గాని ఆ ఊహకు ఆధారం చూపలేదు.

విష్ణుకాంచీక్షేత్రమాహాత్మ్యం ఏ పురాణంలో ఉందో తెలియదుగాని పూర్వగాథాలహరిలో 'కంచి' గురించి ఇలా ఉంది.

కంచి: ముక్తిదాయకమగు క్షేత్రములలో నొకటి. ఇది తొల్లి సత్యవ్రత క్షేత్రం బనబడునది. ఇచ్చటనే బ్రహ్మ విష్ణువును గూర్చి యశ్వమేధయాగము చేసెను. ఆ యాగము చూడవచ్చువారి సదుపాయమునకు బ్రహ్మ విశ్వకర్మను రావించి యిట నొక పట్టణము నిర్మింపుమనియె. అతడు నిర్మించిన పట్టణమే కంచి.

మన ప్రాచీనగాథలలో ముగ్గురు సత్యవ్రతులు ఉన్నారు. ఒకడు ద్రవిడదేశాధీశ్వరుడు వైవస్వతమనువు.

---

1. ఆంధ్రకవితరంగిణి, 8 వ సంపుటము, పుట 233.

రెండవవాడు దేవీభాగవతంలోనివాడు. మూడవవాడు భారతంలోని సుశర్మసోదరుడు. ఈ ముగ్గురిలోను మొదటి ఇద్దరికి, విష్ణుకంచికి ఏదైనా సంబంధం ఉందేమో.[1] ఆ కార్యక్రమాలగురించి తెలుసుకొందాం.

సత్యవ్రతుడు: ద్రవిడ దేశాధీశుడు.[2]

సత్యవ్రతుడు: దేవవత్తుడను బ్రాహ్మణునికుమారుడు.[3]

ఇందులో ఏ సత్యవ్రతునిగురించి ఈ కావ్యం చెప్తుందో, అసలు చెప్పదో తెలియదు. ఈ కావ్యాన్ని వ్రాయడానికి ముందు ఆంధ్రకవి రామయ్య పూర్వకవులను ఇలా స్తుతించాడు:

పూర్వకవిస్తుతి: కాళిదాసు :—

ద్రాక్షాపాకనవీనవైఖరి బ్రబంధస్తోమముల్ సెప్పి యా
ధ్యక్షుండయ్యె మహాకవీంద్రులప నాహా! యెట్టి పుణ్యాత్ముడో
పాక్షాద్భారతిగాక యీతెడు మనుష్యవ్యక్తియే యంచు సం
లక్షింపం దగు కాళిదాసు గృతిలీలావ్యాసు గీర్తించెదన్.

[ప్రబంధ. 418]

కాళిదాసును ఇంత స్తుతించడంవల్ల అతని కావ్యాలలోనుంచి శ్లోకాలను అక్కడక్కడ అనువదించి తన కావ్యంలో పొందుపరిచేవాడేమో అనిపిస్తుంది. ఇతడు ఏ ఇతరసంస్కృతకవులను స్తుతించాడో తెలియదుగాని తెలుగు కవులను స్తుతించిన పద్యం లభిస్తున్నది. అందులో రమారమి ముఖ్యులందరూ ఉన్నారు. చూడండి.

---

1. పూర్వగాథాలహరి, వేమూరి శ్రీనివాసరావుగారు, పుట 90.
2. అదేపుస్తకంలో, పుట 479. 3. అందులోనే, పుట 479.

పూర్వకవిస్తుతి-ఆంధ్రకవులు :—

శబ్దశాసనకావ్యసంఘట్టనక్రమానంచితబుధవర్య నన్నపార్య్య,
నుభయభాషారచనోన్నద్రభద్రవచోరాజి దిక్కనసోమయాజి,
లక్ష్యలక్షణకళాలంకారసౌభాగ్యసత్కావ్యవిన్యాసు శంభుదాసు,
ఛందోనిబంధనచాతుర్యధేయవాగ్ధాము వేములవాడ భీము,
రసికజనపద్మినీనాథు రంగనాథు
బ్రకటకృతికర్మని స్తంద్రు భాస్కరేంద్రు
నమితరసభావు శ్రీప్రతాపరుద్రదేవు
మూర్తిమిధాము నాచనసోము దలతు. [ప్రబంధ. 4.22]

ఈ పద్యంలో ప్రతికవికి ఒక విశేషణాన్ని వాడడం గమనించదగ్గది. నన్నయగారిని శబ్దశాసను డన్నారు. నన్నయగారు వ్యాకరణం ప్రాసివుంటారని ఈమాట చెప్తుం దని పండితలోకంలో కొందరు విశ్వసిస్తారు. నన్నయగారే తననుగురించి తాను చెప్పుకొన్న పద్యంలో తాము విపుల శబ్దశాసనుల మన్నారు (ఆది. 1-9). ఎర్రయగారిపట్లగూడ ఇతడు 'లక్షణ...కళావిన్యాసు' అనే మాటలు వాడాడు. ఎర్రయగారు 'కవిసర్వగారుడం' అనే ఛందోగ్రంథాన్ని ప్రాశారట.[1] కస్తూరి రంగకవి ఆనందరంగరాట్ఛందంలో చెప్పాడు (1-7). అయితే కవిసర్వగారుడాన్ని రచించింది పట్టాభిరామకవి. ఎర్రయగారి విషయంలో స్పష్టంగా చెప్పక పోయినా వేములవాడ భీమకవిమాత్రం ఛందోగ్రంథం ప్రాసినట్లు ఇతడు చెప్తున్నాడు. ఈ సంగతి మొదటిసారిగా చెప్పినవాడు ఆంధ్రకవి రామయ్య. అయితే భీమకవి ఛందం

1. ఆంధ్రకవితరంగణి, 4వ సంపుటం, పుట 72.

ప్రాశాడా లేదా అన్న సంగతి మనం ఇంతకుముందే చర్చించాం.[1]

కవిత్రయాన్ని, భీమకవినీ స్తుతించి రామయ్య రంగనాథుణ్ణి, భాస్కరుణ్ణి, రావిపాటి తిప్పయ్యను, నాచనసోముని తలచుకొన్నాడు. శ్రీనాథుడు రావిపాటి తిప్పయ్యను క్రీడాభిరామంలో ప్రశంసించాడుగాని సోముని ఎక్కడా స్తుతించలేదు. తిప్పయ్యను, సోముని స్తుతించబట్టి ఆంధ్రకవి రామయ్య శ్రీనాథునికి కొంచెం అర్వాచీనుడనీ, రామకవి దగ్గుపల్లి దగ్గన్నకు సమీపకాలస్థుడని చెప్పవచ్చు.

ఇతని కావ్యంపేరు 'విష్ణుకాంచీమాహాత్మ్యం' కనుక అందులో కాంచీ నగరవర్ణన ఉండడం సహజం. అష్టాదశ వర్ణనల్లో ఒకటైన పురవర్ణనలో రామయ్య కంచిని వర్ణించాడు చూడండి.

కాంచి-పురవర్ణన :—

కాంచనబహువిధరత్నా-భ్యంచితమై చిత్రరచనబంధురతరమై
మించి సురాసురముఖ్యులు-కాంచి నుతింపంగ గాంచి కాంచిం బోలెన్.
[ప్రబంధ. 4!5]

ఈ కాంచీపురవర్ణన నాలుగోపాదంలో 'కాంచి' అనే మాటను మూడు అర్థాలలో వాడాడు. (1) కాంచి: కాంచు అనే క్రియా వాచకానికి క్త్వార్థకం. (2) కాంచి: పుణ్యక్షేత్రం పేరు (3) కాంచి: ఆడవాళ్ళ ఒంటిపేట మొలనూలు.

భారత దేశంలో ముక్తిదాయకమైన పుణ్యక్షేత్రాలు

---

1. సమగ్రఆంధ్రసాహిత్యం-I చాటుకవ్యయుగం, పుట 213.

ఏడు ఉన్నాయి. ఒక శ్లోకంలో ఆయేడింటిని మన పూర్వులు స్మరించారు.

అయోధ్యా మధురా మాయా కాశీ కాంచీ అవంతికా
పురీ ద్వారవతీచైవ సప్తైతే మోక్షదాయకాః.
ఉజ్జయని కాశి మాయ యయోధ్య కాంచి
మధుర ద్వారక యనెడి నామములు గలిగి
పటణము లేడు గీ రి సంపద వహించు
మహిత కైవల్యలక్ష్మికి మందిరములు. [కాశీ. 3_87]

ప్రాచీన శ్లోకంలోనూ, శ్రీనాథుని పద్యంలోనూ పేర్కొన్న 'మాయా' పట్టణం హరిద్వారమే. ఈ సంగతి కాశీఖండంలోనే ఉంది (3-120). ఈ ఏడు పుణ్యక్షేత్రాలనూ పేర్కొన్న శ్రీనాథుడు శివశర్మ అనే బ్రాహ్మణునికి ఆ క్షేత్రాలు చూపించాడు. అందులో కాంచి ప్రస్తి ఇలా ఉంది:

కాంచికి బోయి బ్రాహ్మణుడు గాంచె మదావళి భూమిభృచ్ఛిరః
కాంచనకంధరానిలయు గైటభమర్దను గామకోటి ద
ర్శించి భజించె బాలశశిశేఖరు నేకరసాలనాయకు
న్బంచె నవేకపూర్వజననంబుల బుట్టిన పాతకాఘముల్. [కాశీ. 3_108]

కంచిలో దేవతలను చూపించాక శ్రీనాథుడు ఎందుకేనా మంచిదని కాను అంతకు ముందు చూసిన అరవ 'మామా'ల అందాలను శివశర్మకు ఇలా చూపించాడు:

మడువంగ నేర్తురు మడువ దాపటికి రా జిపరబంధము లీగ జీరవార
జొన్న పువ్వులబోలు పొక్కిళ్లు బయలుగా గట్టనేర్తురు చీర కటిభరమున
దొడువంగ నేర్తురు నిమ్రాలు జెవులయం దనతంసకంబుగా నల్లి పువ్వు
పచరింప నేర్తురు పదియారు వన్నియ పసిడిపాళములోర పట్టు చెంప

పయ్యెద ముసుంగు చాలిండ్లభ్రాకనీరు
తరచు పూయుగు రోల(లి) గంధంబు బసుపు
బండికత్తెలు సురతప్రపంచవేళ
గంచిక్షితలు కుసుమాస్త్రఖడ్డలతలు. [కాశి. 3_109]

శ్రీనాథుడు కంచిలో చూచిన అరవతల అందాన్ని ఆంధ్రకవి రామయ్య చూశాడో, లేదో గాని వాళ్ళను ఇలా వర్ణిస్తున్నాడు:

కంచిలోని విలాసినులు:—

పడియలలోపలబడియలందురుగాక
గండుమీనము లంబకముల సరియె?
పొదలు మాటుగ నేచి పొదలుటగనుగాక
యలసుగత్తులు కుచావళుల సరియె?
గహనంబులోనన గహనమై చనుగాక
చమరవాలములు కేశముల సరియె?
ఘనములయొద్దనఘనములై మనుగాక
తళుకులు మించు గాత్రముల సరియె?
కలువ లొండెను జక్రవాకంబు లొండె
జేటు లొండెను బువ్వారుదీగె లొండె
గాక యని ప్రస్తుతింప నా కాంచిలోన
సతులు విలసిల్లుదురు హేమలతలబోలె. [ప్రబంధ. 419]

ఇటువంటి విలాసిను లున్న కంచి పట్టణంయొక్క మాహాత్మ్యానికీ హిమవత్పర్వతానికీ కావ్యంలో ఏసంబంధమో మనకు తెలియదుగాని ఆంధ్రకవి రామయ్య తన కావ్యంలో ఆ పర్వతాన్ని ఇలా వర్ణిస్తున్నాడు.

హిమశైల వర్ణన:—

తనుబట్టి విడువని తగవరి యితడంచు
మృడునకు నొకవంక మేలు సేసె,
దనకు బూర్వాశ్రితు డని సురాధ్యక్షుని
శతకోటి ధనసమన్వితుని జేసె,
దన పాదములు నితాంతము జేరి కొలువగ
రాజీవశత్రుని రాజు జేసె,
దనకు గుణంబుగా దగిలియుండుట నూచి
యహికులాధిపుని భోగాధ్యు జేసె,
ననుచు మిన్నక కొనియాడినను నిజంబ
యగుచు దనయందు గాన్పించు ననుదినంబు
జగతి నొప్పారు నీశైలచక్రవర్తి
యసమతర కీర్తి నిత్యకల్యాణమూర్తి. [ప్రబంధ. 417]

ఈ ప్రదేశంలోనో, మరి లేక ఇంకెక్కడో సంచరించే విష్వక్సేనుని గురించి ఇలా చెప్తున్నాడు;

విష్వక్సేనుడు:—

ఇష్వాపక్రకచాది సాధన పరాహీన ప్రభాంగీకృతా
భిష్వంగద్యుమణి ద్యుతి ప్రకరుడై పీతాంబరాలంకృతున్
విష్వక్సేనుని గౌస్తుభాభరణు నుర్వీ శ్రీయుతుం గొల్చి యా
విష్వక్సేనుడు సంచరించు గణరాడ్విఖ్యాతు డా చక్కటిన్.
[ప్రబంధ. 414]

మన ప్రాచీన పురాణాలలో ఇద్దరు విష్వక్సేనులు వున్నారు. ఒకడు విష్ణుమూర్తిసేనాని; రెండవవాడు శుకుని దాహిత్రుడైన బ్రహ్మదత్తునికి గోదేవియందు పుట్టినవాడు.

ఇతని కుమారుడు ఉదక్సేనుడు. ఈ ఇద్దరు విష్వక్సేనులను కవి ఇక్కడ సరిపోలుస్తున్నట్లు కనబడుతుంది.

ఈ పద్యంలో కవి చాలా దుష్కర ప్రాసమును తీసుకొన్నాడు. ఇష్వాసము అంటే ఇషువులు వేసేది, విల్లు; అభిష్వంగము అంటే అత్యాసక్తి, అభిరుచి.

ఈ విష్వక్సేనునికి, కథానాయకునికి ఏమిటి సంబంధమో తెలియదు. దశావతారాలు యెత్తినట్టి విష్ణువు యెలాగైతే వివిధకాలాలలో శిష్టరక్షణ చేశాడో అలాగే బహుశా నాయకుడు సమర్థుడని ఈ క్రింది పద్యంలో వర్ణిస్తున్నాడు.

నాయకప్రశంస - దశావతారాలు :—

శ్రుతులను నిగర సితులను మగిడింప
నిగిడింప జాలు నీ నేర్పు కలిమి,
ధరణియు రిపుగర్వసరణియు ధరియింప
హరియింపజాలు నీ యులవు కలిమి,
భ్రాత నర్మిలి గన్నమాతను బాలింప
లాలింప జాలు నీ లావు కలిమి,
గేహిని రవిసుతా వాహిని సాధింప
ఛేదింపజాలు నీ పేర్మి కలిమి,
జనుల బాతక జనులను జరుప మరుప
నలరు నీ నేర్పుకలిమి చిహ్నములు నీప
మత్స్య కూర్మ మహీధర మనుజసింహ
భర్వరామత్రయీబుద్ధ కల్కిగతులు. [ప్రబంధ. 423

దశావతారా లెత్తిన విష్ణువు నెలకొన్న కాంచీపట్టణ మాహాత్మ్యానికి, గరుత్మంతునికి ఏదో సంబంధం కనిపి స్తుంది. అతణ్ణి ఇలా వర్ణిస్తున్నాడు.

గరుత్మంతుడు :—

గజ కచ్ఛపంబులె
రునికుక్షి లోనికినిరాది (టి) [?] భిక్ష
సకల లోకములు నేజవసత్త్వ సంపన్ను
ఖురళి కాయతకు గోష్పదంబు,
బలభేది వజ్ర మేయలఘు తెక్కలలోన
జిక్కి పెంపే (దిన) చిరుత పుల్ల,
కద్రూతనూజవర్గంబు లే మహానీరు
నాగ్రహంబునకు జొక్కాకు పుచ్చు,
లతడు హరి గొల్వ నచ్చోటి కగుగుదెంచె
శంఖచూడ సుదక్షిణ క్షమపయోద
వాహనోద్ధారతాభీల సాహసైక
జనిత దాక్షిణ్యు డైనట్టి వినతపట్టి. [ప్రబంధ. 416]

ఈ గరుత్మంతుని వర్ణన శ్రీనాథుని కాశీఖండం చది వాక చేసినట్లు కనబడుతుంది. ముక్కస్యముక్క అనుసరణ కాదుగాని శ్రీనాథుని ప్రభావం లేకపో లేదు.

పరమసంయమి కశ్యపప్రజాపతికిని
వినత కాత్మజుడైన విహగ భర్త
విషధి పుట్టినపాద వితతి భక్షించిచో
ద్విజు గ్రాసి యుమిసిన విమలబుద్ధి

యిభకచ్ఛపముల రోహిణి కాళితో దాల్చి
దివిమీద బారిన పవనవేగి
యహికోటి గెల్చి చిచ్ఛార్చి చక్రము దూరి
యమృతంబు గొన్నట్టి యమిత బలుడు
జిష్ణుపవి కొక్కయీక యిచ్చిన ప్రదాత
యచ్యుతుని వాహనము తార్క్ష్య డగ్రజులును
దాను దలియు గాశికా సలమునందు
గొలిచి రక్కల నలఘుర గుంభజన్మ. [కాశి. 6_14]

శ్రీనాథుడు ఎవరినైనా వర్ణిస్తున్నపుడు అతని జీవితంలోని ముఖ్యఘట్టా లన్నింటిని తీసుకొని సీసపద్యంలో ఒక్కొక్కటి చెప్పి అలాటివాడు ఫలానాది చేశాడనో, చూశాడనో ఎత్తు గీతిలో పూర్తిచేస్తాడు. ఆ సంవిధానం ఇందులో కనిపిస్తుంది.

పురాణాలు వ్రాస్తున్నా, పుక్కిటిపురాణాలు వ్రాస్తున్నా వాటికి కావ్యగౌరవం ఇవ్వడానికి మనవాళ్లు అష్టాదశ వర్ణనలు చెప్పారు. అందులో ఋతువర్ణన ఒకటి. ఆంధ్రకవులు అందమూ చేసే వసంతవర్ణన మన ఆంధ్రకవి ఎలా చేశాడో చూడండీ.

ఋతువర్ణన-వసంతం :—

రాలు కారాకుల వ్రాలు మారాకుల గలయ భూజములెల్ల గానరాగ,
సతుల డెందంబుల నతుల కుందంబుల వికసనం బాత్మకు వ్రేగుగాగ,
బొలుచు దారకముల గెలుచు కోరకముల విరవాది తీగెలు విర్రవీగ,
జంపక జాలంబు నింపక యోలంబు గొని దవ్వులనె తేట కొలములాగ,

నెంతయును వింత యిది యన నంతనంత
సంతతాక్రాంత మదన నితాంత తాంత
కాంత కాంతాకదంబక స్వాంతములకు
పంతసము నింప వచ్చె వసంత మంత. [ప్రబంధ. 421]

అష్టాదశవర్ణనలలో వెన్నెలను వర్ణించడంకూడా ముఖ్యమే. ఆ వెన్నెలలో విహరించే చకోరాలను వర్ణించడం కూడ అవసరమే. ఆంధ్రకవి రామయ్య ఎలా వర్ణిస్తున్నాడో చూడండి.

చంద్రికావర్ణన-చకోరాలు :—

రసికత సోలిసోలి యనురాగ రసంబున దేలి తేలి యా
కసములు మెట్టి మెట్టి తమకంబున గాంతల బట్టిపట్టి యా
దొసటుల జిక్కిచిక్కి కడుదూరముగా జని తక్కి తక్కి పై
కొసరెసగం జకోరికలు కోరిక లీరిక లొత్త మత్తిలున్.
[ప్రబంధ. 420]

ఈ చకోర విలాసవర్ణన తిక్కనగారి చకోరవిహారాలను జ్ఞాపకం తెస్తుంది, చూడండి

క్రమ్మి పైకొరగెడు కౌముదీయంబు సొంపున దనుపున జొక్కిచొక్కి
పచరించు చంద్రాతపంబు కాలుపలలో నడ్డంబుగా నిల్చి యాగి యాగి
వెల్లువపెల్లు సూపెడు సాంద్ర చంద్రికాపూరంబు గని మది బొంగి పొంగి
మిన్నులతో రాయు వెన్నెల కరడుల వెరకలు సడలించి యీది యీది
చెలగి చెలగి మలగి మలగి యల్లల్లన-క్రాలి క్రాలి బిట్టు తూలి తూలి
పమదవృత్తి గేలి సలిపె జకోరచ-యుంబు పదలు దమమయంబుగాగ.
[నిర్వచన. 6-48]

ఈ చకోరవర్ణనలోనే తిక్కనగారు మరపురాని ఒక చక్కనిదృశ్యాన్ని చూపిస్తున్నారు. పెద్ద చకోరాలు

వెన్నెలను చిత్తంవచ్చినట్లు తాగుతాయి. జాబిలిరేకులను తింటాయి. మరి పిల్లలో? ప్రకృతిసిద్ధమైన మాతృ ప్రేమను తెలియచేస్తున్నారు.

తివిచి నవకంబు దీప్తులు ద్రెంచి యలతి
తునియలుగ జంచుపుటముల ద్రుంచి తల్లి
లాదరంబున నంది యీ నర్రు లెత్తి
ప్రీతి గముచు జకోరంబు బిల్లగములు. [నిర్వచన. 6_46]

ఈ గీతపద్యంలోని భావాన్ని ఒక సీసపాదంలో చెప్తూ జక్కన తన విక్రమార్క చరిత్రలో తిక్కనగారిని అనుసరించాడు. చూడండి, జక్కన చేసిన చకోరవర్ణన:

రసగల వెన్నెల మిసిమి పుక్కిట బట్టి
పాసగ బిల్లల నోళ్ల బోసి పోసి
నున్నని క్రొత్యున్క వెన్నెల తుంపరల్
హుమ్మని చెలులపై నుమిసి యుమిసి
కమ్మని వెన్నెల కడుపు నిండగ గ్రోలి
తెలివెక్కి గర్రున ద్రేన్చి త్రేన్చి
కన్నిచ్చలకు వచ్చు వెన్నెల కొన్నుర
వేరి వే ప్రియురాండ్ర కిచ్చియిచ్చి
తరచు వెన్నెల గుంపుల దారి తాగి
యీరమగు వెన్నెలలలోన దూరి తూరి
పలుచనగు వెన్నెలలలోన బారి బారి
మెలగె బెక్క చకోరంపు బులుగుగములు.[విక్రమార్క. 6-71]

చంద్రు డున్నంతవరకే చకోరాలకు ఈ సందడి. సూర్యోదయమైతే ఆటకట్టు! రామయ్య సూర్యోదయాన్ని ఇలా వర్ణించాడు:

సూర్యోదయ వర్ణన :—

అరుణ మూర్తి సురేంద్ర దిక్తట మహావ్యాప్తిఁ బ్రజృంభింపఁగా
శిరసు ల్వంచె జకోర వర్గములు హెచ్చుం జక్రవాకంబు లా
తురతం గైరవపంక్తి దూలె గడు సంతోషించె బద్మంబు లా
క్కరి చే టొక్కరి మేలు పొమ్మనుట నిక్కంబైన చందంబునన్.

[ప్రబంధ. 413]

తొలి సంజెవెలుగులు విజృంభింపగా చకోరాలు తలలు వంచాయి. చక్రవాకాలు ఆతురతకు హెచ్చాయి. కలువలు విచారించాయి. పద్మాలు సంతోషించాయి. ఒకరి చేటు ఇంకొకరి మేలేలేపో అన్నది నిజమైన విధంగా భళ్లున తెల్లవారింది.

అయితే దీనిలోనే ఈకవిచరిత్ర మీద కారుచీకటులు ఆవరించాయి.

11

పోతన



రశైవమతాన్ని ఉద్రేకంగా, ఉద్ధోలంగా ప్రచారం చేసిన పాల్కురికి సోమనాథుడు తెలంగాణాలోని ఓరుగల్లునగరానికి ముప్ప యిమైళ్ల దూరంలో ఉన్న 'పాలకుర్తి' గ్రామంలో జన్మిం చాడు. ఆయన ప్రభవించిన ఈ గ్రామానికి రెండుమైళ్ల దూరంలో ఉన్న బమ్మెరగ్రామంలో, బహుశా, ఆయన మరణించిన నూటపదియసంవత్సరాలకు భాగవతవైష్ణవాన్ని భక్తిపారవశ్యంతో ప్రచారంచేసిన పోతరాజుగారు జన్మిం చాడు. వీరశైవమతాన్నీ, భాగవత వైష్ణవాన్నీ ఉద్ధరించిన ఉద్దండులు ఇరుగుపొరుగుగ్రామాలలో పుట్టడం కేవలం కాకతాళీయం కావచ్చుగాని అందులో ఎంతో ఔచిత్యం ఉంది. శైవమైనా, వైష్ణవమైనా ఒక్క కుదుట్లోంచి పుట్టి నవే. అవి ఆశించే పరమార్థం ఒకటే. బోధించే పద్ధతులలో తేడాలు వుండవచ్చుగాని సాధించేది ఒక్కటే.

ఒకరకంగా చూస్తే పాల్కురికి సోమనాథుని విచిత్ర వ్యక్తిత్వమేబమ్మెరపోతరాజుగారిలో అవిచ్ఛిన్నంగా రూపాంతరం పొందిం దనుకోవచ్చు. తన ఆరాధ్యలక్ష్యానికి త్రికరణ శుద్ధిగా తాను అంకితం అయ్యే మానవన్నైజం పరిపక్వమైన స్థితిలో ఈ ఇద్దరిలోనూ ఒక్కలాగే కనబడుతుంది. సోమనాథుడు విడిచిపెట్టిన చోటునుంచి పోతరాజుగారు అందుకున్నారు. మానవునిలోని తామసాన్ని సాత్వికంలోనికి అనువదించారు.

వాస్తవానికి నూనూగుమీసాల నూత్నయౌవనం వచ్చేదాకా పోతరాజుగారు కూడా సోమనాథుడు ప్రబోధించిన వీరశైవాన్ని ఆచరించినవారే. వారు పుట్టినది వీరశైవం విజృంభించిన పాలకుర్తి పరిసరాలలో. వారి తండ్రి కేసన 'శైవశాస్త్రమతాలలోతు చూసినవాడు.[1] వారి తల్లి అక్కసానమ్మ సదాశివపాదయుగార్చనానుకంపాయనవాగ్భవాని.[2] ఆమె పెద్దకొడుకు తిప్పయ్య ఈశ్వరసేవాకాముడు.[3] తల్లితండ్రులూ, తోడబుట్టిన అన్నగారూ శైవులయినప్పుడు పోతరాజుగారుకూడా ఆమతాన్నే ఆచరించడంలో, ఆమత గురువులను ఆశ్రయించడంలో ఆశ్చర్యంలేదు.

పాలకుర్తి ప్రాంతాలలో, ఆ రోజులలో ఇవటూరి వారు శైవమతగురువులుగా ఉంటూవుండేవారు. వీరు బమ్మెర వారికీ, తడితరులకూ వంశక్రమానుగతంగా గురువులు. పోతరాజుగారి కాలంలో ఇవటూరి సోమనాథుడు మతబోధ

---

1. భాగవతం, 1_22. 2. అదే, 1_24. 3. అదే, 1_25.

చేస్తూండేవాడు. ఆయన బాలపోతరాజుగారిలోని ఉత్సాహాన్ని మెచ్చుకుని ఆ బాలుని కవిత్వానికి చక్కగా కొనమల్లించాడు. అప్పటికి పోతరాజు చాలా పిన్నవాడు. పెక్కు సత్కృతులు వినినవాడు.[1] తండ్రి లతసికి అక్షరాభ్యాసం చేసి తనకు వచ్చిన దంతా చెప్పాడు. సంస్కృత పంచకావ్యాలూ పాఠం చెప్పిఉంటాడు. పండితయ్య శివతత్త్వసారం, సోమనాథుని బసవపురాణం, పండితారాధ్య చరిత్ర మొదలైన తెలుగు పుస్తకాలను పోతరాజుగారే స్వయంగా చదువుకునిఉంటాడు. పూర్వకవులంటే ఆయనకు అకుంఠితమైన భక్తి ఉన్నా వీరశైవులంటే మరీ ఎక్కువ అభిమానం. అందుకే వీరమాహేశ్వరాచారపరులు, వీరసత్యవ్రతులు, వీరసచ్చరిత్రులు, వీరవిక్రములు అయిన సిరియాలుడు, కరికాలుడు, పండితారాధ్యుడు మొదలైన వారిని ఆయన మొక్కేవాడు.[2] బాలపోతరాజు ఎటువంటి వారిని ఆరాధించేవాడో ఒక పద్యంలో చెప్పాడు.

భవి జాడక భవి డాయక-భవుపదములు గొల్చి ఘోరభవభంజనులై
భవదూరులైన పుణ్యుల-భవు నర్చనచేసి వరము పడసినవారిన్.

[వీరభద్రవిజయం, 1-10]

ఇటువంటి బాలపోతరాజుగారిని ఇనటూరి సోమనాథుడొకనాడు పిలిపించి 'వీరభద్రవిజయం' అనే కావ్యం చెప్పమని ఆదేశించాడు. 'చిన్నవాడవైనా, ఎక్కువ చదువు లేకపోయినా మత్ప్రసాదదివ్యమహిమచే ఎంతైనా కవిత చెప్పే లావు నీ కుంటుంది' అన్నాడు. బాలపోతరాజుగారు

1. వీరభద్రవిజయం, 1-21. 2. వీరభద్రవిజయం, 1-11.

వ్యాసవాల్మీకులను పూజించాక తాము చదువుకొన్న పంచ కావ్యాలు వ్రాసిన కాళిదాసు, బాణుడు, మాఘుడు, భారవి మొదలైనవారినీ, తెలుగుకవులనూ ఇలాగ స్తుతించాడు.

బాణు నంచితశబపాకిణు నసమానకవితాగుణావాసు కాళిదాసు
మాఘు వాక్యామోఘు మణిభద్రు శివభద్రు రమణీయతరకవినాథు భోజ
ప్రకటితవిమలప్రభారవి భారవి సన్నుతగుణధుర్య నన్నపార్య
సేవితకవిరాజి శ్రీసోమయాజిని శృంగారకవినాథు రంగనాథు
నవని రెండవ శారదయై వెలుంగు_నైభవోద్ధాము వేములవాడ భీము
వాదిగాగల కవులను నధికభక్తి_దలచి వర్ణించి తత్ప్రసాదంబు వడసి.
[వీరభద్రవిజయం, 1_9]

ఈ పద్యంలోని 'శృంగారకవినాథు' అనే పదబంధం వల్ల పోతరాజుగారు శ్రీనాథుణ్ణి ఉద్దేశించారని కొంతమంది ఊహిస్తారు.[1] కాని అది వాస్తవం కాదేమో. ఈ పద్యంలో సన్నుతగుణధుర్య, సేవితకవిరాజి, శృంగారకవినాథు. వైభవోద్ధాము అనే పదబంధాలు వరుసగా నన్నయ, తిక్కన, రంగనాథ, భీమకవులకు విశేషణాలు. ఈపద్యంలో శ్రీనాథుని ప్రశంసించటే దనుకోవాలి. ఈపద్యంలో ఇంకో విశేషముంది. ఇందులో వీరశైవులైన పండితయ్యనుగాని, సోమనాథునిగాని తెలుగుకవులుగా నుతించలేదు. పండితయ్యను వీరమాహేశ్వరాచారపరునిగా కీర్తించాడు (వీర. 1-11). బహుశా, 'భవి చూడక, భవి డాయక' అనే (వీర 1-10) పద్యంలో పోతరాజుగారు పాల్కురికి సోమనాథుణ్ణే స్తుతించారేమో. అందులో 'వరమువడసినవారిన్' అనే

1. 'పోతన' - నిడుదవోలు వెంకటరావుగారి గ్రంథం, నేషనల్ బుక్ ట్రస్టువారి ప్రచురణ, పుట 30.

పాఠానికి బదులు 'వరము వడసిన సోమునొ' అనే పాఠాంతరం ఉందేమో తెలియదు.

తెలుగుకవులలో మరి ఇద్దరి ప్రభావం పోతరాజుగారి మీద లేకపోలేదు. వారు ప్రబంధపరమేశ్వరులు ఎఱ్ఱయ్యగారున్నూ, నాచనసోమమంత్రీను. ఈ ఇద్దరిరచనలనూ చిన్నప్పటినుంచీ వంటపట్టించుకుని పోతరాజుగారు పెద్దయ్యాక కూడా అనుసరించారు. భాగవతం సప్తమస్కంధం ప్రహ్లాద చరిత్రలోని ఎన్నో పద్యాలకు ఎఱ్ఱయగారి నృసింహపురాణంలోని గద్యపద్యాలు ఒజ్జబంతులు. దశమస్కంధం ఉత్తరభాగంలో నరకాసురవధఘట్టంలోని సత్యభామా యుద్ధాన్ని పోతనగారు నాచనసోముని ఉత్తరహరివంశం చూశాకనే వ్రాశారు. ఆ ఘట్టంలో సత్యభామ "అరి జూచున్ హరి జూచు" అని నాచనసోముడు వ్రాస్తే "పరు జూచున్ వరు జూచు" అని పోతరాజుగారు వ్రాసిన సంగతి ఇంతకుముందు చెప్పుకొన్నాం.[1] ఇటువంటి సంవిధానం పోతరాజుగారి తొలిగ్రంథమైన వీరభద్రవిజయంలోకూడా ఉంది. శివునిమీద పూలబాణాలు వెయ్యడానికి మన్మథుడు వెళ్లాడు. ఆఘట్టంలోని పద్యం చూడండి.

విలు జూచున్ వెలి జూచు జూచు సుమలన్ విశ్వేశ్వరుం జూచు గొం
దలనందుం దలపోయజూచ్చు గడిమిన్ దక్ష్యేక్షణాలంకృతో
జ్వలవిభ్రాజితనిత్యనిర్గుణతపోవారాన్నిధిం జెచ్చెరం
గలపంజూచు గలంపలేక తలకుం గాముండు నిశ్చేష్టుడై.

[వీరభద్రవిజయం, 2-101]

---

1. సమగ్రాంధ్రసాహిత్యం, III పద్మనాయకయుగం, పుట 201.

ఈ ఒక్క పద్యరచనా విధానంలోనే కాక నాచన సోమన్న పోతరాజుగారు బాగా అనుసరించి అతడు చేసిన మూలవిరుద్ధమైన మార్పులను ఆమోదించి భాగవతంలో చేర్చాడు. శ్రీకృష్ణుడు రుక్మిణీసత్యభామలతో జూదం ఆడుతున్నప్పుడు కాశీరాజు కృత్యను ప్రయోగించాడనీ, ఆడుతున్న ఆటను ఆపకుండా కృష్ణుడు చక్రాన్ని ప్రయోగించాడనీ నాచనసోముడు వ్రాశాడు.[1] ఇది మూలవిరుద్ధమే. దీనిని పోతరాజుగారు దశమస్కంధం ఉత్తరభాగంలో ఇలా అనుసరించారు.

...సుధర్మాభ్యంతరంబునం జూదంబాడు దామోదరుం గని రథీ
రథేతియూ త్తరవంబులం గృష్ణ! కృష్ణ! పెనుమంటలం బురంబు కాల్పన్
బ్రళయాగ్ని చనుదెంచె నన, వాడం జూచి, మీరోడకుండని భయంబు
నివారించి సర్వరక్షపుండైన పుండరీకాక్షుండు జగదంతరాత్ముండు
గావున తద్వృత్తాంతం బంతయు దన చిత్తంబున నెరింగి కాశిరాజపుత్ర
ప్రేరితయమ్మహాకృత్యను నిగ్రహింపం దలంచి నిజపార్శ్వవర్తియైయున్న
యద్దివ్యసాధనంబున్ గనుంగొని యప్పుడు
భీమమై బహుతీవ్రధామమై వైరిపుస్తోమమై సుమహితోద్దామమగుచు
జండమై విజితమార్తాండమై పాలితాజాండమై విజయప్రకాండమగుచు
దివ్యమై నిఖిలగంధర్వమై సుజనసంభావ్యమై సద్భక్తసేవ్యమగుచు
నిత్యమై నిగమసంస్తుత్యమై వినమితాదిత్యమై నిర్జితాదిత్యమగుచు
విలయసమయసముద్భూతవిపులభాస్వ
దళికలోచనలోచనానలసహస్ర
ఘటితపటుసటాజ్వాలికాచటులసత్వ
భయదచక్రంబు కృత్యపై బంపె శౌరి. [భాగవతం, 10_II, 529_530]

---

1. ఉత్తరహరివంశం, 3:140_144.

నాచనసోముని ప్రభావంవల్లనే పోతనగారు శ్రీకృష్ణునిచేత జూవం ఆడించారు. ఇన్నివిధాల నాచనసోమున్ని మొదటినుంచీ కడవరకూ అనుసరించినా, ఎందుచేతనో పోతరాజుగారు నాచనసోముని పేరు ఏ రచనలోనూ చెప్పలేదు. అయితే భాగవతంలో "ఇతరపూర్వకవిజనసంభావనంబు చేసి" అని "ఉభయకార్యకరణ దక్షుండన్నై ఉన్నా" మని చెప్పారు. ఆ ఇతరపూర్వకవులలో సోమున్ని చేర్చుకోవాలి. వీరభద్రవిజయంలో కూడా పన్నాయ, తిక్కన, రంగనాథ, పేములవాడ భీముల పేర్లుచెప్పి 'ఆదిగాగల కవులను అధికభక్తి తలచి' అన్నారు. ఇందులో ఎర్రయగారు, సోముడు చేరుతారు.

బాలపోతరాజుగారు నాలుగాశ్వాసాలకావ్యంగా వీరభద్రవిజయం ప్రారంభించారు. ఇందులో ప్రథమాశ్వాసంలో దక్షయజ్ఞం జరుగుతుంది. అందులో సతీదేవి మరణిస్తుందిగాని వీరభద్రుడు ప్రభవించడు. నాలుగవ ఆశ్వాసంలో మళ్ళీ దక్షుడు ఇంకో మన్వంతరంలో యజ్ఞంచేసి శివనింద చేస్తాడు. అప్పుడు వీరభద్రుని పుట్టించి శివుడు విజయానికి పంపిస్తాడు. ఈ రెండు యజ్ఞాలకు మధ్య గిరిజ ప్రభవించడం, శివుని తపస్సు, ఆమెను శుశ్రూషకు నియోగించడం, దేవేంద్రుడు కామున్ని పంపించి, శివుని తపస్సు ఆపించమనడం రతీమన్మథుల విలాపం, కామ దహనం, శివుడు ఎరుకలసాని వేషంలో పార్వతికి పోది చెప్పడం, పార్వతి తపశ్చర్య, శివుడు కపట బ్రహ్మచారి వేషంలో వచ్చి ఆమెను పరీక్షించడం తరువాత శంకరుడు సప్త మహర్షులను పిలిచి

వాళ్లను పెళ్లి పెద్దలుగా పంపడం, పెళ్లిమాటలు, వివిధ ఆచారాలూ, నాలుగురోజులపెళ్లి, పార్వతీపరమేశ్వరులు సుఖంగా ఉండడం, ఆమె అతని కంఠం నీలంగా ఉండడానికి కారణం అడిగితే అతడు క్షీరసాగర మథనం హాలాహల భక్షణ కథనం చేయడం మొదలైనవి పోతరాజుగారు ప్రథమాశ్వాసంలో కొంతా, రెండు మూడు ఆశ్వాసాలలో పూర్తిగా వ్రాశారు.

ఇది పోతరాజుగారి బాల్యరచన కాబట్టి చదువుతూ ఉంటే ఉడిగీ ఉడికని అన్నంలో పండీ పండని పండు కల్సి కుంటున్నట్లు ఉంటుంది. దుష్ట సమాసాలు, అపశబ్దాలు, వ్యర్థపదాలు కోకొల్లలు. అయితే ఒకమహాకవి ప్రాథమిక రచన ఎలా ఉంటుందో కూలంకషంగా పరిశీలించడానికి తోడ్పడుతుంది. ఎంత అపరిపక్వమైన రచన అయినా ఇందులో పోతరాజుగారు ఆనాటి సాంఘిక ఆచారాలను చాలా చక్కగా చెప్పారు. సప్తఋషులను పిలిచిన శివుడు ఈవిధంగా పురమాయించాడు.

శీతాచలేంద్రుని సుతు పార్వతి కన్య వతిమోవనున మాకు నడిగి రండు
ఉడురాజధరకు నుంప వేముడిగిన సింతేవ మైకొని యిచ్చిరండు
మదిరాక్షి వాతండు మన కిచ్చినట్లుగా బెంపార నుగ్రము బెట్టి రండు
పాలకూళ్లు గూడిచి బాలను మనసొమ్ము చేసి రండనువొంద చేసిరండు
ఇదియె మాకు మెచ్చు నెల్ల భంగుల నెన- దీనిజేయనలయు దెరగు మెరసి
కదలిపోవ నిదియె కడు మంచి లగ్నము-భూధరేంద్రపురికి పోయిరండు.
[వీరభద్రవిజయం, 3-27]

ఈ పద్యం ద్వారా ఆ నాడు పెళ్లిమాటలకు వెళ్లే

వాళ్లు ఉంకువ ఇచ్చి ఉంగరం పెట్టి పాలకూళ్లు భుజించి వచ్చేవారని తెలుస్తూంది. పెళ్లిముహూర్తాన్ని నిర్ణయించడానికి ఇంటి అరుగుమీద ఘుడీయారం కట్టించే వారు. దానిని పోతరాజుగా రిలా వర్ణించారు :

తమపెద్దింటి యరుంగుమీద గడకిఁ ధాన్యంబుపై బెండ్లిఁ
గ్నము సాధింప బసిండి పేర్పున నభోగంగా నదీ తోయముల్
రమణం బోసి యలంకరించి ఘుడిఁ తూరం బొప్ప గట్టించి య
య్యమరాచార్యుఁడే మహా మహిమతో నర్క ప్రతాపంబునన్.

[వీరభద్రవిజయం, 3_126]

పుణ్య స్త్రీలు పాడుతూ క్రింతలు పడవడం, పెళ్లిలో వధూవరుల మధ్య తెర కట్టడం, మధుపర్కాలు ఇవ్వడం, సుముహూర్తంలో తెర తియ్యడం తలంబ్రాలు పోసుకోవడం, పెద్ద ఇట్లోనుంచి పెండ్లి అరుగుమీదకు వచ్చి ప్రవేశ హోమం చేయడం మొదలైన నాలుగు రోజుల పెళ్లిని పోతరాజుగారు వివరంగా వర్ణించారు. ఆ మహనాడు అప్పగింతలు.

ఇక్కడ మనం ఒక ముఖ్యమైన సంగతి చెప్పుకోవాలి, పోతరాజుగారు నాలుగు రోజుల పెళ్ళిని వర్ణించినా మంగళ సూత్రధారణను పేర్కొనలేదు. నాకు తెలిసినంతవరకూ పోతరాజుగారి కాలందాకా ఏఒక్క తెలుగుకవీ మాంగల్య బంధాన్ని వివాహంలో వర్ణించలేదు. తిక్కనగారి కాలం నుంచి అందరూ పెళ్ళిలో ముఖ్యంగా తలంబ్రాలు పోసుకోవడమే పేర్కొన్నారు. మడికిసింగన తొలిసారిగా తెరసంగతి చెప్పాడు. వివాహవర్ణనలో మాంగల్య ధారణను గురించి

వివరించకపోయినా పోతరాజుగారు వీరభద్ర విజయంలో మంగళసూత్ర బంధంగురించి వ్రాశారు. భస్మమైన పతిని చూసి రతి విలపిస్తున్న ఘట్టంలోని ఈ క్రిందిపద్యం చూడండి.

రారే యేమఱు మాన్పరే మధురిపుక్ రప్పింపరే కావరే
పోరే కయ్యెఱిగింపరే సిరికి నా పుణ్యంబు విన్పింపరే
తేరే దేవర వేడి నాపెనిమిటిన్ దీర్ఘాయుషోపేతుగా
వీరే మంగళసూత్ర బంధనము మీకంతేని పుణ్యంబగున్.

[వీరభద్రవిజయం, 2_126]

పోతరాజుగారు భాగవతంలోకూడ ఒకసారి మాంగల్యప్రస్తి తెచ్చారు. శివుడు హాలాహలం మింగబోతున్నప్పుడు పక్కన ఉన్న పార్వతి వారించ లేదట. కట్టుకొన్న మొగుడు కాలకూటం త్రాగుతూంటే వీయిల్లాలయినా ఎలాగ ఊరుకోగలదు అనే ప్రశ్న పరీక్షిత్తుకు వచ్చింది. దానికి శుకుడు సమాధానం చెప్పాడు. చూడండి ఆ పద్యాలు.

అమరక్ లోకహితార్థ మంచు నభవుం డౌగాక యం చాడి బో
యనురుల్ భీతిని మ్రింగమో యనిరి వో యంభోజ గర్భాదులక్
దము గావన్ హర! లెమ్ము లెమ్మనిరి వో తా జూచి కన్గంటన
య్యిమ ప్రాణేశ్వర నెట్లు మ్రింగుదువు వయ్యో గానల జ్వాలలక్ ?

అనిన శుకం డిట్లనియె.

మ్రింగెడువాడు విభుండని-మ్రింగెడిని గరళమనియు మేలని ప్రజకున్
మ్రింగుదువె సర్వమంగళ-మంగళసూత్రంబు నెంత మది నమ్మినదో ?

[భాగవతం, 8: 239_241]

మంగళసూత్రం సంగతి పోతరాజుగారు ఇంకొకచోట చాలా చక్కగా చెప్పారు. భారతస్త్రీలు ఏ ఆభరణమైనా తీసేస్తారుగాని పుస్తెలుసూత్రం తీయ్యరు. తాను కొలచుకొనే సీతారాములచేత అన్నీ దానంచేయించి పోతరాజుగారు సీతమ్మకు తాళిబొట్టూ, రామయ్యకు రెండు జతల ధోవతులూ మిగిల్చారు. శ్రీరామచరిత్ర ఘట్టంలో రాముడు యాగంచేసి భూసురులకన్నీ ఇచ్చేశాడన్న సీసపద్యం తరువాతి ఎత్తుగీతి చూడండి.

తనకు రెండు పుట్టంబులు దనకునై
మెలత మంగళసూత్రంబు మినుకుదక్క
వినతుడై యుండె రాముని విభవంబు
పాండవోత్తమ! యేమని పలుకవచ్చు? [భా. 9-341]

పోతరాజుగారికి సమకాలికుడో, లేక కొంచెం పెద్దవాడో అయిన శ్రీనాథుడు కాశీఖండంలో దక్షయజ్ఞం గురించి వ్రాస్తూ శివుణ్ణి కాదని యాగానికి వచ్చిన దేవతలను పేరుపేరునా దధీచిచేత తిట్టించాడు. ఆ పద్యంలో మంగళ సూత్రాలకు దేవ్యమైన తాళ్ళను పేర్కొన్నాడు. చూడండి.

శితికంధరునకు నెచ్చెలికాడు గాడొకో
యటమటీడైన యీ యక్షభర్త కి
యహికంకణునకు మూడవ కన్ను గాడొకో
పాల్కాశినట్టి యీ పావకుండు కి
పురవైరి కవతంసపుష్పంబు గాడొకో
విభ్భగ్యుడైన యీ నీరజారి కి

గంగాధరునకు లెంకలలెంక గాడొకో
కైనుగూళ యైన యీ యనిమేషేంద్రు ?
డేమి గుడువంగ వచ్చినా దిండ్డ విడిచి
హరుని వెలివెట్టినటి యీ యాగమునకు?
రుంచవవనుని కను జేరుదించె నేని
దత్త ణంబున తమ యాంధ్ర తాళ్లు దెగవే? [కాశిఖండం, 7-60]

ఇదే పద్యం చాలా కొద్దిపాటి మార్పులతో వీరభద్ర విజయంలోకూడా ఉంది (1-47). అయితే ఇది ప్రక్షిప్తమనుకోవాలి. లేఖకు లెవరో మోజుపడి దూర్చి ఉంటారు. పోతరాజుగారూ అనుకరించడానికి కొద్దిపాటి ఆస్కారం లేకపోలేదు. శ్రీనాథుని కాశీఖండరచన 1430 తరువాత జరిగిందని పండితులందరూ ఏకగ్రీవంగా భావిస్తున్నారు.[1] అప్పటికి పోతరాజుగారికి ఏ పదమూడేళ్లో అయివుండవచ్చు. కాశీఖండప్రతిని వీరభద్రవిజయం వ్రాసేటప్పుడు చూసిఉండవచ్చు. అయితే ఈ తొలిరచనలో పోతరాజుగారు పన్నెచోడుణ్ణి, పండితయ్యనూ ఎక్కువగా అనుకరించారు.

పండితయ్యతన శివతత్త్వసారంలో దక్షాధ్వర ధ్వంసం, గణాడంబరం విపులంగా వర్ణించాడు. అదితి, సరస్వతి, స్వాహా మొదలైన దేవకాస్త్రీలముక్కులు, చనుముక్కలు వీరభద్రుడు కోశాడని కందపద్యాలలో పండితయ్య చెప్పాడు. అలాగే కందపద్యాలలోనే పోతరాజుగారుకూడా వ్రాశారు. శివతత్త్వసారంలోని 309, 314 పద్యాలతో

---

1. సమగ్రాంధ్ర సాహిత్యం, IV రెడ్డిరాజుల యుగం, 218 పుటలోని శ్రీనాథుని తారీఖులు.

వీరభద్రవిజయం నాల్గవ ఆశ్వాసంలోని 118 నుంచి 121 దాకా ఉన్న కందపద్యాలు తెపారువేస్తే ఈ సంగతి తెలుస్తుంది. వీరభద్రవిజయం రెండవ ఆశ్వాసంలో మూడవ ఆశ్వాసంలో ముఖ్యంగా రతీమన్మథుల సంభాషణలలో పోతరాజుగారు ముఖ్యంగా నన్నెచోడుని అనుకరించారు. అయితే పట్టుగ్గా సతీదేవిచేత ఉపాలంభనం చేయిస్తున్నప్పుడు నన్నెచోడుడు చూపిన నేర్పు, వాడిన పదపటిమ పోతరాజుగారు చూపలేకపోయారు. చూడండీ, ప్రజాపతి కుమార్తె-పరమేశ్వరుని ఇల్లాలు, పదిమందిమధ్య తండ్రిని ఏమంటుందో-

ఏరా దక్ష యవక్షమాగస వృథా యీ దూషణం బేలరా
యోకీ పాపములెల్ల బోవిడువరా యుగ్రాక్షు జేపట్టరా
వైరం బొప్పదురా శివుం దలపరా వర్ణింపరా రాజితో
దారాత్మం డగు నీలకంఠు దెగడంగా రాదురా దుర్మతీ.

[వీరభద్రవిజయం, 1-146]

ఇవి శివదూషణ చేసిన భవిమీద వీరభైవ్రుడు ప్రయోగించే మాటలేగాని ఒక కావ్యంలో ఉదాత్తమైన పాత్రచేత చెప్పించే మాటలు గావు. వీరభద్రవిజయం వ్రాస్తున్నప్పుడు పోతరాజుగారిమతాభిమానం అటువంటిది. పరమతసహనం ఆవయస్సులో లోపిస్తే ఆశ్చర్యపడనక్కరలేదు. అయితే ఇటువంటి ఉడుకునెత్తుటి వీరభైవ్రుడు పరమ సాత్త్వికుడై భాగవతరచన చేయడానికి వీలుగా ఎలా మారాడో తెలుసుకోవడంలో ఆనంద ముంటుంది.

వీరభద్రవిజయం వ్రాసేనాటికి పోతరాజుగారికి మీన

కట్టుకూడా వచ్చివుండదని చెప్పుకొన్నాం. నూత్నయౌవనం వచ్చాక కొందరు భావించినట్లు ఆయన తన గ్రామానికి సమీపాన ఉన్న పట్టణానికి ధనార్జనకో, మరెందుకో పోయి ఉండవచ్చు. "ఈతడు కుటుంబమునకు పెద్దవాడు కావున గ్రామకరణీకి మీతని కుండదు. పండితుడు కవి, బీదవాడును నగు నీతడు సమీపమందున్న గొప్పపట్టణమునకు పోయి బుజునార్గమునసే నొంత ధన మార్జించి కుటుంబపోషణము చేయగూడదా?" అని కొమర్రాజు లక్ష్మణరావుగారు వేసిన ప్రశ్న సమంజసమైనదే.[1] వారు చెప్పినట్లు ఆ రోజులలో, రాజున్నా లేకపోయినా, ఏకశిలా నగరం పెద్దపట్టణం. పలువురు విద్వాంసులు, కవులు, రసికులు, శ్రీమంతులు అక్కడ ఉండడం సహజం. వారి సహవాసనిమిత్తం పోతరాజుగారు అక్కడ ఎక్కువగా ఉండవచ్చు.

పోతరాజుగారి పూర్వులు గణకులు. అందులో ఒకాయన గణకవ్రజమాన్యుడు.[2] పోతరాజుగారుకూడా గణితశాస్త్రం బాగా అధ్యయనం చేసినట్లు కనపడుతుంది. భాగవతనవమస్కంధంలో గంగావతరణఘట్టంలో ఆయన శ్లేషమూలోపమాలంకారాలతో 78 పంక్తులలో సుదీర్ఘమైన 'బాణవచనం' వ్రాశారు. అందులో 'గణితశాస్త్రంబు లోలంబిని ఘన, ఘనమూల, వర్గమూల, సంకలిత, భిన్న మిశ్రప్రకీర్ణఖాతభీష్మంబై' అని వర్ణించారు (9-229). (ఆ వచనంలో ఇతరశాస్త్రాలప్రస్తకికూడా ఉందిగాని

---

1. లక్ష్మణరాయ వ్యాసావళి-'ఏకశిలానగర మొరుగల్లే', పుట91.
2. వీరభద్రవిజయం, 1-32.

అందులో కొన్ని వరంగల్లు చేరాక నేర్చుకొన్నవి కావచ్చు). యుక్తవయస్సు వచ్చాక పోతరాజుగారు ఏ శ్రీమంతుని కొలువులోనో గణకుడుగా చేరి ఉండవచ్చు. ఓరుగల్లులోనో, పద్మనాయకరాజధాని రాచకొండలోనో పోతరాజుగారు నివసించిఉండవచ్చు. ఆ రోజుల్లో చాలామంది ప్రభువులు, ప్రభుత్వోద్యోగులు వైష్ణవంవైపు మొగ్గుతున్నారు. రాచకొండ, దేవరకొండప్రభువులు మొదట శైవులైనా, వేదాంత దేశికులవారి కుమారుడు అక్కడి పండితులను ఓడించి, వైష్ణవాన్ని స్థాపించినట్లు మనం ఇంతకుముందు తెలుసుకున్నాం[1]. వేదాంతదేశికులవారి వైష్ణవగ్రంథాలు పఠించడం అప్పుడు విరివిగా సాగేది. అదీకాక, నాటి ఆంధ్ర సాహిత్యసంప్రదాయంలో హరహరాద్వైతం బాగా వేళ్ళూనింది. శైవుల ఇంట్లో పుట్టి శంభుదాసు అని బిరుదు వహించిన ఎర్రయ్యగారు నృసింహపురాణం, హరివంశం రచించారు. వైష్ణవుడైన అనంతామాత్యుడు తన భోజరాజీయంలో శివుని బాగా వర్ణించాడు; నుతించాడు. ఎర్రయగారి హరివంశంలోని కృష్ణలీలలు, మడికి సింగన్న రచించిన పద్మపురాణంలోని దశమాశ్వాసం (ఇది పూర్తిగా కృష్ణావతారచరిత్ర) బాగా చదివిన పోతరాజుగారికి కృష్ణావతారంగురించి, వాసుదేవతత్త్వంగురించి పూర్తిగా తెలుసుకోవాలనే కుతూహలం జనించిఉండవచ్చు.

ఈ కుతూహలం తీరేలోగా పోతరాజుగారు వయసుకు తగిన సొగసులు చూసి ఆనందించేవారని తోస్తుంది.

---

1. సమగ్రాంధ్ర సాహిత్యం, III పద్మనాయకయుగం, పుట 13.

ఆయన ప్రాయమా? పైలాపచ్చీసు! ఆయన ఉంటున్న దా-మఖ్యపట్నం, వైభోగాలతో, వారవిలాసినుల నృత్యావధానాలతో, మంజులగానాలతో ఆటపాటలు, శృంగార గానాలూ వెల్లివిరిసే కాలం. పోతరాజుగారుకూడ సానివాడను పావనం చేసేవారు కాబోలు. ఆ రోజుల్లో వారికి రాజాశ్రయంకూడా దొరికేది కాబోలు. రాచకొండ నేలే సర్వజ్ఞసింగభూపాలుడు (క్రీ. శ. 1425-1475) కూడా మంచి రసికుడు. అత డొకనాడు గోపాలదేవోత్సవక్రీడలో పాల్గొన్నాడు. అప్పు డొక మేడలోంచి వారకాంత ఒక్కతె అతణ్ణి చూసింది. మోహించింది. ఆమెతల్లి 'ఆ ప్రభువు మనింటికి ఎందుకొస్తాడే? మన తాహతుకు తగ్గ దొరలనే సరించి వలపించాలి' అని హితోపదేశం చేసింది. సానికూతురు వినలేదు. ఎన్ని రకాలుగానో తల్లి నిరోధించి, బతిమాలి, శపించి, ప్రాధేయపడి సింగభూపాలుని తీసుకురమ్మంది. చివరకు ఆ ప్రభువు వచ్చి ఆమెను వీలుకొన్నాడు. సంభోగసీపట్టం కట్టి మాన్యంగా ప్రసాదించాడు. ఏనుగు ఎక్కించాడు. రాజాశ్రయంలోనూ, సానివాడలోనూ సమానంగా వున్న పోతరాజుగారు ఈ సంగతులు ఒక దండకంలో ప్రాశారు.

దాన్ని 'భోగినీదండకం' అంటారు. అంతవరకూ వున్న స్తుతి రూపక సంప్రదాయమునకు బదులుగా, దండకాలలో ఇతివృత్త సంప్రదాయం పోతరాజుగారి దండకంతోనే ప్రారంభం అయిందని కొందరు పరిశోధకులు చెప్తారు.[1] అయితే దండకంలో ఇతివృత్తం చెప్పడం పోతరాజుగారితో

1. పోతన: నిడుదవోలు వెంకటరావుగారు, పుట 91.

కాక శ్రీనాథునితో మొదలైంది. దక్షయజ్ఞ సందర్భంలో కవిసార్వభౌముడు సతీదేవిచేత శివుణ్ణి భూషించి, దేవతలను దండకంలోనే దూషింపించాడు (కాశీఖండం, 7-74). నన్నయ తరువాత తిక్కన ఎర్రనలు దండకాలు ఉపయోగించలేదనికూడా పరిశోధకులు పొరబడుతున్నారు.[1] ఎర్రయ్య గారు నృసింహ పురాణంలో దండకం వ్రాశారు (5-11). పోతరాజుగారు దండకరచనలో ఎర్రయ మార్గాన్ని అనుసరించారు. శ్రీనాథుడు రెండు సగణాలపై రగణంతో దండకం వ్రాశాడు. ఎర్రయగారు ఎత్తుగడతోనే తగణ దండకం వ్రాశారు. పోతరాజుగారి భోగినీదండకం, భాగవతంలోని అక్రూరదండకం తగణదండకాలే.

పోతరాజుగారు పరమ భక్తులుగా భాగవతంవల్ల ప్రసిద్ధులైనవారనుక అటువంటి భోగినీ దండకంలాంటి శృంగార రచనలు చేయరని కొందరి మతం.[2] అయితే వారకాంతలను మాడకూడదు; వారిని వర్ణించకూడదు అన్న నియమం పోతరాజుగారికి భాగవత రచనాకాలంలోకూడా లేదు. దశమ స్కంధ ఉత్తరభాగంలో ధర్మజుని రాజసూయ యాగానికి 'వారాంగనా జనంబులు తమతమ వారలే గూడుకొని' వచ్చారని పోతరాజుగారు వర్ణించారు. ఈ వర్ణన ఒకటి రెండు మాటలతో కాదు. ఒక సీసపద్యంలోనూ, 24 పంక్తుల సుదీర్ఘవచనంలోనూ చేశారు.

---

1. పోతన: నిడుదవోలు వెంకటరావుగారు, పుట 91.

2. ఉదాహరణకు: చాగంటి శేషయ్యగారు, ఆంధ్రకవి తరంగిణి, 6 సంపుటి, పుట 184.

మహిత కుచభారకంపిత మధ్యలగుచు మొలనూళ్లు మెరయ
పయ్యెదలు జార ఒకరిమీద ఒకరు జల్లుకొన్న పన్నీటితో
చెంగావి జిలుగుపుట్టంబులు దట్టంబులుగా గోగిలి మర్మం
బులు బయటపడిన అగ్గలంబులకు సిగ్గులకు ఒప్పిదాలైన
తమ కనుదెప్పలకు అడ్డం చేస్తూ ఆ వారకాంతలు పురుషు
లతో రసోక్తి లెనయ వసంతా లాడారని ఈ సుదీర్ఘ వర్ణ
నలో పోతరాజుగారు చెప్పారు.

మహాభక్తులై పాదపద్మంతో భాగవతం రచిస్తూ బహుశా ఆ రచన కడపటిదశలో వారకాంతలను గురించి ఇంతగా వ్రాసిన పోతరాజుగారు యౌవనంలో భోగినీ దండకం వంటిది వ్రాయకుండా ఉంటారా? ఆ దండకం చివర నున్న ఒక పద్యం-అది పోతరాజుగారు వ్రాసినట్లే ఉంది—చూడండి.

పండిత కీర్తనీయుడగు బమ్మెరపోతన యీ సుధాంశు మా
ర్తాండ కులాచలాంబునిధి తారకమై విలసిల్ల భోగినీ
దండకమున్ రచించె బహుదాన విహర్తకు రావు సింగభూ
మండల భర్తకున్ వినుత మానవనాథ మచాపహర్తకున్.

ఈ పద్యంలో అనుప్రాస పోతరాజుగారి సంవిధా
నాన్నే పోలినది. దండకంలో కూడా పోతరాజుగారికి చాలా
ఇష్టమైన 'మందార మకరంద మాధుర్యమున తేలు మధు
పంబు పోవునే మదనములకు' అనే భావాలు ఉన్నాయి.
(ఈ భావాలను గురించి తరువాత చెప్పుకొందాం) భాగ
వతంలోని ఇతర పద్యాల పోలికలు కూడా దండకపాదా

లలో కనపడతాయి. మాటవరుసకు సింగభూపాలుని చూశాక భోగిని ఇలా అనుకొంటుంది :

మున్నే బ్రహస్తారవిందంబు నైనన్
మహీపాలు హస్తారవిందంబునై నేడు లీలారవిందంబునై యుందుభో
రత్నహారంబు నైనన్
ఈభాకారు వక్షోవిహారంబు గైకొందుభో యేల ఇట్లైతి.

సరిగ్గా ఇటువంటి భావాలే దశమస్కంధంలో శ్రీకృష్ణుని చూసినప్పుడు మధురలోని కాంతలకు వస్తాయి. చూడండి.

వేణునాదములమై వెలసిన మాధవుం డధరామృతము నిచ్చి యాదరించు
బింబదామములమై పెరిగిన వెన్నుండు మస్తకంబున దాల్చి మైత్రినెరపు
పీతాంబరములమై బెరసిన గోవిందు డంసభాగముల బాయక ధరించు
వైజయంతికలమై వ్రాలిన గమలాక్షు డతి ఘనూహాలమున నరుత దాల్చు
దనరు బృందావనంబున దరులమైన-కృష్ణు డానందమున చేరి క్రీడ సల్పు
నెట్టి నోములనైన మున్నిట్టి విధము-లేల కామైతి మోయమ్మ! యింక నెట్లు!
[భాగవతం, దశమ. 1-1352]

ఇలా పోలికలున్న భావాలవల్లనే కాక శైలి, సంవిధానాలవల్ల కూడా భోగినీదండకం పోతరాజుగారు వ్రాసినదే అని చెప్పవచ్చు. సర్వజ్ఞసింగభూపాలుని ఆశ్రయించి ఉన్నప్పుడు పోతరాజుగారు చెప్పిన చాటువుకూడా ఒకటి లభించింది. ఆడవాళ్ళకు లొంగడం మగవారికి పాడికాదని సింగభూపాలుడు భావిస్తే-అది తప్పనీ, లోలాక్షులకు లోబడడం రసికుల లక్షణమనీ పోతరాజుగారు చెప్పారట. చూడండి, ఆపద్యం.

రసికులైనవారు రమణుల కొక వేళ-వంగుటెల్ల ధర్మ వర్తనంబు
తీరసమున విల్లు నారికి వంగదా-చిత్తజాతరూప సింగభూప! 1

గడపవలసిన సమయంలో రసికజీవితం గడిపిన పోత రాజుగారు ఓరుగల్లులో విబుధవరుల సాన్నిధ్యంలో ఎన్నో సంగతులు వింటూ వాళ్లు చెప్పిన గ్రంథాలలో ఎన్నో విషయాలు కంటూ సాహిత్యజీవనం గడుపుతూఉండేవారు. భాగవతపురాణాన్ని గట్టిగా చదువుతూ ఉండేవారు. ఆ అధ్యయనంవల్ల వారికి కలిగిన భావాలు గమనించతగ్గవి.

1. ధర్మంబునం దవ్యభిచారియైన యర్థంబునకు గామంబు ఫలంబు గాదు.

2. తత్త్వ జిజ్ఞాస యనునది ధర్మజిజ్ఞాస.

3. కొందరు ధర్మంబె తత్త్వంబని పలుకుదురు.

4. ధర్మంబునకు భక్తి ఫలంబు. [భాగవతం, 1_56]

అందుకే వారు భక్తిమార్గాన్ని అవలంబించారు. ఆ భక్తికూడా సత్త్వగుణప్రధానమైనదే అయితే మంచిదని భాగవతపఠనంవల్లనే తేల్చుకున్నారు. భక్తి మోక్షదాయక మని నమ్మారు

మోక్షార్థులైనవారలు ఘోరరూపులైన భూతపతుల విడిచి దేవతాంతరనింద సేయక శాంతులై నారాయణ కథలయందే ప్రవర్తించుదురు.

[భాగవతం, 1_59]

అందుకే దేవతాంతరనింద చేసే మతాన్ని మాని తాత్త్వికగుణాన్ని అలవరచుకున్నారు. దీనికికూడా భాగవత పఠనమే కారణం.

---

1. వావిళ్లవారు తమ భోగినీదండకం పీఠికలో వేసుకున్నారు.

కాష్ఠంబుకంటె ధూమంబు, ధూమంబుకంటె ద్రవ్యాత్మయంబైన వహ్ని యెట్లు విశేషంబగునట్లు, తమోగుణంబుకంటె రజోగుణంబు, రజోగుణంబుకంటె బ్రహ్మప్రకాశంబగు సత్త్వగుణంబు విశిష్టంబగు.

[భాగవతం, 1-59]

ఆ కాలంలో వైష్ణవులు చాలా పేదవారు. మూల భాగవతరచనాకాలంనుండి పోతరాజుగారి కాలందాకా విష్ణు భక్తులు దరిద్రనారాయణులే. 'కొందరు రాజసతామసులై సిరియు నైశ్వర్యంబును బ్రజలను గోరి పితృభూత ప్రజేశాదుల నారాధింతురు (భాగవతం 1-59)' అని పోతరాజుగారే చెప్పారు. భాగవతంలో ఒక ఘట్టంలో శివభక్తులు ధనవంతులై విష్ణుభక్తులు పేదలవడానికి కారణం చెప్పమని పరీక్షిత్తే శుకయోగిని ప్రశ్నిస్తాడు. చూడండి.

మునినాథోత్తమ! దేవ దానవులలో ముక్కంటి సేవించువా
రనయంబున్ బహువస్తు సంపదల సౌఖ్యానందులైయుండ న
వ్వనజాతాక్షు రమామనోవిభుని శశ్వద్భక్తి సేవించు స
జ్జనులవర్యుల్ గడు బేదలౌటకు గతంబున్ నా కెరింగింపవే!

[భాగవతం, 10. II. 1227]

శివుడు గుణత్రయాన్వితుడుకనుక రాగాదియుక్తుడై రాగిల్లి అతణ్ణి కొలిచేవారు సంపదలు పొందుతారనీ, విష్ణువు గుణాతీతుడు కనుక అతని భక్తులు రాగాదిరహితులై ఉంటారనీ శుకయోగి చెప్పాడు. ఇదే ప్రశ్న ఒకసారి ధర్మరాజు వేస్తే కృష్ణుడిలా జవాబు చెప్పాడట.—

వసుమతీనాథ! యౌవ్వనిమోద నా కను
గ్రహ బుద్ధి వోడము నా ఘనుని వి త్త

మంతయు గ్రమమున నపహరించిన వాడు
ధనహీనుడగుచు సంతాపమందు
విడుతురు బంధు లవ్విధమున నొంటరి
యై చేయునదిలేక యఖిల కార్య
భారంబు లుడిగి మద్భక్తులతో మైత్రి
నెరపుచు విజ్ఞాన నిరతుడగుచు
బిడప వా డవ్యయానంద పదము నాత్మ
నెరిగి సామీప్య సంప్రాప్తి నెలమి నొందు
గాన మత్సేవ మిగుల దుష్కర మటంచు
వదలి భజియింతు రితర దేవతల నెపుడు.

[భాగవతం, 10_II. 1230]

తనను పూజింపదలచుకొన్న వాళ్ళలో ఎవరినైనా కరుణించదలచుకొంటే వాళ్ళను మొదట బుక్కాపట్నంలో చేస్తానని భగవంతుడు భాగవతంలో ఇంకొక ఘట్టంలో కూడా చెప్తాడు. 'ఎవ్వని గమణింప నిశ్చయించితి వాని యఖిల విత్తంబు నే నపహరింతు' అని వామనుడు చెప్పాడు (భాగవతం. 8-659). ఈ భగవద్వాక్యాలను భాగవత పురాణపఠనంవల్ల పోతరాజుగారు మనస్ఫూర్తిగా నమ్మి దరిద్రాన్ని వరించారు.

భాగవతపురాణరచనాకాలంలోగాని, ఆంధ్రీకరణ కాలంలోగాని శివభక్తులు ధనవంతులై, విష్ణుభక్తులు పేద వారుగా ఉండడానికి తగిన కారణాలు సాంఘిక రాజకీయ చరిత్రలలో దొరకవు. ఆదిమయుగందగ్గిర నుంచి మన దేశంలో శివాలయాలు ఎక్కువగా ఉండేవి. చాళుక్య ప్రభువు ఒక్క నరేంద్రమృగరాజే 108 శివాలయాలు కట్టిం

చాడు. ప్రభువులు, ప్రజలుకూడా పూర్వం శివాలయాలకే బాగులుచేస్తూఉండేవారు. మన ప్రాచీన సాంఘికజీవనం, సాంస్కృతికజీవనం ఆలయాలపైన ఎక్కువగా ఆధారపడేవి. పెద్ద దేవాలయాలను నమ్ముకొని 72 నియోగాలవారు ఉండేవారని, ప్రతిఆలయం ఒక చిన్నసైజు రాజధాని అని మనం ఇంతకుముందు చెప్పుకొన్నాం.[1] ఆరోజులలో శివాలయాలకు ఆస్తులుండేవి. రామానుజాచార్యులవారు కొన్ని శివాలయాలను వైష్ణవాలయాలుగా మార్చి ప్రసిద్ధంచేశారు. తరువాతి యుగాలలో శివాలయాల ప్రభ తగ్గి వైష్ణవదేవాలయాలలో అంగరంగభోగాలు ఎక్కువైనాయి. శైవులు క్రమేణా బీదవాళ్లు కాజొచ్చారు.

రామానుజులు చేసిన మార్పు మన చరిత్రలో కొత్తది కాదు. జైనవసతులను, బౌద్ధారామాలను మన వాళ్లు అంతకుముందు శైవక్షేత్రాలుగా మార్చేశారు. వాస్తవానికి భాగవతపురాణంలోనే జైనబౌద్ధమతాలను వాసుదేవతత్త్వంలో విలీనం చేసుకొనడం కనబడుతుంది. పరమనాస్తికమైన సాంఖ్యాన్ని సవైదికం చేసి ఆస్తికంచేసి ఆధ్యాత్మికం చేసి భాగవతం దానిని స్వంతంచేసుకొంది. భాగవతంలో వాసుదేవుడు ఎత్తిన అవతారాల సంఖ్య 21. వాటిని చూడండి.

ప్రథమస్కంధంలో చెప్పిన వరుస—

(1) ప్రథమమైన దివ్యరూపం. (2) యజ్ఞవరాహరూపం. (3) నారదావతారం. (4) నరనారాయణావతారం. (5) కపిలుని

---

1. సమగ్రాంధ్ర సాహిత్యం, I చాళుక్యయుగం, పుట 97.

అవతారం. (6) దత్తాత్రేయావతారం. (7) యజ్ఞావతారం. (8) ఋషభ క్రమావతారం. (9) పృథు చక్రవర్తి అవతారం. (10) మీనావతారం. (11) కూర్మావతారం. (12) ధన్వంతరి అవతారం. (13) మోహినీ అవతారం. (14) నరసింహావతారం. (15) వామనావతారం. (16) పరశురామావతారం. (17) వ్యాసావతారం. (18) రామావతారం. (19) బలరామావతారం. (20) కృష్ణావతారం. (21) బుద్ధావతారం. తరువాత కల్క్యవతారం. [భాగవతం, 1_61]

ద్వితీయ స్కంధంలో చెప్పిన వరుస—

(1) యజ్ఞావతారం. (2) కపిలుని అవతారం. (3) దత్తాత్రేయావతారం. (4) సనకసనందనాదుల అవతారం. (5) నరనారాయణ అవతారం. (6) ధ్రువావతారం. (7) పృథుని అవతారం. (8) వృషభావతారం. (9) హయగ్రీవ అవతారం. (10) మత్స్యావతారం. (11) కూర్మావతారం. (12) నృసింహావతారం. (13) ఆదిమూలావతారం. (14) వామనావతారం. (15) హంసావతారం. (16) మన్వావతారం. (17) పరశురామావతారం. (18) శ్రీరామావతారం. (19) కృష్ణావతారం. (20) వ్యాసావతారం. (21) బుద్ధావతారం. తరువాత కల్యవతారం. [భాగవతం, 2. 112_199]

ఈ అవతారాలలో కొన్నిటి సవిస్తరగాథలు భాగవతంలో ఉన్నాయి. కపిలాచార్యుని కథ, అతడు తల్లికి సాంఖ్యం ఉపదేశంచేయడం తృతీయస్కంధంలో ఉన్నాయి. కపిలుడు నిరీశ్వరమైన భౌతికవాదాన్ని ఆదిలో ప్రవచించాడు. నేడు మనకు లభించిన సాంఖ్యసూత్రసాంఖ్యకారికలు ఆదిమరచనలు కావని, ఆదిమసాంఖ్యం లోకాయతమేనని దేవీప్రసాదచటోపాధ్యాయగారు వివరించారు.[1]

---

1. *Lokayata* by Devi Prasad Chattopadhyaya, Peoples Publishing House, P. 359_458.

ఆదిమసాంఖ్యం అవైదికం. అది భౌతికవాదం; నిరీశ్వరం. దానిని చాలామంది ఆదరించి ఆచరించారు. జైన బౌద్ధదర్శనాలు దానినుండే ప్రభవించాయి. అందుచేత సాంఖ్య, జైన బౌద్ధప్రవక్తలను వాసుదేవుని అవతారాలను చేసి ఆ దర్శనాలలో ప్రచారంజకమయిన వాటిని స్వీకరించి వైదికులు ఇంకొక దర్శనాన్ని సృజించారు. వాసుదేవుని 21 అవతారాలలో ఒకటైన వృషభావతారం, లేక ఋషభావతారం జైనతీర్థంకరులలో ప్రథముడైన ఋషభదేవుని కథకు రూపాంతరం. పంచమస్కంధంలో 41 నుండి 89 దాకా 49 గద్యపద్యాలలో ఉంది. ఋషభుడు దక్షిణ కర్ణాటదేశానికి వచ్చి ఉన్మత్తునిలాగా విక్షిప్తకేశుడై, దిగంబరుడై సంచరించాడట. అతని కృత్యాలను విని ఆ రాష్ట్రాధిపతి నిజధర్మాన్ని విసర్జించి మనుజులను అసమంజసమైన పాషండమతాభినివేశులను చేశాడట (భాగవతం, 5-89). తెలుగుదేశంలో కూడ ఒకనాడు ఈ ఋషభుని పూజ ఉండేది. వరంగలు జిలాలోని కొలనుపాక నేటికీ జైనులకు యాత్రాస్థలం. ఇక్కడ ఋషభదేవుని ఆకుపచ్చని రాతి విగ్రహం ఉంది.[1] జైనుడైన ఋషభుని వాసుదేవుని అవతారంగా చేయడంలో అంతరార్థం అతని నోటివెంట బ్రాహ్మణాధిక్యతను చాటించడమే. ఋషభుడు తన కుమారులకు చేసిన నీతిబోధలో యీక్రిందిపద్యం ఒకటి:

---

1. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 4వ సంపుటి, పుట 1387.

భూతజాలములందు భూజముల్ వర్యముల్ భూరుహంబులకంటె భోగికి భోగిసంతతికన్న బోధనిష్ఠులు బోధమాన్యులకన్నను మనుజవరులు [లము వీరికన్నను సిద్ధవిబుధగంధర్వులు వారికన్ననుసురుల్ వారికన్న నింద్రాదిదేవత లిందరికన్నను దక్షాదిసన్మనుల్ దలప నెక్కు-

డంతికన్నను భర్గు డా యభవుకన్న
గమలభవు డెక్కు డాతనికంటె విష్ణు
డధికు డాతడు విప్రుల నాదరించు
గాన విప్రుడు దైవంబు మానవులకు. [భాగవతం, 5-74]

దీని తరువాతి పద్యాలుకూడా బ్రాహ్మణపూజనే బోధిస్తాయి. ఈ ఋషభావతారంగురించి కొంతమంది పండితులు వేరేవిధంగా వ్యాఖ్యానం చేస్తారు. "వాసుదేవ తత్త్వము, అవతారములు, భాగవతవైష్ణవము" అనే విషయాలపై ఉపన్యసించిన వేదాల తిరువేంగళాచార్యులు గారు ఇలా వ్రాశారు:

ఇతడు జడస్వభావమైన యోగముతో జరించెను. ప్రశాంతాంతఃకరణుండై పరిముక్తసంగుడై ఇత డుండగా అదియే పరమహంసల కభిగమ్యమగు పదమని పరమర్షులు తెల్పిరి. ఈ మహానుభావుని జడయోగము అవధూతప్రవృత్తిలోని అంతరార్థము నెరుగక ఆర్హతులు, జైనులు విపరీతముగా గ్రహించి అవైదికమై, శిష్టులకు పరిగ్రహింపరాని దగు మార్గము నవలంబించిరి.1

అయితే చారిత్రకంగా చెప్పుకోవాలంటే ఋషభుని ఉపదేశాలకు వేదానుసారులు వేరే వ్యాఖ్యానం చెప్పి చరిత్రను తిరగ్రాశారు అనుకోవాలి. భాగవతతత్త్వాన్ని

1. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, ఆంధ్రసారస్వతపరిషత్తు, పుట 361.

ప్రచారం చేయడానికి ఇటువంటిది జరగడంలో ఆశ్చర్యం లేదు. భాగవతమతంగురించి మేడేపల్లి వరాహనరసింహ స్వామిగారు ఇలా చెప్పారు:

ఇది వేదాల ఉపనిషత్తుల కాలంలో ప్రచారంపొందిన మతం. ఇది ఆర్యేతరమతాంశాల నన్నిటిని తనలో జీర్ణించుకుని ఉండిఉంటుంది. ఈ ప్రజామతము కాలక్రమేణా సాంప్రదాయకరూపమును ఆర్జించుకుని వాసుదేవశ్రీకృష్ణనామములతో సాహచర్యమును సంపాదించుకొన్నది. దీని సంపూర్ణరూపము భగవద్గీతలో మనకు గోచరమగును. ఈ మతము నకు సాధ్యమైనంత ప్రాముఖ్యమును కలిగించుటకుగాను మహాభారత మంతయు తిరిగి వ్రాయబడినట్లు అగుపించును.[1]

శ్రీకృష్ణుని జీవితంగురించి సమగ్రంగా చెప్పే ప్రాచీన గ్రంథాలలో హరివంశం, బ్రహ్మపురాణం, విష్ణు పురాణం, భాగవతబ్రహ్మవైవర్తపురాణాలు ముఖ్యమైనవి. వీటిలోని కథలు కొన్ని పరస్పరవిరుద్ధాలు. ఈ పురాణాల నన్నిటిని తులనాత్మకంగా, కూలంకషంగా పరిశీలించిన పండితులు బ్రహ్మ, విష్ణుపురాణాల రెండిటి పాఠాలూ ఒక్కలాగ ఉన్నాయని, ఈ రెండిటిలో బ్రహ్మపురాణమే ప్రాచీనమని చెప్తారు. పద్మ, అగ్ని, భాగవత, బ్రహ్మవై వర్తపురాణాలలో కృష్ణచరిత్ర వుందిగాని వీటిలో భాగవత మొక్కటే పురాణేతిహాసాలలోని కథలను ఒక క్రమంగా చెప్తుంది. బ్రహ్మవైవర్తపురాణం చాలా అర్వాచీనమని,

---

1. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 7 సంపుటం-దర్శనములు, పుట 585.

రాధకు ప్రాముఖ్యం ఇవ్వడానికి రచించినదని విజ్ఞులు చెప్తారు.[1]

భారతకృష్ణుడు, భాగవతకృష్ణుడు విభిన్నవ్యక్తు లనే వాదం ఒకటి ఉంది. మన ప్రాచీనచరిత్రలో చాలామంది కృష్ణులున్నారు. ఋగ్వేదంలో 'కృష్ణ ఆంగీరసుని' ప్రస క్తి ఉంది. ఇతడు అనార్యనాయకుడని, అంశుమతీతీరంలో పది వేలమంది సైనికులతో ఇతడు వేచిఉన్నప్పుడు ఇంద్రుడు ఇతణ్ణి సంహరించాడనీ సీతానాధత త్వభూషణ్, ఆర్. డి. భండార్కర్ మొదలైనవారు భావిస్తున్నారట.[2] ఋగ్వేదంలో ఎనిమిదవ మండలంలో (85-3, 4) (96-13, 15) లలో కృష్ణప్రస క్తి ఉంది. కౌషీతకీబ్రాహ్మణం (30-9)లో కూడా కృష్ణఆంగీరసుని ప్రస క్తిఉంది. ఐతరేయ బ్రాహ్మణం (III-2, 6) హారీతకృష్ణు డనే ఆచార్యుని పేర్కొంటుంది. ఛాందోగ్యోపనిషత్తులో దేవకీపుత్రకృష్ణుని ప్రస క్తి ఉంది (3-17,6). దీనిమీద వ్యాఖ్యానం వ్రాస్తూ స్వామీస్వాహానందగారిలా అన్నారు.

"In this passage historians find the earliest reference to Sri Krishna which cannot be dismissed as legendary."[3]

బౌద్ధజైనవాఙ్మయంలోకూడా కృష్ణప్రస క్తి ఉంది. ఘటజాతకం కృష్ణవాసుదేవుడు మధురరాజవంశంలోనివా

---

1. Studies in Epics and Puranas of India—by A. D. Pusalker, P. 61.

2. Ibid, P. 51.

3. Chandogya Upanishat, Swami Swahananda, Ramakrishna Math Publication.

డని పేర్కొంటుంది. జైనుల ఉత్తరాధ్యయనసూత్రంలోని ద్వాదశోపాంగం వృష్ణివంశీయుడైన కృష్ణవాసుదేవుని, బలరాముని గురించి చర్చిస్తుంది. శ్రీకృష్ణునిగురించి దొరికినన్ని వివరాలను శ్రీ పుసాల్కర్ గారు సేకరించి శ్రీకృష్ణుని చారిత్రకత్వంపై సుదీర్ఘ వ్యాసం వ్రాశారు.

పాణినికాలంనాటికే వాసుదేవుణ్ణి, అర్జునుణ్ణి వీరులుగా ఆరాధించేవారు. పాణినికాలం క్రీ. పూ. 760–600 అని బెల్వాల్కర్ గారూ, క్రీ. పూ. 350 ప్రాంతాలని మాక్స్ ముల్లర్ మొదలైనవారూ చెప్తారు. ఈ మధ్యకాలంలో ఎప్పుడైనా అతడు ఉండవచ్చు. పాణినీయసూత్రాలలో పేర్కొనబట్టి వాసుదేవుడు, అర్జునుడు అప్పటికే ప్రసిద్ధపురుషులు. వారిని ప్రజలు ఆరాధించేవారు. పార్జిటర్ గారి లెక్క ప్రకారం క్రీ. పూ. 950 లో మహాభారతయుద్ధం జరిగింది. హస్తినాపురంలోనూ, కూపర్ లోనూ జరిపిన త్రవ్వకాలను పట్టి ఈ కాలనిర్ణయం ధ్రువపడిందట.[1] కాబట్టి కృష్ణుడు క్రీ. పూ. 1000 సంవత్సరాలవాడు.

శ్రీకృష్ణుడు తన కాలంలో వైదికమతంపట్ల తిరుగుబాటు చేసినవాడే. అప్పటిదాకా సంప్రదాయానుసారం జరిపే ఇంద్రయాగాన్ని అతడు మానిపించాడు. "కానలు, కొండలు, పసుల గాదిలి వేల్పులు గొల్లవారికిన్" అని ప్రకృతిపూజ నేర్పాడు (హరి. I. 7–131) "మన మేమి ఎరుగుదుము శక్రుని? అమరులు మునులు అతని గొలుతురు

---

1. పుసాల్కర్ గారి Studies in Epics and Puranas of India. 765 పుటలో భారతీయ విద్యాభవన్ సంపాదకుల ఆధోజ్ఞాపిక.

గాక. ఇవ్వనములు గిరులు మన జూచిన మేరలు,'' వీటినే పూజించాలి అన్నాడు. (హరి. I. 7-137) తాను చెప్పిన కొండపండుగ చేయకపోతే బలవంతంగానైనా చేయిస్తా నన్నాడు. ''నేను మీకు కావాలంటే ఒప్పుకొండి'' అన్నాడు. హరివంశంలో ఇలా చెప్పినవాడు అదేభాగవతంలో కర్మయోగాన్ని ఉపదేశిస్తాడు.

కర్మమున బుట్టు జంతువు - కర్మమునన్ వృద్ధి పొందు, కర్మమున జెడున్
గర్మమె జనులకు దేవత - కర్మము సుఖదుఃఖములకు కారణ మధిపా!

[భాగవతం, 10. 1-88]

సత్త్వరజస్తమో గుణంబు లుత్పత్తిస్థితిలయకారణంబులు. అందు రజంబున జగంబు జన్మించు. రజోగుణ ప్రేరితంబై మేఘంబులు వర్షించు. వర్షమునం బ్రజావృద్ధి యగు. ఇంద్రుడేమి సేయంగలవాడు?

[భాగవతం, 10. 1-884]

ఇటువంటి ప్రబోధలు చేసిన కృష్ణుడు క్రమంగా తానే ఆరాధ్యదైవం అయ్యాడు. అతని జీవిత కాలంనుంచి ప్రచారమైన కథలన్నీ క్రీ. శ. 5వ శతాబ్దం తరువాత ఎప్పుడో భాగవత పురాణరూపం దాల్చాయి. నామలింగానుశాసనం అనే అమరకోశం వ్రాసిన అమరసింహుడు ఆ కాలపువాడు. అతడు పురాణాలకు పంచలక్షణం చెప్పాడు.

సర్గశ్చ ప్రతిసర్గశ్చ వంశో మన్వంతరాణిచ
వంశానుచరితంచైవ పురాణం పంచలక్షణం.

అన్నది అమరసింహుని నిర్వచనం. భాగవతపురాణంలో మటుకు దశలక్షణ నిర్వచనం ఉంది.

సర్గోస్యాథ విసర్గశ్చ వృత్తిరక్షాంతరాణిచ
వంశో వంశానుచరితం సంస్థా హేతురపాశ్రయః
దశభి ర్లక్షణైర్యుక్తం పురాణం తద్విదో విదుః
కేచిత్పంచవిధం బ్రహ్మన్ మహదల్ప వ్యవస్థయా.
[భాగవతం, XI-7. 9-10]

ద్వితీయ స్కంధంలో శుకయోగి మహా భాగవతం ఉపన్యసిస్తానని చెప్పి ''అమ్మహాపురాణంబు చతుశ్లోకరూపంబున దశలక్షణంబు ఉచిత మార్గంబుల నొప్పు. అందు దశలక్షణంబు లెయ్యవి? యనిన-సర్గంబును, విసర్గంబును, స్థానంబును, పోషణంబును, ఊతులును, మన్వంతరంబులును, నీశానుచరితంబులును, నిరోధంబును, ముక్తియు నాశ్రయంబను పదితెరంగు లయ్యె'' అని వివరించాడు (భాగవతం, 2-259). ఈ లక్షణాలతోపాటు సాంఖ్య తత్త్వవివరణ, వేదాంత ప్రతిపాదకాలైన బాదరాయణ బ్రహ్మసూత్రాలను క్రోడీకరించడం మొదలైనవాటితో భాగవతం బాగా పెరిగింది. ఇతర పురాణాలు భాగవతంలో 18 వేల గ్రంథాలు, 12 స్కంధాలు ఉన్నట్టు చెప్తాయి. గ్రంథమంటే ముప్ఫయి రెండు అక్షరాలు. ఇప్పటి ప్రతులలో 22 వేల గ్రంథాలున్నాయి. అంటే 4 వేల గ్రంథాలు ఇతరులు కలిపారన్నమాట. ఇవి ఎవరు కలిపిఉంటారు?

క్రీ.శ. 1271-1309 ప్రాంతాలలో దేవగిరి రాజ్యాన్ని రామరాజు పాలిస్తూండేవాడు. అతని ఆస్థానంలో హేమాద్రి అనే మహామంత్రి, బోపదేవు డనే మహాపండితుడు ఉండేవారు. భాగవతంలోని అన్ని స్కంధాలలోనుంచీ విష్ణు

లక్షణ, విష్ణుభక్తి, విష్ణుతత్త్వ ప్రతిపాదకాలైన పద్యాలు ఉద్ధరించి బోపదేవుడు ముక్తాఫలం అనే పద్యాత్మకగ్రంథం వ్రాశాడు. వాటికి హేమాద్రి పేరు పెట్టాడు. ఈ బోపదేవుడే భాగవత పురాణం వ్రాసి దానికి వ్యాసులవారి పేరు పెట్టాడనే అపనింద వ్యాపించింది. అందుచేత మహాభాగవతం అష్టాదశ పురాణాలలో చేరదని, దేవీభాగవతమే అందుకు అర్హమైనదనీ శాక్తేయులు వాదింప సాగారు.[1] బోపదేవుడు అధికపాఠాలు చేర్చిఉంటాడు.

భాగవతానికి 'హయగ్రీవ బ్రహ్మవిద్య' అనే నామాంతరం ఉంది. ఈ పురాణాన్ని అర్థం చేసుకొనడం కష్టం. అందుకే, సాధారణంగా, పండితులు కూడా భాగవతాన్ని పారాయణ చేయడానికి భయపడతారట. పూర్వం ఒక పండితుని వ్యుత్పత్తి గమనించడానికి భాగవతానికి అర్థం చెప్పమనేవారట. ఈ సంగతులు విశదం చేస్తూ వ్యాసభాగవతంలో కవిత్వం కార్కశ్యమున పరాకాష్ఠ అందిందని పుట్టపర్తి నారాయణాచార్యులుగారు చెప్పారు.[2] క్లిష్టమైన ఈ పురాణంలోని అర్థాన్ని స్పష్టంచేయడానికి శ్రీధరులు విపులమైన వ్యాఖ్యానం వ్రాశారు. పోతరాజు గారు భాగవత తత్త్వాన్ని అర్థం చేసుకొనడానికి శ్రీధర వ్యాఖ్యతో ఎన్నోసార్లు దాన్ని అధ్యయనం చేసి ఉంటారు. అంతరార్థాలు గ్రహించి ఉంటారు.

---

1. సంస్కృత వాఙ్మయ చరిత్ర. ద్వితీయ సంపుటం. మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు. పుటలు 76_77.
2. ఆంధ్ర మహాభాగవతోపన్యాసములు, పుట 105.

పోతరాజుగారు భాగవత పారాయణ చేస్తూండే రోజులలో వారికి శ్రీమన్నారాయణ కథాప్రపంచాన్ని వివరించాలనే కుతూహలం కలిగింది. ఒకనాడు చంద్రగ్రహణం వచ్చింది. అది చాలా విశేషమైన సంపూర్ణ చంద్రగ్రహణం కానచ్చు. అందుకే ప్రత్యేకం పనికట్టుకుని పెద్దల అనుమతి తీసుకొని గోదావరిలో స్నానం చేయడానికి ఓరుగల్లునుంచి అంతదూరం వెళ్లారు. నిండుపున్నమిరాత్రి. గోదావరిలో పట్టుస్నానం చేసి పోతరాజుగారు ఇసుక తిన్నెల మీద కూర్చుని మహేశ్వరధ్యానం చేస్తూ కళ్లు మూసుకొన్నారు. అప్పుడు కాంతా సమేతుడైన ఒక రాజ ముఖ్యుడు వారి కళ్లముందు కనిపించాడు. ఆయన ఆదంపతులను తేరిచూసి, మాట్లాడాలని ప్రయత్నించేలోగా ఆ దివ్యపురుషుడు, తాను శ్రీరామచంద్రుడ నని తెలియబల్కి తన పేరు మీదుగా శ్రీ మహాభాగవతం తెలుగు చేయమని, దానివల్ల వారి భవబంధాలు తెగుతాయని ఆనతిచ్చాడు పోతరాజుగారు కళ్ళు మూసుకుని వెరగుపడి ఇలా అన్నారు:

పలికెడిది భాగవతమట – పలికించెడి విభుడు రామభద్రుండట నే
పలికిన భవహరమగునట – పలికెద వేరొండు గాథ పలుకగ నేలా ?

[భాగవతం, 1-16]

కాని భాగవతాన్ని అర్థంచేసుకుని రచించడం చాలాకష్టం. అయితే పెద్దలవల్ల తెలుసుకున్నది, తాము బోధపరుచుకున్నది విశదంచేయవచ్చు. అందుకే ఇలా చెప్పారు:

భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు - తూలికైన దమ్మి చూలికైన
విబుధజనులవలన విన్నంత కన్నంత - తెలియవచ్చినంత తేటపఱతు.
[భాగవతం, 1_17]

ఇది ఎటువంటి శైలిలో వ్రాయాలి అన్నది ప్రశ్న. ఆ రోజులలో కొందరు సంస్కృతసమాసభూయిష్ఠమైన రచన హర్షించేవారు. కొందరు తేట తెనుగు మెచ్చుకొనేవారు. కొందరు రెండూ ఆదరించేవారు. పోతరాజుగారు అందరినీ మెప్పించదలిచారు. ఈ సంగతే ఈ పద్యంలో చెప్పారు:

కొందరికి తెలుగు గుణము-గొందరికిని సంస్కృతంబు గుణము రెండున్
గొందరికి గుణములగు నే-నందరి మెప్పింతు గృతుల నయ్యె యెడలన్.
[భాగవతం, 1_18]

నన్నయగారు, తిక్కనగారు మొదలైన మహాకవులు ఎన్నో కావ్యాలు తెలుగుచేసినవాళ్లు తాము చేసుకొన్న పుణ్యం కొద్దీ భాగవతాన్ని విడిచిపెట్టారని పొంగిపోయారు.

ఒనరన్ నన్నయ తిక్కనాది కవు లీ యుర్వీం బురాణావళుల్
తెనుఁగుల్ సేయుచు మత్ప్రకాశిత శుభాధిక్యంబు తా నెట్టిదో
తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ దీనిన్ దెనింగించి నా
జననంబున్ సఫలంబు చేసెద బునర్జన్మంబు లేకుండగన్.
[భాగవతం, 1_19]

అంతకుముందే వారు పూర్వకవులను సంభావన చేశారు. వర్తమానకవులను ప్రియాలు పలికారు. భావికవులను బహూకరించారు.[1] కుకవులను నిందించనేలేదు. భాగవతాన్ని కల్పతరువుగా భావించి ఇలా నుతించారు:

---

1. పోతరాజుగారిలాగా భావికవులను బహూకరించిన తెలుగుకవి ఇంకెవరూలేరు. 'తమకు మంచి భవిష్యత్తు' ఉందని వారికి ముందే తెలుసు

లలిత స్కంధము గృష్ణమూలము శుకాలాపాభిరామంబు మం
జులతా శోభితమున్ సువర్ణ సుమనస్సుజ్జేయమున్ సుందరో
జ్వల వృత్తంబు మహోఫలంబు విమల వ్యాసాలవాలంబునై
వెలయున్ భాగవతాఖ్య కల్పతరు వుర్విన్ సద్ద్విజశ్రేయమై.
[భాగవతం, 1_20]

ఇలాంటి మహాభాగవతాన్ని తెనిగించాలని నిశ్చ యించి విడుపుస్నానం చేసి దీక్షపట్టారు. కొన్నాళ్ళకు ఏకశిలానగరానికి వెళ్ళి గురువులు, వృద్ధబంధువులు మొద లైనవారి అనుజ్ఞ తీసికొన్నారు. మనస్సులో శ్రీరామ చంద్రుని సన్నిధానం కల్పించుకొన్నారు. నాలుగు ఉత్పల మాలలలో కృష్ణునికి ఇది సమర్పించుకొంటున్నట్లు షష్ట్యం తాలు వ్రాశారు. తాము ఆంధ్రభాషలో రచింపబూనిన శ్రీమహాభాగవతానికి ప్రారంభం చెప్పారు.

పోతరాజుగారు ప్రారంభించిన భాగవతాన్ని సంపూ ర్ణంగా అనువదించలేదు. 12 స్కంధాలలోనూ వారు వ్రాసినవి ఎనిమిదే. మిగతా నాలుగూ ఇతరులు రచిం చారు. ఒకటినుంచి నాలుగు, ఏడునుంచి పది స్కంధాలను పోతనగారు వ్రాశారు. పంచమస్కంధాన్ని బొప్పరాజు గంగయ, షష్ఠస్కంధాన్ని ఏర్చూరి సింగన, ఏకాదశ ద్వాదశ స్కంధాలను వెలిగందల నారయ వ్రాశారు. భాస్కర రామాయణంలాగే భాగవతంకూడా ఇంతమంది వ్రాయ డానికి కారణం తెలియదుగాని వీరేశలింగంగారు భాస్కర రామాయణవిషయంలో చేసిన వివరణవంటిది ఈ సంద ర్భంలో నిడుదవోలు వెంకటరావుగారు చేశారు. చూడండి.

పోతన భాగవతమును రచింప దలపుగొని దాను గ్రంథరచనకు ప్రారంభించి తొలి నాలుగు స్కంధములు రచించి వెనుక భక్తిరస ప్రధానములగు సప్త, అష్టమ, నవమ, దశమస్కంధముల దానే రచింప దలచి మధ్య స్కంధములలో పంచమము గంగనకు, షష్ఠము సింగనకు నిచ్చి రచింపుడని చెప్పి యుండవలెను.....దశమస్కంధాంతము వచ్చు సరికి పోతనకు చాల కాలము పట్టుటచే నేకాదశ ద్వాదశ స్కంధములు దన శిష్యుడగు వెలిగందలనారయకొసగియుండును.[1]

నిడుదవోలువారి వివరణతో ఖండవల్లిలక్ష్మీరంజనం గారూ, పింగళిలక్ష్మీకాంతంగారూ ఏకీభవిస్తున్నారు. పోత నామాత్యుడు స్వయముగా తన శిష్యుల ననుగ్రహింపగోరి భాగవతమునందలి చిన్నచిన్న స్కంధములను వ్రాయుడని వారికి ప్రసాదించియుండును''అని ఖండవల్లివారు అన్నారు.[2] కొన్ని భాగాలు ''పోతనజీవితంలోనే ఆయనఅనుజ్ఞపై ఆ కవులచే వ్రాయబడియుండునని నా యుద్దేశ్యము'' అని పింగళివారు చెప్పారు.[3] అయితే రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు ఈఊహకు ఆధారం చాలదంటున్నారు. భాగవ తాన్ని తనకు కృతిఇవ్వలేదన్న కోపంకొద్దీ సర్వజ్ఞసింగమ రేడు దానిని పాతిపెట్టించాడనీ, అందువల్ల కొన్నిభాగాలు క్రిములు తిన్నాయనీ, గ్రంథాన్ని పైకితీశాక నష్టమైన భాగాలను మిగతావాళ్లు గురువుగారిమీదా, గ్రంథంమీదా

---

1. భాగవతం, వావిళ్ల ప్రచురణ, 1948 ముద్రణ. పీఠిక పుటలు 83, 84.

2. ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం, పుట 67.

3. తెలుగు భాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 3 వ సంపుటి, పుట 400.

ఉండే భక్తిచేత పూరించారన్న కథను అనంతకృష్ణశర్మ గారు నమ్ముతున్నారు.[1] ఈకథను కూచిమంచి తిమ్మకవి ప్రచారంచేశాడు. ఇక, కాకునూరి అప్పకవి, అహోబలపతి, ముద్దరాజురామన్న మొదలైన లాక్షణికులు పోతరాజుగారి కవిత్వంలో బండిరాలకు,కొమ్మ్నరాలకు సాంకర్యం జరిగిందని, అందుచేత అది అప్రమాణం అన్నారట! పోతరాజుగారు అలా వ్రాయలేదు. నష్టమైన భాగాలను ఇతరులు పూరించడంవల్ల వారి రచనలో యీ సాంకర్యం వచ్చిందని తిమ్మకవి తన సర్వలక్షణసారసంగ్రహంలో చెప్పాడు.

అఖలవేదాంత విద్యారహస్యుడు, సహజపాండిత్య విశారదుడు, పటుతరకవితావిభాసితుడు, సకలాంధ్రలక్షణ చక్రవర్తి అయిన పోతరాజుగారు రేఫఱకారాలు ఎరగరని అజ్ఞులు కొందరాడుకొంటారు. ఆ మహాత్ముని కవిత్వంలో ఎక్కడా లోపం కలుగదని తిమ్మకవి చెప్తూ ఈపద్యాలు వ్రాశాడు.

అఖిలవేదాంతవిద్యారహస్యవిదుండు సహజపాండిత్యవిశారదుండు
మత్తకీతీశాధమస్తోత్రవిముఖుండు శంభుపదాబ్జపూజారతుండు
పటుతరకవితావిభాసితప్రతిభుండు సకలాంధ్రలక్షణచక్రవర్తి
రఘుకులేశనిదేశ రచితమహాభాగవతపురాణుడు పుణ్యవర్ధనుండు
బుధజనహితుండు బమ్మెరపోతసుకవి
యెన్న రేఫ రకారంబు లెరుగడనుచు
నజ్ఞులోకకొంద రాడుదు రమ్మహాత్ము
కవిత నెందును లోపమ్ములుగ దభవ!

---

1. భాగవతం. రాయలు ముద్రణ. పీఠిక. పుటలు 8-10 వరకు.

ఘనుడు పోతనమంత్రి మునుభాగవతమురచించి చక్రికిసమర్పించునెడల
సర్వజ్ఞసింగయతమ్మావరుండడి దనకిమ్మనివేడిన నిడకయున్న
నలిగి యాపుస్తకంబవనిభాతించిన జివికి యందొకకొంతశిథిలమయ్యె
గ్రమ్మర నది వెలిగందలనారపరాజును మరి బొప్పరాజు గంగ
రాజు మొదలగు కవివర్యుల్దిజమెసగ
జెప్పి రాగ్రంథములయందె తప్పులొదవె
గాని పోతకవీంద్రుని కవితయందు
లక్షణంబెందు దప్పదు దక్షహరణ.

[సర్వలక్షణసారసంగ్రహం, రేఫరకారప్రకరణం, 265, 266]

క్రీ. శ. 1756 లో ఉన్న తిమ్మకవి చెప్పేదాకా ఈ కథ దేశంలో ప్రచారం కాలేదు. పాతించడమే నిజమైతే పోతనశిష్యుడు వెలిగందల నారయ్య గ్రంథస్థం చేయకుండా ఉంటాడా? షష్ఠ స్కంధంలో స్పష్టంగా వేరే కృత్యాదీ, అవీ ఉంటే తిమ్మకవి ఆ స్కంధం పోతరాజుగారు చెప్పినదే అని చెప్పాడు. పై పద్యం తరవాత నెంబరులేని వచనంలో ఇలా ఉంది: "పోతరాజు చెప్పినవి ప్రథమ స్కంధమును, ద్వితీయ స్కంధమున కొంతయు, షష్ఠసప్త మాష్టమ నవమ స్కంధములును, దశమ స్కంధము పూర్వభాగము కొంతయునున్నవి. అందులో రేఫఱకార సాంకర్యము లేకుం డుటకు ప్రాయుచున్నాము, అని ప్రమాణాలు ఇచ్చారు.[1] తృతీయ స్కంధములో పోతరాజుగారి గద్య వుంటే అది వారి రచనగా తిమ్మకవి ఇవ్వనేలేదు.

---

1. రాజామంత్రిప్రగడ భుజంగరావుగారు 'మంజువాణి'లో ప్రకటించిన సర్వలక్షణ సారసంగ్రహ ప్రతి, పుట 262.

పోతరాజుగారిమీద ఉండే గౌరవము కొద్దీ తిమ్మకవి ఈ పాతిపెట్టడం కథ ప్రచారం చేశాడని పండితలోకంలో చాలామంది నమ్ముతారు. తమ ఆశ్రయంలో ఉన్న కవులు తమకు అంకితం ఇవ్వకుండా దేవునిపేర కావ్యాలు చేస్తే సహించిన రాజులు లేకపోలేదు. మడికి సింగన జ్ఞానవాసిష్ఠరామాయణాన్ని రాజాశ్రయంలో ఉంటూనే దేవునికి అంకితం ఇచ్చాడు. సర్వజ్ఞసింగమరేడు భాగవతం తన కంకితం ఇవ్వలేదని బాధపడినా, దేవునిపేర తెనిగిస్తున్నందుకు సంతోషించేఉంటాడు.

పోతరాజుగారు బీదతనం అనుభవిస్తూ వ్యవసాయం చేసుకొంటూ జీవించారనీ, రాజులన్నా, వారిచ్చే సంపదలన్నా కిట్టక భోగాలకు విముఖులై భాగవతం రచించారనీ లోకులు చెప్పుకొనే విషయాలు సుప్రసిద్ధాలు. ఈ క్రింది పద్యం వారు ప్రాసిందే అంటారు.

ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములు గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము బాసి కాలుచే
సమ్మెట ప్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పినీ
బమ్మెరపోతరా జొకడు భాగవతంబు జగద్ధితంబుగన్.

[భాగవతం, 1_11]

అయితే ఇది ప్రక్షిప్తమని పండితులు భావిస్తారు. ఈపద్యమూ, దీనితోపాటు 'చేతులారంగ శివుని పూజింపడేని' అనే పద్యమూ రెండువచనాలమధ్య ఉన్నాయి. తొలివచనం 'ఉభయకార్య దక్షుండనై' అనే ఉత్తమ పురుషతో ముగు

స్తుంది (1-10). మలివచనం 'మదీయ పూర్వజన్మ సహస్ర సంచిత తపఃఫలంబున శ్రీమన్నారాయణకథా విరచన కుతూహలుండనై' అని ఉత్తమ పురుషతోనే మొదలవు తుంది (1-13). ఈ రెండు వచనాలూ కలిసి ఏకాండంగా ఉండేవనీ, అందుకే రెండూ ఉత్తమ పురుషలోనే ఉన్నా యనీ, ఎవరో లేఖకులు ప్రథమపురుషలో ఉండే 'ఇమ్మను జేశ్వరాధముల' అనే పద్యమూ, 'చేతులారంగ శివపూజ' అనే పద్యమూ కలిపి ఉంటారనీ భావించవచ్చు.

అయితే ఆ రెండు వచనాల మధ్య ఈ రెండు పద్యాలు దేశంలో ఉన్నా, వ్రాతప్రతు లన్నిటిలోనూ ఏమాత్రం మినహాయింపు లేకుండా ఉన్నాయట. ఇటీవల మన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీవారు రెండువందల తాళపత్రగ్రంథాలను సేకరించి పరిశీలించి, వాటిలో ముప్ఫయి ప్రతులను ఎన్నుకొని పాఠాలు నిర్ణయించి భాగ వతం అచ్చువేశారు. అకాడమీ సంపాదకులు చూసిన అన్ని వ్రాతప్రతులలోనూ ఈ పద్యాలు ఉత్తమ పురుష వచనాలమధ్యనే ఉన్నాయట.[1]

అకాడమీ వారు ప్రచురించిన భాగవతం పీఠికలో ఈ క్రిందిపద్యం ఉదాహరించి కొన్ని సంగతులు వ్రాశారు. చూడండి.

---

1. భాగవతం, ప్రథమస్కంధం, 35 పుటలో ఆధోజ్ఞాపిక.

వినుము శుకుడు వచ్చి విజ్ఞానపద్ధతి_నతని కెట్లు తూఁపె, నతడు పిదప
దన శరీర మెవ్విధంబున వర్జించె_విప్రముఖ్య! నాకు విస్తరింపు.[1]
[భాగవతం, 1_275]

"అచ్చు ప్రతులలోను, వ్రాతప్రతులలోను పాఠ మిట్లే ఉన్నది. 'వినుము' అను క్రియ పద్యమున సంగత పడుటలేదు. సరియైన పాఠ మేమో ఇంకను విచారింప వలసి యున్నది."[2]

ఈ పద్యంలో 'వినుము' అన్నక్రియ సంగతపడక పోవడానికి కారణం ఉంది. 'వినుము' అన్నది పోతరాజుగారి ఊతపదం. చాలాపద్యాలు వారు 'విను', 'వినుము' అని ఎత్తుకొంటారు. అప్పుడప్పుడు ఒకేపద్యంలో రెండుసార్లు 'వినుము' అనేమాట వాడుతారు. చూడండి. వారు 'వినుము' వాడిన గద్యపద్యాల జాబితా.

వినుండు (1_65) విను (1_112) వినుమీసృష్టి... (1_127) వినుమీసంసారం... (1_130) వినుము నీకు నేడు (2_12) వినుము భగవంతుడైనహరి (2_16) వినుమూఢుండు (2_20) వినుమప్పరమాత్మయైన (2_28) వినుమునీవడిగిన (2_34) వినుడంభోజభవుండు (2_35) వినుము బ్రహ్మకర్చన (2_38) వినుమీశ్వరు (2_83) వినుమునీయీవిభుండైన (2_86) వినువత్స (2_102) వినువేయేటికి (2_106) నీకెరింగించెద వినుము (2_112) 2_116 నుంచి 197 దాకా విష్ణువుయొక్క 21 అవతారాల వర్ణన. ఈ గద్యపద్యాలలో 20 సార్లు 'వినుము' అనే మాట దొర్లింది. వాటిసంఖ్యలు—116, 118, 120, 122, 124, 135, 137,

---

1. అకాడమీసంపాదకులు పీఠికలో యీ పద్యం 1_275 అన్నా అచ్చువేయడంలో 274 గా వేశారు.

2. శ్రీమహాభాగవతం, మొదటిసంపుటం, పీఠిక పుట 111.

189 రెండుసార్లు, 141, 143, 145, 147, 149, 152, 154, 172, 173, 193, 197. అన్యులన్ జెప్పనేల వినుము (2_199) ఎఱిగింతు వినుము (2_203) వినుశుకయోగికి (2_217) వినుమని చెప్పెవడిసూతుండు (2_222) వినువిప్రుడు (2_284).

పోతరాజుగారు ప్రవాసిన ప్రథమద్వితీయస్కంధాలలో వెరసి 715 పద్యగద్యాలు ఉన్నాయి. వాటిలో 'వినుము' అనే క్రియ 41 సార్లు దొర్లింది. ఇతరస్కంధాలలోకూడా పోతరాజుగారిలా ఈ క్రియను చాలాసార్లు వాడారు. గ్రంథవిస్తరణభీతిచేత, అన్నీ క్రోడీకరించినా, ప్రకటించడం లేదు.

కొంతమంది కవులకు కొన్ని పదాలు ఎలాగ ఊత పదాలు అవుతాయో, అలాగే కొన్ని ఉపమానాలుకూడా విరివిగా వాడేవి అవుతాయి. 'మందారమకరంద మాధుర్య మున తేలు మధుపమ్ము వోవునే మదనములకు' అనే భావం పోతరాజుగారికి చాలా ఇష్టం. దీనిని ఆయన పాల్కురికి సోమనాథుని రచననుండి గ్రహించారు. బసవపురాణంలో బిజ్జలుడు కోపించి బండారుబసవన్నను బిలిచి తన సొమ్ము తన కిమ్మన్నప్పుడు అత నన్నవి—

బగుతు డాసించునే పరధనంబునకు
మృగపతి యెద్దెస మేయునే పుల్లు?
క్షీరాబ్ధిలోపల గ్రీడించు హంస
గోరునే పడియలనీరు ద్రావంగ
జాతఫలంబుల జుంబించు చిలుక
బ్రాతి బూరుగుమ్రాని పండ్లు గన్గొనునె

రాకామలజ్యోత్స్న ద్రావు చకోర
మాకాంక్షసేయునే చీకటి ద్రావ?
విరిదమ్మి వాసనల విహరించు దేటి
పరిగొని సుడియునే ప్రబ్బలి విరుల
నెరుగునే యలదిగ్గజేంద్రంబు కొదమ
యెరపందిచనుసీక: నెరుగవుగాక. [బసవపురాణం, 3 : 32-42]

ఈ భావాలు సోమనాథునికే చాలా ఇష్టం. బసవపురాణంలోనేకాక చతుర్వేద సారంలోకూడా వీటిని చెప్పాడు.

రాకామలజ్యోత్స్న ద్రావనిచ్చలుగొన్న నాచకోరంబుల కరుచియగునె?
సహకారపల్లవచయములు దొరకిన జగతి కోయిలకును చప్పనగునె?
క్షీరాబ్ధిలోపల గ్రీడింపగల్గిన భువి రాజహంసకు బుల్లనగునె?
విరిదమ్మివాసన వెల్లిముంచిన గ్రోలు షట్పదమ్ములకు నాస్వాదమగునె?
బహుశితరదయార్ద్రభావప్రభావన-మహిమ దనరు జంగమంబు రాగ
నతులభక్తిపరుల కావశ్యకంబగు-పరిహృతాభిభంగ బసవలింగ!

[చతుర్వేదసారము, 153]

చిన్నప్పుడు పాల్కురికి సోమనాథుని రచనలు బాగా చదువుకొన్న పోతరాజుగారికి ఇవి చక్కగా ఒంటపట్టాయి. యవ్వనంలో ద్రావిన భోగినీదండకంలో ఈ భావాలను పోతరాజుగారు ఇలా చెప్పారు:

సింగభూపాలుపై ద్రావి నాచిత్త మున్మత్తమై సోలి కామానలా
యత్తమై రాదు, తేరాదు నే నామరుండనై గౌరీవరుండైన వాణీధవుం
డైన దేవోత్తరుండైన నన్యున్ మదిం గోరగా నొల్లనే? ఉల్లసత్ఫుల్ల
మందారరాజన్మరందంబునం గ్రోలు మత్తాళి దుత్తూరమున్ గ్రోలునే?
హేమరాజీవరాజీరజోరాజితాకాశగంగానదీలోలకల్లోలడోలానటద్రాజ

హంసంబుశైవాలగండూపదీ భేక శ్రేకీధులీసంకులాసారకాసారముం బీరునే?
మండితాఖండలానీలజీమూతనిర్యత్పయోధారలన్ ద్రావు సారంగి కుంభాం
తరాంభఃప్రపూరంబులన్ ద్రావునే మాధవోజ్జాతచూతాంకురస్వాదు
లీలాలసత్కోకిలేంద్రంబు ఝల్లీవరక్రూరభల్లాతకీశాఖకున్ బోవునే?

ఇవేభాగాలు భాగవతంలో చాలాసార్లు దొర్లాయి. చూడండి.

హరినామాంకితసత్కథామృతరసవ్యాలోలుడైనట్టి స
త్పురుషశ్రేష్ఠుడసత్కథాలవణవాఃపూరంబు దా గ్రోలునే
వరమందారమరందపానకుతుకస్వాంతద్విరేఫంబు స
త్వరమైపోవునె చేతివేములకు తద్గంధానుమోదాత్మయై?

[భాగవతం, 3-223]

కాన సరోజలోచను జగత్ స్తవనీయకథాసుధారసం
బానిన యట్టి జిహ్వ యసదవ్యకథాలవణోదకంబులన్
బానముసేయ జూచునె సుపర్వమహీజమరందపానలా
భానుభవంబు నొందు మధుపంబును బోవునె వేపచెట్లకున్?

[భాగవతం, 3-441]

వూని భవత్పదాంబురుహ మూలనివాసులమైన మేము మే
ధానిధి! నీ విలోకనము దక్కగ నన్యము గోరనేర్తుమే?
మానితపారిజాతకుసుమస్ఫుటనవ్యమరందలుబ్ధతో
భానయశాలి యైన మధుపంబు భజించునె యన్యపుష్పమున్?

[భాగవతం, 4-925]

మందారమకరందమాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు?
నిర్మలమందాకినీవీచికల దూగు రాయంచ సనునె తరంగిణులకు?
లలితరసాలపల్లవఖాదియై చొక్కు కోయిల సేరునే కుటజములకు?
బూర్ణేందుచంద్రికాస్ఫురితచకోరక మరుగునే సాంద్రనీహారములకు?

అంబుజోదరదివ్యపాదారవింద-చింతనామృతపానవిశేషమత్త
చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు-వినుతగుణశీల! మాటలు వేయునేల?
[భాగవతం, 7-150]

నను బాణిగ్రహణంబు చేసితిగదా నాభర్తవు న్నీవ డై
వనియోగం బిది బౌరుషంబునకు నావాక్యంబు సిద్ధంబు సౌ
ఖ్యనివాసు న్నిను మాని యొండువరునిం గాంక్షింప నేనోర్తునే
వనజం బానెడి తేటి యన్యకుసుమావాసం బపేక్షించునే?
[భాగవతం, 9-529]

సిరికి నుదారచిహ్నముల జేయు భవచ్చరణారవిందముల్
సరసిజనేత్ర మాతపసుసంపద జేరితి మెట్టకేలకున్
మరలగ లేము మామగలమాటల నొల్లము పద్మగంధముల్
మరగిన తేటు లన్యకుసుమంబుల చెంతల జేరనేర్చునే?
[భాగవతం, 10. I. 989]

నీరదాగమ మేఘ నిర్యత్పయఃపాన చాతకం బేగునే చొటిపడెకు
బరిపక్వమాకంద ఫలరసంబులు గ్రోలు కీరముల్ చనునె దుత్తూరములకు
ఘనరవాకర్ణ నోత్కలిక మయూరముల్ గోరునే కఠినరుల్లీరవంబు
గరికుంభ పీఠ సద్గ్రాసమోదిత సింహ మరుగునే ఋనకమాంసాభిలాష
ప్రవిమలాకార! భవదీయ పాద పద్మ
యుగ సమాశ్రయ నైపుణోద్యోగ చిత్త
మన్య జేరునె తన కుపాస్యంబు గాగ
భక్తమందార! దుర్భర భవవిదూర! [భాగవతం, 10-II. 257]

పోతరాజుగారి ప్రసిద్ధమైన పద్యాలలో "సిరికిం జెప్పడు శంఖచక్రయుగమున్ జేదోయి సంధింపడు" (8-96) అనేదీ, "తనవెంటన్ సిరి, లచ్చివెంట నవరోధ వ్రాతమున్" (8-98) అనేదీ చాలా ముఖ్యమైనవి. భక్తు

లను రక్షించడానికి ఎవ్వరికీ చెప్పకుండా విష్ణువు బయలు దేరితే భార్య, పరివారం అనుసరించారని ఈ అష్టమస్కం ధంలో గజేంద్రమోక్షంలోనే కాక ముందుగా తృతీయ స్కంధంలోనూ వ్రాశారు.

సనకసనందనాదులు విష్ణువును సేవించుకొనడానికి వచ్చారు. వాళ్ళకు జయవిజయులు 'ఇప్పుడు అవకాశం దొరకద'న్నారు. అడ్డగించారు. మునులు ఘుర్షణపడ్డారు. శపించారు. ఆ కలకలం లోపలనున్న హరి ఆలకించాడు. శ్రీదేవితో సరసాలాపవినోదసౌఖ్యరచనలు చేస్తున్నవాడు వాటిని చాలించి శుద్ధాంతమందిరపు మాణిక్యగేహాళులు గడచివెళ్లాడు. అతనివెంట 'శరనిధికన్యకామణియు సంభ్రమమొప్పగ' తోడువెళ్ళింది. ఆమెవెంట అచ్చరలు వెళ్లారు. వాళ్ళ తరువాత పక్షీంద్రుడుకూడ ఉన్నాడు. వైన తేయాంసవిన్యస్తవామహస్తకలితకేయూరవలయకంకణము లొప్ప అని పోతరాజుగారు వర్ణించారు. జయవిజయులకు శాపం ఇస్తున్న సనకసనందనాదుల వద్దకు వెళ్ళిన శ్రీహరిని పోతరాజుగారు 8 గద్యపద్యాలలో వర్ణించారు (3 : 528–535). ఈ దృశ్యాన్నే వారు సంక్షిప్తంచేసి 'తనవెంటన్ సిరి లచ్చివెంట' అనే ఒకేఒకపద్యంలో తరువాత చెప్పారు. దశమస్కంధంలో శ్రీకృష్ణుని వెతుక్కుంటున్న గోపికల చేత పోతరాజుగారు చెప్పించిన పద్యం వినని తెలుగువాడు దేశంలో ఉండడు. చూడండి అది.

నల్లనివాడు పద్మనయనంబులవాడు కృపారసంబు పై
జల్లెడువాడు మూలి పరిసర్పిత పించమువాడు నవ్వు రా

జిల్లెడు మోమువా డొకడు చెల్వల మానధనంబు దెచ్చె నో
మల్లియలార! మీ పొదల మాటున లేడు కదమ్మ చెప్పరే.

[భాగవతం, దశమ. I. 1010]

అయితే ఇటువంటి పద్యాలే పోతరాజుగారు నవమ స్కంధంలోనూ వ్రాశారు. అక్కడ రామున్ని వర్ణిస్తూ ఇవే మాటలు వాడారు చూడండి.

నల్లనివాడు పద్మనయనంబులవాడు మహోరుగంబులన్
విల్లును దాల్చువాడు గడు విప్పగు వక్షమువాడు మేలు పై
జల్లెడువాడు నిక్కిన భుజంబులవాడు యశంబు దిక్కులం
జల్లెడువాడు నైన రఘుసత్తము డీవుత మా కభీష్టముల్!

[భాగవతం, 9-360]

వాస్తవానికి పోతరాజుగారి దృష్టిలో రాముడన్నా కృష్ణుడన్నా తేడా లేదు. రాము డాదేశించి వ్రాయమన్న పుస్తకాన్ని ప్రారంభిస్తూ శ్రీకృష్ణుని-నందాంగనాజీంభకుని ప్రార్థించాడు. షష్ట్యంతాలు కృష్ణపరంగా వ్రాశారు. మిగతా కవులంతా షష్ట్యంతాలు కందపద్యాలలో వ్రాస్తే పోతరాజుగారు ఉత్పలమాలలు గట్టి పూజించారు. ప్రతి పద్యంలోనూ అంత్యానుప్రాస హాయిగా వాడారు. కృష్ణ స్తుతిలో వాడిన అనుప్రాసను రామకథ చెప్పడంలో విరివిగా వాడారు. నవమస్కంధంలో వారు 258 నుంచి 362 దాకా శ్రీరామచరిత్ర వ్రాశారు. అంటే 105 గద్యపద్యాలు. వీటిలో అనుప్రాసలు తెగ వ్రాశారు.[1] చిట్టచివర ఇలా వ్రాశారు:

---

1. ఈ రామచరిత్రలో పోతరాజుగారి పద్యాలకన్నా 'ఇతరుల చేతిపని చాలకల'దని రాళ్లపల్లివారు శంకిస్తున్నారు. చూ॥ శ్రీమదాంధ్ర భాగవతం, రాయలప్రచురణ. పీఠిక, పుట 11.

మంతనములు సద్గతులకు_పొంతనములు ఘనములైన పుణ్యముల కిదా
నీంతన పూర్వమహోఘని_కృంతనములు రామనామకృతి చింతనముల్.
[భాగవతం, 9_362]

ఇటువంటి పద్యమే రుక్మిణీకల్యాణం ప్రారంభిస్తూ చెప్పారు :

భూషణములు చెవులకు బుధ_తోషణము లనేక జన్మదురితౌఘు విని
శ్లోషణములు మంగళతర_ఘోషణములు గరుడగమను గుణభూషణముల్.
[భాగవతం, 10_I. 1682]

పోతరాజుగారి దృష్టిలో శ్రీరామునికి, శ్రీకృష్ణునికి తేడా లేదు. కాబట్టే ఇటువంటి సంవాదరచనలు సాధ్యమైనాయి. అయితే దశమస్కంధంలోని 'నల్లనివాడు' అనే పద్యమే ఎక్కువ ప్రచారం అయింది. పోతరాజుగారి భాగవతంలోని వివిధ ఘట్టాలలోని కొన్నిపద్యాలు మన జాతిజీవనంలో కలిసిపోయాయి. ఎవరైనా అపురూపంగా మన ఇంటికి వస్తే "ఊరక రారు మహాత్ములు" అంటాం. ఇది పోతరాజుగారి పద్యపాదం. దశమస్కంధంలో బలరామకృష్ణులకు సంస్కారంచేసి నామకరణం కావించడానికి గర్గుడు మందకు వెడతాడు. అప్పుడు నందుడు తగిన సత్కారాలు చేసి ఇలా అంటాడు.

ఊరక రారు మహాత్ములు
వా రధముల యిండ్లకడకు వచ్చుట లెల్లన్
గారణము మంగళములకు
నీరాకశుభంబు మాకు నిజము మహాత్మా ! [భాగవతం,10_I.283]

ఈ పద్యంలోని తొలిపాదం తెలుగువాళ్ళ సంభా

షణలో ఒక చక్కని వాక్యంగా నిలిచిపోయింది. ఇటువంటిదే 'మాట తిరుగ లేరు మానధనులు' అనేది, అది అష్టమ స్కంధంలోని వామనావతార ఘట్టంలోనిది. శుక్రాచార్యునితో బలిచక్రవర్తి చెప్పినది. పూర్తిపద్యం చూడండి.

బ్రతుకవచ్చుగాక బహు బంధనములైన-వచ్చుగాక లేమి వచ్చుగాక
జీవధనములైన జెడుగాక పడుగాక-మాట దిరుగ లేరు మానధనులు.

[భాగవతం, 8-597]

బలిచక్రవర్తి ఈమాట అనడానికి రెచ్చగొట్టిన శుక్రాచార్యుని హితోపదేశంకూడా చాలా ప్రసిద్ధమైనదే. చూడండి.

వారిజాక్షులందు వైవాహికములందు-ప్రాణవిత్తమాన భంగమందు
జకిత గోకులాగ్రజన్మ రక్షణమందు-బొంకవచ్చు నఘము పొంద దధిప!

[భాగవతం, 8-584]

ఇలాగే 'పృథివి నధిపులు నూతనప్రియులు గారె' అనేది కూడా ప్రసిద్ధమే. ఇది భ్రమరగీతలలోనిది (10-1-1463). ఇదేభావం 10-1-1216 లో కూడా ఉంది. పోతరాజుగారి పద్యాలలో ప్రచారం పొందిన మిగతావన్నీ ఒక ఎత్తు, ఈక్రింది కందపద్యం ఒక్కటీ ఒక ఎత్తు.

నీ పాద కమలసేవయు-నీ పాదార్చకులతోడి నెయ్యమును నితాం
తాపార భూతదయయును-తాపసమందార! నాకు దయసేయగదే!

[భాగవతం, 10-I. 1268]

ఇది కంసవధకోసం మధురకు వెళ్ళిన బలరామకృష్ణులకు మాలికుడు దండఇచ్చిన ఘట్టంలోది. తమకు పూలహారం ఇచ్చిన మాలికుణ్ణి 'నీ కేమి వరం కావా'లంటే అతడు

పై పద్యంలోని కోరిక కోరుతాడు. ఇది పోతరాజుగారి వ్యక్తిగతప్రార్థనకూడా కావచ్చు.

భాగవతరచనకు ముందు పోతనగారు భగవత్ప్రార్థన చేసూ 'నారాయణా' అనే మకుటంతో ఒక శతకం వ్రాశారని లోకులు చెప్పుకుంటారు. అయితే ఇది పోతరాజు గారు వ్రాయలేదని, ధర్మపురిలో ఉండే లక్ష్మీనారాయణ స్వామిమీద ఎవరో చెప్పిన శతకం అని చాగంటి శేషయ్య గారు భావిస్తున్నారు. ఈ ఊహకు కారణమైన ఈ క్రింది పద్యాన్ని శతకంలోంచి చూపించారు.

అపరాధమ్ములు నిన్ను నమ్మి విను మే నా జన్మ పర్యంతమున్
విపరీతంబుగ జేసినాడ నిక నీవే దిక్కు నాలోనికిన్
గపటం బింతయు లేక దండధరునుం గట్టీక రక్షింపుమీ
కృపకుం బాత్రుడ నయ్య ధర్మపురి లక్ష్మీనాథ నా...

[నారాయణ శతకం, 98]

ఈ ఒక్కపద్యంవల్లనేకాక ఇంకోపద్యంవల్లకూడా ఇది పోతరాజుగారి రచన కాదని చెప్పవచ్చు. చూడండి.

సీమూర్తుల్ గన నీ కథల్ విన దుదిన్ నీ పాదనిర్మాల్య ని
ష్కామోదంబు నెరుంగ నీచరణతోయం బాడ నైవేద్యముల్
సీమంబొప్ప భజింప నీజపము వర్ణింపన్ గృపం జేయవే
శ్రీమించన్ బహుజన్మ జన్మములకున్ శ్రీయాది నారాయణా.

[నారాయణ శతకం, 105]

ఇందులో 'బహుజన్మజన్మములకున్' అనే మాట పోతరాజుగారి తత్వానికి విరుద్ధం. వారు పునర్జన్మ కోరరు.

భాగవతాన్ని తెనిగించి 'నాజననంబున్ సఫలంబు జేసెద బునర్జన్మంబు లేకుండగాన్' అని వారు దీక్ష వహించారు (భాగవతం 1-19). అందుచేత బహుజన్మజన్మాలు చెప్పే నారాయణశతకం పోతరాజుగారి రచన కాదని చెప్పవచ్చు.

ఈ శతకం ఆయన వ్రాసింది కాదని కొందరు నమ్ముతున్నట్టే వీరభద్రవిజయంకూడా పోతరాజుగారి రచనకాదని కూడా భావిస్తున్నారు. పింగళి లక్ష్మీకాంతంగారూ,[1] ఖండవల్లి లక్ష్మీరంజనంగారూ[2] మొదలైనవారు ఈ వాదాన్ని గాఢంగా నమ్ముతున్నారు. వీరభద్రవిజయంలో పోతనపేరు గద్యములో ఉండడంవల్లా, కవివంశంలో వ్యత్యాసాలు లేకపోవడంవల్లా ఖండవల్లివారు బమ్మెరపోతరాజుకు అదే పేరుగల సవతితమ్ముడున్నాడని, అతడు వీరభద్రవిజయం వ్రాశాడని భావిస్తున్నారు. పోతరాజుగారి గ్రంథాన్ని వ్రాయలేదనే విశ్వాసానికి ఆద్యులు గురజాడ శ్రీరామమూర్తిగారు. వీరు 'వీరభద్రవిజయవివేకం' అనే సుదీర్ఘచర్చ చేశారు.[3]

పండితులు ఇలా భావించడానికి ప్రప్రథమకారణం భాగవతరచన పూర్తిఅయ్యాక అందులో దక్షయాగ ఘట్టంలో శివనింద చేసి, అందుకు ప్రాయశ్చిత్తంగా పోతన

1. తెలుగుభాషాసమితి వారి విజ్ఞానసర్వస్వం, 3వ సంపుటి, పుట 33.

2. ఆంధ్రసాహిత్యచరిత్రసంగ్రహం, పుట 69.

3. కవిజీవితములు, పుటలు 622-642.

గారు ఈ వీరభద్రవిజయం చెప్పినట్టు ఎవరో ఒక పద్యం కల్పించి గ్రంథంలో చొప్పించారు, చూడండి ఆ పద్యం.

భాగవతప్రబంధ మతిభాసురతన్ రచియించి దత్కథా
వ్యాగకథాప్రసంగమున నల్పవచస్కుడ నైతి తన్నిమి
త్తాగతవక్త్రిదోషపరిహారముకై యజనైకశైవ సా
స్త్రీగమవీరభద్రవిజయంబు రచించెద వేడ్క నామదిన్.

[వీరభద్రవిజయం, 1_41]

భాగవతంలోని భావోద్వేగం, సురుచిరపాకం, పరిణతభావనా వీరభద్రవిజయంలో లేవు. అందుచేత భాగవత రచన తరువాత ఇంత పేలవంగా ఉండే గ్రంథం వ్రాయడం జరగదు అనే సహజభావం జనించి అసలు వీరభద్రవిజయం పోతరాజుగారు ఎప్పుడూ రచించిఉండరనే గాఢవిశ్వాసానికి దారితీసింది. అయితే ఇది పోతరాజుగారి బాల్యరచన కావచ్చు. ఇందులో చేసిన దోషాలు ఏమిటో విబుధవరుల వల్ల విన్నంత కన్నంత తెలుసుకొని తరువాతి రచనలో దిద్దుకొనవచ్చు. వీరభద్రవిజయం అసహ్యంగా కన్పించే గొంగళిపురుగు కావచ్చు. దీనినుంచి రంగురంగుల రెక్కలున్న సీతాకోక చిలుకలాగా భాగవతరచనాశిల్పం జనించడానికి అవకాశాలు లేకపోలేదు. పోతరాజుగారికి లాటానుప్రాస ఇష్టమే. (కమలాక్షు నర్చించు కరములు, 7-169). వీరభద్రవిజయంలోకూడా లాటానుప్రాసరచన ఉంది. శివుని మీదకు పంపించేముందు ఇంద్రుడు మన్మథుని పొగిడే పద్యం చూడండి.

జగములోపల గల జంతురాసులబట్టి మనసుల గలచు నీమహిమ మహిమ
నాడుచో గంటు గానగరాక వాడియై సరిలేక నాటు నీశరము శరము
పరమేష్ఠిసృష్టిలోపలి పురుషుల కెల్ల దీపమై వెలుగు నీరూపు రూపు
అఖిలంబు నెందాక నందాక నందమై పృథుతరంబైన నీబిరుదు బిరుదు
శూలినైన దాపసులనైన బాధింతు-గాలినైన నెట్టి ఘనులనైన
గలదె నీదు పేర్మి ఘనత తక్కొరులకు-నిన్ను బోల వశమె నిరుపమాంగ!

[వీరభద్రవిజయం, 2-58]

పోతరాజుగారికి చాలా ఇష్టమైన అంత్యానుప్రాస భాగవతంలోనే తన విశ్వరూపప్రదర్శనం చేస్తుంది. 'అతని వర్ణన పద్యములలో అంత్యానుప్రాస లేని దెక్కడనో గాని ఉండదు' అని అకాడమీవారి భాగవత సంపాదకులు అన్నారు.

ఈఅంత్యానుప్రాస భాస్కరరామాయణంనుంచి పోతరాజుగారు అలవరుచుకొన్నారు. నాచనసోముడు మరి కొన్ని శబ్దాలంకారాల మజాలు నేర్పాడు. ఎర్రయ్యగారు అర్థాలంకారాల రహస్యాలు బోధించారు. పాల్కురికి సోమనాథుని అమితావేశానికి పోతరాజుగారే ఏకైకవారసులు. భాషాప్రపంచంలోని శబ్దాలన్నీ వారికి కరతలామలకాలు. అనుప్రాసలు వాడేటప్పుడు గాని, పర్యాయపదాలను గుప్పించేటప్పుడుగాని తడుముకోవడం లేనేలేదు. పాటలాగ ధ్వనించే పద్యాలలో వ్యర్థపదాల అపశ్రుతులు వినబడవు. అయితే శబ్దాలపైన వారికున్న మక్కువ ఎక్కువ కావడంచేత పోతరాజుగారిపై అభిమానం ఉన్నవారు సైతం ఇలా భావిస్తారు. "ఈశబ్దదృష్టి పోతన్నలో కొంత చాపల్యమునకే

దారితీసిన దనవచ్చు. ఒక్కొక్కసారి ఇతడు శబ్దములను శబ్దములకొరకే వాడును. బ్రహ్మాయన్నచో నాతనికి చాలదు. 'తలవాకిట వాణిగల పోడిమిచే వాడిమికెక్కిన నలుమొగం బుల తక్కరిగొంటు' అని బ్రహ్మాండముగ విస్తరించి చెప్పినచే యీతనికి తృప్తి!" అని పుట్టపర్తినారాయణాచార్యులు గారు చెప్పిన మాటలు నిజం.[1] అయితే శైలికి తగ్గ శబ్దాలను స్వీకరించడం అవసరం. పోతరాజుగారి భాగవతం ఆంధ్రదేశంలో ప్రచారంకావడానికి మధురమధురమైన శైలికూడా కారణమే. "భాగవతమున కింతటి ప్రజాదరము అందలి భక్తిప్రభావమువలననే కాదు. మంద్రగంభీరగమన ముగల యీతని శైలివలనను వచ్చినది. అది సహజాధార విలసితము, ఓజఃప్రసాదగుణోజ్జ్వలితము. బిగువైన ఆ పద బంధమున సంస్కృతములు, తెలుగులు చెరిసగముగా గుచ్చిన మల్లెలు జాజులై పరిమళించును" అని గడియారం శేషశాస్త్రిగారు చెప్పిన మాటలు వాస్తవాన్ని వ్యాఖ్యానం చేస్తాయి.[2]

ఈ పరిమళాల మత్తులో తన్ను తాను మరిచిపోయి పోతరాజుగారు పారవశ్యంలో ఈదులాడుతాడు. కళ్లుమూసుకుని భాగవతతరంగనిస్వనాలు వింటారు. నిజానికి భాగవత

---

1. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, పుట 195.

2. తెలుగుభాషాసమితివారి విజ్ఞానసర్వస్వం, 3 వ సంపుటి, పుట 935.

దశమస్కంధంలోని పలుఘట్టాలకు సరిసమానమైనవి ఎర్ర య్యగారి హరివంశంలో ఉన్నాయి. రెండు రచనలూ తుల నాత్మకంగా పరిశీలిస్తే ఎర్రయ్యగారి రచన దృశ్యకావ్యంగా ఉంటుంది; పోతరాజుగారిది పాటకచ్చేరీ. ఉదాహరణకు గోపి కలు కృష్ణుసమీప నేరాలు యశోదతో చెప్పే ఘట్టం తీసు కుందాం. పోతరాజుగారు 23 పద్యాలు ఏకబిగిని వ్రాశారు (భాగవతం 10-I-306-328.) ఎర్రయ్యగారు 25 గద్య పద్యాలు వ్రాశారు (హరివంశం, 1-5: 211-235). పోత రాజుగారి రచనలో అన్నీ గోపికలమాటలేగాని కవివచ నాలు లేనే లేవు. ఎర్రయ్యగారు గోపికలు ఎలా చెప్పారో వివరిస్తారు. "ఓ ర్తుకోర్తించువిధంబున జేతుల వీచుచు కృష్ణ జననిం గడిసి ఇట్లనియె" అంటారు. "మరియొక్క యతివ ఆగ్రహమున అందరం ద్రోచికొం చరుగుదెంచి" చెప్పిం దంటారు. పోతరాజుగారికి గోపికలు ముఖ్యం కాదు. కృష్ణ లీలలే ప్రధానం. అందుచేత కృష్ణుడు ఏం చేశాడో చెప్పిం చారుగాని వాళ్లు ఎలాగ చెప్పారో తాము చెప్పదలచుకో లేదు.

పోతరాజుగారి కవితాదృష్టిని వారి పాత్రలు అలవర చుకొని బాలకృష్ణుని దేవునిగానే భావిస్తాయి. కాళిందిమడు గులో పడ్డ కృష్ణుని తలచుకొని పోతరాజుగారి యశోద "తండ్రీ! నీవు సర్పదష్టుండవై యున్న నిచట మాకుప్రభువు లెవ్వ రింక" అని రోదిస్తుంది. ఆమెదృష్టిలో కృష్ణుడు

కొడుకు కాదు, ప్రభువే. ఎర్రయగారు ఇదే ఘట్టంలో యశోదచేత తల్లిలాగా విలపింపజేశారు. ''కన్న కడు పగ్గలమై వెలపెట్టరాని పెంపున గల మానికం బొదవి బుగ్గలు పోయెనె యిక్క డక్కటా!''[1] అని ఆమె వేడుస్తుంది. వెన్న తిన్న నేరానికి రోలుకు కట్టినందుకు ఇలా చేశావా అని పలవిస్తుంది.

ఎర్రయగ్గారి యశోద పూర్తిగా వెర్రిబాగుల తెలుగు తల్లి. పూతన వచ్చి దారుణం చేశాక నందుడు వచ్చి 'నీవేల యేమరితివి' అని గద్దిస్తాడు. అప్పుడామె

కడుపునిండగ జన్నిచ్చి కొడుకు నిద్ర
వోవ దీవియ మండంగ బ్రొద్దువోవు
నందనుక మేలుకొనియుండి యలసికన్నొ
కింతమూసితి, నాలస్య మేదియిందు? [హరివంశం, I_5_157]

ఇవి తెలుగు ఇల్లాలిమాటలే. కృష్ణుడు శకటాసురుణ్ణి చంపాక ఎర్రయ్యగారి యశోద విరిగిన బండిని చూసి ఎంతో భయపడుతుంది. కృష్ణుని చూసి 'భవజ్జనకుండు వచ్చి నన్నెన్ని తెరంగులం బరుపడు' అంటుంది. ఇలా బాధపడుతుంది:

ఈ మెయి శకటం బెడలుట_కేమి గతము దీని నెవ్వ రెరుగుదురువిభుం
డేమి యది యనిన నుత్తర_మేమని నే నిత్తు నిండ యిడుదురునాకున్.
[హరివంశం. I_5_179]

ఇలా అన్నాక ఎర్రయ్యగారి యశోద బాలుణ్ణి తొడమీద పెట్టుకుని మాట్లాడక పాలిస్తుంది. ఇలాంటి భయాలు, నింద వేస్తారనే బెంగ పోతరాజుగారి యశోదలో

1. హరివంశం, I_7_41.

లేవు. అయితే 'బాలుని రోదనంబు విని పరతెంచి' సహజంగా ఇలా అంటుంది.

అలసితివి గదన్న ! యాకొంటివి గదన్న!
మంచియన్న యేడ్పు మాను మన్న
నన్ను గుడువు మన్న సంతసపడు మన్న
యనుచు జన్ను గుడిపె నర్భకునకు. [భాగవతం, 10_1_258]

కృష్ణలీల లనే పాలతో ఎర్రయ్యగారు పాయసం చేశారు. పోతరాజుగారు కోవా చేశారు. వాస్తవానికి భాగవతంలోని యితరఘట్టాలలోని పద్యాలుకూడ తియ్యని కోవాబిళ్ళలే. భీష్మస్తవం, కృష్ణనిర్యాణం, ప్రహ్లాదచరిత్ర, గజేంద్రమోక్షం, వామనావతారం, రుక్మిణీకల్యాణం మొద లైన ఘట్టాలన్నీ సుప్రసిద్ధాలు. "పోతనకవితాసముద్రమునం గల పద్యము లన్నియు గుమ్మడికాయంతముఖ్యములే. ఇం దేవి గణనీయములో నిర్ణయింప నవసరంలేదు. ప్రతిపద్యము పఠనీయము. ప్రతికథాంశము స్మరణీయమే" అని శేషాద్రి రమణకవులు చెప్పిన మాటలు నిజానికి నిమ్మకాయలంత రత్నాలు. పోతనగారి పద్యాలు పరిమళాలు వెదజల్లే పారిజాతాలు.

భాగవతాన్ని కల్పవృక్షంగా భావించిన పోతరాజు గారు ఆ వృక్షశాఖపై కూర్చుని గానం చేసే మత్తకోకిల వంటివారు. ఛందస్సులలో ఆయనకు మత్తకోకిల అంటే ఇష్టం. ఏఏ వృత్తాలు, జాతులు ఎన్నెన్ని ప్రాశారో చూడండి.

---

1. భాగవతం, వావిళ్ళప్ర చురణ, 1922 ముద్రణ, పీఠిక, పుట 70.

పోతరాజుగారి భాగవతంలో గద్యపద్యాలు

(అకాడమీ ప్రతిని అనుసరించి)

సంఖ్య	ఛందస్సు	ప్రథమ	ద్వితీయ	తృతీయ	చతుర్థ సప్తమ	అష్టమ	నవమ	దశమ పూర్వ.	దశమ ఉత్తర.	మొత్తం
1.	ఆటవెలది	22	6	4	5	24	63	78	87	37	326
2.	ఇంద్రవజ్ర	...	...	...	...	...	...	1	2	...	3
3.	ఉత్పలమాల	47	10	54	19	33	10	25	125	82	405
4.	ఉత్సాహం	...	...	...	...	...	...	...	...	2	2
5.	ఉపేంద్రవజ్ర	...	...	...	...	...	...	...	1	...	1
6.	కందం	148	68	354	284	116	216	182	581	368	2317
7.	కవిరాజవిరాజితం	...	...	...	1	...	...	...	...	2	3
8.	చంపకమాల	16	19	115	87	12	5	15	39	139	447
9.	తరల	2	1	3	2	...	...	3	6	...	17
10.	తేటగీతి	4	5	83	50	...	9	4	7	77	239
11.	దండకం	...	...	1	...	...	...	...	1	...	2
12.	పంచచామరం	...	...	...	...	...	...	...	1	...	1
13.	భుజంగప్రయాతం	1	...	...	...	...	...	...	...	...	1
14.	మత్తకోకిల	6	...	1	1	3	6	3	11	4	35
15.	మత్తేభం	57	41	70	33	34	69	49	138	75	566

16.	మహాస్రగ్ధర	...	...	...	...	...	...	...	...	1	1
17.	మానిని	...	...	...	...	...	...	...	1	...	1
18.	మాలిని	1	1	1	1	1	1	1	1	1	9
19.	లయగ్రాహి	...	...	...	...	...	...	...	...	1	1
20.	లయవిభాతి	...	...	...	...	...	...	...	2	1	3
21.	వచనాలు	144	83	233	311	163	233	284	523	390	2364
22.	శార్దూలం	29	7	1	1	49	32	21	110	19	269
23.	శ్లోకం	...	1	...	...	...	...	...	...	...	1
24.	సీసం	46	47	137	171	48	92	66	153	139	899
25.	స్రగ్ధర	...	...	...	...	...	...	...	...	2	2
	మొత్తం	523	289	1057	966	433	736	732	1789	1340	7915
	సీసం పిదప ఆ.వె.	24	11	...	1	20	43	20	86	17	222
	సీసం పిదప తే.గీ.	22	36	137	170	28	49	46	67	122	677

ఇందులోని కొన్ని విశేషాలు: (1) మొత్తం గద్యపద్యాలలో ఇంచుమించు మూడవ వంతు వచనాలున్నాయి. మళ్ళా ఇందులో సుమారు మూడవవంతు ఒక్కపంక్తిని మించని వచనాలు. వాటిలో కొన్ని ఒక్కమాటను మించనివికూడా ఉన్నాయి. ఉదాహరణకు 'మరియును', 'వెండియు' వంటివి. 8_447 చాలా పెద్దవచనం. అందులో 112 పంక్తులున్నాయి. 9_229 లో 78 పంక్తులున్నాయి. (2) చతుర్థాశ్వాసంలో 890 వ నెంబరు పద్యమొక్కటే సీసంతరువాత ఆటవెలది ఉన్న పద్యం. మిగతా సీసాలన్నింటికీ తేటగీతులే అనుసంధాన మైనాయి. (3) పోతరాజుగారి కవితాకన్య మత్తేభగమన.

ఈ గద్యపద్యాల పట్టికను చూస్తే విశేషవృత్తాలలో మత్తకోకిల లంటే పోతరాజుగారికి ఇష్టం అని తెలుస్తుంది. భాగవతంలో 35 సార్లు ఈ ఛందస్సు వాడారు. వీరభద్ర విజయంలోకూడా 20 మత్తకోకిలలు ఆలపించడం గమనించ దగ్గ విషయమే. మత్తకోకిలలాగే నడచే తరళను పోతరాజు గారు వీరభద్రవిజయంలో నాల్గుసార్లు, భాగవతంలో 17 సార్లు వాడడం కూడ గమనించాలి. పోతరాజుగారి ఛందస్సులు భాగవతాన్ని కూలంకషంగా చదివిన పాఠకుణ్ణి సమ్మోహింప జేస్తాయి. వారి ఆటవెలదుల నడక నేటి విరుపులకు దగ్గరలో ఉంటుంది. పుట్టపర్తి నారాయణాచార్యులుగారు ఇలా అన్నారు :

"భాగవతమున ప్రతిసీసపద్యము కడపటను సాధారణముగ నాటవెలదియే తగులుచుండును. ప్రత్యేకముగ వ్రాసిన యాటవెలదులు కూడ నెక్కువ. వీనిలోని సౌందర్యమును 'చాలు! చాలు!' ననునంత వరకు పోషించినవాడు పేమనయోగి! కాని తొలుత నొక వింత యొయ్యారముతో, ఆంధ్రభాషలో నాటవెలది యడుగుపెట్టిన దీపోతన్న తోనే!"[1]

పోతరాజుగారి ఆట వెలదుల నడకలోని ఘులంఘులలు చెవులను భ్రమింపజేయడం వల్లనే వారు సీసాల తరువాత తేటగీతులు ఆలపించడంకన్నా ఆటవెలదులను ఆడిస్తారనే భావన కలుగుతుంది. అయితే వాస్తవానికి ఆయన భాగవతంలో వ్రాసిన 899 సీసాలలో 677 తేటగీతులు, 222 ఆట వెలదులు ఎత్తుగీతులుగా వ్రాశారు. వీరభద్ర విజ

1. ఆంధ్రమహాభాగవతోపన్యాసములు, పుట 196, 197.

యంలో 118 సీసపద్యా లున్నాయి. అందులో 101 ఆట వెలదులు, 17 తేటగీతులు మాత్రమే ఉన్నాయి. శ్రీనాథుడు తన సీసాల తరువాత ఒక్కటే ఒక్క ఆటవెలదీ, మిగతా 824 తేటగీతులే వ్రాశాడని మనం ఇంతకు ముందు గమనించి ఆంధ్ర ఛందః పరిణామంలో ఇదొక ముఖ్య ఘట్టాన్ని సూచిస్తుందని చెప్పుకున్నాం.[1] శ్రీనాథుడూ, పోతరాజుగారూ బావమరదులు కాకపోయినా ఇంచుమించు సమకాలికులు కావడంవల్ల ఇద్దరి సీసాల ఎత్తుగీతులలో పోలికలు కనబడుతున్నాయి. వీరభద్రవిజయం వ్రాసే కాలంలో, బహుశా పోతరాజుగారు ఆధునికుల పద్ధతులు వినకపోవడంవల్ల ప్రాచీనుల పద్ధతివైపు మొగ్గారు. తరువాత శ్రీనాథుడు వాడినట్టే ఎక్కువ తేటగీతులు, సీసాల పిదప వాడారు.

అయితే ఈ మహాకవులు జీవితదృక్పథాలలోకూడా ఎవరికివారే. చనిపోతున్న సమయంలోకూడా శ్రీనాథుడు 'కస్తూరి కేరాజు ప్రస్తుతింతు?' అని వాపోయాడు. పోతరాజుగారిది ఎప్పుడూ పైచేయే; అది నిద్రలోకూడా క్రిందవదు. పరీక్షిత్తుకు శాపమిస్తున్న శృంగిచేత ఆయన ఇలా అనిపించారు:

పోము హిరణ్యదానములు పుచ్చుకొనంగ ధనంబు లేమియుం
దేము సవంచనంబులుగ దీవెన లిచ్చుచు వేసరింపగా రాము [భాగ.1_465]

వస్తుతః పోతరాజుగారికి భోగా లంటే ఇష్టం లేదు. వారిదృష్టిలో కటికనేల కమనీయం. పట్టుబట్టలకన్నా

---

1. సమగ్రఆంధ్రసాహిత్యం_III రెడ్డిరాజుల యుగం, పుట 221.

ముతకదుస్తులే వారికి మెత్తగా ఉంటాయి. అందుకే భాగవతంలో ఇలా ఒక పద్యం చెప్పారు (2-21).

కమనీయభూమిభాగములు లేకున్నవే పడియుండుటకు దూదిపరపు లేల?
సహజంబులగు కరాంజలులు లేకున్నవే భోజనభాజనపుంజ మేల?
వల్కలాజినకుశావళులు లేకున్నవే కట్ట దుకూలసంఘంబు లేల?
కొనికొని వసియింప గుహలు లేకున్నవే ప్రాసాదసౌధాదిపటల మేల?
ఫలరసాదుల గురియువే పాదపములు_సాధుజలముల నుండవే సకలనదులు?
పాసగ భిక్షయు పెట్టవే పుణ్యసతులు_ధనమదాంధుల కోలు వేలతాపసులకు?

భాగవతంలో ఎక్కడ పడితే అక్కడ ఇటువంటి భావాలు సాక్షాత్కరించడంవల్ల పోతరాజుగారి పద్యాలని కొన్నిప్రక్షిప్తాలను లోకులు నమ్మ్నతారు. వాటిలో 'ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి' అనే పద్యంగురించి ఇంతకుముందు చెప్పుకొన్నాం. పోతరాజుగారికి సుమారు రెండువందల సంవత్సరాలకు పూర్వమున్న మంచన తన కేయూరబాహు చరిత్రలో ఈ క్రిందిపద్యం వ్రాశాడు.

బాలరసాలపుష్ప[1] నవపల్లవకోమలకావ్యకన్యకల్
గూళల కిచ్చి యప్పడుపుగూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి మరి యంతకు నాయతి లేనినాడు గౌ[2]
ద్దాలికులైన నేమి నిజదారసుతోదరపోషణార్థమై? [కేయూర. 1_13]

అయితే ఈపద్యం పోతరాజుగారి చాటువుగా కొద్ది మార్పులతో బహుళప్రచారం పొందింది.[3] ఇందులో 'సత్కవుల్ హాలికులైననేమి?' అనే ప్రశ్న శ్రీనాథుణ్ణి చూసి

---

1. 'సాలసాల' అని పాఠాంతరంలో పోతరాజుగారి చాటువు అని ప్రవాద. 2. "గహనాంతరసీమల కందమూలగౌద్దాలికులైననేమి" అని చాటువులో పాఠాంతరం. 3. 'బాలరసాలసాల'అనే పదప్రయోగం భాగవతం, 3_753 లో ఒకసారి పోతరాజుగారు చేశారు.

పోతరాజుగారు వేశారని లోకం చెప్పుకొంటుంది. కమ్మని కావ్యాన్ని వీరభద్రునికో అంకితమిచ్చి వెయ్యినూటపదహార్లు పుచ్చుకోమని సహజపాండిత్యబిరుదాంకితుడైన కవిసార్వభౌముడు సలహా ఇచ్చాడనీ, అది విన్నాక పోతరాజుగారు అంత పనీ చేసేస్తారని భయపడి సరస్వతీదేవి కళ్ళు నిళ్లు పెట్టుకొందనీ, అప్పుడు ఆయన ఈ పద్యం చెప్పి ఊరడించారనీ ఇంకొక కథ.

కాటుకకంటినీరు చనుకట్టుపయిం బడ నేల యేడ్చె దో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల! యో మదంబ! యో
హాటకగర్భరాణి! నిను నాకటికిం గొనిపోయి యల్లకల్లోలకిరాటకీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్మ్ల భారతీ!

ఆలుబిడ్డలను పోషించుకోడానికి పుస్తకాలు అమ్మకోనక్కర్లేదనే విశ్వాసం పోతరాజుగారి కుందని ఈ చాటువులే చాటి చెప్పనవలసిన అవసరం లేదు. ఇంతకు ముందు గమనించినట్టు భాగవతంలోని పద్యాలెన్నో సాక్ష్యమిస్తాయి. ఉన్నదానితో తృప్తిపడి పోతరాజుగారు కుటుంబాన్ని హాయిగా పోషించుకొన్నారు. ఆయనకు ఎంతమంది సంతానమో నికరంగా తెలియదు. వారి వంశంలోనివారే మనుమలో, మునిమనుమలో వ్రాసిన కృతులలోని పద్యాల వల్ల పోతరాజుగారి వారసుల సంగతి తెలుస్తున్నది. అయితే పరిశోధకులు ఈ పద్యాలను, కృతులగద్యాలను రకరకాలుగా వ్యాఖ్యానం చేస్తున్నారు. కట్టుకథల ప్రకారం పోతరాజుగారికి మల్లన అనేకుమారుడున్నాడు.[1] వారసుల గ్రంథాల

1. అకాడమీవారి భాగవత పీఠిక, పుట 15.

సాహిత్యంవల్ల ప్రౌఢసరస్వతి అనే బిరుదున్న కుమారుడున్నాడు. ఇతని అసలుపేరు కేసన. పోతరాజుగారు తమ కొడుక్కి తండ్రిపేరు సహజంగా పెట్టుకొనిఉంటారు. అయినా ఈ కేసన పోతరాజుగారి కొడుకు కాడు, మనుమడు అని కొంద రంటారు.[1] బమ్మెరవారి వంశంలో మల్లయ అనే పేరు పోతరాజుగారికి కొన్నితరాలు ముందూ, వెనుకా కనబడదు. కుమారునికి ఆ పేరు ఆయ నెందుకు పెట్టారో!

ఇహలోకంలో పుత్రపౌత్రాభివృద్ధిగా పోతరాజుగారు చల్లగా జీవించినా పరంలో వారు కోరుకున్నవరం ఒక్కటే ఉంది. అది మోక్షం.

పోతరాజుగారు భాగవతం ప్రథమ స్కంధంలో శ్రీకారంచుట్టి కైవల్యం కావా లనుకొన్నారు. 'శ్రీకైవల్య పదంబు జేరుటకునై చింతించెదన్' అని గ్రంథం ఆరంభించారు. దశమస్కంధంలో చిట్టచివర శుకయోగిచేత ఫలశ్రుతి చెప్పిస్తూ, ఈకృష్ణకథా సుధారసము గ్రోలినవారు "కాంతు రచ్యుతపదం బైనట్టి కైవల్యమున్" అని ముగించారు (భాగవతం, దశమ. II-1332). వారి ఆకాంక్ష తొలినుంచి చివరిదాకా కైవల్యమే. భాగవత జన్మవల్ల వారికి పున ర్జన్మ లేదని భావించారు.

నిజమే. పోతరాజుగారికి పునర్జన్మ లేదు. అసలు మరణిస్తే కదా మళ్లీ పుట్టడం అనే సమస్య వస్తుంది? తెలుగు సాహిత్యం జీవించి వున్నంతకాలం ఆయన బ్రతికే ఉంటారు.

---

1. ఆంధ్రకవితరంగిణి, చాగంటి శేషయ్య, 11 వ సంపుటి, పుటలు 92.

ప్రమాణగ్రంథాలు

అనంతుని ఛందము

ఆంధ్రకవితరంగిణి, IV, V, VI, VIII-చాగంటి శేషయ్యగారు.

ఆంధ్రకవుల చరిత్ర I - కందుకూరి వీరేశలింగంగారు.

ఆంధ్రమహాభాగవతోపన్యాసములు - ఆంధ్రసారస్వత పరిషత్తు.

ఆంధ్ర సాహిత్య చరిత్ర సంగ్రహం - ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక సంచికలు.

ఆంధ్రాలంకార వాఙ్మయ చరిత్రము - బులుసు వెంకటరమణయ్యగారు.

ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డిగారు.

ఒంటిమిట్ట రఘువీర శతకం - అయ్యలరాజు తిప్పయ్య.

కళింగ సంచిక - సం: రాళ్ళబండి సుబ్బారావుగారు.

కాకతీయ సంచిక

కాటమరాజు కథ

ఛందోదర్పణం.

తెలుగుభాషా సమితివారి విజ్ఞాన సర్వస్వం - III, IV, VII సంపుటాలు.

నవనాథ చరిత్ర - గౌరన.

నెల్లూరు శాసన సంపుటం V.

పూర్వగాథాలహరి - వేమూరి శ్రీనివాసరావుగారు.

పోతన - నిడుదవోలు వెంకటరావుగారు.

ప్రబంధరత్నావళి -

భోజరాజీయం - అనంతామాత్యుడు.

రసాభరణం - అనంతామాత్యుడు.

రెడ్డిసంచిక.

లక్ష్మణదీపిక - గౌరన.

లక్ష్మణరాయ వ్యాసావళి - కొమర్రాజు లక్ష్మణరావుగారు.

విక్రమార్క చరిత్రము - జక్కన.

విజయనగర సామ్రాజ్యమందలి ఆంధ్ర వాఙ్మయ చరిత్ర - చేకూ మళ్ళ అచ్యుతరావుగారు.

శతకకవుల చరిత్ర - వంగూరి సుబ్బారావుగారు.

శివయోగసారం.

శృంగారనైషధ సర్వంకష - వేదం వెంకటరాయశాస్త్రిగారు.

శ్రీనాథుని కవితా సమీక్ష - చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు.

శ్రీనాథుని కవిత్వ తత్వము - కందూరి ఈశ్వరదత్తుగారు.

షోడశకుమార చరిత్ర.

సంస్కృత వాఙ్మయ చరిత్ర II - మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారు.

సుభాషిణి - సంపాదకుడు : పండిరి మల్లికార్జునరావుగారు.

స్వరశాస్త్రమంజరి - గణపనారాధ్యుడు.

హరిశ్చంద్ర ద్విపద - గౌరన.

Chandogya Upanishat - Swami Swahananda.

History of Reddi Kingdoms - M. Somasekhara Sarma.

Lokayata - Deviprasad Chatopadhyaya.

Struggle for Empire - Bharateeya Vidyabhavan.

Studies in Epics & Puranas of India - A. D. Pulaskar.

The Delhi Sultanate - Bharateeya Vidyabhavan.

Sri Saradanikethanam Post Dindigul Tamilnadu
LIBRARY
GUNTUR.

256